TIGHT BINDING BOOK

brown book

UNIVERSAL LIBRARY
OU_206194
UNIVERSAL LIBRARY

శివపురాణము

(నాలుగవ సంపుటము.)

మూర్తిత్రయ ప్రణీతము.

నడకుదుటి వీరరాజు పంతులు

సంపాదకుండు.

వెల రు ౧-౮-౦.

పి ఠా పు ర ము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల.

౧౯౨౬.

విషయసూచిక.

		పుట.
౧	ఓంకారక్షేత్రమాహాత్మ్యము.	౧
౨	పుష్పవాహనచరిత్రము.	౩
౩	కపిలాహ్రదాదులవృత్తాంతము.	౮
౪	నందీశ్వరచరిత్రము.	౧౪
౫	నందీశ్వరునితపశ్చరణము.	౨౦
౬	నందీశ్వరోత్పత్తి.	౨౩
౭	నందీశ్వరాభిషేకసంకల్పము.	౨౬
౮	నందీశ్వరాభిషేకము.	౩౦
౯	నందీశ్వరపరిణయము.	౩౨
౧౦	నీలకంఠస్తవము.	౩౭
౧౧	త్రిపురోపాఖ్యానము.	౪౪
౧౨	విజయయాత్రాసన్నాహము.	౪౯
౧౩	త్రిపురదహనము.	౫౪
౧౪	ద్విజమాహాత్మ్యకీర్తనము.	౬౧
౧౫	వివిధయోగవర్ణనము.	౭౦
౧౬	యోగధ్యానము.	౭౪
౧౭	పాశుపతాదివ్రతమాహాత్మ్యము.	౭౮

వాయవీయసంహిత.

౧౮	విద్యావతారకథనము.	౮౭
౧౯	బ్రహ్మసందర్శనము.	౯౧
౨౦	బ్రహ్మప్రబోధనము.	౯౨
౨౧	అనిలాగమనము.	౯౯

౨౨	మహర్షిపవనసంవాదము.	౧౦౧
౨౩	శైవతత్త్వకథనము.	౧౦౭
౨౪	కాలప్రభావము.	౧౧౪
౨౫	శక్త్యాద్యుత్పత్తికథనము.	౧౧౯
౨౬	లోకోత్పత్తివర్ణనము.	౧౨౧
౨౭	పృథ్వీమండలోద్ధారణము.	౧౨౬
౨౮	సృష్టినిరూపణము.	౧౨౯
౨౯	శేషశాయివర్ణనము.	౧౩౬
౩౦	రుద్రోత్పత్తి.	[illegible]
౩౧	అర్ధనారీశ్వరసాక్షాత్కారము.	౧౪౧
౩౨	మిథునసంబంధసర్గారంభము.	౧౪౪
౩౩	స్వాయంభువవంశప్రశంస.	౧౪౬
౩౪	సతీదేహత్యాగము.	౧౫౨
౩౫	వీరభద్రాగమనము.	౧౫౭
౩౬	దక్షాధ్వరధ్వంసము.	౧౬౨
౩౭	దక్షప్రమథగణంబులయుద్ధము.	౧౬౬
౩౮	పార్వతీపరమేశ్వరానుగ్రహము.	౧౭౫
౩౯	మందరగిరివర్ణనము.	[illegible]
౪౦	గౌరీదేహాధారణము.	[illegible]
౪౧	వ్యాఘ్రమునకుగాణపత్యప్రాప్తి.	[illegible]
౪౨	ఉమామహేశ్వరసల్లాపము.	[illegible]
౪౩	అగ్నీషోమాదినిరూపణము.	[illegible]
౪౪	షడధ్వవివరణము.	[illegible]

స్వవిషయము.

దీనితో శివపురాణము నాలుగుసంపుటములైనది. పాఠకులకు విభిన్నంబు లగునూతనాభిరుచులను గల్పించుపాంటి విచిత్రకథావిలసితంబును, విమలతీర్థక్షేత్రమాహాత్మ్యవిరాజితంబును, భగవల్లీలామయంబును, బరమపురుషార్థదాయకంబునగు బ్రహ్మపురాణమునుగూడ నాంధ్రీకరింపఁ బ్రారంభించి యందొకభాగమును రాఁబోవుసంపుటముగాఁ బ్రకటింపఁదలఁచితిమి. ఈవిధముగా శివపురాణ మొకసంపుటమును, బ్రహ్మపురాణ మొకసంపుటమునుగా నొకదానివెనుక నొకటి ప్రకటించుచుందుము. ఈవిధముగాఁ జేసినచో నించుమించుగా శివపురాణము పూర్తియగునప్పటికి బ్రహ్మపురాణమును సంపూర్ణముగాఁ గలదు. పిమ్మట గరుడపురాణమును, అగ్నిపురాణమును, వాయుపురాణమును, విష్ణుపురాణమును బ్రారంభించి యిట్లే ప్రకటింప నిశ్చయించితిమి.

సనాతనధర్మపరాయణులును దేశభాషాభిమానులు నగునాంధ్రసోదరులెల్లరును గష్టసాధ్యంబును, గాలోచితంబును దేశభాషాభివృద్ధికిఁ బరమోపయోగంబు నగుమాయుద్యమము నాదరించి మాకెల్లవిధంబులఁ జేయూఁత యొసగి యవశ్యకరణీయంబగునీఘనకార్యమును మాచే నిర్వహింపఁజేయఁగలరని విశ్వసించుచున్నాము. అచిరకాలముననే పలువురు పుణ్యపురుషులు చందాదారులుగాఁ జేరి మాకుఁ బరమోత్సాహమును గల్పించి స్వధర్మనిర్వహణమును గావించుచుండుటచే వారి నెంతయు నభినందించుచున్నాము.

ప్రకాశకుఁడు.

శ్రీ మైనమః.

శివపురాణము.

సనత్కుమారసంహిత.

ఓంకారక్షేత్రమాహాత్మ్యము.

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! వేదసమ్మితమును, దివ్యంబును, బురాతనంబు నగునీచరిత్రము నాలకింపుము. దేవి యగు గిరిరాజకన్య కాళికానామముచే విఖ్యాతయై పరమేశ్వరునకు భార్య యయ్యెను. శీలవృత్తగుణంబులచే నత్యుత్తమురాలగు నయ్యర్ధాంగియెడల నతిప్రియుండై మహాదేవుండు స్వతంత్రంబగు నవిముక్తపురంబున నామెతోఁగూడ యుండెను. ఆపంచాయతనక్షేత్రమునం దీపికముగాఁ జాలకాలము గడచిపోయెను. లోకసంగ్రహముకొఱకు కాతంఁపు నిత్యము నుభయసంధ్యలయందు నోంకారేశ్వరు నుపాసించుచుండెను. అప్సరలు, గంధర్వులు, విద్యాధరులు, చారణులును నృత్యగీతవాద్యంబులఁ గావించుచుండిరి. అట్లు ఋషివర్గంబులు వారితోఁ గలసి నృత్యముగావించుచున్నమహేశ్వరునిశరీరమునందలి ఘర్మజలంబునుండి ప్రమథగణంబులును, భూతగణంబులును నావిర్భవించి మహానందముతో నృత్యము గావించుట కారంభించిరి. ఆతాండవావేశముచే జారిపోవుచున్నవస్త్రములనుగూడ వారు లక్ష్యము సేయుట లేదు. ఆవిధముగనే నాట్యతత్పరుండై యున్నమహాదేవుం గాంచి పార్వతీదేవి యిట్లనియెను.

ఓవిరూపాక్షా! ఇదియేమినాట్యము! నాకిదియంతయు నతివిచిత్రముగా నగపడుచున్నది. నేనిదివఱకు మందరపర్వతమునందును, కైలాసాచలమునందును, మఱియు నితరమహీధరంబులయందును నీయానందనర్తనముం గాంచియుంటిని. కాని యిప్పటినటనమేమో విలక్షణముగాఁ దోఁచుచున్నది. నేను నీప్రేమకుఁ బాత్రురాలనే నైనచో నాకీయుత్సాహకారణమును దెలుపుము. అని పార్వతీదేవి ప్రార్థించుటయుఁ బరమేశ్వరుండు మందహాసంబు చేయుచు నద్దేవివదనకమలంబును దనకరంబుతో నల్లనఁ బైకెత్తి సాంత్వనస్వరంబున నిట్లనియెను.

ఓగిరిరాజకుమారీ! ఇచ్చట నేనిట్లు నృత్యంబు గావించుటకు విశేషకారణ మున్నది. పరాత్పరుండును, సాక్షీభూతుండు నగునేదేవుఁడునాదాఖ్యచేఁ బరికీర్తితుం డగుచుండునో యాదేవుం డీపవిత్రక్షేత్రంబున వెలసియున్నాఁడు. ఈబ్రహ్మాండగర్భమునం దెన్నితీర్థము లున్నవో యన్నిటికంటె నీపంచాయతనక్షేత్రమే యుత్తమమైనది. నేనీక్షేత్రము నింతయధికముగా నేల ప్రేమించుచుంటినో చెప్పెదను వినుము. జగదంబ యగునిందిరాదేవికేళీమందిర మగుపద్మవనము బ్రహ్మదేవునకెంతపరమానందకర మైనదియో, నాకీస్థాన మంతటియానందదాయకమైనది. ఈక్షేత్రమున నివసించు జితాత్ములకు దివ్యదృష్టి లభించును. ఆదృష్టిప్రభావముచే వారు చతుర్భుజుం డగుపురుషోత్తముని దర్శింపఁగలుగుదురు. పూర్వము పంచాయతనక్షేత్రమునందుండు మానవులు ప్రత్యక్షముగఁ ద్రినేత్రుండును, త్రిశూలధారియు, వృషభవాహనుండు నగుమహాదేవుని దర్శింపఁగలుగుచుండిరి. పంచాయతనంబున శివలోకసంచార మగుచుండును. ఈరహస్యము విషయలోలు రగుదుర్వివేకులకు విదితము గానేరదు. శాస్త్రవిరుద్ధకర్మాచరణు లగువారైనను పంచాయతనక్షేత్రసేవనమువలన శమదమాదిసంపన్నులై సద్భావభావితులు గాఁ

గలరు. వారికిఁ బరమేశ్వరసాక్షాత్కారము లభింపఁగలదు. ఈయవి ముక్తక్షేత్రము సర్వోత్తమం బైనదని పూర్వజన్మమున శివారాధనముం గావించినపుణ్యాత్ములకుమాత్రమే తెలియఁగలదు. ఈప్రపంచమునందలి సాధువు లందఱును వైశాఖశుద్ధచతుర్దశినాఁడు వారాణసీక్షేత్రమునకుఁ బోయి పంచాయతనస్థితుం డగుమహాదేవుని దర్శించుచుందురు. ఓంకారేశ్వరునకుఁ జతుర్దిశలందును, దేవతలును, ఋషులును, రుద్రగణంబులును, పాశుపతగణంబులును నివసించి యుందురు. ఈపంచాయతనక్షేత్రమునకుఁ బూర్వభాగమున నాదిదేవుండును, స్వయంభువు నగుకేశవుండు నివసించి యుండును. దక్షిణభాగమునఁ గోటిరుద్రగణంబు లోంకారేశ్వరచింతాపరాయణులై యుందురు. ఉత్తరభాగమున వామదేవుఁడు, సావర్ణి, అఘోరుఁడు, కపిలుఁడు మొదలగువా రోంకారధ్యానాసక్తులై యుందురు. పశ్చిమంబునఁ గృత్తివాసదేవుండు విరాజిల్లుచుండును. ఈదేవతలందఱును, మనస్సు, బుద్ధి, అహంకారము, కామము, లోభము మొదలగువానినుండి సనాతనంబగు నీదివ్యక్షేత్రమును రక్షించుచుందురు. ఓంకారేశ్వరసందర్శనమువలన లోకదుర్లభం బగునుత్తమపదలాభంబు సిద్ధించును.

—♦ పుష్పవాహనచరిత్రము. ♦—

పూర్వము రథంతరకల్పమునందుఁ బుష్పవాహనుం డను నొకరాజుండెను. ఆతఁడు త్రిభువనములయందును సుప్రసిద్ధుండును, సూర్యసన్నిభతేజోమయుండు నై యుండెను. అమ్మహీవరుని తపంబునకు సంతుష్టుండై మహాదేవుం డాతనికిఁ గామగమం బగుకాంచనకమలమును బ్రసాదించెను. ఆసువర్ణకమలప్రభావముచే నారాజేంద్రుండు స్వర్గమర్త్యపాతాళలోకంబులయందును, సప్తద్వీపములయందును యథేచ్ఛాసంచారము గావించుచుండెను. పుష్కరవాసి యగునాభూపాలుని

నామముచేఁ గల్పాదియం దాతఁడు నివసించినద్వీపమునకుఁ బుష్కరద్వీపమని పేరు గలిగెను. బ్రహ్మదేవుం డానృపాలునకు మనోవేగసంపన్నం బగు దివ్యవిమానమునుగూడఁ బ్రసాదించెను. ఆకారణముచే దేవతలును బాంధవులునుగూడ నాతని బుష్పవాహనుఁ డని పిలుచుచుండిరి. త్రిలోకములయందు నాతని కగమ్యం బగుస్థాన మేదియును లేకుండెను. ఆతని సతీమణి యప్రతిమానరూపలావణ్యసంపన్నయు, సతిలోకగుణవతియు, నంగనాజనశిరోమణియు నై యుండెను. పార్వతియందుఁ బరమేశ్వరునకుంబోలె లావణ్యవతి యగు నాసతీరత్నమునం దాతఁడు బద్ధానురాగుఁడై యుండెను. ఆదంపతులకు ధర్మాత్ములును, ధనుర్ధరులయం దగ్రగణ్యులు నగుపదివేలమందితనయులుండిరి. ఆమహారాజు తనవైభవము నంతను జూచుకొని తనలోఁ దానే విస్మయుఁ డగుచుండెను.

ఇట్లుండ నొకనాఁడు ప్రచేతసుం డనుమునీంద్రుఁడు తనచెంతకరుదెంచుటయు నారాజేంద్రుం డాతని నుచితరీతిని సన్మానించి, మహాత్మా ! పరమేశ్వరుండు నాయల్పతపంబునకే సంతుష్టుండై నిర్మలైశ్వర్యంబును, లోకవిఖ్యాతకీర్తిని, సుందరీశిరోమణియగుభార్యను, కామగమం బగుపద్మగృహంబును బ్రసాదించుటకుఁ గారణమేమి ? ఈ పద్మగృహము వివిధమణివసనప్రపూర్ణంబులగువీథులచే విరాజిల్లుచున్నది. చతురంగబలసమేతులై శతకోటిమహీపతు లిందుఁ బ్రవేశించినను నిరాఘాటముగ నిదియాకాశసంచారము సేయఁ గలదు. ఇట్టియసాధారణంబగునైశ్వర్యము నాకేజన్మాంతరసుకృతవిశేషంబుచే లభించినదో దయయుంచి యానతీయవలయు నని ప్రార్థించెను.

అప్పు డమ్మునివరుం డిట్లనియెను. మహారాజా ! నీజన్మాంతరవృత్తాంతమును దెలిపెద నాకర్ణింపుము. నీవు పూర్వజన్మంబునఁ గిరాత

వంశమునందు జనియించితివి. అందుచే నీహృదయము దయావిరహితంబును, నీకరంబులు లోకహింసాకరంబులును, నీశరీర మకార్యకరణమూలంబున నతికర్కశంబును, గునఖబహుళంబును, వికృతంబు నై యుండెను. నీకుఁ దల్లిదండ్రులుగాని, పుత్రికాపుత్రకులుగాని, బంధుమిత్రులుగాని యెవ్వరునులేకయుండిరి. కేవల మొక్కభార్యమాత్రమే యుండెను. అట్లుండ నొకప్పు డతిసంతాపకరం బగుననావృష్టి యగుటయు నాహారాభావముచే నీవధికక్షుధార్తుండవై యనేకస్థలంబులఁ బరిభ్రమించి వెదకియు నొక్కఫలమ్మైనను బడయఁజాలకపోయితివి. నీ వావిధముగాఁ బోయిపోయి కమలకుసుమశోభితం బగునొకసరోవరమును గాంచి యందుఁ బ్రవేశించి మోయఁజాలినన్ని తామరపువ్వులను గోసి నెత్తిని బెట్టుకొని యవిముక్తనామకం బగుపురంబునఁ బ్రవేశించితివి. ఆనగరమునం దాపూవులను విక్రయించి కొంతధనమును సంపాదింపవలయు ననునాశతో నూరంతయును దిరిగి ప్రయత్నించితివి గాని యెంతమాత్రమును లాభము లేకపోయెను. అట్లు తిరిగి తిరిగి వేసరి తుదకు నీవు నీభార్యతోఁ గలసి రుద్రావాసమును జేరుకొంటివి. అందు మీరిరువురును మంగళధ్వనుల నాకర్ణించుచు మహావైభవసంపన్నులగు పార్వతీపరమేశ్వరులను సందర్శించితిరి. ఆపవిత్రస్థానమునందుఁ దద్భావగతసంకల్పులును, ఓంకారేశ్వరచింతాతత్పరులు నగు దేవగంధర్వసిద్ధకిన్నరులును, వేదతత్త్వజ్ఞులగుబ్రాహ్మణులును, పాశుపతవ్రతులును దమహృదయకమలములందుఁ బరమేశ్వరునిచరణకమలములను ధరించి నిటలతటఘటితాంజలులై యోంకారేశ్వరుని ధ్యానించుచుండిరి.

ఆపంచాయతనక్షేత్రసేవనంబునను, సాధుజనసందర్శనంబువలనను నిశ్చయముగా నప్పుడు నీకును, నీభార్యకును బరమేశ్వరునియందు భక్తి కలిగెను. అప్పుడు నీవు నీయొద్దనున్న తామరపూవులతోఁ బరమే

శ్వరు నలంకరింపవలయు నని సంకల్పించి యాపుష్పముల నన్నిటిని మహాదేవునకు సమర్పించితివి. మాహాత్మ్యవశంబున మరల నీవాపుష్పములను దీసికొనఁజాలకపోయితివి. మఱియుఁ బ్రసంగవశంబున నీవారాత్రి యచ్చటనే జాగరణంబు గావించి ప్రాతఃకాలమునందు యాదృచ్ఛికముగా నాదేవుని సందర్శించి మనంబున నాశ్చర్యంబు నొందుచు భార్యతోఁగూడ నీవాస్థలమును బరిశుభ్రముగఁ దుడిచి యలికి పరిష్కృతముం గావించితివి. మఱికొంతసేపటికి నీవాస్థానమునందే క్షుద్బాధచేఁ బంచత్వంబు నందితివి. అప్పుడు నీభార్య యగ్నిప్రవేశంబు గావించెను.

ఓమహారాజా ! ఆసత్కర్మముచేతనే నీకీజన్మమునం దింతటిమైశ్వర్యము లభించినది. నీవు వ్యాధుండవయ్యును మహాదేవునకుఁ బుష్పసమర్పణంబు గావించి సేవించుటవలన నిప్పుడు మహీనాథుండవై జన్మించితివి. నీపూజ స్వల్పంబైనను, ఓంకారేశ్వరమాహాత్మ్యముచే నది కోటిగుణితంబైనది. నీకు దివ్యవిమానమును బ్రసాదించినబ్రహ్మదేవునికివలెనే బ్రహ్మస్వరూపి యగునీశ్వరుఁడును నీయెడల సంతుష్టుండై యుండె నని యెఱుంగుము. కావున నీవిప్పుడీపుష్కరద్వీపమును విడిచి యవిముక్తక్షేత్రమునకుం బోయి యోంకారేశ్వరు నాశ్రయింపుము. ఆదేవునియనుగ్రహంబున నీకీశ్వరసందర్శనంబు లభింపఁగలదు. అని యమ్మునిచంద్రుం డానతిచ్చుటయు నాభూపాలచంద్రుం డమందానందహృదయుండై యోబ్రహ్మకులతిలకా ! మీరు దయతో నా పూర్వజన్మవృత్తాంతముం దెలిపితిరి. మహాపుణ్యవశంబునఁగాని మీవంటిమహనీయులసందర్శనము లభింపదు. అని యనేకవిధంబుల నామునీంద్రుని వినుతించి భార్యాసహితుండై పుష్పవాహనభూపాలుఁడాక్షణంబుననే వారణాసీక్షేత్రమునకుఁ బ్రయాణ మయ్యెను. క్రమ

ముగా నాతఁడు కాశికి వచ్చి మత్స్యోదరీతీర్థప్రాంతమున నున్న రుద్రావాస మను సరోవరమున కుత్తరమున శివప్రియతమంబగు పంచాయతనము నందు దక్షిణామూర్తిస్థితుం డగు నోంకారేశ్వరుని సేవించెను. పూర్వకాలమునం దీస్థానము నందు దేవహ్రద ముండెడిది.

ఈదివ్యస్థలము పుణ్యము సేయనివారికి దుర్లభమైనది. సకలజీవులకును బుణ్యప్రదమైనది. స్వర్గవాసులును, దదితరక్షేత్రవాసులును గూడ నాదివ్యస్థలమును గాంక్షించుచుందురు. రుద్రావాసమున స్నానము చేసి పంచాయతనవాసి యగు నీశ్వరుని దర్శించువారికిఁ బునర్జన్మంబు లేదు. ఆదేవుని సందర్శించుటవలన సర్వాభీష్టములును సిద్ధించును. కలికల్మషదూషితులగువా రీస్థలమును స్మరింపనైనఁజాలరు. వారి కీదివ్యక్షేత్ర మగమ్యమైనది. అట్లగుటకు వారి యజ్ఞానమే కారణము. కాని నిశ్చలబుద్ధు లగువారి కాక్షేత్రసేవనము లభింపఁగలదు. ఓవ్యాసమునీంద్రా! ఆదివ్యతీర్థమును స్వయముగాఁ బరమేశ్వరుఁడే స్థాపించి యున్నాఁడు. అందు గంధర్వులు, కిన్నరులు, యక్షులు, అప్సరలు, ఉరగులు, దైత్యులునుగూడ నదృశ్యులై పరమేశ్వరుని బూజించుచుందురు. రాజర్షి యగు పుష్పవాహనుం డాస్థానమునందుఁ బరమభక్తియుక్తుండై శాంతమూర్తి యగు పంచాయతనేశ్వరు నారాధించి పరమపదమును సందర్శించెను. ఈవిశ్వ మంతయును బరమాత్మునిచే వాక్కుచేతనుంబోలి వ్యాప్తమై యున్నది. ఆస్థానమునందు జపంబులఁ గావించుచు యోగులు ముక్తు లగుచుందురు.

ఓదేవీ! పార్వతీ! నీవు నన్నడిగినప్రశ్నంబున కుత్తరం బిచ్చితిని. వారణాసియందలి పంచాయతనక్షేత్రమునం దున్న యోంకారేశ్వరుని దర్శించువారికి విజ్ఞానవిభవంబులు లభింపఁగలవు. ఆస్థానమునందలి దుర్లభపదము తపస్వులకుఁగూడ నసాధ్యమైనది. దానంబులలో దుర్ల

భదానంబును, పవిత్రంబులలో దుర్లభపవిత్రంబు నగునీస్థానము సాధారణదుర్లభంబని పరమేశ్వరుం డానతిచ్చి యుండెను. నిశ్చల మగుభక్తితో శంకరు నారాధించువా రమ్మహాదేవునియందు విలీను లగుదురు. అట్టిమానవమూర్తులకు ప్రమథగణస్వరూపములు సిద్ధించును. ఓసుందరీ! సిద్ధయోగసంపత్తి కిదియే యేకమాత్రసోపానము! వారాణసియందలిప్రధానక్షేత్రము లన్నిటిలోనను, ఓంకారస్థానమే శ్రేష్ఠంబును ప్రథమంబు నై యున్నది. ఓంకారేశ్వరదర్శనంబున సకలక్షేత్రదర్శనఫలంబును సిద్ధించును.

అని చెప్పి మహేశ్వరుం డో దేవీ! పూర్వము నాచే నిర్మింపఁబడినయుద్యానమును దర్శింతువుగాని రమ్ము! దానితో సమానమగునది దేవలోకమునందుఁగూడ నెందును లేదు. దానిని గాంచి యాశ్చర్యముం గాంచనిజీవు లెవ్వరు నుండరని ప్రశంసించుటయుఁ బార్వతీదేవి, నాథా! నీవు చెప్పినట్లే చేయుదును. నాకింక నేమియును బనిలేదు. అక్కడకే పోవుదము రమ్మనియెను.

—♦ కపిలాహ్రదాదులవృత్తాంతము. ♦—

అనంతరము వృషభధ్వజుం డగుమహాదేవుండు పూర్వదిగ్భాగంబున నసిత్థ్రమునకు సమీపమునం దున్న మనోహరోద్యానమును దేవియగుహిమాచలతనయకుఁ జూపించెను. అచ్చటఁ గిన్నరులతిమనోహరముగ గానము సేయుచుండిరి. నలుదెసలయందును బుష్పించినతరులతాదులు రమణీయములై యుండెను. కలవిహంగములమధురకూజితము లెల్లయెడల శ్రవణానందముం గూర్చుచుండెను. చంపకపున్నాగాశోకప్రియంగుకదంబార్జునవటోదుంబరాదివృక్షపంక్తులు పల్లవకుసుమఫలభరితములై కన్నులపండువుగా నుండెను. సుగంధకలితంబు లగుజాతీవకుళాదిపుష్పగుచ్ఛంబులపై మధుపానాసక్తంబు లగుమదభృంగము

లు ఝుంకారస్వనంబులతోఁ దిరుగాడుచుండెను. అట్టి సర్వసంపన్నం బగునుద్యానవనరాజమధ్యమునఁ బ్రవేశించి దేవదేవుండు పార్వతీదేవిం గూర్చి యిట్లనియెను.

ఓ దేవీ! అదిగో! చూడుము! కిన్నరులు విమానారూఢులై యంబరతలంబున సంచరించుచున్నారు. ఇవి పారిజాతభూరుహములు. ఇయ్యవికల్పలతాకుంజములు. పవిత్రంబులగునీసకలవృక్షలతలును బ్రహ్మవిష్ణుశివలోకంబులయందుమాత్రమేయుండును. అవి యన్నియు నిందున్నవి చూడుము! ఈవారణాసీదేవి శివలోకము నాశ్రయించి యున్నది. ఈభ్రాంతోద్యానమునందు దేవదేవుం డగుజనార్దనుండును, ఆతనినాభికమలమునుండిజనియించినబ్రహ్మదేవుండును నివసించియున్నారు. మఱియు నీయోంకారేశ్వరుని సకలదేవతలును బరివేష్టించి యున్నారు. దీనికూర్ధ్వంబున గోలోకమున్నది. అందు బ్రహ్మాదిదేవతలు గోవులకు స్వయముగా ఘాసము నొసగుచుందురు. ఈస్థానమునందొక్కప్పు డేకవర్ణముగల యాగోగణంబులదుగ్ధధారలు నాపైఁబడియెను. ఆసమయమునందు నేను తలయెత్తి పైకిఁ జూచితిని. యాజ్ఞికగణంబుల కుపకరణంబు లగుగోసమూహములు పైభాగమునందు నాకగపడియెను. నాదృష్టితాఁకినంతనే యవియన్నియును భయభ్రాంతములై పోయెను. ఆచూపువేఁడిచే నవి క్రమముగా దగ్ధము లగుచుండెను. ఆగోవు లన్నియును బూర్వము కపిలవంశమునందు జన్మించిన వగుటచే నన్నిటికి నొక్కటేరంగు గలిగి యుండెను. నాదృష్టి సోఁకినంతనే వానియందు వివిధవర్ణములు పొడకట్టుచుండెను. అప్పుడు లోకమాతలగుగోవులన్నియును నాశరణముం గోరి నన్నాశ్రయించెను. అనంతరము బ్రహ్మదేవుం డాగోరక్షణంబునకు నన్నుఁ బ్రసన్నుం గావించుకొని యిట్లనియెను.

ఓపరమేశ్వరా ! ఈధేనుగణంబులకు వినాశంబు గలుగకుండున ట్లు నీవు ప్రసన్నుండ వగుము. వీనికిభద్రంబు గలుగున ట్లనుగ్రహింపు ము. ఇట్లు బ్రహ్మదేవుండు ప్రార్థించుటయు నేను శాంతుండనై స్వస్థలం బును జేరితిని. ఆకారణంబుచే నాకు గోప్రేక్షకుం డనునామము గలి గెను. గోప్రేక్షకేశ్వరమును దర్శించి మహాదేవుని బూజించువారికి దు ర్గతిభయంబు గలుగదు. అట్టివారు సర్వపాపములనుండియు విముక్తు ల గుదురు. అప్పుడు నేనుప్రసన్నకటాక్షములం దిలకించినంతనే యాగో వులన్నియును బ్రశాంతచిత్తముతో సంచరించుచు గ్రమముగా వచ్చి యీహ్రదమునందు స్నానము సేయ నారంభించెను. ఆగోవులభక్తిం గూర్చియు, నుపయోగముంగూర్చియు, బ్రహ్మదేవుండు నాకు విన్న పంబు గావించుటంజేసి గోవులు నాయాజ్ఞచే జగంబునం బూజనీయం బులును, గణనీయంబులు నయ్యెను. నాఁడుమొదలుగా నీహ్రదము క పిలాహ్రదనామంబున విఖ్యాతం బయ్యెను. ఈస్థానమునందు నేను వృ షభధ్వజనామముతో నుండి సాధువులకు సాక్షాత్కరించుచుందును. సు ప్రసిద్ధం బగునీకపిలాహ్రదము దేవతలకుఁగూడ దుర్లభమైనది. స్వయ ముగా బ్రహ్మదేవునిచే నిది ప్రదర్శింపఁబడినది. తీర్థయాత్రార్థులగుపు ణ్యాత్ములతాపశాంతికై యిందలిజల మమృతస్వరూపమై యుండును. ఆధేనుదుగ్ధంబులచేతనే యీహ్రదం బుత్పన్నం బయ్యెను. దీనికి రు ద్రహ్రద మనియు, దేవహ్రద మనియు నామములు గలవు. ఈస్థాన మునందు సకలదేవతలును నన్నుఁ బ్రసన్నుం గావించుకొనిరి. నేనును సకలజీవులకు మంగళవిధాతనై శివస్వరూపముతో నిందధిష్ఠించియుందు ను. ఈహ్రదం బధికపుణ్యప్రదమైనది. నిశ్చలభక్తియుక్తుఁడై యీ హ్రదమును దర్శించువానికి దేవలోకావాసంబు సిద్ధించును.

పరమేష్ఠి యగుబ్రహ్మదేవుం డీస్థానమునందు నన్నుఁ బ్రతిష్ఠించె

ను. అనంతరము విష్ణుదేవుండుగూడ మరల నన్ను స్థాపించుటం గాం చి పితామహుం డుద్విగ్నహృదయుండై నారాయణు నుద్దేశించి నీవు మదానీతంబగు నీశివలింగమును మరల నిచ్చట నేల ప్రతిష్ఠించితివని యడిగెను. విష్ణుదేవుండును క్రోధముచే నసలసదృశుండై నాకతితరం బగుభక్తి కలుగుటవలన నేనిట్లు ప్రతిష్ఠించితిని. ఈశివలింగమింతటినుం డి హిరణ్యగర్భనామంబున విఖ్యాతంబు గాఁగల దనియెను. దేవీ! అ ప్పటినుండి నేనిందు సమాహితుండనై యుంటిని. నన్నిందు దర్శించు వారికి శమనసందర్శనంబు లేదు. అనంతరము లోకపితామహుండును మరల యథావిధిగ శివలింగప్రతిష్ఠాపనముం గావించి ప్రహృష్టహృద యుండై యాశివలింగమునకు మహాదేవస్వరూపప్రాప్తి కావలయు నని సంకల్పించెను. అనంతరము నేను సకలదేవతాసమక్షంబున బ్రహ్మవి ష్ణునియోజితుండనై వారిగౌరవముకొఱకు లింగమధ్యమున సూక్ష్మ రూపముతోఁ బ్రవేశించియుంటిని. అప్పటినుండియు నేనచ్చట నునీలే శ్వరరూపముతో భక్తులకు సాక్షాత్కరించుచుందును. ఆకారణముచే నీపుణ్యక్షేత్రము నునీలంబనునామముచేఁ బ్రఖ్యాతం బయ్యెను. ఇం దుఁ బ్రాణత్యాగంబు గావించినవారికిఁ బునర్జన్మంబు లేదు. అప్పు డు లోకపితామహుం డగుబ్రహ్మయును, మహాత్ముం డగువిష్ణుదేవుం డును గూడఁ బ్రసన్నచిత్తులైరి.

ఈస్థానమునందు దైత్యులు నివసించి దేవతాకంటకులై సంచ రించుచుండుటచే నేను వ్యాఘ్రమూర్తినై వారినందఱను వినాశముం గావించితిని. అందుచే నేనీస్థానమునందు వ్యాఘ్రేశ్వరనామంబునఁ బ్రసిద్ధుండ నైతిని. వ్యాఘ్రేశ్వరసందర్శనంబున దుర్గతులు దూరము లై పోవును. పూర్వకాలంబున బ్రహ్మదేవుం డుత్పలుండును, విమలుం డు నను నిరువురుదైత్యులను సృజియించెను. వారు సకలదేవతలను నవ

ధ్యులై విక్రమించుచుండిరి. దేవీ! నీవారాక్షసులను సంహరించితివి. అప్పుడు నీయాజ్ఞచే నిందు సురాసురపూజితంబును, నిర్వాణనామకం బునగుహ్రదంబు కల్పింపఁబడియెను. ఈహ్రదమును దర్శించువారు సర్వబంధవినిర్ముక్తు లగుదురు. నేను ముందుగా నిచ్చటికి వచ్చి ప్రమథగణంబులతోఁ గలసి ప్రయాణము చేయుచుందును. ఈయుత్తమస్థానము పుణ్యదర్శనం బని నేను భావించుచుందును. ఇందలివినిర్మలశివలింగమును దర్శించువారు జననమరణబంధంబులనుండి విడివడి దుఃఖదూరు లగుదురు. ఇందు నలుదెసలను మదీయంబు లగుశివలింగములు ప్రతిష్ఠితములై యున్నవి. నిశ్చలభక్తితో వీనిని దర్శించువారికి దేహాత్మవిభేదజ్ఞానము లభియింపఁగలదు. ఇప్పుడు నేనిందువచ్చి నివసించి యుంటిని. ఎప్పటికిని నేను దీనిని విడిచియుండను గావున దీని కవిముక్తక్షేత్రం బనునామము గలిగెను.

పూర్వకాలంబున సకలసురాసురసమూహంబులును వివిధంబు లగుస్తోత్రంబులతో నన్నిందుఁ గీర్తించి యుండిరి. అప్పుడు నేను భూతలమును భేదించుకొని లింగస్వరూపమున వారికి సాక్షాత్కరించితిని. ఆసమయంబున దేవతలందఱును నన్ను మహాదేవుం డనిప్రశంసించుచు ధ్యానపరతంత్రులై యీవారాణసియందు నన్ను బహుప్రకారంబులఁ బూజింప నారంభించిరి. పవిత్రం బగునీవారాణసీక్షేత్రము ముక్తిదాయకం బైనది. అవిముక్తేశ్వరు నిందు సందర్శించినపుణ్యాత్ము లెందు మరణించినను శివలోకగమను లగుదురు. ఈస్థానమునఁ బ్రాణత్యాగము గావించువారి కుత్తమగతిలాభంబు గలుగును. దేవీ! పూర్వకాలమున నీజనకుం డగు హిమాచలేంద్రుండు స్వయముగా నాకుఁ బ్రియతమం బగునీస్థానమునందు శివలింగప్రతిష్ఠాపనముం గావించియున్నాఁడు. ఆశైలేశ్వరలింగ మిదిగో చూడుము! ఈశివలింగదర్శనంబున శివ

లోకప్రాప్తి యగును.

పుణ్యభాగయగు వారాణసీదేవి పరమానందముతో జాహ్నవీ సహితయై యీక్షేత్రము నలంకరించి యున్నది. ఇందు వరణ, గంగ, అసి యనునదీత్రయము విరాజిల్లుచున్నది. ఈనదీత్రయసంగమస్థానమునందు బ్రహ్మదేవుం డుత్తమం బగుశివలింగమును బ్రతిష్ఠించి యుండెను. ఆలింగము సంగమేశ్వరనామంబునఁ బ్రకీర్తితం బగుచున్నది. ఈస్థానమునందు శుచియై స్నాన మాచరించి భక్తితో సంగమేశ్వరు నర్చించువాఁడు భవవిముక్తుం డగును. ఈయద్భుతక్షేత్ర మతిశ్రేష్ఠంబును యోగిజననివాసయోగ్యంబు నై విరాజిల్లుచుండును. ఈక్షేత్రమునకు మధ్యస్థలంబున నేను స్వయంభువునై సాక్షాత్కరించితిని. ఆలింగమును సురాసురు లందఱును మధ్యమేశ్వరుం డని ప్రశంసించుచుందురు. శివవ్రతావలంబులు, మోక్షాభిలాషులగు సిద్ధులు, యోగీంద్రులు మొదలగువారి కిది నివాసస్థానము. ఈస్థానమును సేవించువారికి జననమరణాదిదుఃఖంబులు గలుగవు. ఈలింగము భృగుపుత్రుం డగుశుక్రునిచేఁ బ్రతిష్ఠింపఁబడినది. ఈశుక్రేశ్వరలింగము పూర్వము సకలసిద్ధులచేతను బూజింపఁబడియెను. ఈలింగముం దర్శించినమానవులు సర్వపాపవిముక్తు లగుదురు. ఈక్షేత్రమున మరణించువారికి మరల జన్మగ్రహణంబును, సంసారబంధంబును లేదు.

తొల్లి బ్రహ్మదేవుండు జంబుకరూపమును ధరించి నదీతటంబున దేవతలతోఁ గలసి దేవకంటకు లగునిరువురుదానవులను సంహరించెను. అప్పుడు గోమాయువధశంకితు లగుదేవతలం గూర్చి “ నేనును సృగాలరూపంబున ననేకదానవులను బరిమార్చితిని. ” అని చెప్పితిని. వారందఱు నాసమయమున నాయాజ్ఞచే నచ్చట ననేకలింగములను బ్రతిష్ఠించిరి. ఆలింగముల నన్నిటిని దర్శించుటవలన బహుపుణ్యఫలంబు లభిం

చుటే కాక సకలమనోరథంబులును సిద్ధించును. దేవీ! ఈస్థానమున సూర్యదేవునిచే స్థాపింపఁబడిన గంభీరేశ్వరలింగ మున్నది. ఇది కల్పాంతమునందైనను శిథిలంబు గాక సర్వశుభదాయకమై యుండును. మఱియు యమునిచేఁ బ్రతిష్ఠింపఁబడిన యమభయనివారకం బగునింకొక లింగము గలదు. దానిని దర్శించువారు ముక్తు లగుదురు. ఈశానప్రతిష్ఠితం బగులింగమును దర్శించి యారాధించువారు పాపవిముక్తులై భవదూరు లగుదురు. సకలదేవతారాధ్యం బగునీశానలింగము సర్వశ్రేష్ఠమైనది. దేవీ! ఈపవిత్రస్థానము లన్నిటింగూర్చియు నీకుఁ దెలిపితిని. ఇఁక నీమహాక్షేత్రంబున నతిగోప్యం బగుస్థానముంగూర్చి చెప్పెదను వినుము. ఇందు నలుదెసల నేకైకక్రోశంబుగా యోజనపరిమితం బగుపుణ్యస్థానమున మరణించువారికి మోక్షంబు లభించును. గంగాసహితంబగు హిమాలయమునందును, గేదారంబునందును సుప్రతిష్ఠితుండనై యున్న నన్ను సేవించువారికి గాణపత్యలాభంబును మోక్షప్రాప్తియు నగును. గాణపత్యప్రాప్తియే ముక్తి. గాణపత్యప్రాప్తిచే ముక్తి లభియించును గావున గేదారము ముక్తికారణం బయ్యెను.

—♦ నందీశ్వరచరిత్రము. ♦—

ధర్మాత్ముండును, వీర్యవంతుండు నగుశిలాదుం డనునొకఋషి యుండెను. అతఁడు శిలవృత్తిచే జీవించుచుండెను. ఒకప్పు డాతఁడు శివలోకమునకుఁ బోయి వచ్చుచు మార్గమధ్యమున భయంకరనరకముపై వ్రేలాడుచున్నతనపితృదేవతలం గాంచెను. వారందఱును శిలాదుం గాంచి, వత్సా! సంతతివిచ్ఛేదంబువలన నరకపతనంబు గలుగును. కావున నీవు పుత్రలాభంబుకొఱకు దేవాదిదేవుండును, అవ్యయుండు నగుమహాదేవు నారాధింపుము. మమ్ములను దరింపఁజేయు సమర్థుం

డగుసద్దేవుండు నీకుఁ బుత్రలాభమును బ్రసాదింపఁగలఁడు. అని బోధించుటయు శిలాదుండు మహాదేవు నుద్దేశించి వేయిసంవత్సరంబులు తపంబు గావించెను. అంతఁ ద్రిశూలధారియగు దేవుండు ప్రసన్నుండై యోమునిసత్తమా! నేను నీతపంబునకు మెచ్చి నీకు వరప్రదానముం గావించుటకై వచ్చితి నని యానతిచ్చెను. శిలాదుం డట్లుసాక్షాత్కారించిన మహాదేవుని దర్శించి సాష్టాంగప్రణామంబు గావించి హర్షగద్గదస్వరంబున నిట్లు వినుతింపందొడంగెను.

పరాత్పరా! మహాత్మా! మహేశ్వరా! నీవు సురశ్రేష్ఠుండవు. బ్రహ్మాదులకుఁ బ్రభుండవు. కామాంగనాశకుండవు. కైలాసనివాసుండవు. ధ్యానగమ్యుండవు. విధాతవు. సకలదేవతలకును, ఋషులకును బ్రభుండవు. వేదనాథుండవు. యోగిగణేశ్వరుండవు. ప్రధానుండవు. పరమతత్త్వస్వరూపుండవు. భక్తాభీష్టదాయకుండవును, సర్వవ్యాపకుండవును, సృష్టికర్తవు, జగత్పతివి, ప్రకృతీశ్వరుండవు నగునీకు నమస్కారము. ఈశ్వరుండవును, యోగగమ్యుండవును, జన్మమృత్యువినాశకుండవును, వరదాతవు నగునీకు వందనములు. భస్మాంగరాగుఁడవు, యోగమూర్తివి, తేజఃపతివి, సూర్యచంద్రాగ్నినేత్రుఁడవు, బాలశశాంకభూషణుఁడవు, నిత్యుండవు, త్రిభువనవిధాతవు నగునీకు నమస్కారము. జగదుత్పత్తిప్రళయంబులకుఁ గారణుండ వగుటచే నీవు సర్వజీవస్తవనీయుండవు. మావంటిదీనులకు శరణ్యుండవు. ఓవిశ్వకర్తా! నీవు నాయెడలఁ బ్రసన్నుండవై వరప్రదానంబు గావింపుము.

అని శిలాదమునీంద్రుం డనేకవిధంబులఁ బ్రార్థించుటయు, దేవదేవుం డగుత్రిలోచనుండు మునిశ్రేష్ఠుం డగు నాతనిం గాంచి యో ఋషివరా! నేను వరదాతను. భక్తితో నీవుగావించిన యీస్తోత్రమును ప్రాతఃకాలమున శుచియై నిర్మలచిత్తంబున బఠియించువారు భూత

పిశాచరాక్షసపన్నగాదిబాధలనుండి విముక్తు లగుదురు. పూతనాగణం బువలన వారికెట్టియనిష్టంబులును గలుగవు. అని యానతిచ్చి నీయభీష్టంబు నెఱింగింపు మనుటయు శిలాదుండు మహాదేవున కిట్లనియెను. మహాత్మా! నీవు నాయెడల ననుగ్రహించి నాకు వరప్రదానంబు గావింప నిచ్ఛగింతువేని నీవలె నమరుండును, నయోనిజుండు నగునొక పుత్రుని నాకుఁ బ్రసాదింపు మనికోరెను. మహాదేవుండును బ్రీతుఁడై యట్లే యగుఁగాక యని వరంబిచ్చి యంతర్హితుం డయ్యెను. అనంతరము పరమపూజ్యుం డగునమ్మహర్షికులతిలకుండు తనయాశ్రమంబునకు వచ్చి యచ్చటిమునీంద్రులకు సకలవృత్తాంతమును నివేదించి వారిచేఁ బ్రస్తుతుం డయ్యెను.

ఇట్లు కొంతకాలము జరగినపిమ్మట శిలాదుం డొకప్పుడు యజ్ఞభూమిని దున్నించుచుండఁగా లాంగలమార్గమునందు సూర్యాగ్నిసదృశతేజోమయుం డగునొకకుమారుం డాతనికి దృష్టిగోచరుం డయ్యెను. ఆకస్మికముగ నాబాలకునిం గాంచి యది రాక్షసమాయ యనుభయంబుచే శిలాదుం డక్కుమారుని సమీపింపఁజాలక దూరముగఁ దొలఁగి యుండెను. అప్పుడు తేజోనిధానుండగు నాబాలకుండు తండ్రీ యని పిలుచుచు దీనభావముతో శిలాదుని సన్నిధి కేతెంచెను. కాని శిలాదుఁడు భయసంశయములపాలై యాదారకు నభినందింపఁజాలకపోయెను. అప్పు డాకాశమునుండి వాయుదేవుండు "ఓసాలంకాయనా! ఈతఁ డయోనిజుం డగునీపుత్రుఁడు. పరమేశ్వరుఁడు పూర్వము నీకు వరమిచ్చెనుగదా! నీవిక్కుమారుం గైకొని యుపలాలింపుము. నీకుఁ బరమానందకరుం డగుటచే నిక్కుమారుండు నందినామంబున విఖ్యాతుండు గాఁగలఁడు" అని తెలుపుటయు శిలాదమునీంద్రుండు మహానందముతోఁ బుత్రు నాలింగనంబు గావించుకొని సంతోషముతోఁ

దనయాశ్రమంబునకుఁ దీసికొనిపోయెను. క్రమముగా [illegible] కుమారునకుఁ జూడోపనయనాదికర్మంబులఁ గావించి పదక్రమ[illegible]ంబుగా వేదచతుష్టయంబును, ఆయుర్వేదంబును, ధనుర్వేదంబును, గాంధర్వశాస్త్రంబును, శిల్పవిద్యయు, శకునవిద్యయు, భూతచికిత్సయు, మాతృచరితంబును, భుజంగచరితంబును, సకలధర్మశాస్త్రంబులును, అష్టవిధవ్యాకరణంబులును, పురాణములును, ఇతిహాసములును, పంచయజ్ఞంబులును, జ్యోతిశ్శాస్త్రంబును, మాతృతత్త్వంబును, మంత్రశాస్త్రంబును, యోగశాస్త్రమునుగూడ నధ్యయనంబు సేయించెను. ఆబాలకుం డీసమస్తవిద్యలను బంచదివసంబులలో నభ్యసించి ముగించెను. తేజస్సంపన్నుం డగునక్కుమారుండు కార్యదక్షుండును, పవిత్రాత్ముండును, ప్రసన్నహృదయుండును, ప్రియవాదియు, అహింసావ్రతుండును, సకలహృదయనయనానందకరుండు నై విరాజిల్లుచుండెను.

ఆబాలకున కేడుసంవత్సరములవయసు వచ్చినసమయమునం దొకనాఁడు శిలాదునియాశ్రమంబునకు మహాతేజోనిధు లగునిరువురు తాపసులు విచ్చేసిరి. శిలాదమునీంద్రుండు వారిని యథోచితంబుగఁ బూజించి వారి యనుమతిం గాంచి సుఖోపవిష్టుం డై యోగబలసమన్వితులును, సర్వజీవాభిజ్ఞులు నగుమిత్రావరుణు లనునాయిరువురుమునులను ననేకవిధంబుల వినుతించుటయు వారు శిలాదుం గాంచి "మునీంద్రా! నీకుమారుండు నీకు సంతుష్టిం గూర్చుచుండెనుగద? ఆతఁడు ధార్మికుఁడును, స్వాధ్యాయతత్పరుండు నై మెలంగుచుండెనా? ప్రియవచనంబులచే నాతఁడెల్లర నానందింపఁజేయునా?" అని ప్రశ్నించుటయుఁ బుత్రవత్సలుం డగుశిలాదుండు "మునివరులారా! సద్గుణసంపన్నుఁ డగునిక్కుమారుండు నావంశవర్ధనుండై యున్నాఁడు" అని చెప్పుచు నవినశ్వరుండు, ననిందితుండు నగునిజపుత్రునిచే వారిపాదములకు

సాష్టాంగప్రణామము చేయించెను. అప్పు డమ్మునికులతిలకు లిరువురు నేకవాక్యముగా “నీకుధర్మవృద్ధి యగుఁగాక! నీవు గురుసేవారతుండ వయ్యెదవుగాక! సకలలోకములు నక్షయంబు లగుఁగాక” అని యాశీర్వదించిరి.

శిలాదుండు వారియాశీర్వాదము నుపలక్షించి కుమారుం డగు నందిని లేవఁదీసి యమ్మునులఁ గాంచి మహాత్ములారా! మీరు తపస్సిద్ధు లగుసత్యవాదులు. సకలజీవగతులును మీకు సువిదితంబులు. అట్టిమీరు నాకుమారుని దీర్ఘాయురస్తునిగా నేల యాశీర్వదింపకైతిరి? అని ప్రశ్నించుటయు మిత్రావరుణు లోమునీంద్రా! నీపుత్త్రునిపరమాయు వష్టవర్షంబులుమాత్రమే. అష్టమవర్షమునం దితఁడు మృతుం డగు నని చెప్పిరి. ఆమాట విని శిలాదుండు శోకాకులితహృదయుండై యమ్మునివరుల నంపించి యేకాకియై విలపింప నారంభించెను. జనకుని దుఃఖస్వరము నాలకించి పుత్త్రుం డాతనిచెంతకు వచ్చి తండ్రీ! మీ రేల దుఃఖకుపితు లగుచున్నారు? మీయీదుఃఖమునకుఁ గారణమేమో యానతీయవలయు నని ప్రార్థించెను. అప్పుడు శిలాదుండు కుమారా! నీవు సంవత్సరములోపల మరణింతు వని సత్యవాదు లగుమునులు చెప్పి యున్నారు. ఇంతకంటెను దుఃఖకారణ మిఁక నాకేమున్నది? అనుటయు నందీశ్వరుండు తండ్రీ! ఎంతప్రయత్నించినను దేవతలుగాని, దానవులుగాని, యముండుగాని నాకు మృత్యువును గల్పింపఁజాలరు. అందుకై మీరూరక దుఃఖింపవల దని యూఱడించెను. అంత శిలాదుండు కుమారుం గౌఁగిలించుకొని తండ్రీ! నీవేతపంబుచే నేయోగముచే, నేవిద్యాలాభము నెవ్వని నాశ్రయించి దారుణమృత్యుపదనమునుండి విడివడఁగలవు? నాకేమియుం దోఁచుట లేదని విచారింపఁ దొడంగెను. నందీశ్వరుం డప్పుడు మృదుమధురస్వరముతో తండ్రీ!

ఎట్టివిద్యలైనను, తపంబులైనను మృత్యువును దప్పింపఁజాలవు. కేవలము మహాదేవానుగ్రహముచేతనే మృత్యుదేవతను జయింపవలయును. ఈవిషయంబునఁ బినాకి యగు మహాదేవునియనుగ్రహంబుదక్క నన్యోపాయంబులేదు. నేనమ్మహాదేవుని బ్రసన్నుంగావించుకొని యాతని దయవలన మృత్యువును జయింతు నని చెప్పుటయు శిలాదుండు పుత్త్రా! నేను వేయివత్సరంబులు తపంబు గావించి మహాదేవునిసాక్షాత్కారముం గాంచి యాతనికృపచే నిన్నుఁ బుత్త్రునిగాఁ బడయఁగలిగితిని. నీవొక్కసంవత్సరములో నద్దేవునెట్లు ప్రసన్నుం గావించుకొనఁగలుగుదువు? అట్టిసామర్థ్యము నీకేతపంబుచే లభించును? ఏయుపాయముచే నీవిమ్మృత్యువును జయింతువో నాకుఁ దోఁచుట లేదనియెను.

అప్పుడు నందీశ్వరుండు నాయనా! తపంబులచేఁగాని విద్యలచేఁగాని పరమేశ్వరసాక్షాత్కారము దుర్లభమైనది. విశుద్ధచిత్తంబున భక్తిమూలముననే యాతని దర్శింపవలయును. ఆతనిం బ్రసన్నునిగాఁ జేసికొనునుపాయము నేనెఱుంగుదును. నేనిప్పుడు మీకడ సెలవు గైకొని యచిరకాలముననే యమ్మహాదేవునిసన్నిధికిఁ బోయెదను. ఈవిషయమున మీరెంతమాత్రమును సంశయింపవలదు. సంపూర్ణముగఁ గృతకృత్యుఁడనై వచ్చినమీకుమారుని మీరచిరకాలముననే చూచి యానందింపఁగలరు. నాకిఁక నెంతమాత్రమును జననమరణంబులు లేవు. నాకెవ్వరు ననిష్టముం గూర్పఁజాలరు. నాకెట్టిసమయములందైనను మృత్యువు గలుగదను దృఢసంకల్పముతో మీరు నాకు సెలవొసగుఁడు. సహస్రమృత్యుదేవతలును, శతకోటియములునుగూడ నాయుధధారులై యతిక్రోధముతో ముట్టడించినను నన్నేమియుఁ జేయఁజాలరు. కావున మీరెంతమాత్రమును భయపడవలదు. వారు నాకించుకైన నపాయముం గల్పింపఁజాలరు. విశుద్ధచిత్తముతో జలంబులయం

దుపవసించి శతరుద్రీయమును జపించుచు మృత్యుంజయుండును, వర దాతయు నగుమహాదేవుని బ్రసన్నుం గావించుకొందును. నేను యోగము నవలంబించి జపంబు సేయుచు రుద్రభావరతుండనై యున్నప్పుడు మృత్యువుగాని, కాలుఁడుగాని, యముఁడుగాని యెవ్వరును నాకనిష్టముం గూర్చుటకు సమర్థులు గాఁజాలరు. అని ధైర్యము చెప్పెను.

విశుద్ధంబులును, మధురంబులును, శాంతిదాయకంబులు నగు కుమారునివచనంబుల నాలకించి యదీనుండును, మహాతపుండు నగు శిలాదుం డతికష్టముతోఁ గుమారునకు సెలవొసంగుటయు మహాశయుండగు నందీశ్వరుం డవనతమస్తకుండై తండ్రిచరణంబులకుఁ బ్రణామంబు గావించి ప్రదక్షిణంబు సేసి ప్రయాణమై సకలార్తిహరుం డగుమహాదేవుని నిశ్చలచిత్తంబున ధ్యానంబు గావించుచు బయలుదేఱిపోయెను.

—♦ నందీశ్వరునితపశ్చరణము. ♦—

నందీశ్వరుం డిల్లువెడలి పోయి లోకవిఖ్యాతంబును, సర్వజీనసుఖదాయకంబును నగుభువనానదిం జేరి యందుఁ బ్రవేశించి జలనిమగ్నుండై యేకాగ్రచిత్తంబునఁ బరమకారుణికుండగురుద్రుని ధ్యానించుచు శతరుద్రీయమును జపింపనారంభించెను. ఆతఁడిట్లు కోటిజపంబు గావించునప్పటికి జటాజూటధారి యగుమహాదేవుండు సంతుష్టుండై యాతనికి సాక్షాత్కరించి నందీశ్వరా! నీయెడలఁబ్రసన్నుండనైతిని. నీకు శుభంబగుఁగాక! నీయిచ్ఛవచ్చినవరంబును గోరుకొనుమనియెను. నందీశ్వరుం డప్పుడు ప్రణతుండై పరమకారణా! నేనింకను నొకకోటిజపంబు సేయవలయునని కుతూహలపడుచున్నాను. అని చెప్పెను. ఈశ్వరుం డట్లయగుఁగాక యని యంతర్ధానుం డయ్యెను. నందీశ్వరుండు మరలనీశ్వరధ్యాననిమగ్నుండై కోటిజపంబు గావింపనారంభించెను. ఆ

జపము పూర్తి యగునప్పటికి దేవదేవుండు మరల సాక్షాత్కరించి వత్సా! నేను నీకువరప్రదానంబు చేయవచ్చితి ననియెను. నందీశ్వరుఁడు మూఁడవకోటికూడఁ బూర్తియగువఱకు జపంబు సేయనిమ్మనికోరెను. శివుం డట్లేయని దేవీసహితుండై యంతర్హితుం డయ్యెను. నంది మూఁడవకోటిజపంబు గావించి యుగాంతసూర్యునివలెఁ దేజోమూర్తి యయ్యెను. ఆతనిదేహము జ్ఞానముచే జాజ్వల్యమాన మగుచుండెను.

మహాదేవుం డప్పుడు సకలభూతగణసహితుండై సాక్షాత్కరించి తనకరంబులచే నాతనిం గ్రహించి శిరంబును బైకెత్తి దక్షిణహస్తముచే నాతని స్పృశించుచు, ఓశిలాదతనయా! నీతపంబునకు నేను సంతుష్టుండనైతిని. వరంబు గోరుకొనుము. ఓధీమంతా! నీవుత్తమజపంబు గావించితివి. నీయుద్దేశమేమో తెలుపుము. అనుటయు, నందీశ్వరుండు, ప్రభూ! నీవు నాయెడలఁ బ్రీతుండ వైతివేని నన్నింకను జపంబుఁ జేసికొననిమ్మనియెను. అప్పుడు, మహాదేవుండు, కుమారా! నీఁక జపంబుతోఁ బ్రయోజనంబు లేదు. నాకు సంపూర్ణముగ సంతృప్తి గలిగినది. నీవేమికోరిన దానిని బ్రసాదించెదను. బ్రహ్మవిష్ణులోకంబుల నభిలషించినను, రుద్రాదిత్యరూపంబుల వాంఛించినను, మోక్షము నపేక్షించినను నిశ్చయముగా నీమనోరథము సిద్ధింపఁగలదు. అని హెచ్చరించుటయు నందీశ్వరుండు శివచరణంబులకుఁ బ్రణతుండై జరాశోకనిహంత యగుపరమేశ్వరు నిట్లు వినుతింప నారంభించెను.

ఓదేవాదిదేవా! మహాదేవా! త్రైలోక్యసంహారా! హరా! నీకు నమస్కారము. దేవా! నీవు కామాంగనాశకుఁడవు; ఉగ్రదండధారివి; కాలశాసకుఁడవు; సహస్రమస్తకుఁడవు; సహస్రకరుఁడవు ; సహస్రచరణుఁడవు; నీపాణిపాదంబులును, నయనవదనంబులును, శ్రవణంబులును.

సర్వతోముఖంబులై యున్నవి; నీవు సర్వవ్యాపకుఁడవు. అతీంద్రియా!
కపర్ది! సూర్యచంద్రులు నీనేత్రములు. నీవు యోగీశ్వరుఁడవు. పినాక
శూలముద్గరధరుండ వగునిన్నెవ్వరును జయింపఁజాలరు. పరశుదండ
గదాఖడ్గమహాధనుర్ధారి వగునీకు నమస్కారము. రుద్రుండవగునీవు
దేవతాదుల కధీశ్వరుండవు. సహస్రచక్షుండవు, సహస్రబాహుండవు
నగునీకు వందనములు. నీవాదిత్యవసుప్రముఖులకుఁ బ్రభుండవు. స్వ
ర్లోకమహర్లోకేశ్వరుండ వగునీకుఁ బ్రణామంబులు. యోగగమ్యుఁడ
వు, యోగప్రియుఁడవు, ధ్యానశీలుఁడవు, ధ్యేయుఁడవు, ధ్యానపరాయణు
లచేఁ బ్రస్తుతుండవు నగు నీకు జోహారు. మృత్యువును, కాలదండం
బును, యముండును నీస్వరూపములు. దేవదేవా! నీవు దివ్యశరీరధా
రివై విరాజిల్లుచుందువు. నీవు దానసహితయజ్ఞస్వరూపుఁడవు. స్వర్గ
జన్మప్రదాయకుఁడవు. బహుజన్మప్రదాయకుఁడవు. బహునేత్రుఁడవు;
ధర్మమూర్తివి; దేవతారక్షకుఁడవు; మోక్షస్వరూపుఁడవు; ఉమారుద్ర
నారాయణస్వరూపుఁడవు. బ్రహ్మశిరంబునకును, ఇంద్రయజ్ఞంబునకును
బరిపంథి వగునీకు నమస్కారము. త్రిపురహంతయు, ఉగ్రచరుండును,
సర్వాశుభహరుండును, లలాటాంకితనేత్రుండును, ఊర్ధ్వలోకోత్పాద
కుండును, యమహంతయు, బ్రహ్మగురుండును, కార్తికేయజనకుండు
ను, వరదాతయు నగునీకు వందనము. హలధరుండవు, ముసలధారివి;
మహాహాసుండవు, మృత్యుపాశోగ్రహస్తుఁడవు, నక్షత్రలోకాధారుఁడ
వు, మందాకినీధరుండవు, వృషభవాహనుఁడవు, హిమాలయ వింధ్య
సుమేరు కైలాసగిరినివాసుఁడవు, విష్ణుదేహార్ధసంస్థితుండవు, విష్ణువరదా
తవు నగునీకు నమస్కారము. ఓసర్వభూతస్వరూపా! చైతన్యమూర్తీ!
నీవు సకలభూతదయాపరుఁడవు. సకలభూతాంతర్నివాసుఁడవు. సకల
జీవస్వరూపుఁడవు. వాక్యమూర్తివి, వక్తవు, సూక్ష్మశరీరుఁడవు నగు

నీకు నమస్కారము. పశుపతియు, ఆత్మయు, విటుండును, విష్ణుండును, [illegible]ము, [illegible]యు, [illegible]రూపుండును, సప్తర్షిస్వరూపుండును, [illegible] [illegible], తా[illegible]దాయకుండును, విశుద్ధబ్రాహ్మణస్వరూపుండు నగునీకు నమస్కారము. దేవా! నీవు శిల్పివి, శిల్పనాశకుండవు, విశ్వకర్మవు. విద్వాంసుండవు. సాధుమూర్తివి. ధర్మమూర్తివి. భూతమూర్తివి. భూతనాథుండవు. పిశాచపతివి. స్థావరజంగమస్వరూపుండవు. గాయకుండవు. నర్తకుండవు. అవశ్యుండవు. అవధ్యుండవు. నీకుం జరామరణంబులు లేవు. క్షయవృద్ధులు లేవు. నీవప్రతిహతుండవు. అనాథనాథుండవు. పుణ్యమూర్తివి. సూక్ష్మాతిసూక్ష్ముండవు. సర్వగతుండవు. ఓమహాత్మా! త్రిలోచనా! పరమేశ్వరా! సర్వలోకేశ్వరా! సర్వజనకా! విశ్వనాథా! బ్రహ్మస్వరూపా! నీకు నమస్కారము.

దేవా! నేను విష్ణుపదమును గాని, దేవపదమును గాని, ఇంద్రపదమును గాని వాంఛించుట లేదు. భవనివృత్తి నపేక్షించుచున్నాను. నిత్యమును నీశరణము నభిలషించుచున్న నాయెడల నీవు ప్రసన్నుండవై నీదివ్యమూర్తిని సాక్షాత్కరింపఁజేయుము. నీవు మాపూర్వగతివి. నాకుఁ బరమాశ్రయుండవు. నీ వెవ్వనిఁ బరిత్యజింతువో వానికిఁ దప్పక మృత్యు వగును. నీసేవకంటె నాకుఁ బరమోపాయంబు లేదు. అదియే నాకుఁ బరమసుఖకరమైనది. దుస్తరం బగు నీసంసారమునందు నేను నీయందనురక్తుండను, భక్తుండను నై మెలంగునట్లనుగ్రహింపుము. మహాదేవా! ఇదియే నాప్రార్థనము.

— నందీశ్వరోత్పత్తి. —

ఇట్లు పరమభక్తిసంపన్నుండును, దీనభావావాసన్నుండునై సాష్టాంగప్రణామంబులతోఁ జరణసన్నిధానమునఁ బ్రణతుఁడై పడియున్నసం

దీశ్వరు సమ్మహాదేవుండు నిజకరకమలంబులతో లేవనెత్తి యాతనిమొగంబును దుడుచుచు మృదుమధురస్వరంబునఁ గుమారా! నీకు భయములేదు. భయము లేదు. నాయనుగ్రహంబుచే నీవు జన్మమృత్యుజరావిరహితుండ వైతివి. వత్సా! నీనిర్మలభక్తిని నేను గ్రహించితిని. నీవు నీజననితోడను, బాంధవులతోడను జననమరణాదిదుఃఖవిహీనుండవై శివలోకగమనంబు గావింపుము. నీవు మత్సమానబలపరాక్రమసంపన్నుండవై నాకుఁ బ్రధానగణనాయకుండవై సర్వదా నాపార్శ్వమునం దుండి యోగబలసంపన్నుండవై మత్సదృశంబగురూపముతో విహరిల్లఁగలవు. మహైశ్వర్యసమంచితంబు లగుద్వీపంబులచే విలసిల్లు క్షీరసాగరమును నీకుఁ బ్రసాదించితిని. నీవాప్రదేశమున నివసించియుండుము. అని యనుగ్రహించుచు స్వయంభువగుమహాదేవుండు సుందరంబగుసురభికమలమాలికను, దేవస్వరూపుఁ డగునందీశ్వరునకుఁ బ్రసాదించెను. ఆకమలకుసుమదామమును గంఠమునఁ దాల్చినంతనే పరమతేజోమయుండగునందీశ్వరుండు త్రినేత్రుండును, దశభుజుండును, సుందరశ్రీసంపన్నుండునై రెండవశంకరునింబోలి ప్రకాశించుచుండెను.

అప్పుడు భగవానుం డగుశంకరుం డాతని దనకరంబులతో గ్రహించి సమాదరపూర్వకంబుగా, కుమారా! నీకేమికావలయునో కోరుకొనుము. నీవు సముత్కటంబుగాఁ దపంబు సేసినయియ్యాశ్రమము జాప్యేశ్వరనామంబునఁ బ్రసిద్ధమై యతిపవిత్రంబు గాఁగలదు. ఇది చతుర్దిశల నేకయోజనపర్యంతము మోక్షప్రదంబగును. ఇందప్సరోగణంబులును, సిద్ధచారణులును నివసించి యుందురు. ఈసిద్ధక్షేత్ర మతిగోప్యమైనది. మనోవాక్కర్మంబులచే మానవులుగావించినశుభాశుభకర్మంబు లిందు భస్మీభూతంబులై పోవును. ఇందు జపంబు గావించువాఁడు శివసముం డగును. ఈక్షేత్రమున మరణించువాఁడు శివలోక

ముం జేరును. అని ప్రశంసించుచు నానందమయుండును, మహాత్ముం
డు నగుమహాదేవుండు హారనిర్మలంబగుజపసలిలము సఘముత్రింబు
గావించి విసర్జించెను. అప్పు డాదివ్యోదకము పుణ్యంబును, గర్వితుల
కశుభదాయకంబును, హంసకారండవచక్రవాకాదిజలవిహంగశోభితం
బును నగుమహానదీరూపంబును గాంచెను. తోడనే యాదివ్యనది క
మలదళసుందరవిలోచన యగుస్త్రీమూర్తిం దాల్చి బద్ధాంజలియై యవ
నతమస్తకంబుతో మహాదేవు నెదుటఁ నిలువఁబడియెను.

అప్పుడీశ్వరుం డాపుణ్యవాహినినుద్దేశించి యోశుభాననా! నీజ
లంబులు యజ్ఞోద్భూతంబులు, గావున నీకు యజ్ఞోదకినామంబు సుప్ర
సిద్ధం బగుఁగాక! శుచివై నియమంబున నీయం దవగాహన మాచరిం
చువాని కశ్వమేధసమఫలంబులభింపఁగలదు. అట్టివాఁడు రుద్రలోక
పూజితుం డగును. అని యనుగ్రహించి మహాదేవుం డప్పుడు నందీ
శ్వరుని, దేవియగుపార్వతి చరణకమలంబులకుఁ బ్రణతుంగావించి యో
ప్రియా! నీవిక్కుమారునియెడలఁ బుత్రవాత్సల్యముం జూపుమని వచి
యించెను. అద్దేవియు నక్కుమారునిమూర్ధాఘ్రాణంబు గావించి కర
కమలంబుచే నాతనిశరీరమును స్పృశించుచుఁ బుత్రస్నేహంబుచేఁ గలి
గిన స్తన్యధారలచే నాతనినభిషిక్తుం గావించుచుండెను. అప్పు డామె
శ్రోత్రములనుండి మూఁడుధారలతో నొకనది యుత్పన్నం బయ్యెను.
అందుచే దానిని త్రిస్రోత యను నామంబు గలిగెను. నందీశ్వరుం
డాపుణ్యవాహినిం గాంచి పరమానందముతో మహాధ్వానంబు గావిం
చెను. ఆమహానాదమునుండి యొకదివ్యనది యుదయించుటయు మహా
దేవుండు మహాహర్షంబున నందీశ్వరునకు సువర్ణమయకిరీటంబును,నమృ
తసంభవంబు లగుకుండలంబులును బ్రసాదించి ప్రభాకరునివలె నప్రమే
యతేజోనిధియగు నాతనిని రాజ్యాభిషిక్తుం గావించుటయు నక్కుమా

రుండు మరల నధికోచ్చస్వరంబున మహానాదముం గావించెను. అప్పా డయ్యభిషేకపుణ్యోదకంబు వాహినీరూపముం గాంచుటయు మహాదే వుం డిది సువర్ణకిరీటమునుండి ప్రవాహితంబయ్యెనుగావున సువర్ణముఖరీ నామంబునను, జాంబూనదకిరీటపరివృత్తంబుగావున జాంబూనదీనామం బునను విరాజిల్లఁగలదని యానతిచ్చెను. దానిని దర్శించి యటఁ ద్రి రాత్రోపవాసంబు గావించి యందవగాహనంబు సేసి మహాదేవు నర్చిం చి బ్రాహ్మణసమారాధనముం గావించువారు నంద్యనుచరులై క్షీరో దకంబున నిత్యనివాసంబు గాంచఁగలరు. వారు నందీశ్వరతుల్యులై శాశ్వతులు నక్షయులును గాఁగలరని మహాదేవుం డానతిచ్చినందీశ్వ రుం గాంచి వత్సా! నీకుఁ బ్రియులగువారు నాకుఁ బ్రియపాత్రులగు దురు. ఈజాప్యేశ్వరమునందును, బంచనదంబునందును దేహత్యాగ ముం గావించువారు మద్గణపతులై నీవలెనే రమణీయమూర్తు లగుదు రని యానతిచ్చెను.

—♦ నందీశ్వరాభిషేకసంకల్పము ♦—

పిమ్మట మహాదేవుండు నందీశ్వరు నలంకరించి యభిషిక్తుం గా వించి దేవిం గాంచి యోమంగళదాయినీ! నేనీనందీశ్వరునకు గాణప త్యప్రదానముం గావింపఁదలఁచితిని. నీయుద్దేశ మేమని ప్రశ్నించుట యుఁ బార్వతీదేవి నాథా! ఈతఁడు మాతనయుఁడు. సప్తలోకంబుల కును, సకలగణాధ్యక్షులకునుగూడఁ బ్రభుత్వం బీకుమారునకుఁ బ్రసా దింపవచ్చు ననియెను. అనంతర మమ్మహాదేవుండు సిద్ధసురప్రమథ గణపరివృతుండై పూర్వాభిముఖంబుగఁ గూర్చుండి నిజానుచరులును, దిగంబరులు నగురుద్రగణంబులను స్మరింప నారంభించెను. అట్లు తలం చినంతనే గణాధ్యక్షు లెల్లరును బ్రహృష్టహృదయములతో దశదిశల నుండియు శివసన్నిధానమునకుఁ జేరుకొనఁదొడంగిరి. అందు శూల

ధరులును, నిషంగధరులును, నీలకంఠులును, కృష్ణగ్రీవులును, విశుద్ధో
జ్జ్వలనయనులును, బ్రహ్మాండావరణులును, కపాలహస్తులును, శతనే
త్రులును, వాయువేగులును, శతపాదులును, శతాననులును, సర్వలో
కేశ్వరులు నగుగణనాయకులు ముందుగ నేతెంచిరి. అనంతరము కరా
ళవదనుండును, భ్రుకుటీభూషితముఖుండును, పంచయోజనదీర్ఘవిస్తీ
ర్ణుండును, చతుర్ముఖుండును, శుక్లవర్ణుండును, పంచజిహ్వుండును, ఊ
ర్ధ్వకర్ణుండును, పాశహస్తుండును, మనోవేగుండు నగుభవభూతినామక
గణాధ్యక్షుండు నిజతుల్యపరాక్రములగు భూతగణశతంబులచేఁ బరివృ
తుండై చనుదెంచెను. మఱియు మహాయోగబలుండును, ఖడ్గధరుం
డును, ధ్యానయోగపరాయణుండు నగుసోమవర్ణుం డనుగణపతి తనతో
సమానులగు కోటిమందియధికులతో శివునిచెంత కరుదెంచెను. పిమ్మట
సురాసురపూజితుండును, యుగాంతానలసదృశుండును, శూలధారియు,
నర్ధచంద్రాలంకృతుఁడును, చతుర్భుజుండును, రక్తవర్ణుండు నగునంబో
శివుండను శివపార్షదుం డేకపాదులును, మహాకాయులు నగుశతకోటి
శూలపాణిగణంబులతో విచ్చేసెను. తరువాత విశాలోదరుండును,
సహస్రపాణిపాదనయనుండును, విస్తృతవదనుండును, మహాఫణిభూష
ణుండును, త్రిలోచనుండును, చంద్రావతంసుండును, ముండమాలా
లంకృతుండును, బ్రశస్తకుంతలుండును, హ్రస్వపాదుండును, శుచియు
నగు హరనామకగణాధిపతి యాత్మతుల్యులగుకోటిగణంబులతో నేఁగు
దెంచెను. ఆవెనుకఁ జతుర్వదనుండును, జతుర్వింశతిలక్షణంబులచే
మహాతేజస్సంపన్నుండును, మహాబలశాలియు, వరదాతయు నగుసోమ
నామక గణనాథుండును, నావెనుక సహస్రబాహుండును, విశాలకరాళ
వదనుఁడును, శంఖకర్ణుఁడును, శతపదుండును, కృశోదరుండును, విద్యు
త్కేశుండు నగునూర్ధ్వవాహనుండను గణపతియు, నాతనిపిమ్మటఁ బ్ర

శస్త్రవదనుండును, ఉభయతోగతియు, నజేయుండును బ్రిముఖగణకోటి పరివృతుండు నగు నజైకపాదుం డనుగణప్రభుండును, వానియనంతరము సర్వతోముఖుండును, సర్వతఃకరచరణుండును, మహాబలుండు నగు నొకగణనాయకుండును విచ్చేసిరి. హ్రస్వబాహుండును, అశనిధరుండు ననగునపాదుం డనుగణేశ్వరుఁ డష్టోత్తరశతకోటిగణసహితుండై యేఁగుదెంచెను. చంద్రమౌళియు, పుష్పమాలాలంకృతుఁడును, సహస్రహస్తుండును, జక్రిదండధరుండును, శంఖవర్ణుండును నగునికుంభుఁడను గణశ్రేష్ఠుఁ డరుగుదెంచెను. సర్పమాలాలంకృతుండును, మహాదేవుని కతిప్రియుండు నగు సూర్యాపాయనుండును, సర్వజ్ఞుండగు మహాతేజుండును, షట్చతకోటిగణంబులతో మహాతేజుండును, చంద్రాయుధధారియు, చక్రహస్తుండు నగుకటాకటుండును, కోటిగణంబులతో మహాబలుండగు శంఖకర్ణుండును, పదిమందిగణపతులతో నందితుండును, అష్టగణంబులతోఁ బిశంగాక్షుండును, చతుష్షష్టిశతకోటిగణంబులతో వినాయకుండును, షట్చతకోటిగణంబులతో సువర్ణవర్ణుఁడు, నేకపాదుండునగు కూష్మాండుండును, ద్వాదశశతకోటిగణంబులతో ధూమ్రకేశుండును, దశశతకోటిగణంబులతోఁ బతాకియు, పంచశతకోటిగణంబులతో శతమన్యుండును, షట్చతకోటిగణంబులతో సహస్రశీర్షుండును, దశశతకోటిగణంబులతో వీరుండును, అష్టకోటిగణంబులతోఁ గుంభకర్ణుండును, సహస్రకోటిగణంబులతో విశ్వబలుండును, శతకోటిగణంబులతో మనువును, అష్టకోటిగణంబులతో నశనినాదుండును, సప్తకోటిగణంబులతోఁ జంద్రవర్తనుండును, సహస్రకోటిగణంబులతో మహీంధరుండును, కోటిగణంబులతోఁ బ్రణవాదిత్యుండును, శతకోటిగణంబులతో సంతోషుండును, అష్టకోటిగణంబులతోఁ గరుదుండును, పంచదశకోటిగణంబులతోఁ గుంభుండును, కోటిభూతగణంబులతో నమోఘుండు

ను, అష్టే మేఘుండును, భూతికుండును, అష్టషష్టికోటిగణంబులతో నేకపాదుండును, సప్తశిరుండును, దశకోటిగణంబులతో మహాబలాపస్మారులును, సప్తతికోటిగణంబులతో నీలోద్భవ, దేవేశ, కణ్వభద్ర, వికృతులును విచ్చేసిరి. ఈవిధముగా వింశతిశతసహస్రకోటిగణంబులతోఁ జతుర్దిశలనుండియు గణాధ్యక్షు లెల్లరును వచ్చి చేరుకొనుచుండిరి.

కోటిసహస్రభూతంబులతోడను, గోటిప్రమథగణంబులతోడను వీరభద్రుఁడు వచ్చెను. మఱియు నవకోటిభూతగణంబులతో మేఘసౌదామనియు, వింశతికోటిగణంబులతోఁ బ్రభాకరుండును, విద్యుత్తును వచ్చిరి. మృత్యువు, యముఁడు, కాలుఁడు, విషధరుఁడు, శతమాయుఁడు, పర్వతాభరణుఁడు, ఏకశృంగుఁడు, మహాబలుఁడగు భృంగిరిటి మొదలగు గణనాథులు హర్షాన్వితులై ముఖ్యవాద్యములను బ్రయోగించుచుండిరి. అందఱును రథములు, గజములు, అశ్వములు, భల్లూకములు, మర్కటములు, వ్యాఘ్రములు, సింహములు, విమానములు, సర్పములు, పక్షులు మొదలగు తమతమవాహనముల నధిరోహించి నానారూపధారులై యుండిరి. పుష్పక, విమానంబుల నధిరోహించి యున్నకిన్నరోరగగణంబులచే నాకాశమండలమంతయు నాచ్ఛన్నమై పోయెను. ఏకపుష్కర, భేరీ, శంఖ, మృదంగ, పణవ, గోముఖ, పటహానకప్రభృతివాద్యంబులును, గంభీరంబు లగుడమరు, డిండిమ, వేణు, వీణా, దర్దుర, కరతాళాదిమంగళవాద్యయంత్రంబులను బ్రయోగించుచు మహాఘోరగణంబులు మహాదేవుని సన్నిధిని జేరియుండిరి. అచ్చట నొకదివ్యాసనముపైఁ బద్మగర్భుండగు పితామహుం డాసీనుఁడై యుండెను. నలుదెసలను సిద్ధమునిగణంబులు పరివేష్టించియుండిరి. దివ్యకుండలధారి యగుబుగ్వేదుండు దక్షిణభాగంబునను, నానారూప

విరాజితుం డగుసామవేదుండు పశ్చిమంబునను, వహ్నిసదృశుం డగు నథర్వవేదుం డుత్తరంబునను, విద్యుత్తుల్యమూర్తి యగుయజుర్వేదుండు పూర్వభాగంబునను, ఎట్టయెదుట వివిధరూపంబులతోఁ బురాణేతిహాసంబులును, పార్శ్వములందు సకలదేవతలు నుపస్థితులై యుండిరి.

అప్పుడు యజ్ఞరూపధరుం డగుమహాదేవుండు లోకభావనుం డగు నారాయణుం గాంచి గంభీరస్వరంబుతో సర్వదేవతాధీశ్వరా! నీకుఁ బ్రియం బయ్యెనేని నాకును నందీశ్వరునకును నభిషేకంబు గావింపు మనుటయు, విష్ణుదేవుండు మందహాసంబు సేయుచుఁ బ్రభూ! నీవెట్లాజ్ఞాపించిన నట్లే నేను గావించుటకు సిద్ధముగా నున్నాను. నీవు దేవాదిదేవుఁడ వనుట నిశ్చయము. అనియెను. అంతలో నైరావతారూఢుఁడై మహేంద్రుండును, ప్రత్యేకవిమానారూఢులై వసుగణంబులును మహాదేవునికడకు విచ్చేసిరి. వారితోఁ గలసివచ్చిన భాస్వన్మూర్తులగు విశ్వకర్మాదిదేవత లచ్యుతుండును శాశ్వతుండు నగువిశ్వేశ్వరు నుద్దేశించి గంభీరస్వరంబున జయధ్వానములం గావింప నారంభించిరి.

—♦ నందీశ్వరాభిషేకము. ♦—

మహాసత్త్వులగు ప్రమథులందఱు నప్పుడు దేవదేవుండగుమహేశ్వరునకుఁ బ్రణామంబు గావించి యోపరమేశ్వరా! సర్వభూతనమస్కృతా! నీవు మమ్ముఁ బిలిపించుటకు నిమిత్తమేమో యానతిమ్ము! సముద్రముల నింకింపవలయునో, పర్వతసమూహములఁ బెకలింపవలయునో, దిశలఁ దెరలింపవలయునో, సబాంధవంబుగ సమవర్తిని సమయింపవలయునో, యెవ్వరెని ఘోరవిపన్నులం గావింపవలయునో, యెవ్వరియుత్సాహైశ్వర్యములను ధ్వంసములుగఁ జేయవలయునో యాజ్ఞాపింపు మని ప్రార్థించిరి. అప్పుడు భక్తవత్సలుం డగుమహాదేవుండు

వారి నభినందించుచు, మీరు సకలభువనహితకారులు. మిమ్ముఁ బిల్పించుటకుం గారణము వినుండు! పిమ్మట నిస్సంశయముగా నాయాజ్ఞను బరిపాలింపుఁడు! ఈనందీశ్వరుఁడు నాపుత్రుఁడు. సర్వశ్రేష్ఠుఁడగు నీతఁడు నాకుఁ బ్రియతముఁడు. మీరీతని సకలదేవతాగ్రణిగాఁ జేసి సేనానాయకపదంబున నభిషేకింపవలయును. ఇది మొదలుగ నీనందీశ్వరుండు మీయందఱకును బ్రభుండు గాఁగలఁడు. అని భగవానుం డగురుద్రుం డాదేశించుటయుఁ బ్రమథనాయకులందఱు నంగీకరించి యభిషేకోపకరణములను సంపాదించుట కారంభించిరి.

సువర్ణమయంబును, మేరుసదృశంబును, దివ్యంబును, సుందరంబు నగునొక పీఠమును, జతురంగశోభిత మగునొక మండపమును నిర్మింపఁబడియెను. అందున్న వైడూర్యస్తంభములు, ముక్తామణిజాలంబులచే నలంకరింపఁబడియెను. ఆమణిమండపము చతుర్ద్వారశోభితమై యుండెను. అందమూల్యాసనముపై నందీశ్వరు నాసీనుం గావించి మహాదేవుండు స్వయముగా నాతనికి దివ్యవస్త్రయుగ్మంబును, గంధద్రవ్యంబులును, కేయూరకుండలకిరీటహారంబులను, పట్టస, శూల, వజ్ర, రశనా, చ్ఛత్ర, చామరంబులను సమర్పించెను. అప్పుడు బ్రహ్మాది దేవతలును, మునిగణంబులును, నందీశ్వరు నిట్లు స్తుతింప నారంభించిరి.

ఓకూష్మాండరాగా! సాలంకాయనపుత్రా! వజ్రహస్తుఁడవగు నీకు నమస్కారము. శిలాదపుత్రా! నీవు హాలమార్గమునుండి యుద్భూతుండవై రుద్రజాప్యపరాయణుండవైతివి. దేవా! నీవు రుద్రభక్తుండవు. జలశాయివి. గణాధిపతివి. మహాయోగీశ్వరుండవు. నీదంతములతిప్రచండములైనవి. నీ వేకాకివయ్యు నేకాదశశతస్వరూపుఁడవు. అక్షయుఁడవు, అమృతుఁడవు, అజరుఁడవు, అవ్యయుఁడవు నగునీకు నమస్కారము. ఓపశుపతీ! రుద్రస్వరూపా! నీయాకార మతిభయంకర

మైనది, నీవు సర్వజ్ఞుఁడవు, అజేయుఁడవు, అనేకమస్తకుఁడవు, కిరీటకుండలమహాపరిఘధారివగునీకు నమస్కారము. సకలభూతగణరక్షకుండవగునీకు వందనములు.

అని యిట్లు దేవతలందఱును బ్రణతులై యమ్మహాత్ము ననేకవిధంబుల వినుతించుచు జయధ్వనులం గావింపఁదొడంగిరి. అప్పుడు బ్రహ్మేంద్రాదిదేవగణంబులును, అసురగణంబులును, దక్కిన యఖిలజీవగణంబులును జయధ్వానములం గావించిరి. యక్షాసురనాగభూతగణంబులు శంఖభేరీమర్దళాదివాద్యయంత్రసహస్రంబుల నొక్కపెట్టున బ్రమోగించుచు జయనినాదంబులు గావింప నారంభించిరి. దేవకీర్తితంబగునీనందీశ్వరస్తోత్రమును నిరంతరమును బఠించువానికి శివలోకావాసంబు సిద్ధించును. "నమోనందీశ్వరాయ" అని యెవ్వఁడు జపించునో యాతని కెన్నఁడును భూతభయంబు గలుగదు. నిత్యమును బ్రాతఃకాలంబున లేచి భక్తిపూర్వకముగా నీస్తవమును బఠించువానిపూజలకు మహాదేవుండు సంతుష్టుండై యాతని కభిమతవరప్రదానముం గావించును. ఆతని కెన్నఁడు నెట్టిభయంబును గలుగదు. నందీశ్వరునకుఁ బ్రతిదినమును బ్రణతుండగువాని సర్వేంద్రియములును సుప్రసన్నములై విశుద్ధంబులగును. ఆతఁ డీశ్వరునకుఁ బ్రీతిపాత్రుఁడై విశిష్టపదప్రాప్తుం డగును.

నందీశ్వరపరిణయము.

అనంతరము దేవదేవేశ్వరుం డగుహరుండు నందీశ్వరపరిణయంబునకుఁ గన్యను సంగ్రహించునుద్దేశముతో దేవతలంగాంచి యోమహాతేజులారా! మీలోనెవ్వరియొద్దనైన దివ్యరూపసంపన్నయు, శుభలక్షణవిలసితయు నగుకన్య యున్నచో నాకుఁ గోడలుగాఁ జేయుట కంగీకరింపవలయు నని కోరెను. అంత దేవత లోత్రిలోకనాథా! సర్వ

జగంబులకును, సర్వజీవులకును బ్రహ్మండ వగునీవిట్లు యాచించుట యుచితము గాదు. పరాత్పరా! నీవు మాకుఁ బ్రధానాధారుఁడవు. శ్రీమంతుఁడగుకశ్యపుఁడు మాజనకుఁడు, మరీచిమాపితామహుఁడు. ఆతని తండ్రి బ్రహ్మదేవుఁడు. అట్టి బ్రహ్మకుఁగూడ నీవు జనకుండవు. కావున నీవు మాకు వృద్ధప్రపితామహుఁడవు. అట్టినీవు మమ్ము యాచించుట యోగ్యము గాదు. అని విన్నపంబు సేయుటయు మహాదేవుండు సురలారా! మీరు యథార్థమునే వచించితిరి. నేను కన్యకొఱకు యాచించుట లేదు. లోకహితార్థమై నేనిట్లు యాచించితిని. అదత్తంబగువస్తువును నేను సంగ్రహింపనొల్లను. మునీంద్రులకుఁగూడ నిదియే సనాతనధర్మమైయున్నది. అని చెప్పుటయుఁ బ్రధానదేవతలు మనంబున ధ్యానంబు గావించి యాక్షణంబున నొకదేవకన్యకం దెచ్చి యాదేవునకు సమర్పించిరి.

లోకపితామహుండగుబ్రహ్మదేవుండు స్వయముగ హోతయై యాపాణిగ్రహణకార్యమును సంపన్నంబు గావించెను. చారణసహితులగుగంధర్వులును, బర్వతనారదులును, సానుచరుండగుచిత్రసేనుండును సర్వావశ్వుండును, సురుచియు, హాహాహూహువులును, మఱియు నితరగంధర్వులును మధురస్వరములతో గానముసేయఁ దొడంగిరి. రంభాద్యప్సరోగణంబులు దేవమనోహరంబుగా నృత్యము సేయుచుండిరి. ఈవిధముగా ధీమంతుండును, గణశ్రేష్ఠుండు నగునందీశ్వరునివివాహమహోత్సవ మప్రతిమానముగా సంపన్నం బయ్యెను. అనంతరము కృతదారుం డగునందీశ్వరుండు శిలాదకులంబునకు శ్రీసంపాదకుండై మహాత్ముండగుదేవదేవునకును, దేవియగుపార్వతికిని, జగత్పితయగు విష్ణుదేవునకును, లోకపితామహుండగుబ్రహ్మకును వందనంబులఁ గావించెను. అప్పుడు మహాదేవుండు పుత్రుఁగాంచి కుమారా! ఈనా

కోడలు నీకుఁ బ్రియురాలగుంగాక! నేనిప్పుడు సంతుష్టుండనై నీకు వర మీయవలయునని వేడుకపడుచున్నాను. నీయభీప్సితముం దెలుపుము. అనుటయు నందీశ్వరుండు ప్రభూ! జగత్కారణుండవగునీకు నాయెడల ననుగ్రహంబు గలదేని నాకు నీయెడల సర్వదా దృఢభక్తి వర్ధిల్లునట్లును, సర్వదా నీవు నాయెడల సంతుష్టుండవై యుండునట్లును వరంబు దయచేయఁగోరెదను. మఱియు నోజగన్నాథా! వరదా! నాజనకుని యెడలఁగూడ నించుకయనుగ్రహముం జూపఁగోరెదను. అని వేడుకొనియెను.

అప్పుడు దేవదేవుండు వత్సా! గణేశ్వరా! దేవియు, నేనును సర్వదా నీయెడలఁ బరమసంతుష్టులమైయుండెదము. నీపితృపితామహాదులు పరమైశ్వర్యసంపన్నులై మదీయంబగుస్థానంబును జెందఁగలరు. మీరజేయులును, సర్వపూజ్యులును, మహాసత్వులును గాఁగలరు. నీవున్నచో నేనును, నేనున్నచో నీవును గూడి యుండెదముగాక! నీవంశీయు లెల్లరును నీపితృపితామహులతోఁగూడ మద్గణాధ్యక్షులై మల్లోకంబున నివసింపఁగలరు. సర్వాభీష్టదాయకంబును, గామగమంబును, దివ్యవృక్షశోభితంబును, జలాశయవిలసితంబు నగునై భ్రాజంబనుపర్వతమును నీకుఁ బ్రసాదించితిని. అనుచుండగాఁ బార్వతీదేవి వరప్రదానాభిలాషతో నందీశ్వరునిచెంతకువచ్చి కుమారా! నీకేమికావలయునో కోరుకొమ్మనియెను. అప్పుడు నందీశ్వరుండు దేవీ! నాకు సర్వదా నీయెడ భక్తివర్ధిల్లునట్లనుగ్రహింపు మని కోరుకొనియెను. ఆసమయంబున మరుత్సుతయగునందిపత్ని యాదేవిసన్నిధికేతెంచి ప్రణామంబు గావించి తన్నుఁ దెలుపుకొనుటయు నుమాదేవి సంతుష్టయై కుమారీ! నీవు జన్మవర్జితవై మత్సమాన వగుము. మఱియుఁ బుత్రపౌత్రసంపత్తిం గాంచి నాయెడలను, నీభర్తయెడలను భక్తిమతివై నిరంతరము

చ్చింతాపరాయణ నయ్యెదవుగాక! బ్రహ్మవిష్ణులు నీకు వరప్రదు లయ్యెదరుగాక! అనియనుగ్రహించినంతనే బ్రహ్మవిష్ణువులు "తథాస్తు" అనిరి. అనంతరము మహాదేవుండు హరిబ్రహ్మలం గాంచి దేవతావరులారా! ఇదిమొదలుగ నందీశ్వరుండు పుత్రులగుమీచే బూజితుం డగుంగాక! ఈతఁడు దేవతలకుఁ బ్రభుండై నాద్వారపాలకుం డగుఁగాక! అనుటయు బ్రహ్మవిష్ణు లట్లే యగు ననిరి. అంత నందీశ్వరుం డెల్లవారిం గనుంగొని నాకు మీయెడల భక్తి వర్ధిల్లుఁగాక! మీవచనంబులచే నాకిష్టైశ్వర్యంబు లభించుఁగాక! మా మనోవ్యసప్రియుల మయ్యెదము గాక! మా కెన్నఁడును విచ్ఛేదంబు గలుగకుండుఁగాక యనియెను.

అప్పుడు రుద్రగణంబు లిట్లుచెప్పం దొడంగిరి. దేవా! నీవు మాకును, సకలదేవతలకును, ఋషులకును, మహాదేవపార్శ్వవర్తులగు రుద్రగణంబులకును, ప్రమథగణంబులకునుగూడ గతివి, విచారణకర్తవు, నియంతవు నై యున్నాఁడవు. నీవు మహాశక్తిసంపన్నుఁడవు. మహాయోగీంద్రుండ వగునీవు మాప్రభులకుఁ బ్రభుండవు. నాయకుండవు. దేవసేనానాయకుండగు కార్తికేయునితో సమానుఁడవు. అమరపూజితుం డగునారాయణునితోడను, బ్రహ్మాగ్నులతోడను, దేవియగుపార్వతితోడను గలసి యుందువు. నీవు జాప్యేశ్వరాశ్రితుఁడవును, సన్మానితుఁడవును, వరదాతవు నై యున్నావు. నీవు నిఖిలభువనాధీశ్వరుఁడవు. అనియిట్లు సకలాభీష్టదాయకులగు దేవతలెల్లరును బ్రశంసించుటయు నందీశ్వరుం డందఱిం గాంచి నేనేమి గావింపవలయునో యాజ్ఞాపింపుఁ డనియెను. అంతగణపతిగణంబులును, రుద్రగణంబులును మహేశ్వరునిసన్నిధిని దివ్యజ్ఞానసంపన్నుం డగునందీశ్వరుం గాంచి దేవా! నీవు మహేశ్వరునిచే సన్మానింపఁబడి, యాదరింపఁబడి సర్వగణాధ్యక్షుం

నైతివి. మేమును నిన్నభిషేకించితిమి. కావున నీవు మాకు నాయకుఁడవు, మోక్షప్రదాతవు నైతివి. అట్టినీవు బాలుండ వయ్యును సౌమ్యుఁడవు. నిర్గుణుండవయ్యును సద్గుణవంతుండవు. క్షమాశౌచదమోపేతుండవు. విశేషించి మాకుఁ బ్రియకరుండవు. అని సమాదరపూర్వకంబుగఁ గీర్తించుటయు నందీశ్వరుండు నిటలతటఘటితాంజలియై సకలగణాధ్యక్షుల నిట్లు వినుతింప నారంభించెను.

ఓగణనాథులారా! యోగులును, మహాయోగులు నగుమీకు నమస్కారము. జటాధరులు, రుద్రమూర్తులు, విశ్వరూపులు, విశ్వరక్షకులు, వల్కలచర్మపరిధానులు, బహురూపులు, దేవతాధీశ్వరులు, మునులు, విప్రమూర్తులు నగుమీకు నమస్కారము. మీరు శతసహస్రరూపంబుల విరాజిల్లుచుందురు. సంయతరూపులును, వాయురూపులును, మార్జాలరూపులును, కాలరూపులును, దేవాసురమానవాహ్వాయితులు నగుమీకు నమస్కారము. దేవదేహులును, అగ్నివాయువరుణాదిత్యమూర్తులును, వామనులును గామరూపులు నగు మీకు నమస్కారము. ఓశుభులారా! జలస్వరూపులును, సర్వగతులునగుమీకు నమస్కారము. మీరందఱును సమానులు. కాని మీతో సమానులేక నెవ్వరును లేరు. మీరు సౌమ్యపర్వతస్వరూపులు. సురసిద్ధపూజితులును, శక్తిసంపన్నులు నగుమీకు నమస్కారము.

గణనాయకు లిట్లు మధురవాక్యంబులచేఁ బ్రస్తుతులై దేవా! మాబలవీర్యసుఖంబులు యుగాంతంబులవఱకును సుస్థిరంబు లగునట్లను గ్రహింపు మని ప్రార్థించిరి. నందికృతం బగునీస్తోత్రమును నిత్యమును బఠించువాఁడు సకలపాపవిముక్తుండై యశ్వమేధఫలప్రాప్తుం డగును. మఱియు నాతనికి దినంబులయందును, బూర్వాపరసంధ్యలను, రాత్రులయందును గావించినపాపములు నశింపఁగలవు:—అనంతరము సకల

గణపతులును, నందీశ్వరసహితులై మహాదేవునకు నమస్కారంబులు గావించి సెలవు గైకొని వెడలిపోయిరి. దేవతలును, మహర్షులును దేవదేవీసహితముగా నాకాశమార్గమున నభిమతస్థానంబులకుం బోయిరి. ఈనందిజన్మంబును, వరదానంబును, అభిషేకంబును, వివాహంబును బఠించినను, ఇతరులకు వినిపించినను నందీశ్వరలోకప్రాప్తి యగును. సంయతాత్ములై భక్తిపూర్వకంబుగ నీచరిత్రమును బఠించువారును వినువారును నందీశ్వరసమానులై మహాదేవానుచరులు గాఁగలరు.

—♦ నీలకంఠస్తవము. ♦—

సనత్కుమారుండిట్లనియెను. మునులారా! భగవానుం డగు శంకరునకు నీలకంఠత్వము సంఘటిల్లినవృత్తాంతమును కోటివత్సరంబులకి్రందట జగత్ప్రాణుండగు వాయుదేవునివలన నేను వినియుంటిని. ఆచరిత్రమునుయథారూపముగఁ దెలిపెదను వినుండు. కైలాసపర్వతంబున కుత్తరదిగ్భాగంబున సరోవరములయందును, నదీతీరములందును, పవిత్రోద్యానములందును, తీర్థసమూహములందును, దేవతాయతనములందును, సమున్నతగిరిశృంగములందును, శంకరోపవనంబులయందును వ్రతానుష్ఠానపరాయణులై యున్న మునిగణంబులు యథావిధిని భక్తిపూర్వకంబుగ ఋగ్యజుస్సామాథర్వవేదాత్మకంబు లగువాక్యంబులతో మహాత్ముం డగుసదాశివుని స్తోత్రంబు సేయుచు, ఓంకారహుంకారనమస్కారంబులచే నిరంతరము నర్చించుచుండిరి. ఒకనాఁడు జ్యోతిశ్చక్రంబున భగవానుండగుసూర్యదేవుండు మధ్యాకాశమున విరాజిల్లుచున్నసమయంబున సకలదేవతలును సంయతచిత్తులై యుండఁగాఁ గొంతసేపటికి నియమావసానసమయంబున సకలభూతజీవనుండగువాయుదేవుండు ‹‹ నీలకంఠాయనమః ›› అని యుచ్చరించెను.

అప్పుడు నియతవ్రతులును, సూర్యానుగాములును, వాయు

పర్ణాంబుభోజనులును, నగునష్టాశీతిసహస్రవాలఖిల్యమునిగణంబులు వాయుదేవుం గాంచి ప్రభంజనా! నీవు పావనుఁడవు. పుణ్యాత్ములలోఁ శ్రేష్ఠుఁడవు. నీవిప్పు డుచ్చరించిన నీలకంఠశబ్దము పుణ్యదాయకంబును బరమగుహ్యంబు నైనది. కావున నంబికానాథుఁ డగుమహాదేవునకు నీలకంఠనామ మెట్లుగలిగెనో యాచరిత్రయును సవిశేషముగ నీవలన వినవలయునని కుతూహలపడుచున్నాము. మానవులవాక్ప్రవృత్తికి నీవే యేకమాత్రప్రేరకుఁడవు. నీవు విద్యారూపుఁడవు. నీవు వ్యానగతుండవు నైనంతనే మానవులకు వాక్ప్రవృత్తి యగుచుండును. సర్వజంతువులకును, జ్ఞానపూర్వకంబు లగుక్రియ లన్నియును నీవలననే యగుచుండును. నీ నుండియే సకలవర్ణంబులును నిష్పన్నంబు లైనవి. వాక్పథంబున కగమ్యంబగు స్థానంబునఁగూడ నీసద్భావంబు గలదు. నీవు సర్వగతుఁడవు. ఇట్లు సర్వగతులగుదేవతలు నీకంటె నన్యు లెవ్వరును లేరు. సర్వప్రాణులును నీవు సకలజీవకారణుండ వని ప్రత్యక్షముగ నెఱుంగుదురు. నీవు స్మృతిస్వరూపుఁడవును, మేధారూపుఁడవును గావునఁ బాపనాశకంబులును, మంగళకరంబులు నగువాక్యములచే మాకీవిషయము నెఱింగింపు మని ప్రార్థించిరి.

అంత లోకపూజితుండును, మహాతేజుండు నగువాయుదేవుం డిట్లనియెను. వేదవేదాంగవిదు లగుబ్రహ్మర్షులారా! వినుండు. బ్రహ్మమానసపుత్రుం డగువసిష్ఠుం డనునొకధర్మాత్ముండు గలఁడు. ఆతఁ డొకనాఁడు మయూరవాహనుండును, క్రౌంచభేదియు, మహిషాసురవధూనయనాంజనతస్కరుండును, గౌరీహృదయానందకరుండును, మేఘమంద్రస్వరుండును, మహాత్ముండును, స్వేచ్ఛాబాలకస్వరూపుఁడును నగుకార్తికేయుంగాంచి మహాసేనా! లోకమంగళకరంబును, ప్రియకరంబును, బవిత్రంబు నగునీలకంఠచరిత్రమును నాకెఱింగింపుము. నీభక్తుఁ

డను, విశ్వస్తుఁడను, దాంతుఁడను నగునాప్రార్థనమును మన్నింపుము. అనుటయు నగ్నితేజుండును, దైత్యసంహర్తయు, మహాత్ముండు నగు కార్తికేయుం డిట్లనియెను. మునీంద్రా! నేను మాక్రోడంబున నివసించి యాకర్ణించినపార్వతీపరమేశ్వరసంవాదమును జెప్పెదను వినుము.

నానాధాతుకాంతివిభూషితం బగుటచే నతిరమణీయంబును, దరుణాదిత్యసంకాశంబును, వజ్రసోపానవిరాజితంబును, స్ఫటికద్వారవినిర్మితంబును, సువర్ణమయదివ్యశిలాకుట్టిమశోభితంబును, వివిధఫలపుష్పతరులతాసమాకీర్ణంబును, హంసకారండవాదిజలవిహంగసంకులంబును, గోకిలాలాపపరివ్యాప్తంబును, సిద్ధచారణగణసేవితంబును, మేఘగంభీరంబులగువృషభనినాదములచే నిరంతరశబ్దాయమానంబును నగు కైలాసపర్వతము వినాయకభయంబునఁ గిన్నరులచే విడువంబడినకందరంబులచేతను, మనోహరవంశధ్వనులచేతను, డోలావిహారంబు గావించు సురగణంబులచేతను, జతుర్దిశలఁ బ్రతిధ్వనించుచున్నధ్వజఘంటానినదంబులచేతను, వాణిజ్యపరులగువణిగ్వరులచేతను, మంగళవాద్యంబులచేఁ బ్రతిధ్వనితంబులగుకందరంబులచేతను విరాజిల్లుచుండెను. అందు భయంకరాట్టహాసులును, విచిత్రవర్ణులును, గరాళవదనులును, వ్యాఘ్రసింహముఖులును, మృగమేషవదనులును, గజాస్యులును, హయాననులును, బిడాలసృగాలవానరముఖులును, వామనులును, దీర్ఘాకారులును, కృశాంగులును, స్థూలకాయులును, సర్పోదరులును, జంఘాలంబితహస్తులును, లంబోష్ఠులును, స్థూలనితంబులును, గోకర్ణులును ఏకకర్ణులును, మహాకర్ణులును, వికర్ణులును, ఏకచరణులును, ప్రశస్తచరణులును, బహుచరణులును, జరణహీనులును, ఏకమస్తకులును, జతుర్మస్తకులును, బహుమస్తకులును, మస్తకవిహీనులును, ఏకచక్షులును, మహాచక్షులును, బహుచక్షులును నగుప్రమథగణంబులు పరమానంద

ముతో విహరించుచుండిరి. అట్టికైలాసగిరిశిఖరంబున విచిత్రరత్నభూషణాలంకృతంబును, హేమమయంబును, మనోహరంబు నగుశిలాతలంబున భూతగణపరివృతుండై సుఖోపవిష్టుండై యున్నమదనవైరిం గాంచి పార్వతీదేవి యిట్లనియెను.

ఓ దేవదేవా! వృషభవాహనా ! నీకంఠదేశమునందు నీలమేఘఖండమువలె, విశుద్ధనీలాంజనరాశివలె విరాజిల్లుచున్నయీచిహ్న మేమి? ఓజగదీశ్వరా! అట్లగుటకుఁ గారణమేమి? నీకీనీలకంఠత్వ మెట్లుగలిగినది? ఈసకలవృత్తాంతమును సవిశేషముగ వినవలయు నని కుతూహలముగా నున్నది. అని ప్రార్థించుటయుఁ బార్వతీప్రియుండు మృదుమధురవచనంబులతో నిట్లనియెను. వరాననా! పూర్వము దేవాసురులు క్షీరసాగరమును మథించినప్పుడు ప్రప్రథమమునఁ బ్రళయానలసదృశంబును, భయంకరము నగుకాలకూటవిషం బుత్పన్నం బయ్యెను. దానింగాంచి దేవాసురులు భయంబుచే విషణ్ణవదనులై పోయి బ్రహ్మదేవునిశరణముం గాంచిరి. ద్యుతిమంతుం డగుబ్రహ్మదేవుండు భయభ్రాంతు లగువారిం గాంచి యోమహాభాగులారా! మీరిట్లుద్విగ్నహృదయులై యేతెంచుటకుఁ గారణ మేమి? అష్టైశ్వర్యములను మీకు నేను ప్రసాదించితిని. విగతజ్వరు లగుమీరు త్రైలోక్యంబును బరిపాలించుచు విమానచారులై స్వచ్ఛందవిహారముం గావించుచున్నారు. మీరాధ్యాత్మికంబులు, నాధిభౌతికంబులు, నాధిదైవికంబులు నగువ్యసనంబులను గర్మానుసారంబుగా జీవులకుఁ గల్పింపఁగలసమర్థులు. అట్టిమీరు సింహపీడితమృగంబులవలె నుద్విగ్నచిత్తులై వచ్చుటకుఁ గారణమేమో తెలుపుఁ డని యడిగెను. అప్పుడు ఋషిగణసహితు లగుదేవాసురగణంబులు దేవదేవా! మేము క్షీరాంబుధిని మథించుచుండఁగా ఘోరమేఘాకారంబును, నీలాంజనసదృశంబు నగుమహావిషం బుద్భవించినది.

ప్రళయానలసదృశంబగు దానిభయంకరతాపమునకు మేమందఱమును భీతిల్లి నీశరణంబు గోరి వచ్చితి మని చెప్పఁటయు బ్రహ్మదేవుండు పరమేశ్వరుం దలంచి యిట్లు స్తుతింపఁదొడంగెను.

ఓవిరూపాక్షా! దివ్యచక్షూ! పినాకవజ్రధారి వగునీకు నమస్కారము. సాంఖ్యయోగస్వరూపుఁడవు, మహాభూతస్వరూపుఁడవు, త్రైలోక్యనాథుఁడవు, భూతనాథుఁడవు, దానవసంహారివి, చంద్రసూర్యాగ్నినయనుఁడవు నగునీకు నమస్కారము. బ్రహ్మవిష్ణురుద్రస్వరూపుఁడవు, మదనదమనుండవు, కాలకాలుఁడవు నగునీకు నమస్కారము. శంకరా! హరా! రుద్రమూర్తీ! వసురేతుండవును, దేవదేవుండవును, జటాజూటధరుండవును, కపాలివి, శివుండవు నగునీకు నమస్కారము. దేవా నీకు రూపము లేదు. నీవు సర్వమంగళవిధాతవు. ఓమఖఘ్నా! త్రిపురాసురధ్వంసకారీ! మంత్రపతీ! నీకు నమస్కారము. బుద్ధుండవు, పవిత్రుఁడవు, ముక్తుఁడవు, అద్వితీయుఁడవు, దిగంబరుఁడవు, శిఖండివి, కమలహస్తుఁడవు, శ్రేష్ఠుఁడవు, ఉగ్రుఁడవు, విప్రుఁడవు, బహునేత్రుఁడవు, సత్త్వరజస్స్వరూపుఁడవు, అవ్యక్తుఁడవు, అనిత్యుఁడవు, నిత్యుఁడవు, నిత్యానిత్యుఁడవు నగునీకు నమస్కారము. అచింత్యుఁడవును, చింత్యుఁడవును, చింత్యాచింత్యుఁడవును, భక్తార్తినాశకుండవును, నారాయణప్రియుండవును, ఉమాప్రియుండవును, శర్వుండవు నగునీకు నమస్కారము. దేవదేవా! నీవు పక్షమాసఋతువత్సరస్వరూపుఁడవు. బహుస్వరూపుఁడవు. దండవల్కలధారివి. ఋగ్యజుస్సామస్వరూపుఁడవు. ప్రధానపురుషుఁడవు. ఈశ్వరుఁడవు. లోకక్షయనిపాతనుండవు. ఇంద్రుండవు. వరుణుండవు. నీచరిత్రం బతిప్రధానమైనది. ఓపృథ్వీపతీ! స్తవనీయుండ వగునిన్ను నీప్రసాదంబు లేక యెవ్వరును దర్శింపఁజాలరు. దేవా! నీవు నాయెడలఁ బ్రసన్నుండవై నాకు భక్తిజ్ఞానంబు

లను బ్రసాదింపుము.

అని యిట్లు వేదవేదాంగసంభవంబులగువివిధస్తవంబులచే విరించి నన్ను నుతించుటయు నేసంతుష్టుండనై యాతనియెదుట సాక్షాత్కరించి యోజీవమంగళనిదానా! భూతాధిపా! మహాతపా! నేనిప్పు డెట్టికార్యంబును దీర్పవలయునో చెప్పుమని యడిగితిని. అప్పుడు పద్మగర్భుండు నన్నుంగాంచి యోత్రికాలాధినాథా! దేవాసురులు క్షీరాంబుధిని మథించుచుండఁగా నతిభయంకర మగుమహావిషంబుద్భూతం బై వెసది. అది ప్రళయాదిత్యునివలె నతిభయంకరతేజోమయమై యున్నది. ఆదారుణజ్వాలలచేఁ ద్రిలోకములు నాచ్ఛన్నము లై పోయినవి. దానిం గాంచి యెల్లవారును భయకంపితులై నీశరణంబు గోరియున్నవారు. లోకహితంబుకొఱకై నీవిషమును పానంబు సేయవలయును. నీవే యేకమాత్రభోక్తవును, సర్వదేవతావరప్రదాతవు నై యున్నావు. ఇట్టిఘనకార్యమును నిర్వహించుసమర్థుఁ డీత్రిలోకములయం దింకెవ్వఁడును లేఁడు. ఆవిషజ్వాల యుదయించినతోడనే జనార్దనుండు కృష్ణవర్ణుఁడై పోయినాఁడు. ఇకమావంటివార మేమిచేయఁగలము? అని చెప్పుటయు నేనట్లే చేసెద నని చెప్పి యంతకసదృశంబును, దేవపీడాకరంబును, భయాకరంబునగునమ్మహావిషమును పానము చేసితిని. అంత లోకపితామహుండగుజలజాసనుండు మహాదేవా! నీనీలకంఠ మిప్పు డతిరమణీయముగా నున్నదని ప్రశంసించెను.

ఓపార్వతీ! అప్పుడు సకలదేవాసురయక్షగంధర్వపిశాచోరగగణసమక్షంబున నతిఘోరంబగువిషంబును గంఠధారణంబు గావించుటచే నాకు శ్రీకంఠత్వము గలిగినది. అత్యుగ్రతేజం బగుకాలకూటవిషంబును నేనట్లు పానముచేయుటవలన నఖిలదేవాసురగణంబులును బ్రహృష్టహృదయులై యతివిస్మయాక్రాంతచిత్తులై పోయిరి. ఓమదగజగామి

నీ! అనంతరము సకలదేవతాగణంబులును నన్నుద్దేశించి మహేశా! మందాకినీజలప్లావితకేశపాశా! నీబలవీర్యపరాక్రమంబు లత్యద్భుతంబులై నవి. ఏమియీదేహకాంతి! ఏమియీమాహాత్మ్యము! దేవా! నీవు బ్రహ్మవిష్ణుయమకుబేరవహ్నిస్వరూపుఁడవు. పరమపురుషుఁడవు. సూక్ష్మాతిసూక్ష్మస్వరూపుఁడవు. ఈచరాచరప్రపంచమునందు భోక్తవును, నిత్యుండవును నీవుమాత్రమే. ప్రళయమునందును రక్షకుఁడవు. యోగాభిగమ్యుఁడవు. అట్టినీకు నమస్కార మని నుతించుచుఁ దమతమ స్థానంబులకుం జనిరి. వారెల్ల విమానారూఢులై స్వర్గంబున కేఁగియు స్తోత్రపాఠంబులఁ గావించుచునే యుండిరి. ఇది యతిగుహ్యం బగు చరిత్రములలో గుహ్యతమంబై నది. ఈనీలకంఠచరిత్రము త్రిలోకప్రసిద్ధమైనది. పాపనాశనం బగునీశుభచరిత్రము స్వయంభువగుబ్రహ్మదేవునిచే నుద్గీతంబై నది. ఈచరిత్రమును వ్రాసి ధారణంబు గావించువాని కిహపరలోకసుఖంబులు గలుగును. ఆతనికి స్థావరజంగమాదివిషబాధలు గలుగవు. ఆతనియశుభంబులు శాంతించును; దుస్స్వప్నంబులు దొలంగును; ఆతనికి విజయంబులు లభించును. యుద్ధంబున శౌర్యంబును, మార్గంబున మంగళంబులును, నెల్లయెడల నిర్భయంబును గలుగును. అట్టివాఁడు దేహావసానంబున నంది తుల్యుండగును. మఱియుఁ ద్రిశిరుండును, త్రిలోచనుండును, త్రిశూలధారియు నై దివ్యవాహనమునధిరోహించి సప్తలోకములను సంచరించుచుండును. ఆకాశవాయువులంబోలి యాతని కప్రతిహతగతి లభించును. ఆతఁడు కల్పాంతపర్యంతమును మత్సమానుండై యుండును. భక్తితో నీచరిత్రము నాకర్ణించువారికి సహస్రగోదానఫలంబు గలుగును. ఇందొకశ్లోకమునుగాని, శ్లోకార్థమునుగాని ధరించువారికి రుద్రలోకనివాసంబు సిద్ధించును. అని మహాదేవుం డానతిచ్చెను.

—♦ త్రిపురోపాఖ్యానము. ♦—

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! త్రిపురదహన వృత్తాంతము నాలకింపుము! పూర్వకాలంబున దైత్యశ్రేష్ఠుండగు హిరణ్యకశిపుండు నృసింహదేవునిచే నిహతుండగుటయు సకలదైత్యదానవ బలంబును విభిన్నంబై పోయెను. అప్పుడు మయుండను రాక్షసుండు దుఃఖితుండై విశ్వకర్త యగు రాక్షసేశ్వరుండు రతివిహీనుం డగు మకరధ్వజునింబోలి లక్ష్మీవిహీనుండై యున్నవాఁడని విచారించుచు విష్ణుసమప్రభావుండగు విద్యుత్ప్రభునిం జేరి తారకసహితంబుగా నత్యుగ్ర తపంబు గావింపఁదొడంగెను. ఆమువ్వురును శీతకాలమున హిమాలయమునందును, గ్రీష్మకాలమునఁ బంచాగ్నిమధ్యంబునను, వర్షాకాలంబున జలమయస్థలంబునను నిలిచి దృఢప్రయత్నముతోఁ దపంబు గావించుచుండిరి. వారిట్లు తపంబు సేయుచుండ దివ్యవర్షసహస్రంబులును, యుగసహస్రములును గడచిపోయెను. అప్పటికి వారిశరీరము లస్థిచర్మమాత్రావశిష్టంబు లయ్యెను సూర్యాగ్నిప్రభలచే విరాజిల్లుచుండెను. అంతఁ జతురాననుండు వారికి సాక్షాత్కరించి ప్రియమధురస్వరముతో దృఢవ్రతులారా! మీరు బహుపాపనాశకం బగుతపంబు గావించితిరి. మీయభిమతవరంబులఁ గోరుకొనుఁ డని యానతిచ్చెను.

అప్పుడు మయాసురుండు జలజాసనునెదుట మోకరించి భక్తివినయపూర్వకంబుగాఁ గృతాంజలియై దేవదేవా! అవధ్యత్వమును, అపారబలంబును, అనంతసుఖంబును, అమరత్వమును, దివ్యపురంబులును మాకుఁ బ్రసాదింపుము. మాపురంబులు దివ్యవిమానసదృశములై, యితరులకగమ్యములై, కామగమనంబు గలిగియుండవలయును. అని ప్రార్థించుటయు విరించి పుత్రా! నేనింతటివరంబు నీయఁజాలను. ఏదేనించుకయవకాశంబు జూపి మరలఁ బ్రార్థింపుము. నేనిట్లంటినని

మానంబున నన్యథా భావింపకుమనియెను. అప్పుడు మూఢుం డగుమయుం డట్లే యని స్వామీ! నేనిదివఱకుఁ గోరినకోరిక లన్నియు నట్లు సిద్ధింపవలయును. కాని వేయిసంవత్సరములకొకసారి యొకయరనిమిషమమాత్రము మాపురంబులుమూఁడును గలిసికొనునట్లును, ఆసమయమున నెవ్వఁడైన నొకమహాబలుఁ డేకబాణంబున మూఁడుపురంబులను గొట్టఁగలిగినచో నప్పుడు మాత్రిపురంబులును సజీవముగ దగ్ధములగునట్లును మేమంగీకరింతుమని కోరుటయు బ్రహ్మదేవుండు ప్రహృష్టహృదయుండై యట్లే యగునని వరంబిచ్చి వెడలిపోయెను. అనంతరము మయుండు జగద్విఘాతంబుకొఱకు లోహరజతస్వర్ణమయంబులగు త్రిపురంబులను నిర్మించెను. అవి సుమేరుశృంగంబులం బోలి సమున్నతంబులై మనోహరద్వారవలభీగవాక్షంబులచేతను, హేమమయవీథ్యంగణంబులచేతను విరాజిల్లుచు దివ్యం బగుస్వర్గసౌందర్యము నపహాసించుచుండెను. అందలిహర్మ్యంబులతమంబు చంద్రకిరణంబులచే దూరీభూత మగుచుండెను. అందు శీతలవాయువులు ప్రవహించుచుండుటచే సుఖప్రవేశయోగ్యంబులై యుండెను. ముక్తాప్రవాళమణిఖండచిత్రితంబులును, తటిత్ప్రకాశంబులును, పవనోచ్చలితంబులును, వజ్రభూషితంబులు నగుకేతనంబులచే శోభితంబులగుసమున్నతప్రాసాదపంక్తులున్నతతోరణసహితంబులై మణికాంతులతో విరాజిల్లుచుండెను. వానికి నలుదెసలను సర్వకాలములందును ఫలపుష్పసమన్వితంబులగు మనోహరవృక్షశ్రేణులచే నొప్పుమీఱు శతశత రత్నోద్యానములు చెలువందుచుండెను. మఱియు నాపురంబులు ప్రఫుల్లకమలశోభితంబులగు జలదీర్ఘికలచేతను, కలవిహంగమధురగీతంబులచేతను, నఖక్షతవిభిన్నపయోధరలును, ఆకర్ణరక్తాంతవిలోచనలును, లజ్జాచపలేక్షణలు నగురమణీమణులచేతను విలసిల్లుచుండెను. మయుండిట్లు త్రిపురంబుల

ను సృజించి లోహమయపురంబు తారకునకును, రజతపురంబు విద్యు త్ప్రిభునకు నొసంగి హేమమయనగరమును దాను గైకొనియెను. ఇ ట్లాదానవులు త్రిపురంబుల నధిష్ఠించి త్రిలోకభీకరులై వివిధసుఖోప భోగంబుల ననుభవించుచుండిరి. వారట్లు మోహదర్పోద్ధతులై దేవ తాగణంబుల నవమానించుచు నాకస్మికముగ విజృంభించి వారిని వివి ధరీతుల బాధింప నారంభించిరి. నందనాదిరమణీయోద్యానముల వి ధ్వంసంబు గావించి యథేచ్ఛావిహారులై వారిట్లు దేవతల కనిష్టంబు గూర్చుచు వర్తించుచుండఁ జాలకాలము గడచిపోయెను.

అప్పు డింద్రాదిదేవతాగణంబు లాదానవులయెడలఁ గ్రోధోద్రి క్తులై పితామహునిపాలికింబోయి వారి దుశ్చేష్టితముల నాతనికి నివేదిం చిరి. లోకకర్త యగుకమలభవుండు వారల నూఱడించి సురలారా! ఆదానవు లతిబలవంతులై యున్నారు. అట్టివారిని స్వబలంబులచే మీరేమియుం జేయఁజాలరు. విష్ణుదేవుండును, నేను మిమ్ము వెంటఁ బెట్టుకొని మహాదేవుని సన్నిధికిం బోయి శరణంబు గోరవలయునని తలంచితిమి. శూలపాణియు, శశిభూషణుండు నగునద్దేవుఁడే మనకు గతియైయున్నాఁడు. ఆదేవుండు మనశత్రువుల బలమునంతను వినాశం బు గావింపఁగలఁడు. అని చెప్పి విరించి యాదేవతలం దోడ్కొని కైలాసపర్వతంబునకుం బోయెను. అప్పుడు సకలదేవతలును మహాదేవు నిట్లు వినుతింప నారంభించిరి.

ఓత్రిలోకేశ్వరా! నీవు సర్వవందితుఁడవు. అసీమవిక్రముఁడవు. సర్వామరప్రియుఁడవు. నీజటాకలాపమునందలిచంద్రప్రభలచే నీమస్త కము ప్రకాశించుచుండును. నీవు పినాకహస్తుఁడవు. త్రిలోకదేవుఁడ వు. ప్రదీప్తపరశ్వధుండవును, త్రిశూలహస్తుండవు నగునీకు నమస్కా రము. జగచ్ఛరణ్యుండును, నిత్యుండును, నందివరప్రియుండును, సురే

శ్వరుండును, హోమ్నవరప్రియుండును, యజ్ఞేశవరదుండును, హిమాచలస్థితుండును, కైలాసవాసుండును, వృషభవాహనుండును, దిగ్వాసుండును, సంపద్విముక్తుండును, జగద్విధాతయు నగునీకు నమస్కారము. దేవా! నీవు చంద్రసూర్యాగ్నులను, బ్రహ్మనుగూడ సృజించితివి. నిత్యుండవు. సూక్ష్ముండవు. పరమేశ్వరుండవు. సృష్టికర్తవు. పాలకుండవు. పరాత్పరుండవు. పరమాత్ముండవు. శంకరా! నీకు నమస్కారము. శర్వుండును, సర్వవస్తూత్పత్తికారణుండును, యజ్ఞమూర్తియు, నగునీకు నమస్కారము. దేవా! నీవు తపమునిదంతనిర్మూలనంబు గావించితివి. మదనదేహవిధ్వంసకుండవు. పురుషోత్తమా! ప్రధానుండును, రుద్రుండును, సౌమ్యుండును, వపుష్మంతుండును, త్రిలోచనుండును, సురాసురశ్రేష్ఠుండును, నీలశిఖండధారియు, శ్మశానవాసియు, దైత్యవినాశకుండు నగునీకు నమస్కారము. తేజోమయా! నీయనుగ్రహంబుచే మోహాజ్ఞానంబులు దూరీభూతంబు లగును. నీవు మాతృవరప్రియుండవు. అమృతసంస్థితుండవు. పార్వతీపతివి, కుమారజనకుండవు. బ్రహ్మవు. విశ్వకర్తవు. ధీమంతుండవు. హరుండవు. శంభుండవు. శత్రులకైన నభీష్టవరదాయకుండ వగునీకు నమస్కారము. మహాదేవా! కృపాళుండవై మాకుఁ బ్రసన్నుండ వగుము.

అని స్తుతించుటయు దేవదేవుండు సంతుష్టుండై యోదేవతలారా! నేను మీయెడలఁ బ్రసన్నుండనైతిని. మీయభిలషితవరంబుల నర్థింపుఁడు. నాకు మీకీయరాని దేదియును లేదని యానతిచ్చెను. అంత దేవతలందఱు నేకవాక్యముగా శంకరా! మయాదిదానవులు బ్రహ్మవరగర్వితులై యప్సరస్సుందరుల నపహరించి, నందనోద్యానమును భగ్నము చేసిరి. నేఁడో రేపో సకలదేవతలును నిహతులు గానున్నారు. పితామహుండును, విష్ణుండునుగూడ వారిని నిగ్రహించుటకు

సమర్థులు గాకుండిరి. అందుచే మే మతిభయాకులితహృదయులమై యున్నాము. దేవా! ఇప్పుడు త్రిపురవినాశంబును, సర్వదేవతావిజయంబును ఘటిల్లునట్టివిధానంబును గావింపుము. ఇదియే మాప్రార్థన మని విన్నపంబు సేయుటయు మహాతేజుం డగుమహాదేవుండు దేవతాగణంబుల నూఱడించుచు మీరెల్లరును నాతేజమునం దర్ధాంశమును గ్రహించి దానవసంహారంబు గావింపుం డని యానతిచ్చెను.

అప్పుడు దేవతలు దేవా! నీసహస్రాంశమైనను మేము భరింపఁజాలము. నీతేజము నవలోకించుటకైనను, ధరించుటకైనను మాకు శక్తి యెక్కడిది? కావున నీవు మాయెడలఁ బ్రసన్నుండ వగుము. మే మెట్టిబలంబుచే నైనను దానవసంహారంబు సేయనేరము. శంకరా! నీవే స్వయముగాఁ ద్రిపురసంహార మాచరింపవలయును. శూలపాణీ! దివ్యవర్షసహస్రంబులు గడచినపిదప నొక్కయుద్ధనిమేషమాత్ర మా త్రిపురంబులు నొక్కచోఁ జేరుకొనియుండును. అప్పుడు మహాబలుం డగువాఁ డేకబాణంబున నేకపర్యాయము త్రిపురంబులను, దానవులనుగూడ దగ్ధంబు గావింపవలయును. అట్లు గాదేని వారికి వినాశంబు లేదు. ఇది బ్రహ్మవరంబు. అంతటిఘనకార్యముం గావించుసామర్థ్యము మా కెవ్వరికిని లేదు. అని ప్రార్థించుటయు శంకరుండు మరల నిట్లనియెను. సురలారా! త్రిపురంబు లంతటిదుర్గమంబు లగునేని నేనే యేకబాణప్రయోగంబుచే వానిని దహింపఁ జేసెదను. బ్రహ్మవిష్ణుల హితంబుకొఱకు దేవేంద్రదేవతాదుల ననుగ్రహించి నేనే స్వయముగ రథారూఢుండనై చని త్రిపురదహనంబు చేసెదను. కావున మీరు హిమాచలంబును బోలి సారగర్భంబును, నన్ను వహించుటకు సమర్థంబును నగు రథంబును సిద్ధముగఁ జేయుఁడు. అని శివుం డాజ్ఞాపించెను.

—♦ విజయయాత్రాసన్నాహము. ♦—

అంత దేవతలు మహాదేవునకుఁ బ్రణామంబు గావించి ప్రహృష్టాంతఃకరణులై యందఱుం గలసి యుత్తమరథనిర్మాణంబున కుద్యుక్తులైరి. అప్పుడు బ్రహ్మయు, విష్ణుండును, వైశ్వానరుండును సర్వదేవతామయంబగు రథంబును నిర్మించిరి. ఆరథంబున బ్రహ్మయు, సూర్యుండును, బ్రచండపవనుండును, కుబేరుండును, యముండును, అష్టవసువులును, రుద్రగణంబులును, ద్వాదశాదిత్యులును, గంధర్వులును, అశ్వినీకుమారులును, గరుడుండును, పర్వతంబులును, పన్నగగణంబులును, గుహ్యకులును, ఋషులును, సిద్ధగణంబులును, యక్షులును, గ్రహగణంబులును, మేఘకాలవనస్పతులును,దివస, ముహూర్త, క్షణ, కాష్ఠా, లవ, ఋతు, మాస, విషు, వత్సరంబులును, స్థావరంబులును, జంగమంబులును, నక్షత్రములును, అష్టవిధదేవతానికాయంబులును స్థాపితులై యుండిరి. కొందఱు దేవతలు ధ్వజరూపముం దాల్చి యుండిరి. చతుర్వేదము లశ్వంబులుగను, సంవత్సరములు చక్రంబులుగను హిమాచలము ధనువుగను, జగత్పతి యగుదేవదేవుండు ధనుర్గుణంబుగను జేసి గిరిసదృశం బగునుత్తమరథంబును సిద్ధము గావించి బ్రహ్మవిష్ణువైశ్వానరులు పరమేశ్వరునకుఁ బ్రణామంబు చేసి రథము సజ్జితంబైనదని మనవి చేసిరి.

అప్పుడు సర్వభువనేశ్వరుండును, భగవానుండు నగుశంభుండు సకలసురాసురవందితుండై తేజోమయం బగునారథంబును మీఁదనుండి క్రిందవఱకును దిలకించి వాక్పతియగుబ్రహ్మంగాంచి యోజలజాసనా! నీవీరథంబును ధనుస్సును నిర్మించితివి. కాని త్రిపురదహనసమర్థం బగు బాణమెక్కడ! దానినిగూడ సిద్ధపఱుపుము. అనుటయు విరించి వృషభధ్వజునకు నమస్కరించి దేవా! నేను నీనిమిత్త మీరథధనుస్సులను

మాత్రమే నిర్మింపఁగలిగితిని. కాని బాణమునుమాత్రము స్వయముగ నీవే కల్పించుకొనవలయు నని విన్నవించెను. శివుఁ డప్పుడు తనపార్శ్వములందున్న విష్ణువైశ్వానరులను గటాక్షవీక్షణంబునం జూచి సన్మానించుటయు వారిరువురును గృతాంజలులై పంచముఖునకు నమస్కరించి నిలువఁబడిరి. అంత మహేశ్వరుండు స్వయముగా విష్ణుదేవుని శరంబుగను, ఓషధీశ్వరుం డగుచంద్రుని దన్ముఖంబుగను, పావకుని ములికిగను జేసి విధాతం గాంచి సారథినెవ్వనిగాఁ జేసితి వని యడిగెను. మీయాజ్ఞయైనచో నేనే సారథినయ్యెద నని బ్రహ్మదేవుండు విన్నపంబు చేయుటయు శివుండు మంచిదని యంగీకరించి విరించి హస్తంబును గ్రహించి రథారోహణంబు గావించెను.

అంతరుద్రానుచరులును, మహాయోగసంపన్నులును, రణనిపుణులు నగునందీశ్వర శంకుకర్ణ, చండేశ్వరాదులు చతుర్దశసహస్రగణేశ్వరులతో వివిధాయుధధారులై శంఖభేరీప్రముఖవాద్యంబుల మ్రోగించుచు మహాదేవు సన్నిధిని నిలిచియుండిరి. దేవదేవునియుత్తమాంగమునం దతితుములం బగుపుష్పవృష్టి యగుచుండెను. దేవతాగణంబులు తనభారమును వహింపఁజాల రని యెంచి మహాదేవుండు శరీరభారంబు సహనీయంబుగాఁ జేసెను. మహాదేవుని రణసమారంభముంగాంచి దానవులెల్లరును భయభ్రాంతులై పలాయితులు గాఁదొడంగిరి. అప్పుడు నారదుండు దానవరాజుపాలికిం బోయి వృషభధ్వజుండగుశంభుండు బ్రహ్మసారథికంబగు దేవమయదివ్యరథారూఢుఁడై త్రిపురదహనార్థమెత్తివచ్చుచుండె నని తెలిపెను. ఆవృత్తాంతము విని రాక్షసేశ్వరుఁడు తారకవిద్యున్మాలిప్రముఖు లగుననుజగణంబులను, భృత్యగణంబులను బిలిపించి నారదునివచనంబులను వారికెఱింగించుటయు నప్పుడు తారకుం డిట్లనియెను. మహారాజా! మీ రేల విచారించెదరు? మన

మందఱము నిశ్చయముగా నవధ్యులము. ఈత్రిపురంబులను ధ్వంసము గావించుసమర్థు లెవ్వరున్నారు? ఇప్పుడు దేవతలందఱును గలసి మన పై నెత్తివచ్చుచున్నారు. దుర్బలులగువారు సామదానభేదోపాయంబులచేఁ గార్యనిర్వహణముం గావించుకొందురు. మహాత్ములు యశంబును గోరుచుందురు. బలవంతుఁడు తనపరాక్రమమును బ్రదర్శించుచుండును. జిగీషాపరతంత్రుఁ డగుబలవంతునకు దుర్బలునియెడల దండవిధానమే కర్తవ్యము. స్వర్గవాసు లగుదేవత లీమనదానవులయంతటిబలవంతులు గారు. ప్రచండదండమూలంబున మనము వారిని జయించి సుఖముగా నుండవలయును. అని చెప్పుటయు మహాబలపరాక్రమశాలి యగువిద్యున్మాలి గంభీరస్వరముతో దుర్బలు లగుదేవతలు మనతో రణంబు గావించుటకు సమర్థులు గారు. మూఢులైవారు మనమీఁదికి దండెత్తియే వచ్చినచో నిశ్చయముగా వారికి క్షయంబును, మహారణమునందసురులకు విజయంబును సిద్ధించును. మహారాజా! కావున నీవు సర్వదేవతావినాశంబు గావించి స్వర్గంబునఁ గూడ దానవరాజ్యమును బ్రతిష్ఠింపుము. త్రిభువనలాభంబున నీవింద్రుండవయ్యెదవు. అప్పుడు మేమందఱమును నిన్ను హిరణ్యాక్షహిరణ్యకశిపులంబోలి యగ్రగణ్యునిగా నెంచి సప్తలోకేశ్వరుండ వగునీదర్శనముచే నిరంతరసంతుష్టుల మగుచుందుము. నీవు జగంబుల కన్నిటి కేలికవై విశ్వరాజ్యంబు ననుభవించుచు వారితో సమానుండవై విరాజిల్లెదవు. అని చెప్పుటయు మయుండు మాటిమాటికి శిరఃకంపంబు గావించుచు దానవవీరులారా! ఇది యుచితముగాదు. శత్రువులు మనతో సమానులైనను, మనకంటె హీనబలులైనను మనమిప్పుడు సామోపాయంబుననే కార్యసాధనంబు గావించుకొనవలయును. ఏమనిన—భగవంతుండును, సర్వభూతేశ్వరుండును, ప్రభుండును, మహుండును, దేవత

లనుగూడ సృష్టించినవాఁడును సంహారించువాఁడు నగుమహాదేవుఁడే స్వయముగా మనలను నాశంబుసేయునుద్దేశముతో నెత్తి వచ్చుచున్నాఁడు. ఇప్పు డిఁక నుపాయ మేమున్నది? కేవలసద్గుణంబులచే నాతనికిఁ బ్రణమిల్లుట, యాతనిశరణముం గోరుట యనునీరెండుపాయములే యిప్పుడు మనకార్యసాధనమున కుచితమైనవి. నాబుద్ధి కిట్లుతోఁచుచున్నది. ఒకవేళ మీరు కర్క-శత్వము నవలంబించి మహాదేవునితో యుద్ధమే చేయఁదలంచినచో నిశ్చయముగా నాతనివక్రిదృక్పాతంబుచే సద్యోనిహితులు గాక మానరు. బ్రిహ్మాదిదేవతలు రిపుపీడితులై యెవ్వనిశరణంబు గాంచుచుందురో యట్టిమహాదేవునే యెదిరించువారిని రక్షించుటకు సమర్థు లింకెవ్వరున్నారు? ఆదేవుండు తలంచినచో బ్రహ్మాదిసకలలోకంబుల నొక్క-క్షణములో వినాశనంబు నందింపఁగలఁడు. మరల నొక్క-క్షణములో సృష్టింపఁగలఁడు. మోక్షైకకారణుండును, జగద్బీజుండు నగుదేవునితో రణంబుగావించుట మనకెట్లు సంగతం బగును. ఈయుద్ధమువలన మనవిశుద్ధతపోవినాశంబు గాఁగలదు. దానవులారా! పాటిబెడ్డలవంటిమీరు పర్వతముతోఁ దులఁదూఁగఁదలఁచుచున్నారు. కాలపాశబద్ధులై మీరు మహాదేవునితో యుద్ధము చేయఁగోరుచున్నారు. నేనమ్మహాదేవునిభక్తుండనుగావున నాతనిమహాత్త్వమును విశేషించి యెఱుంగుదును. ఇతరు లెట్లెఱుంగఁగలరు? నేనాదేవునియెదుట వినమ్రుఁడనై నిలిచి యుండెదను. ఎన్నటికిని శివునితో నేను యుద్ధము సేయఁజాలను. నాయాలోచన మీకు రుచించినచో మీరీశ్వరునితోడి యుద్ధమును మాని యాతనిశరణముం గోరుకొనుఁడు.

మహాబలశాలియు, విశ్వకర్మయు నగుమయుం డిట్లుచెప్పుటయు భగవానుం డగునారదుండు దైత్యవినాశనంబు నుద్దేశించియిట్లనియెను.

ఓవిశ్వకర్మా! నీవు సవిస్తరంబుగాఁ జెప్పినవాక్యములు యుక్తియుక్తముగా నున్నవి. కాని ప్రస్తుతసమయంబున కివి యుచితంబులు గావు. మీతపమంతయును క్షీణించి మీయైశ్వర్యము పరిభుక్తమై యున్నది. ఇఁకఁ బిఱికితనమునుగూడఁ బ్రకటించి యగౌరవము నేల తెచ్చికొందురు? మీవినాశంబుకొఱకు సకలదేవతలు నేకీభవించి మహాదేవునిసాహాయ్యముం గోరికొనియున్నారు. మీరిప్పుడు నమ్రత నవలంబించి యున్నను మహేశ్వరుఁడు దేవహితంబుకొఱకు మిమ్ము సంహరింపక మానఁడు. మీరు దనుతనయులై, మహారాజులై, మహాబలగర్వితులై యుండియును సామాన్యులవలె భయభ్రాంతులై యేల మృత్యుముఖమునుండి రక్షణముం గాంచుటకుఁ బ్రయత్నించెదరు? యుద్ధము మానుకొనుటవలన మీకింతకంటె మహైశ్వర్యము లభింపఁబోదు. కాని మీయశంబునకు వినాశంబు మాత్రము గలుగక మానదు. కావున మీకిది శుభదాయకంబు గానేరదు. ఒకవేళ మీరు మహాదేవునితో మహారణంబు గావించి మరణించినను మీకు నిశ్చయముగాఁ బ్రమథాధిపత్యము సిద్ధింపఁగలదు. దేవతలవిషయంబున సామాద్యుపాయంబులచే మీకార్యసిద్ధి యగుట కవకాశము లేదు. కావున మహాదేవునితో యుద్ధముగావించుటయే మీకిప్పు డవశ్యకర్తవ్యము. మీ బలపరాక్రమములం గాంచి మహాదేవుఁడు ప్రీతుఁడైనను గావచ్చును. ఆతఁడు మీకు వరంబులిచ్చినను నీయవచ్చును. కావున మీరు మీ విక్రమమును బ్రకటించుటె యుచితము. మీకు శస్త్రాస్త్రఘాతనివారణంబగునట్లు నేను రక్షణోపాయంబు నాలోచింతును. మీరిఁక యుద్ధాభిలాషులై విజయోత్సాహముతో బయలుదేఱుఁడు.

అని చెప్పిన నారదునిమాటలకుఁ దారకవిద్యున్మాలులు తమ యంగీకారమును సూచించిరి. మహాసురవీరు లిద్దఱును గాలపాశబ

ద్ధులై, క్షీణపుణ్యులును, గతాయుష్కులు నగుటచేతనే వారిహృదయము లెల్ల పరివర్తితములై పోయెను. అప్పుడు మయుండును దానవవినాశకాలంబు సమీపించిన దని గ్రహించి నారదోపదేశంబున కంగీకరించెను. నారదుండు ప్రహృష్టహృదయుండై మీకస్త్రభయంబు లేకుండు నని కపటంబుగాఁ జెప్పి వారికి రక్షాబంధనంబులఁ గావించి యుద్ధాభిముఖులం జేసి తాను శివరథాభిముఖుండై పోయెను. పిమ్మట సకలదానవులును రణంబునకు దృఢనిశ్చయులై వివిధంబులగు నస్త్రశస్త్రంబులను సంపాదింపఁదొడంగిరి. తారకాక్షుండును, బలుండును, బాణుండును, విద్యున్మాలియు, వీరయోధోచితంబులగు వేషంబులతో సర్వసన్నద్ధులై నిలుచుటయు సహస్రసహస్రశంఖభేరీప్రముఖరణవాద్యంబులు దిక్కులు వ్రక్కలగునట్లు మ్రోగ నారంభించెను. అప్పుడు దుర్బలభయంకరం బగుదానవసేనామధ్యమున “రథ మతివేగముగా వచ్చుచున్నది! అదిగో ధ్వజపటము! ఎంతశీఘ్రముగా వచ్చుచున్నది!” అను నుత్సాహవాక్యములు వెలువడుచుండెను. భయవిషాదశూన్యు లగుత్రిపురదైత్యగణంబులు క్రుద్ధులై యుత్తమాస్త్రంబుల హస్తంబులం దాల్చి రణసన్నద్ధులై రథంబువంకఁ బ్రతీక్షించుచు దవానలంబు నెదిరించు పశువులంబోలి రథాభిముఖులై చనుచుండిరి.

—♦ త్రిపురదహనము. ♦—

వివిధధ్వజశోభితంబును, జిత్రిచూడావిశిష్టంబు నగుశివరథంబు పశ్చిమసాగరమూర్ధంబున రెండవహిమాచలేంద్రముం బోలి విరాజిల్లుచుఁ ద్రిపురాభిముఖంబుగ నేతెంచుచుండెను. నందీశ్వరాది శివసేనానాయకులు త్రిపురదుర్గంబును గాంచినంతనే పరస్పరమును గలిసికొని యుద్ధోత్సాహముచే సింహనాదంబులు గావింప నారంభించిరి. భయంకరవిగ్రహుండును, మహాత్ముండు నగు చండేశ్వరుండు జ్వాలాఖీలం

బగుదారుణకుఠారముం దాల్చి భీకరవదనగహ్వరమును దెఱచుకొని శివసన్నిధిని నిలిచి యుండెను. శివసమానపరాక్రమశాలియుఁ, త్రిలోచనుండు నగునందీశ్వరుండు తీక్ష్ణంబగు త్రిశూలమును, బ్రచండంబగు ముసలంబును గరంబులం దాల్చి మహాదేవుని పార్శ్వంబున నిలిచియుండెను. మహాత్ము లగుభృంగి, వీరభద్రుఁడు మొదలుగాఁగల వీరపరాక్రములగు నసంఖ్యప్రమథగణంబులు వజ్రత్రిశూలగదాఖడ్గాదిప్రహారణంబులఁ గరంబులఁ దాల్చి విజయోత్సాహముతో యుద్ధసన్నద్ధులై వచ్చుచుండిరి. అప్పుడు తారకాక్షాదిదైత్యులు శివరథంబు తమ్ము సమీపించుటం గాంచి వివిధాయుధధారులై మూఢత్వంబున యుద్ధోత్సాహులై ప్రమథగణంబులపైఁ బడి విజృంభింప నారంభించిరి. చంద్రరేఖావతంసుం డగుసదాశివుండు సర్వంబును గనుంగొనుచుఁ త్రిపురదహనంబుకొఱకు వేచి యున్నవాఁడు గావునఁ బ్రమథగణంబులకును, దైత్యగణంబులకును జరుగుచున్న భీకరసంగ్రామముం గాంచి యట్టహాసంబు గావించెను.

అప్పుడు నందీశ్వరుండు మహాసత్త్వులగు ప్రమథగణంబులతోఁ గూడ దానవులపైఁ బడి మహారణంబు గావింపఁదొడంగెను. క్రోధరక్తలోచనుం డగుభృంగి యప్పుడు దశనిశితశరంబులచే విద్యుత్ప్రభునికాయంబునఁ గాఢంబుగఁ గాయంబులఁ గావించెను. వివిధాయుధధారు లగునసురవీరు లాతని ముట్టడించి రణవిజృంభణంబు నెఱపిరి గాని యెవ్వరు నాతని కెట్టిపీడనమును గల్పింపఁజాలకపోయిరి. అనంతరము భృంగిరిటి నిశితాగ్రం బగుతనత్రిశూలముతో విద్యుత్ప్రభుని పృష్ఠభాగమునం బొడుచుటయు నాతఁడు ఫూత్కారంబు సేయుచు భయభ్రాంతుఁడై పలాయితుఁ డయ్యెను. దానవేశ్వరుం డట్లు పాఱిపోవుచు సునిశితంబు లగుసప్తశరంబులచే గణేశ్వరునిస్కంధదేశమును

విద్ధంబు గావించి మరలఁ ద్రిషష్టిబాణంబులచేతను, దశశరంబులచేతను నాతని మర్మాహతునిం గావించెను. అప్పుడు గజవదనుం డగువినాయకుండు క్రుద్ధుండై మృణాలంబునుండి పద్మోత్పాటనంబు గావించు మదగజంబునుం బోలి యావిద్యుత్ప్రభు నంగయష్టినుండి యుత్తమాంగము నుత్పాటితంబు గావించెను. రణక్షేత్రమునం దామస్తకము గజసన్నిభంబగు నయ్యసురుని దేహమునుండి విచ్ఛిన్నంబై పడి హ్రదస్థితంబును, మృణాలవిచ్యుతంబును, భృంగనినాదితంబునగు పద్మముం బోలి విరాజిల్లుచుండెను. అప్పు డంధకతుల్యవిక్రములగు నేమియు, బలుండు నను నసురేశ్వరులు గణనాయకశంకుకర్ణులం దాకి, శరవర్షంబు గురియించుటయుఁ బ్రమథనాయకులు కోపోద్దీపితులై యాదానవనాయకులను విరథులం గావించిరి. వారు మరల వేఱురథంబుల నధిరోహించి యొక్కుమ్మడి గణేశ్వరునిపయిం బడి తీక్ష్ణశరప్రయోగంబున నొప్పించుచుండ శంకుకర్ణుం డతిక్రోధంబున ముసలధారియై విజృంభించి యాక్షణమునందే యావీరద్వయమును యమలోకంబున కంపివైచెను. అంతఁ ద్రిపురవాసు లగునితరదానవవీరు లందఱును రణవిజృంభితులై ప్రమథగణంబుల నొక్కపెట్టునం దాఁకి వజ్రనారాచఖడ్గకుఠారాదివివిధాయుధంబులఁ బ్రయోగించుచు మహారణరంగంబున సింహంబులచే నిహతంబులగు మృగంబులం బోలి నిహతు లగుచుండిరి. గిరితుల్యదేహు లగుకొంద ఱసురవీరులు భిన్నహస్తులును, భ్రష్టాయుధులు నై శోణితధారలతో వాత్యాహతమేఘములం బోలి సముద్రపతితు లగుచుండిరి. ఇట్లు బలనేములు సబలంబుగా రణనిహతు లగుట నాలకించి తారకాక్షుండు క్రోధతామ్రాక్షుండై పురంబు వెలువడి వచ్చి గణనాయకునిపయిం బడుటయు శంకుకర్ణగణేశ్వరులు తమముసలాయుధంబుల నాతనిమస్తకంబునఁ బ్రయోగించిరి. తారకాక్షుండును వానిని లక్ష్యం

బు సేయక చక్రప్రయోగముం గావించెను. అప్పుడు శంకుకర్ణుండు చక్రాహతుం డయ్యును జలింపక యతివేగముగఁ బోయి యాతనిమస్తకంబున దృఢముష్టిప్రహారముం గావించెను. అయ్యాఘాతంబునకుఁ దారకాక్షుండు భూపతితుండై తూలుచు నంతలో నొక్కయుదుటున లంఘించి తననిశితఖడ్గమును శంకుకర్ణునిపై విసరి యాక్షణంబుననే విక్షతాకారముతో మృత్యుముఖంబునఁ బడిపోయెను.

అట్లు మృతుండై సదానవేశ్వరుం గాంచి యసురవీరులందఱును దుఃఖాక్రాంతులై తక్షణంబ యాతని మయమందిరంబునకుఁ గొనిపోయి దుఃఖగద్గదస్వరంబులతో రాక్షసేంద్రుఁ డగుమయునకు సర్వవృత్తాంతమును నివేదించిరి. అప్పుడసురాధీశ్వరుండగుమయుండు వారి నూఱడించుచు దైత్యయోధులారా! మనము తెచ్చినయమృతముచే నీతని బునర్జీవితునిం గావింపుఁ డని ప్రబోధించెను. ఆమాట విన్నంతనే దానవులందఱును బ్రఫుల్లవదనులై యమృతప్రయోగముచేఁ దారకాక్షుని మరల బ్రదికించి మయాసురున కభివందనంబులఁ గావించిరి. అట్లు పునర్జీవితుం డగుతారకాక్షుండు మరల రణాభిలాషియై యతిశీఘ్రముగ రణరంగమున కరుదెంచెను. అట్లు మరణించియు మరలజీవించి వచ్చిన తారకాక్షుం గాంచి బ్రహ్మదేవుండు తనవామహస్తంబుచే నాతనిం జూపుచు మహేశ్వరు నుద్దేశించి యిట్లనియెను. మహాదేవా! శంకరా! ఈతారకాక్షుండు నిహతుం డయ్యెను. ఈతని మయాసురుండు మరల జీవితునిం గావించినాఁడు. దేవదేవా! ఆతనియొద్ద నుత్తమంబగునమృత మున్నది. దానిచే నాతఁడు సకలదానవులను బ్రదికించుచున్నాఁడు. కావున నీవమ్మయాసురుని బ్రహరించి యాతనికడనుండి యమృతహరణంబు గావింపుము. అని చెప్పినంతనే మహాదేవుం డట్లు గావించెను. అంతఁ బితామహుండు ప్రహృష్టహృదయుండై శంకరా!

పరిబలపరాక్రములగుదైత్యులతోఁ బ్రమథగణంబులు గావించు మహా రణమును దిలకించితిని. ఈరీతిగా వేయిదివ్యవర్షంబులు గడచినను త్రిపురవినాశంబు గాఁజాలదు. దేవా! శీఘ్రంబుగ నీవు ప్రదీప్తబాణప్రయోగంబు గావించి దేవద్వేషులగు దానవులను సంహరింపుము. సహస్రవర్షంబులును నిండినచో నీత్రిపురంబు లొకసారి కలసికొని మరల విడిపోవుచుండును. దేవదేవా! నీకాసంయోగముతోఁ బనిలేదు. నీవు తలంచినచోఁ ద్రిపురంబులు నిమిషమునందే దగ్ధంబులు గాఁగలవు. మహాదేవా! నాయందు నీకాదరంబు గలదేని నామాట విని త్రిపురంబులపై బాణప్రయోగంబు గావింపుము.

అని బ్రహ్మదేవుండు ప్రార్థించుటయు మహాదేవుండు దృఢంబగు పినాకనామకధనుర్గ్రహణంబు గావించి యానమితోన్నమితిపూర్వకంబుగా గుణాకర్షణంబు చేసి యందు శరసంధానం బొనరించుటయు సకలదానవసహితంబుగాఁ ద్రిపురంబులును, సకలజగంబులును నిష్పందితంబు లయ్యెను. అంత మహాదేవుండు చంద్రాగ్నిముఖంబును, విశాలంబును, త్రైలోక్యసంహారకంబు నగు తీవ్రశరంబును ధనుర్విముక్తంబు గావించి యంతలోనే “అయ్యో! ఎంతపని జరిగినది!” అనియెను. శివునిపదకమలమునుండి యావాక్యము వెలువడినంతనే నందీశ్వరుండు సన్నిధి కేతెంచి యేమిజరిగినదిస్వామీ యని ప్రశ్నించుటయు దేవదేవుండు వత్సా! మయాసురుండు నాకుఁ బరమభక్తుండు. ఆతనికి మంగళమ్ముం గూర్చుట నాయభిమతము గాదు. కావున నీవెల్లయినఁ బోయి యాతనిపురంబు దగ్ధంబు గాకుండునట్లు చేయుము. నీవు శీఘ్రముగఁ బోయి యాసోమానలులను నివారింపు మని యానతిచ్చెను. నందీశ్వరుండును మహాదేవాదేశంబున యోగశక్తిప్రభావముచే వాయువేగంబునఁ బూర్వపురంబునకుం బోయి యటదానవగణసహితుం

ము, వినమితమస్తకుండును నగుమయాసురుండు మహాదేవు నారాధించుచుండుటం గాంచి మృత్యుభయంబున శరణాపన్నుండగు నాశివభక్తు నాశ్వాసించుచు భక్తమణీ! నీకు భయంబు లేదు. భక్తశిరోమణి యగునిన్ను మహాదేవుండు పరీక్షించెను. అని చెప్పుటయు మయుండు పరమానందంబున మహాదేవునింబోలి నందీశ్వరునకును నమస్కారంబు గావించెను. అప్పుడు వైశ్వానరుండు త్రిపురదహనంబు గావించుటకై నలుదెసలం బ్రజ్వరిల్లుచు, జగత్ప్రళయంబు గావించుకల్పాంతానలముంబోలి ప్రదీప్తుండై త్రిపురంబుల నాక్రమించుచుండుటయు నందీశ్వరుం డాతనిం గాంచి హుతాశనా! నీవీత్రిపురదహనంబు సేయవలదనియెను. ఆమాటవిని వీతిహోత్రుం డిదియేమనియెను. ఈపురమధ్యంబున మహాదేవభక్తుం డగుమయాసురుండున్నాఁడు. ఆతనిరక్షింపవలయు నని మహాదేవాజ్ఞయైనది. అని చెప్పుటయు ననలుండు మయుం గాంచి దానవేశ్వరా! శీఘ్రముగా నీవీపురమునుండి వెడలిపొమ్మనియెను. తోడనే భయార్తుండగుమయాసురుండు సువర్ణమయం బగుతన శివలింగమును గైకొని యుమాపతికిం బ్రణామంబు సేయుచు నాపురంబు వెలువడి యతివేగముగఁ బాతాళమునం బ్రవేశించెను. నందీశ్వరుండు మరలివచ్చి సర్వవృత్తాంతమును సర్వేశ్వరునకు నివేదించెను.

తోడనే త్రిపురంబులును బ్రజ్వలితంబు లయ్యెను. వేదిగృహంబు లన్నియు విధ్వస్తంబులును, వినష్టంబులు నగుటయు రాక్షసులు వానిని బరిత్యజించుచుండిరి. దైత్యరమణీమణులు వివస్త్రలై పరుగులువాఱుచు నార్తనాదంబులచే దిక్కులం బ్రతిధ్వనింపఁజేయుచుండిరి. మద్యపానవిహ్వలలును, పర్యంకశయానలును, శ్యామానదాతవిగ్రహలును, ప్రియాలింగితలును, హర్మ్యవాతాయనవిమానోపవిష్టలు నగునసురకాంతలు రత్నవిశాలశయనములతో దారుణాగ్నిజ్వా

లలం గాంచి భయభ్రాంతలై పలాయితలగుచుండిరి. అప్పుడావిభ్రాంతనారీగణంబులం గాంచి వారిప్రియులు గాఢాలింగనంబులఁ గావించుకొని మోహాముగ్ధులగుచుండిరి. అంతలోనే తత్తరపడి శివభక్తివిహీనులగు నయ్యసురవీరు లుద్వేగముతోఁ బరుగెత్తిపోయి సముద్రమధ్యమునఁ బడిపోవుచుండిరి. పర్వతోపమానంబులు నతితీవ్రంబులు నగు నక్రాదిజలచరంబు లారాక్షసులను గబళించి తృప్తిఁ గాంచుచుండెను. మఱియు విచ్ఛిన్నముక్తాహారలును, బలివిహీనలును, సముద్రపతితలు నగు దైత్యసుందరులనుగూడఁ గరాళవదనంబులఁ దెఱచి భయంకర దంష్ట్రలచే భక్షించుచుండెను. అట్లు భక్షిత లగుచున్న కాంతలు క్రోధదృష్టులను దమపతులవంకఁ బరగించుచు మరణించుచుండిరి. ఆదీనకోపదృష్టులం గాంచి దైత్యయువకులహృదయములు పగిలిపోవుచుండెను. ఈరీతిగా దైత్యవీరులు తమసతీమణులతోఁగూడ నగ్నిదగ్ధులై సముద్రజలంబులఁ బడి నక్రాదుల కాహారంబు లై పోవుచుండిరి. ఇట్లొకనిమేషమాత్రమున సోమానలవిష్ణుస్వరూపంబగు నాతీక్ష్ణబాణము త్రిపురదహనంబు గావించి మరల మహాదేవునికరకమలంబు నలంకరించెను.

ఇట్లు త్రిపురదహనంబును, దైత్యవినాశంబు నగుటయు సృష్టిస్థితిలయకారకుం డగుమహాదేవుండు క్రమ్మఱ దివ్యరూపధారణంబు గావించి సకలదేవతలకును సుస్థిరత్వముం బ్రసాదించెను. అప్పుడు బ్రహ్మాదిదేవతలు మహాదేవునకుఁ బ్రణామంబు గావించి యిట్లు స్తుతింపనారంభించిరి. దేవా! నీవలన నసాధ్యం బగు నీశుభకార్యము సంపన్నంబైనది. ఇది యన్యుల కతిభయంకరమైనది. త్రిపురదహనంబును, దైత్యనాశనంబును నగుటచే మాహృదయములు శాంతించినవి. ప్రమథనాథా! నీవు సర్వదా సర్వస్థితుండవై యుండుము. దేవతాదులకు

సృష్టికర్త వగునీకు నమస్కారము. సర్వగతుండవు, నిత్యుండవు నగు
నీవిజ్ఞానమునందే సమస్తజగత్క్రియలును సంపన్నంబు లగుచున్నవి.
మహాదేవా! నీకు నమస్కారము. అని వినుతించుటయు శంకరుండు
సంతుష్టుండై సురలారా! నాకు మీరు పాలనీయులును, బుత్త్రసదృశ
రక్షణీయులు నై యున్నారు. ఇప్పుడు మీశత్రువినాశం బయ్యెను
గావున మీయభిమతంబులు సిద్ధించినవి. మీరిఁక మీస్థానంబుల కరు
గవచ్చు నని యానతిచ్చుటయు సకలదేవతలును మహాదేవునకుఁ బ్ర
ణామంబు లాచరించి పరమానందహృదయులై తమతమనివాసములకుం
బోయిరి. అనంతరము జగత్కర్తయుఁ ద్రినయనుండు నగుశివుండు
సిద్ధసాధ్యగణపూజితుండై చండీశ్వరనందీశ్వరవీరభద్రప్రభృతులతోఁ
గూడి కైలాసశిఖరంబునకుఁ బ్రయాణమయ్యెను.

వ్యాసమునీంద్రా! దేవదేవునిచేఁ గావింపఁబడిన యసాధ్య
కార్యం బగుత్రిపురదహనవృత్తాంతమును నీకు వినిపించితిని. శుచియై
దీని నధ్యయనంబు గావించుశివభక్తుండు సర్వపాపవిముక్తుండై దివ్య
రూపముం దాల్చి స్వర్గప్రాప్తుం డగును.

—: ద్విజమాహాత్మ్యకీర్తనము. :—

సనత్కుమారుం డిట్లనియెను. వ్యాసమునీంద్రా! దేవదేవుం
డగుశంకరుం డుమాసహితుండై కైలాసశిఖరమునం దుపవసించియు
న్నసమయంబునఁ బార్వతీదేవి పరమేశ్వరునకుఁ బ్రణామంబు చేసి
యిట్లనియెను. స్వామీ! నైమిశారణ్యవాసి యగు హిరణ్యుండను
నొకబ్రాహ్మణుఁడు ఉంఛవృత్తిచే జీవించుచున్నాఁడు. తపశ్శౌచభక్తి
యుక్తుండును, శమాదిగుణసంపన్నుండు నగునాతనిసన్నిధికి నేను స్వ
యముగఁ బోయి పూజింపఁబడుచుందును. తపస్వియగు నాబ్రాహ్మ
ణుని మాహాత్మ్యముఁ గాంచి నేను విస్మయాక్రాంతహృదయనై

యట్టిమాహాత్మ్యముగలబ్రాహ్మణులు దేవతలకంటెను శ్రేష్ఠులే యని భావించితిని. కావున బ్రాహ్మణమాహాత్మ్యము వినవలయు నని నాకుఁ గుతూహలము గలుగుచున్నది. అనుటయు మహాదేవుం డిట్లనియెను. ఓసురాసురనమస్కృతచరణకమలా! జగన్మాత! నీయుద్దేశము సత్య మే. తపస్వులగు బ్రాహ్మణులు దే[illegible] శ్రే[illegible] మగుదురు. పూర్వసృష్టియందు మొట్టమొదట [illegible] బ్రాహ్మణులను సృజించి[illegible]టిని. అనంతరము నేను మహాతేజస్కులును, సుప్రసన్నరూపులు నగు బ్రాహ్మణులను సృష్టించితిని. నన్ననుసరించియే బ్రహ్మయును బ్రప థమమునఁ దనమస్తకమునుండి బ్రాహ్మణులను సృష్టించెను. నేనెప్పు డును ద్విజన్ముల కగ్రనిరతుండనై యుందును గావున వారు శ్రేష్ఠులైరి. అందుచేతనే బ్రాహ్మణులు నిరంతరమును మచ్చింతాపరతులై యుం దురు. ధర్మార్థకామమోక్షంబు లనుచతుర్వర్గములును బ్రాహ్మణుల యందే సుప్రతిష్ఠితములై యున్నవి. బ్రాహ్మణులే యజ్ఞహోమహవి స్స్వరూపులు. వారిమూలముననే దేవతలు సంతృప్తు లగుచుందురు. బ్రాహ్మణహితమునందే యీజగంబంతయును బ్రతిష్ఠితమై యున్నది. అట్టియుత్తమబ్రాహ్మణలక్షణంబు వర్ణించెద నాకర్ణింపుము.

దేవీ! కలికాలమునందు బ్రాహ్మణులశౌచాచారకర్మపరిభావ నై భవంబులం గూర్చి చెప్పెదను వినుము. జన్మమే బ్రాహ్మణసంజ్ఞకు హేతుభూతమై యున్నది. సంస్కారము ద్విజసంజ్ఞకుఁ గారణము. విద్య విప్రనామమునకు మూలము. ఇట్లు బ్రాహ్మణులు త్రివిధంబులఁ బరగుచుందురు. సంస్కారసంపన్నులును, వేదపారగులు నగుబ్రాహ్మ ణులకు రక్షోవధంబులయందుఁ బుణ్యపాపంబులు సమంబులై యుండు ను. జన్మచేతను, సంస్కారముచేతనుగూడ బ్రాహ్మణుండై మఱియు సర్వశాస్త్రవిశారదుండును, తపశ్శౌచసమన్వితుండు నగువాఁడు త్రి

ఫుండఁబరగును. దేవపితృకర్మంబులయం దట్టిబ్రాహ్మణునకు భోజనంబిడువాని సత్కర్మంబు లక్షయఫలదాయకంబు లగును. వేదవేత్తయు, వహ్నిహోమపరాయణుండు నగుబ్రాహ్మణుండు శ్రేష్ఠుండు గావున నాతఁడు పూజితుండై తరింపఁజేయుటకు సమర్థుం డగును. జాతిమాత్రబ్రాహ్మణుండుగూడ సర్వవిషయములయందును బూజ్యుండును లోకగురుండు నై యుండును. అట్టివానిని బూజించుటవలనఁ గూడ సులభముగాఁ బుణ్యఫలంబు సిద్ధింపఁగలదు. అగ్నిహోత్రంబును, దమంబును, యోగంబును, శౌచంబును, ఋజుభావమును, సత్యంబును, వేదపరిసంగము ననునివి బ్రాహ్మణకర్మంబులు. మిథ్యావాదంబును, బ్రాణిహింసనంబును, సేవాచరణంబును, పాపాసక్తియు బ్రాహ్మణులకు విరుద్ధకర్మంబులు. బ్రాహ్మణుఁడు కేవలము తపస్వియై యుండవలయును. అతనికిఁ బునర్జన్మంబు లేదు. విద్యయు, బ్రాహ్మణ్యంబును లభించినవాని కిఁక గర్భవాసానుభవంబు లేదు. చంద్రసూర్యాదికంబు లగునాయష్టమూర్తులును బ్రాహ్మణునందే సుస్థిరములై యున్నవి. సత్పాత్రబ్రాహ్మణులైనను శుభాశుభవితరణంబునకు సమర్థు లగుదురు. ఇట్టిచో మహాతేజోమయు లగుబ్రాహ్మణుల కసాధ్యమేమున్నది? వారియనుగ్రహనిగ్రహంబులచే శుభాశుభంబులు తమంతనే సంఘటిల్లుచుండును. వేదవిద్యావిశారదులును, దపస్వులు నగుబ్రాహ్మణులు వృత్తిదాయకులై దేవగణంబులకుఁగూడ దేవతలై యుందురు. నేనును బ్రహ్మయు బ్రాహ్మణగణంబుల కుత్పాదకులము. సత్ప్రవృత్తు లగుబ్రాహ్మణులు బ్రహ్మోత్పన్నులు. ఓదేవీ! నీవు ప్రకృతివి. నేను పరమపురుషుఁడను. గుణకర్మవ్యాప్తం బగురజోగుణము నీస్వరూపము. రజస్తమోగుణంబులు మోహాత్మకము లైనవి. సత్త్వగుణము మోహనాశకమైనది. అట్టిసత్త్వగుణము సాగ్నికక్రియ

లచే వర్ధిల్లుచుండును. సత్త్వగుణావలంబులును, మహాత్ములు నగు బ్రాహ్మణులు వహ్నిసదృశతేజస్సంపన్నులై యుందురు. వారు సర్వవిషయములందును నవ్యాహతగతులై యుందురు. వారి నెవ్వరు నడ్డగింపఁజాలరు. ఆర్జవంబును, సమతయు బ్రాహ్మణతేజస్స్వరూపము లని యెఱుంగవలయును. విద్యాతపంబులకంటె నార్జవమే శ్రేష్ఠమైనది. సమతాగుణంబువలన నసాధ్యం బగుమోహబంధంబును, పాపంబులునుగూడ నశింపఁగలవు.

దేవీ ! పూర్వము భాగీరథీతీరంబునఁ బరమధార్మికుండును, ఉంఛవృత్తిజీవనుండును నగుదానరుచి యనుబ్రాహ్మణుండు వాసము చేయుచుండెను. ఆతఁడు సర్వవిద్యాసంపన్నుం డగుటచే వినీతాత్ముండును, సర్వభూతాభయప్రదుండునై సహధర్మిణీసహితముగ నిరంతరము నగ్నిహోత్రంబు సేయుచు నభ్యాగతులగు నతిథులను ముందుగా భోజనాదికంబులచే సంతృప్తులం గావించుచు దివసమునందలియాఱవభాగమునందు సతీసహితముగఁ దాను భుజించుచు నీవిధముగా ధర్మనిష్ఠుఁడై కాలక్షేపము సేయుచుండెను. ఈనియమముతో నాతనికిఁ జాలకాలము గడచిపోయెను. ఆతనియింటికి వచ్చినయతిథు లెవ్వరు నేఁడుఁడు నూరక మరలిపోలేదు. తపశ్శౌచపరాయణుఁ డగునాబ్రాహ్మణుఁడు సూర్యాగ్నులకంటెను నధికతేజస్సంపన్నుఁడై యుండెను. ఆతనితపంబుచే నగ్నిదేవుండు పరమసంతుష్టుండై యభీష్టఫలప్రదాత యగుచుండెను. ఇట్లుండ నాతని కొకదినంబున నతిథియొక్కఁడును లభింపకపోయెను. ప్రబలం బగుశీతంబుచే దుర్దినాయమానంబై యున్నయాదినంబున నతిథికొఱ కాతఁడెంతయో ప్రయత్నించెను గాని ప్రయోజనము లేకపోయెను. సాయంకాలమువఱకు నెవ్వరును లభింపకుండుటచే నియమనిష్ఠుండగునాబ్రాహ్మణుండు చింతాన్వితుండై భగవంతుం డగువాసు

దేవుని ధ్యానించుచు నుపవాసంబు నవలంబించియుండెను. సౌభాగ్య
వతి యగునాతనిసహధర్మిణి పతిభక్తిపరాయణ గావునఁ బతియెట్లు చేసిన
నట్లే చేయుచుండెను.

ఓపార్వతీ! ఆబ్రాహ్మణుండు ద్వంద్వభావవిరహితుండయ్యు నప్పు
డు శీతవాతాదిపీడలచే ఖిన్నుండై పడి యుండెను. కాని, శీతబాధనవి
నను, నాఁడు ద్వాదశం బగుటచేతను నతిథియెవ్వఁడు నచ్చటికి రాఁడ
య్యెను. అప్పు డగ్నిదేవుండు మహాత్మ్యంబును బరమంబు నగునా
భూదేవునినిశ్చయం బెఱింగి కుత్సితంబును, వికృతంబునగు చండాల
రూపముం దాల్చి యొకతరుమూలంబునఁ గూర్చుండి యాబ్రాహ్మణున
కు దృష్టిగోచరుం డయ్యెను. అతిథిసంగ్రహంబునకై తిరిగితిరిగి యుప
వసించియున్న యవ్విప్రుండు వికృతరూపుండును, ఘోరదర్శనుండు నగు
చండాలుని గాంచెను. వానిశరీరమంతయు వ్రణమయమై యావ్రణం
బులనుండి క్రిములును, శోణితమును వెలువడుచుండెను. వాఁడు శీత
బాధచేఁ గంపితదేహుండై యార్తనాదము గావించుచుండుటయు బ్రా
హ్మణుండు మృదుమధురస్వరముతో భయము లేదని యాతని నూఱ
డించి యగ్నిని బ్రజ్వలింపఁజేసి యాతనిశీతబాధను నివారింపఁజేసి పర
మాదరంబున నీవు మాయింటికి వచ్చి భుజింపు మని చెప్పెను. అప్పు
డు దీనుండగుశ్వపాకుండు తపోనిధి యగుభూసురుం గాంచి మహాదేవా!
నేను చండాలుఁడను. మృగవిహంగములకుంబోలి నాకిచ్చుటనే యన్న
ము పెట్టఁదగును. నేను మీగృహంబున కరుదెంచి భుజించుట కర్హుఁ
డనుగానని నివేదించెను. ద్విజవరుండును ధ్యానబలంబుచే నాతఁడు
వైశ్వానరుం డని గ్రహించి, యోపాపరహితా! నేను నీజాతిని బూజిం
చుట లేదు. సర్వశరీరంబునాత్మ సకలజీవులయందును సుప్రతిష్ఠిత
మై యున్నది. నేను దానినే పూజింతును. పరమపురుషుం డగునాత్మ

మేశ్వరుం డెల్లయెడలను వ్యాపించి యున్నాఁడు. అది కారణంబుగాఁ దిర్యగాదిజంతువులయందుఁగాని, నీవంటిజీవులయందుఁగాని నాకెట్టియు సహ్యాభావమును లేదు. నాకంతయును దేవతాస్వరూపమే. కావునఁ దపశ్శౌచపరాయణుండ నగునే నవ్యాకులహృదయముతో నిన్నర్చింతును. నీవెంతమాత్రమును సంశయింపవలదు. ఆత్మ సర్వగతంబైనది. అది క్రిమికీటసర్పాదులయందును, జండాలాదులయందును, బ్రాహ్మణులయందునుగూడ నొక్కరీతినే విరాజిల్లుచుండును. ఇఁక నిందాబహిష్కారముల కవకాశ మెక్కడిది? కుత్సితాకుత్సితులయెడల నాకెట్టిభేదభావంబును లేదు. ఇప్పుడు నీవనుగ్రహించి సుసంస్కృతం బగునాయన్నమును భుజించి నన్నుఁ బవిత్రునిగాఁ జేయుము.

అని బోధించుటయుఁ జండాలుండు ప్రసన్నచిత్తుండై యాభూసురు ననుగ్రహించి యాతనియింటికిం బోయెను. అప్పు డతిథిపూజాపరాయణుం డగుద్విజశ్రేష్ఠుండు భక్తిపూర్ణహృదయముతో యథావిధిగ నాతని కతిథిసత్కారంబులఁ గావించెను. భోజనానంతరంబున నగ్నిదేవుం డాతనికి నిజస్వరూపముతో సాక్షాత్కరించి యోగైశ్వర్యాద్యుత్తమవరప్రదానంబు గావించెను. అప్పు డాబ్రాహ్మణుండు పరమయోగప్రాప్తుండై పత్నీసహితంబుగ దేహత్యాగంబు చేసి మోక్షపదంబును గాంచెను. ఓగిరీంద్రనందినీ! ఇప్పుడు నీకు నేనుపదేశించిన యీద్విజమాహాత్మ్యమును శుచియై నిత్యమును శ్రవణపఠనంబులఁ గావించువాఁడు పవిత్రసుఖంబులను నభిమతఫలంబులను, దేజోలాభంబులను బడయఁగలఁడు. దేవీ! ఇట్టిమహత్వంబుగల విప్రు లలోకసామాన్యప్రభావులై మహామునిసులభం బగుమత్పదంబును జేరుట కర్హులై యుందురు.

—♦ విభూతియోగము. ♦—

వ్యాసమునీంద్రా! దక్షాధ్వరసమయంబున బ్రహ్మాదిదేవతలు వీరభద్రునకు భయపడి మహాదేవునిశరణముం గాంచిరి. భస్మలిప్తశరీరులగువారందఱును యజ్ఞదీక్షితపశువులంబోలి భస్మకూటాంగణమును జేరి ప్రమథగణమూలంబునఁ దమవృత్తాంతమును దెలుపుకొనుటయు భగవానుండగుశంకరుండు వ్రతధారు లగువారికి హిరణ్యగర్భాదిప్రధానయోగులచే నాచరింపఁబడుచున్న మోక్షవిద్యాతత్త్వం బగుస్వయోగమును బ్రసాదించెను. ఇతరంబు లగుసకలయోగంబులు నతికష్టసాధ్యంబులు. అవి సహస్రజన్మాంతరములయం దభ్యసించినను దీరునవి గావు. సకలకర్మంబులను బరిత్యజించియైనను బాశుపతదీక్షితుం డైనచో మహేశ్వరునియందు విలీనుఁడు గాఁగలఁడు. తపోధర్మసమ్మతంబును, సర్వజ్ఞానసమాయుక్తంబును ముక్తిప్రదంబు నగునిమ్మహావ్రతముం గూర్చి చెప్పెదను. అధర్మముకంటెఁ బాపంబును, ధర్మముకంటెఁ బుణ్యంబును వేఱొకటి లేదు. పరస్పరాశ్రయంబులగునీధర్మాధర్మములను బరిత్యజించి మంగళవ్రతంబగునీవ్రతంబును స్మరింపవలయును. అనంతరము పాశుపతయోగప్రాప్తుం డై పరమైశ్వర్యసంపన్నుం డగును. భస్మగ్రహణమాత్రంబుననే సకలబంధవిముక్తుం డగును. బ్రహ్మస్వరూపం బగుభస్మమును స్పృశించినమాత్రముననే మానవుఁడు ముక్తుం డగును. బ్రహ్మాదిదేవత లందఱును భస్మధారులును, భస్మప్రియులు నై యుందురు. భస్మతేజోబలంబుచేఁ బవిత్రం బగునీశ్వరభావప్రాప్తి యగును.

త్రాసీశ్వరుండ నని భావించి భస్మస్నానము నాచరింపవలయును. శివయోగాత్మకం బగుభస్మమువలనఁ బాపరూపబంధంబులకు విముక్తి యగును. దేవతలు సోమసంభూతులును, పితృదేవత లగ్ని

సంభూతులు నగుటచే నీజగంబంతయు నగ్నిసోమాత్మకంబై యున్నది. ఈశ్వరుండును, అగ్నియు, సోముండును భస్మతేజస్స్వరూపులై యున్నారు. భస్మతేజోవిరాజితుం డగుద్విజుండు పాపవిముక్తుం డగును. సాంఖ్యవిద్యను, దపంబును, వేదోదితసకలధర్మంబులనుగూడఁ బరిత్యజించినైనను కేవలభస్మస్నానమూలంబునఁ బరమేశ్వరప్రాప్తుండగును. పాపాత్ముండైనను, పుణ్యాత్ముండైనను, అధార్మికుండైనను, ధార్మికుండైనను శివభక్తిసంపన్నుం డగువాఁడు భస్మధారణంబున విశుద్ధుండై యతిశీఘ్రంబుగఁ బరమయోగింబును గాంచి సంసారబంధవిముక్తుం డగును. పాశుపతధర్మావలంబి యగుమునీంద్రుం డీవిధముగా మహావ్రతపరాయణుండై పరమగుహ్యం బగుపరమేశ్వరజ్ఞానాభ్యాసంబు గావింపవలయును.

స్థానత్రయసమన్వితం బగునాత్మ నాడీసమూహమునం దెట్లుండునో యట్లే జ్ఞేయంబును, జ్ఞానంబును, జ్ఞాతయు ననునీత్రియంబును దేహాస్థితంబై యుండును. ఆత్మయందే యుపస్థితంబగునాత్మ యట్లే సకలప్రాణులయందు నతిగూఢముగ వ్యాపించి యుండును. జ్ఞానసేవనంబుకంటె నాత్మవిజ్ఞానంబున కన్యోపాయం బేదియును లేదు. రూపశబ్దరసాతీతుం డగునమ్మహేశ్వరు నెవ్వ రెఱుంగఁగలరు? వ్యాసమునీంద్రా! నేను పరమేశ్వరప్రసాదముచే నాత్మజ్ఞానంబునకుఁ బ్రధానోపాయమును జెప్పెద నాకర్ణింపుము. దేవాసురులు, నదులు, సూర్యచంద్రులు మొదలుగాఁగల జగజ్జన్యపదార్థములును, దృష్టపదార్థములును సత్యముగా లేనే లేవు. కేవలనిర్మలుండును, పవిత్రుండును, మహాత్స్వరూపుండును నగు పరమేశ్వరుఁడుమాత్రమే యున్నాఁడు. ఆతఁడు నిత్యుఁడును, నిర్వికారుఁడును, సర్వగుణాతీతుఁడును, అంతర్బహిర్గోచరుఁడును, నిరంజనుఁడును, తేజోదీప్తుండును, జ్ఞానస్వరూపుఁడును, ప్ర

ధానుఁడు నై యుండును. అవినశ్వరం బగునాబ్రహ్మతేజమునుండి ప్రథమంబున 'ఓమ్' అను నేకాక్షరము నిర్గతం బయ్యెను. అది యక్షరత్రయవిలసితంబును, మాత్రాత్రయసమన్వితంబు నై బ్రహ్మస్వరూపముగాఁ బ్రశంసితం బగుచున్నది. ఓంకారాంతర్గతమగు 'అ'కారము బ్రహ్మస్వరూపము. మాత్ర ప్రకృతిస్వరూపము. ఆప్రకృతి పత్నిస్వరూపంబున మహేశ్వరు ననుభవించుచుండును. బ్రహ్మవిష్ణులును నీశ్వరసంజ్ఞితులై యుందురు. ప్రకృతి నతిక్రమించి యోంకారమును ధ్యానించువాని నాదిత్యుండు ముక్తాత్మునిగను, కృతార్థునిగను గావించును. కాని కేవలహేతువాదపరాయణులును, విమార్గులు నగు వారల్లు కృతకృత్యులు గాఁజాలరు. క్షీరంబులయందు ఘృతంబునుం బోలి యోంకారము ప్రకృతియందు నిత్యస్థితమై విరాజిల్లుచుండును. గుణకర్మవిశిష్టం బగుప్రకృతి యీశ్వరునికంటె భిన్నమైనది. అట్టిప్రకృతి బృహత్త్వంబు గాంచుటచే బృహతి యనియు, శ్యామయనియు, విష్ణుత్వముం గాంచుటచే విభవ యనియుఁ గీర్తింపఁబడుచుండును. ప్రకృతి సాభిమాన మైనచో సృష్టి యగుచుండును. దానికి మహేశ్వరుండు భోక్త యగుచుండును.

జగన్మాత యగుప్రకృతి యష్టబాహువిలసితయు, చరణత్రయవిరాజితయు, పంచాకృతియు, పంచముఖియు, త్రినేత్రయు, సప్తాశ్వరథారూఢయు, గుణత్రయవికారజాతియు నై యుండును. అట్టిప్రకృతి యందు శుభాశుభంబులును, విద్యావిద్యలును విద్యమానంబు లగుచుండును. యథార్థజ్ఞానంబును, యోగంబును, క్రియానుష్ఠానంబును, యోగాసనవిషయంబులశుభాశుభలక్షణంబులును, తారాబలనిర్ణయంబును వానికొఱకే! ఓంకార మీశ్వరునియం దుత్పన్నమైనది. ఈశ్వరుండు దానియందే ప్రతిష్ఠితుండై యుండును. కావుననే కపిలాదియో

గిగణంబులు మహాయోగము నవలంబించి నిత్యంబును,నిర్వికల్పంబును, బరమంబు నగునోంకారము నుపాసించుచుందురు. అదియే సర్వయోగాత్మకంబును, సర్వకారణంబు నై యున్నది. ప్రకృతిభూతులును, ఓంకారసంజనితులును, గుణస్వరూపులునగు బ్రహ్మవిష్ణువు లీశ్వరభోగ్యులై యుందురు. వారు వేదయజ్ఞంబులను, ధర్మబంధంబులను బరిత్యజించి విద్యాప్రభావముచే మహామోహతమోమధ్యంబునఁ బ్రవిష్టులై యుందురు. ఇరువురును రజస్సత్త్వగుణాధికులును, సుఖదుఃఖమయులును, సర్వనిత్యసములును, సంసారపీడకులును, మోహాధికులు నై యుందురు. ఈశ్వరధ్యానయోగపరాయణుఁడే విద్వాంసుఁడు. ఆతనినుండియే ప్రకృతియుత్పన్న మగుచున్నది; ఆతనియందే లయమగుచున్నది. ఆత్మ ప్రకృతికంటె భిన్నమైనదని యెఱింగినవానిని బ్రకృతి బంధింప నేరదు. ఆతఁడు భవసముద్రమునుండి యుత్తీర్ణుఁడు కాఁగలఁడు.

——♦ వివిధయోగవర్ణనము. ♦——

సూక్ష్మం బగునాత్మయు, మనంబును, బుద్ధియు, నహంకారంబును, సత్త్వాదిగుణత్రయంబును, బంచభూతంబులును, బంచేంద్రియంబులును, బంచతన్మాత్రలును, దశవాయువులునుగూడ దేహమునందుఁ గ్రమంబుగా జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయందు విభక్తములై యుండును. సూక్ష్మంబును, సర్వతోముఖంబును, దశనాడీవేష్టితంబు నగు హృదయపద్మమునందు సజీవంబుగా నాత్మ యధిష్ఠితమై యుండును. అద్ది స్వప్నస్థలం బని సిద్ధయోగులు చెప్పుదురు. జ్వాలిని, స్తిమిత, ఉగ్ర, విద్య, అవిద్య, విశాలిని, మాలిని, శంకరి, సుమిత్ర, సుబోధిని యను నీదశనాడులును జీవప్రతిష్ఠితములై యుండును. ప్రబుద్ధుండును, భావాభావసమాహితుండు నగుజీవుఁడు జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయందు శబ్దాదివిషయంబులను గ్రహించుచుండును. మనోబుద్ధిచిత్తాహంకార

ములు నాల్గును దేహజము లైనవి. ఇవి యాత్మతోఁ గలసి యుండక దాని నష్టగించుచుండును. ఆనాల్గింటితో జీవుఁడు చేరియుండును. జీవాత్మ హృదయకర్ణికాంతరమున సర్వతోముఖమై మనోమధ్యంబు నం దతిసూక్ష్మాకృతితో విరాజిల్లుచుండును. అపారగుణాత్మకం బగు జీవాత్మ చిత్తంబనియుఁ బురుషుండనియుఁ బ్రశంసింపఁబడుచుండును. అహంకారమునుండి బ్రహ్మోత్పత్తి యయ్యెను. అదియే భాస్కర సంచారక్షేత్రము. అహంకారము, బ్రహ్మ, సూర్యుఁడు, చంద్రుఁడు, జ్ఞానము, ధర్మము, రతి, రసము, ఆత్మ, ఓషధులు, సపరికరం బగు ఘ్రాణసమూహము, నిరాశ, మృత్యువు, దుఃఖము, అనామయము, నీచములగుకామరోషవేగములు, సర్వతోవ్యాప్తంబులగుధర్మములు. సమత, విష్ణువు, బుద్ధి, శౌర్యము, కారణము, భూమి, జ్ఞానము, వైరాగ్యము, ఆకాశము, రాజసభావసమూహమును జీవమధ్యస్థితంబులై యుండును. సూక్ష్మంబును, విధూమంబును, సకలజీవుల కమృత, గతి స్వరూపంబునగుపావకశిఖామధ్యంబున నగ్నిసదృశుం డగుజీవుఁ డదృశ్యుఁడై యుండును.

సరస, లోహిత, ముఖ్య, ప్రోత, రసవతి, విధూమ, అమృత నందిని, వక్ర, విస్తర మొదలగునీసూక్ష్మనాడులు పదార్థములను భేదించి భూతాధారభూతుండును, పయోవృతుండు నగుసోము ననుసరించి పర్యటనంబు సేయుచుండును. సర్వాంతరసమీపస్థుం డగునాసోముం డానాడులచేఁ దర్పితుండై యగ్ని జీవమధ్యగతంబగునాడి నాహ్వానించుచుండును. జీవదంబును, ఉత్తమంబు నగుదానినే యమృతమని చెప్పుదురు. సోమశిఖాకల్పితాప్లవసమయమే జాగ్రదవస్థ యనియు, సుషుమ్నాప్రతిష్ఠితసురానాడీయోగమే సుప్తావస్థ యనియుఁ బ్రాజ్ఞులగుయోగులు చెప్పుదురు. మునిగణంబు లీసుప్తజాగ్రదవస్థలను ఉ

యుంచి యజాగరితం బగుధ్యానయోగమును స్వయముగాఁ జింతించు చుందురు. గమనాదిదైహికక్రియలును, ఘ్రాణాదిమనఃక్రియలును జాగరితంబులు గాకున్నచోఁ దన్మూలమున సద్వైరాగ్య మవగతంబగును. బుద్ధినిశ్చయంబును, మనస్సంశయంబును, అహంకారాభిమానంబును త్యజించినచో మరణమునుండి యుత్తీర్ణుండగును. అట్లు గాక కర్మనిక్షేపంబు గావించిచో మోక్షరూపం బగుకుశల మెట్లు లభించును? కర్మబంధవిషాదమునుండి విశుద్ధుఁడైనవాఁడు ముక్తిలాభంబు నందు నని యెఱుంగునది. సకలవిషయంబులును సోమసంభూతములనియు, వానికి భోక్త వహ్నియనియుఁ జెప్పుదురు. సామాన్యచర్మము వానిని బాధింపఁజాలదని గ్రహించి సర్వదా యోగానురక్తుఁడై చింతలను త్యజింపవలయును. జీవితావస్థయం దున్నను నేను మహేశ్వరుండనే కావున ధర్మకర్మవిరహితుండ నగుచున్న లోకమునుంబోలి యిచ్ఛ బాధింపనేరదని సుస్థిరుఁడై యుండవలయును. క్రియామూలమున యోగ్యు లగువారు శంకరప్రీతావలంబులై స్వతనుత్యాగంబును, మాయాభేదంబును గావించి పరమపదముం గాంచఁగలరు.

వ్యాసమునీంద్రా! శివభక్తుండ వగునీ కింలోకంబెను సూక్ష్మంబును, బరమంబును, స్ఫుటంబు నగు జ్ఞానయోగము నుపదేశించెదను. ఇట్టిపరమోత్తమసూక్ష్మజ్ఞానము యోగులకుఁగూడ నవేద్యమైనది. విశుద్ధు లగుపాశుపతులకుఁదక్క నిది యెవ్వరికిని దెలియనేరదు. మనస్సు, బుద్ధి, అహంకారము, ఇంద్రియములు, సత్త్వాదిగుణంబులును గూడ బహిర్వికారమాత్రములును, క్షయశీలంబులును గావున నివి యాత్మ నెంతమాత్రమును స్పృశింపఁజాలవు. ఆత్మ సర్వవ్యాప్తం బయ్యు నెందును దృష్టిగోచరంబు గాకుండును. ఆపరమాత్మ నేరూపముచేతను గనుంగొనఁజాలము. పరమేశ్వరుఁడు భావగుణంబుల కగమ్యుం డని

యనుభవముచే గ్రహించినవారే యోగిశ్రేష్ఠులుగాఁ బరిగణింపఁబడు చుందురు. కనీనికాంతరంబునఁ దేజస్స్వరూపం బగునాత్మచ్ఛాయ దృష్టిగోచర మగుచుండును. సర్వశరీరులకును మూలభూతంబగుసూక్ష్మ జీవము సహస్రకర్ణికాపద్మమునం దుండును. పూర్వోక్తంబు లగునాడు లన్నియు నందు జీవసహితంబులై యుండును. గాంధారి, విజయ యనునవి ప్రాణధారిణులగునాడులు. పాణిన, తాలగంధ యనునీనాడులు రెండును నాభిస్థితంబులై యుండును. యోగ మొదలుగ నూపాస్మాంతంబువఱకును గలదశనాడులును నాగవాయుపోషితములై యుండును. హవ్యవాహనుఁడు ప్రాణసహితుఁడై బహిరంతర్భాగముల సంతృప్తి పఱచుచుండును. సుషుమ్నానాడి సోమవహ్నిస్థితమై యుండును. కారణదేహకుమారదేహములం దవిలంబితనాడియు, జీర్ణకుమారదేహమూలం దనలస్థితనాడియు నుపస్థితములై యుండును. విశుద్ధం బగువాతవాసస్థనాడి నిత్యవాతపరిపూరితమై యుండును. సమానధ్యానసంయుక్తనాడి సర్వదా రక్తపూర్ణమై యుండును. వాయువును, కూర్మనామకం బగునీవాయువును నాభిస్థితంబగుసన్ననాడియందు సంచరించుచుండును. అసర, అవధర యనునీనాడులు రెండు సల్పవాయుకలితంబులై యుండును. వానికూర్ధ్వాధోభాగములందు పాదసన్నద్ధం బనువాయువును, మస్తకోపరిభాగంబునఁ గూర్మవాయువును వ్యాపించియుండును. దేవదత్తనామకం బగువాయువువలనఁ గృతాకృతప్రజ్ఞానంబు గలుగును. ప్రాణదేవమహాబలవాయువులు రెండును, వహ్నిసోమనిబద్ధంబులై యుండును. అందొకటి యగ్నిని, మఱియొకటి సోముని వర్ధిల్లఁ జేయుచుండును. దేవదత్త, మహానాగ, కృక, కూర్మ, ధనంజయవాయువులు ప్రాణవాయువులు. ఇవి మనయందు చక్రయోగపాలకంబు లని కీర్తింపఁబడుచున్నవి. వీనియందు హంసతేజమును, సోమాంబును

బ్రతిష్ఠితంబులై యుండును. హోమము యజ్ఞవిధానంబు గావించును గాని, ముక్తికారణంబు గానేరదు. స్మృతయను నాడియందు ప్రదీప్తం బగు నగ్ని యుండును. ఆనాడీస్థానమునుండియే యగ్ని విస్తృతం బగుచుండును. అట్లు వెడలుచున్న యగ్ని కర్ణికామధ్యపర్వతంబులమూలమునఁ బరితృప్తిం గాంచుచుండును. నేత్రములయందు తారారూపంబునఁ బ్రకాశమానం బగుచుండుజ్యోతియే సర్వజీవులకును జీవస్వరూపము. అది యాత్మ ననుసరించి యుండును. ఆనేత్రజ్యోతియందలి సూక్ష్మపదార్థమే పరమతత్త్వం బని చెప్పుదురు. అదియే యమృతస్వరూపము. అది జ్ఞానమువలననే లభింపఁగలదు. దానికంటె శ్రేష్ఠం బగునది మఱి యేదియును లేదు. యోగవిజ్ఞానదాయకం బగుగతి యది యొక్కటియే. ఈతత్త్వమును బాగుగ గ్రహించి గుణత్రయవికారజనితం బగుమోహమును బరిత్యజింపవలయును. ఆత్మ కభిన్నం బగునీపరమతత్త్వ మీశ్వరునికంటె భిన్నమైన దని చెప్పుట కేయోగవిశారదుఁడు సాహసింపఁగలఁడు? నిరంజనుండును, నిర్వికల్పుండు నగు నీశ్వరునికంటె నీపరమతత్త్వ మెప్పటికిని భిన్నమైన దని తలంపరాదు. వ్యాసమునీంద్రా! నీకు నేనీమహేశ్వరతత్త్వమును వర్ణించి చెప్పితిని. ఆపరమేశ్వరుఁడు పరిపూర్ణబ్రహ్మము. ఆతనికి నామరూపంబులు లేవు.

—♦ యోగధ్యానము. ♦—

పరాశరనందనా! శివసిద్ధాంతసంకలితంబును, ఈశ్వరధ్యానకారణంబును, యోగిగణంబులకు ముక్తిదాయకంబు నగుపరమజ్ఞానముం గూర్చి చెప్పెదను వినుము. నన్ను గురునిగా భావించి మదుక్తం బగు నీవిద్య నభ్యాసము చేయుచుఁ గార్యమునకు విఘ్నంబునుంబోలె తత్త్వజ్ఞానంబునకు స్వదేహంబు ప్రతిబంధకం బనియెంచి పరిత్యజించి షడ్విం

తత్త్వలాభంబు గాంచవలయును. దేహమునందలి సకలనాడులును వాయుసంబద్ధములై యందందు సంచరించుచుండును. అవి యన్నియును నేతుకర్ణికామధ్యము నాశ్రయించి యుండును. ఈనాడులు సేతువు నాశ్రయించి బాహ్యాపాదస్థలంబులై యుండును. ఇతరంబులగు సకలనాడులును గరావలంబనముం గాంచి యుండును. వేయినాడులు సమాసవిరహితం బగుపరమాత్మయం దుపస్థితంబులై యుండును. వానిలో నొక్కొక్కటి భిన్నంబును, సూక్ష్మంబును, సూక్ష్మతరంబు నై యుండును. కర్ణికామధ్యమునం దుత్పన్నమైనప్రాణవాయు వీసమస్తనాడులయందును సంచరించుచుండును. యోగివరులు జ్ఞానమూలంబున నీనాడుల నన్నిటిని దర్శించి పరమాత్మావలోకనంబు సేయుచుందురు. తేజస్స్వరూపం బగుపరమాత్మ సర్వదేహములయు సకలనాడులయందును విభక్తంబై యుండును. ఈనాడు లన్నియును సంబులోం గూడి దానిని జలింపం జేయుచుండును. ఆతేజము చక్షువుల నాహారంబుచేసి సర్వనాడీసమాశ్రితమై యుండును. మనంబు నేకాగ్రముగం జేసి యాత్మయందు నియోజితంబు గావింపవలయును. ధనంజయనామకం బగువాయువు హృదయమధ్యమున సర్వదా ప్రకాశించుచుండును. దానికి శిరంబును, నాభియు, హృదయంబును ముఖ్యస్థానములు. నాచే నిదివఱకు వర్ణింపంబడినవాయువు లన్నియు ధనంజయవాయువున కధీనములు. అవి దానినుండియే యుత్పన్నము లగుచుండును. కావున నవి యితరస్థానములం జరించుట కసమర్థములై దానియందే సుస్థితంబులై యుండును. వాయువులకుం బ్రథమస్థానము నాభిబంధననాడీచక్రము. ద్వితీయస్థానము కర్ణిక. తృతీయస్థానము తాలువు. భ్రూవికారపరం బగుస్థలము త్రివిధోత్క్రాంతి యని చెప్పంబడును.

యోగులు సకలధర్మాధర్మములవలనను, పూర్వజన్మార్జిత కర్మంబులవలనను బద్ధులు గాకుండునట్టి మార్గమును జెప్పెదను. బాహ్యం బనియు, శరీరజం బనియు మృత్యువు రెండువిధంబులు. అందు విషశస్త్రాదులచేతను, వ్యాఘ్రసర్పాగ్నిజలాదులచేతను బుట్టించునది బాహ్యమృత్యువు. శరీరజమృత్యువు రోగజ మనియుఁ గాలజ మనియు రెండువిధములు. వృద్ధత్వముచే ఘటిల్లునది కాలజ మనియు, వ్యాధులచే సంభవించునది రోగజమనియుఁ జెప్పంబడును. అభ్యాసమువలన యోగసాధనజం బగుమృత్యు వతిదుర్లభమైనది. కాలజమృత్యువు కాలక్షయ మైనంతనే యగుచుండును. యోగజమృత్యు విచ్ఛానుసారముగ సంభవించును. యోగాభ్యాసరతునకు శ్రోత్రసంధిజం బగుశబ్దము శ్రవణగోచర మగును. ఆశబ్దమును ముందుగాఁ గూర్మవాయువునందు జేర్చినచో వహ్ని తనప్రభను త్యజించును. ఆవహ్ని నిష్ప్రభంబైనంతనే శబ్దసంబంధమునుండి విముక్తి యగును. శబ్దస్పర్శము లతీతములైనచో రూపవిముక్తి యగును. అగ్ని యీవిధముగాఁ బ్రవేశించి యేకాంతయోగము నిచ్ఛించుచు సకలమర్మములను విస్పష్టంబు గావించును. కిమ్మార, దేవదత్త, కృకర, నాగ, ఉదానవాయువులు సమ్మిళితములై కర్ణికయందుఁ బ్రవేశించును. మనస్సు జీవాత్మయందు నిష్క్రియమై యుండును. సకలేంద్రియములును మనస్సునందును మనస్సు ప్రాణమునందును లగ్నమై యుండును. ఇట్లన్నియును విలీనములై ప్రాణవాయువును బీడించును. అట్లు పీడితం బగుప్రాణవాయు వేకశతరూపంబులఁ బరిణమించును. అనంతరము కర్మాత్మవాయుస్థానములు పరస్పరసంయుక్తము లగును. క్రమముగా నావాయువు లన్నియును ధనంజయవాయువును బూరించును. అప్పు డాధనంజయవాయువు జీవుని త్యజించి తాను నిలిచియుండును. ఈవిధముగా సర్వభూ

ణగుణస్థితి యేకకాలకృతమై యుండును. అతిసూక్ష్మం బగుమహేశ్వ
రపదము యోగవ్యతిరిక్తముగా నెవ్వటికిని బొందశక్యంబు గానేరదు.

మననశీలుం డగువాఁ డుపవిష్టుండైనను, ప్రసుప్తుండైనను, గ
మనతత్పరుండైనను, ఛురికాపరిఘశూలధరుండైనను పరబ్రహ్మ మగు
మహేశ్వరు నెఱింగి యిచ్ఛానుసారంబుగ ముక్తిలాభముం గాంచును;
క్రియాసహితంబుగ వికారము లన్నియును లయంబు గాంచుటచే సర్వ
తత్త్వస్వరూపుఁ డగుమహేశ్వరుసాక్షాత్కారముం గాంచును. మనస్సే
ప్రాణులకు రోగదాయకమైనది. రోగసహితుం డగువాఁడు విపన్నుం
డగును. విపన్నుఁడు మోహబద్ధుఁడై జ్ఞానవస్తువు నెఱుంగఁజాలకుండు
ను. వేదవిహితంబు లగుపవిత్రకర్మములచే స్వర్గలాభముం గాంచినట్లే
యాకర్మముచే సకలదుఃఖములను బరిత్యజించి జ్ఞానస్వరూపం బగుబ్ర
హ్మమును బొందవలయును. సద్యోజాతాదిపంచబ్రహ్మల నెఱుంగని
వాఁడైనను, దర్శనమాత్రంబున వారికర్మంబులయందు నిష్ఠుండై,
భస్మధారణముచేఁ బవిత్రుఁడై, శంకరునియం దేకాగ్రచిత్తుఁడై, యో
గాభ్యాసనిరతుఁడై యున్నచో నాతనికిఁగూడ సుజ్ఞానము లభింపఁగల
దు. మాహేశ్వరం బగుయోగము సఫలంబును, ముక్తిదాయకం
బు నైనది. మాహేశ్వరవ్రతంబు ననుష్ఠింపక యెట్టియజ్ఞానుష్ఠానంబు
గావించినను ముక్తి లభింపదు. సర్వజ్ఞుండును, ప్రబుద్ధుండు నగువానికిఁ
బాశుపతవ్రతంబుతో నిమిత్తంబు లేదు. మాహేశ్వరచింతనంబుచేత
నే జ్ఞానలాభం బగును. ఎట్టియోగులైనను నీశ్వరచింతనంబుచేఁ గాని
పరబ్రహ్మపదంబు నందఁజాలరు. ఆదేవుని యనుగ్రహంబు లేకున్న
ముక్తిలాభంబు గలుగదు. శివయోగుల కిదియే మోక్షోపాయము.
దీని నవలంబించుటచే సర్వమును మిథ్య యని బోధ యగును. బ్రహ్మ
లోకమునకుఁ బరంబునం గలమాహేశ్వరస్థానమును శివభక్తులగువారు

మాత్రిమే చేరఁగలుగుదురు.

—♦పాశుపతాదివ్రతమాహాత్మ్యము.♦—

పారాశర్యా! సత్యలోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, భూతలోకము, భవ్యలోకము, భవలోకము ననుసీసప్తలోకములకు నూర్ధ్వంబున నిత్యశివనివాసం బగుశివలోకసమూహము ప్రతిష్ఠితమై యుండెను. ఆశివలోకముల నాశ్రయించియే యూర్ధ్వమధ్యాధోదేశములందు సకలలోకమును సుస్థిరంబులై యున్నవి. బ్రహ్మాండమంతయు నాశివలోకమునందే ప్రతిష్ఠితమై యున్నది. ప్రళయకాలమునందును దానికి నాశము లేదు. అదియే శాశ్వతస్థానము. దేవత లందఱు నచ్చటనే నివసించి యుందురు. అందు సనకాదియోగిగణంబులును, పితామహుఁ డగుబ్రహ్మయు, వాలఖిల్యాదిమహర్షులును, కపిలాదిసిద్ధులును శివయోగావలంబులై, సత్వాదిగుణవివర్జితులై, నిష్కాములై యీశ్వరసేవ గావించుచుందురు. శివరూపుఁ డగుసీశ్వరుఁడు పరమాత్ముండును, నిత్యుండును, పరముండును, పరమైశ్వర్యసంకలితుండును, సకలజీవులకుఁ బ్రభుండునై యుండును. క్షమాసత్యంబులును, ధృతియు, తపంబును, వైరాగ్యమును, విష్ణుత్వమును, బ్రహ్మత్వమును, శుద్ధజ్ఞానమును, మహేశత్వమును సమస్తమునుగూడ నామహేశ్వరునందే నిత్యస్థితంబై యుండును. కావుననే యాతఁడు దివ్యంబగుపరమాణుపదంబున స్థితుండై యుండును. అద్వయంబగునాతేజమునుండియే మనోహంకారములకుఁ బ్రకాశంబు గలుగును. మహత్వమును, నిత్యత్వమును గల్పించుముక్తిపదము లౌకికమైనది. సిద్ధమండలము దానినుండియే యుదయించెను. ఆక్షేత్రమునుండియే ద్విజోత్పత్తి యయ్యెను. ఆయీశ్వరుండు విభుం డనియు, నాతనినుండి యుదయించిన ప్రకృతి వైష్ణని యనియుఁ బ్రశంసింతురు. ఆశంకరరూపబ్రహ్మమున

కగ్రభాగమున బ్రహ్మలోకమును, దానికగ్రభాగమునఁ దేజోమయపురంబును గలవు. ఆపురంబున మహాత్ముఁడును, సర్వభూతేశ్వరుఁడు నగుశివుండు నిలిచియుండుటచే నదియే సకలశివయోగులకును గతియై యున్నది.

ఆపురంబు కోటియోజనవిస్తీర్ణమును, నిర్మలపవిత్రమహామండలవిలసితంబును, మధ్యాహ్నమార్తాండసముజ్జ్వలంబును, విశాలసువర్ణప్రాకారవేష్టితంబును, మణిముక్తావిభూషితకళకద్వారశోభితంబును, రమణీయంబును, సిద్ధగణసేవితంబునై విరాజిల్లుచుండును. అందు జరామరణశ్రమవ్యాధిమోహశోకభయాదు లెంతమాత్రమును లేవు. అది సర్వసమృద్ధిసంపన్నమై యుండును. స్పర్శమాత్రసుఖదాయకం బగున మహానతీభూమి యందే యున్నది. అందొక్కచోఁ జంద్రనిర్మలంబు లగు శ్వేతపద్మములును, బాలసూర్యప్రభాసంపన్నము లగురక్తపద్మములును సుగంధపూర్ణంబులై విరాజిల్లుచుండును. కమలేందీవరశోభితంబులును,సుధామధురోదకపూరితంబులు నగు ననేకవాహినులా శివపురంబు చుట్టును బరివేష్టించి ప్రవహించుచుండును. వరద, వరేణ్య, వశేశ, పావని, వార్ష్ణా, వారిభవి, వర, మహాపద యనునదులయందలి యుదకము వివిధకుసుమగంధవిలసితమును అమృతోపమానము నై యుండును. దేవాసురమునిగణంబులును, నారదాదులునుమాత్రమే పరమాద్భుతమగునాపురమును దెలిసికొనఁజాలుదురు. అంతర్భావవిశుద్ధులును, విశేషభక్తియుక్తులును, కేవలశివచింతాతత్పరులు నగువారందు నివసించి యుందురు. సూర్యాగ్నిసదృశతేజోమయం బగునాపురమధ్యమున మేరుశృంగసన్నిభంబును, దివారాత్రివిభాగవిహీనంబును, సర్వకామదంబును, కనకమయంబును, అసాధారణదర్శనీయంబును, నీలస్ఫటికప్రవాళచంద్రశిలాదిమణిభూషితంబు నగునొకప్రాసాదరాజము విరా

జ్వలించుచుండును. అగ్నిశిఖాసముజ్జ్వలంబగునానగరంబున సూర్యసమతేజోమయంబులగుధ్వజపటంబులు సుఖజనకంబులగువాయువులచే సవిలాసముగఁ జలించుచుండును. ఆదివ్యపురంబునందు సకలఋతులయందును బుష్పఫలసమంచితంబులగుకల్పతరులతలు కన్నులపండువుగా నుండును. సకలమహీధరంబులయందును మేరువుంబోలె, యఖిలలోకంబులకు నూర్ధ్వమునందున్న యీపురశ్రేష్ఠము సర్వోత్కృష్టంబై ప్రకాశించుచుండును. ఆపురంబున మహాభూతపరివృతుండును, పంచవింశతితత్త్వావృతుండును, విశ్వేశ్వరుండు సర్వదా దేవీసహితుండై నివసించియుండును. మఱియు, లక్ష్మియు, మేధయు, ధృతియు, శ్రీయు, కీర్తియు, సరస్వతియు, లోకమాతృకలును దివ్యరూపములం దాల్చియుమాదేవీసహితలై యందుఁ గ్రీడించుచుందురు. సకలదేవతలును గణేశ్వరులతోఁ గూడి యందు విహరించుచుందురు. ప్రమథగణాగ్రగణ్యులును, కుబ్జవామనరూపులును, కామరూపులును, మహావేషధారులును, పాశుపతవ్రతులు నగుగణనాథులందఱు నచ్చట నివసించియుందురు. మహాకాలేశ్వరుండందు విరాజిల్లుచుండును. ఆయుధపాణులగుచండీశ్వరగణేశ్వరులు ధ్యానతత్పరులై శివపార్శ్వంబునను, దివ్యరూపధారిణులును, యోగబలసమన్వితలును, ఖడ్గహస్తలు నగుజయావిజయులు దేవీపార్శ్వంబునను నిలిచియుందురు. కకుద్మంతుండును, మహానాదుండును, మహాత్ముండును, ఈశ్వరవాహనస్వరూపుఁడును, కామరూపుండును, ఘంటాశక్తిధరుండును, శ్రీమంతుండు నగుగోపతి పితృపార్శ్వమునం దుపవసించి యుండును. జగత్పతి యగుమహాదేవునిసూక్ష్మరథంబునందు దశసహస్రసూర్యతేజస్సంపన్నములగు కాంచనవర్ణశార్దూలసమూహమును, సింహసమూహమును విలసిల్లుచుండును. ప్రాజ్ఞులును, నిర్మలస్వభావులును, మహాయోగులును, తేజస్సంపన్నులును, నగుకోటికోటిరుద్రగ

కోంబు లరెదు నివసించి యుందురు. అందుఁ గాంచనమయంబును, దివ్యమణిచిత్రితంబును, రమణీయంబునగునుత్తమరథంబు శోభిల్లుచుండును. ఆదేవదేవునిదివ్యరథము యోగవహనశీలంబును, సర్వలోకసంచారక్షమంబును, రత్నభిత్తియుతంబునై విరాజిల్లుచుండును.

సాత్యవతేయా! ఈయుపాఖ్యానము సర్వాశుభవినాశకంబును, సత్యంబునైనది. యోగాశ్రయంబుచే సర్వభావముల సాత్మయందు సమర్పణంబు సేయువారును, నిరంతరశివచింతాతత్పరులు నగువారెందు మరణించినను దివ్యం బగునాపురంబును జేరి నిత్యనిర్మలులై యుందురు. మహేశ్వరభక్తులగువారందఱును శంకరాలయం బగునాపురంబున విహరించుచుందురు. సనకసనందనాదులును, పితామహుండగుబ్రహ్మయు, కపిలాదిసిద్ధులును, నరనారాయణులును, పంచశిఖాదులును, యాజ్ఞవల్క్యాదిమహర్షులు నందు నివసించి యుందురు. వారు ప్రళయకాలంబున నీశ్వరునియందుఁ బ్రవేశించి సృష్టికాలంబున మరల యథారూపమునఁ బ్రకాశించుచుందురు. మహాదేవునిదివ్యాలయంబుల దర్శించువారును, మంగళమయంబులగుమహాకాళేశ్వరగోకర్ణక్షేత్రలను, అవిముక్తమునం దోంకారేశ్వరుని, విశ్వేశ్వరుని, శ్రీపర్వతమునందలిమహేశ్వరుని, కారోహణంబున దేవేశ్వరుని, మహాకాలంబున శంకరుని, భద్రేశ్వరుని, మహాదేవుని, శబ్దకర్ణేశ్వరుని సేవించువారును మరణానంతరమున గిరిజావరునిదివ్యపురంబున నివసించి యుందురు. శివయోగావలంబులు, పాశుపతవ్రతులు, శివభక్తులు నగువారు శివపురవాసంబుచే గృతార్థులై నందీశ్వరకార్తికేయాదులతోఁ గలసి యోగావలంబనపరులై నిరంతరమును శంకరపార్శ్వంబున రుద్రరూపధరులై యుందురు. నేనిప్పుడు నీకుపదేశించిన పరమం బగుశివయోగమువలనఁ

బరమేశ్వరవిజ్ఞానంబు లభించి యాప్రభావముచే సకలదుఃఖవినాశంబును ముక్తిలాభంబును గలుగును. వ్యాసమునీంద్రా! యోగి యగువాఁడు జగదాధారుండు గావున సకలధర్మప్రవర్తకుండగుచున్నాఁడు. కావున నీవు జ్ఞానమూలంబున సకలసిద్ధులను గాంచి జగత్కారణతత్త్వవిషయంబున స్మృతిలాభంబు నంది స్థితిధర్మప్రబోధకం బగుపురాణరచనం గావింప గలవు. యజ్ఞాదికర్మప్రచారంబుకొఱకు నీవు స్వాయంభువంబును, ఏకంబు నగువేదమును ప్రబోధార్థమై చతుర్భాగములుగా విభజింపఁగలవు. ఇది యనిందితం బగువైవస్వతమన్వంతరము. ఇహలోకమునందు త్వత్కృతంబులగు శ్రుతిస్మృతిధర్మశాస్త్రములు స్థితికరంబులు గాఁగలవు. నీవు తీర్థకరుండ వయ్యెదవు. అనంతరము సర్వబంధముక్తుఁడవై పరమేశ్వరునియందు విలీనుండవయ్యెదవు.

అని సనత్కుమారుండు బోధించి వ్యాసమునీంద్రుని భస్మసంస్కృతునిం గావించి యనుగ్రహించెను. మహాతపుండగువ్యాసుండు ను సనత్కుమారునకుఁ బ్రణామంబు గావించి మహాతలాసీనుఁడై ప్రశ్నించుటయు సనత్కుమారుండు శివపురాణం బంతయు నాతని కెఱిఁగించెను. ఈశివపురాణము సకలాగమసంయుతంబును, సృష్టిమన్వంతరాదిప్రశంసాకలితంబును, శివయోగమయంబును, సర్వజ్ఞానాత్మవంబునై విరాజిల్లుచున్నది. మునులారా! మీరును శివప్రీత్యనుష్ఠానపరులై సకలయోగంబులనభ్యసించి యీశ్వరనిలయప్రాప్తిం గాంతురుగాక! మునిశ్రేష్ఠుండును, మహాతేజస్వియు నగువ్యాసుం డీశివయోగాభ్యాసముచేతనేసమస్తవేదతాత్పర్యమును గ్రహింపఁగలిగెను. ఈవ్యాసునివలననే సకలధర్మములును, యోగవిద్యలును బహిర్గతములైనవి. ఈశివపురాణము ప్రథమం బనియు, సర్వోత్తమంబనియు నందీశ్వరుండు ప్ర

శంసించి యున్నాఁడు. దీనిని సర్వంబును గ్రహించినవాఁడు సర్వజ్ఞుం డు గాఁగలఁడు. దీనివలనఁ ద్రివర్గప్రాప్తియు, ముక్తిలాభంబును, ఆ యుర్వృద్ధియు, యోగసిద్ధియుఁ, గాఁగలదు. సమస్తజగద్విద్యావిష యంబున నాదికర్త యగుమహాదేవునివలెనే సకలపురాణంబులలోనను నీశివపురాణము ప్రధానమైనది. ఈపురాణము నధ్యయనము సేయు వారు సకలక్లేశవిముక్తు లగుదురు. దీని నాకర్ణించువారు మహాదేవసా యుజ్యముం గాంచఁగలరు. ఈపురాణధారణానుశీలంబువలన యోగ సిద్ధియు, ముక్తిలాభంబును గలుగును. త్రిభువనశ్లాఘ్యంబులగుమహా దేవునిదివ్యస్తోత్రానువాదంబులచేతను, మహాదేవియగుభగవతిమహాప్ర భావకీర్తనంబులచేతను బరమంబగునీశివపురాణము పవిత్రమైనది. ఇది సర్వశాస్త్రసమ్మతమైనది. సకలదేవతలచేతను, భూదేవులచేతను, బ్ర హ్మాదులచేతను సంసేవితం బగు నీపురాణశ్రవణమువలన శివసాయుజ్య ము లభించును. సర్వభావంబులను శివార్పణంబులుగాఁ జేసి యీశ్వ రసేవాతత్పరు లగువారు సూర్యానలసమశరీరులును, త్రినయనులును, బాలచంద్రావతంసులునై మహాదేవానుచరశ్రేష్ఠులు గాఁగలరు. వారి కెట్టి యమంగళములును గలుగవు. వారుసకలశాస్త్రపారంగతులై నా నాగుణాలంకృతులై సర్వదామహానందముతోఁ గాలక్షేపము చేయు చుందురు. అనంతరము మహాలోకంబున వారుపరమయోగీంద్రులై య నంతస్వర్గసుఖభోగంబు లనుభవించుచుందురు. ప్రయత్నపూర్వకంబు గాఁ ద్రిపురహరుండగుమహాదేవుని దెలిసికొన్నవారు సకలపాపవిదూరు లై విముక్తులగుదురు. శుచియై పరమపవిత్రం బగునీపురాణమును బ ఠించువాఁడును, వినువాఁడును, దుర్లభమనోరథసిద్ధుఁడై యంతంబున నుత్తమం బగుశివపదముం గాంచఁగలుగును. శ్రాద్ధసమయములం దీ పురాణపఠనంబు గావించినచోఁ బితృదేవతలు సంతృప్తు లగుదురు. ఈ

పురాణపఠనముచే దుస్స్వప్నదోషములును, సకలకలికలుషంబులును నశించును. శ్రద్ధాభక్తియుక్తుండై మనఃపూర్వకంబుగా నీపురాణంబునందొక్కశ్లోకంబును గాని, శ్లోకార్థమునుగాని భఠించువానియెడల మహాదేవుండు సుప్రసన్నుండై యుండును.

శ్రీత్తై నమః.

శివపురాణము.

వాయవీయసంహిత.

పూర్వభాగము.

శ్రీగౌరీనిబిడకుచా
భోగలసత్కుంకుమాభిభూషితవక్షో
భాగు భవరూపచక్రిస
దాగమనోద్యోగు భోగు దలంతును భక్తిన్.

భగవానుండగు నుపమన్యుని ప్రసాదంబుచే నుపలబ్ధంబైన విషయము నంతయు జెప్పి మహాత్ముండు మధ్యాహ్నికార్చితుండై యున్న సమయమున వాయుదేవుండు నియమానుసారంబుగ లేచుటయు నైమిశారణ్యవాసు లెల్లరు నాతని నొకవిషయంబును గూర్చి యడిగి తెలిసికొనవలయు నని నిశ్చయించి నియమకర్తవ్యకర్మసమాపనాంతంబునఁ బూర్వవిధంబుననే మరల వచ్చి వాయుదేవుని పునరాగమనంబుకొఱకు నిరీక్షించుచుఁ గూర్చుండి యుండిరి. అవ్వాడంబరోద్భవుం డగు ననిలదేవుండు నియమకృత్యములం దీర్చుకొని యచటకు వచ్చి మునిసమాజ

మధ్యంబున నర్ఘాసనాసీనుం డయ్యెను. సర్వలోకనమస్కృతుం డగు వాయుదేవుం డట్లు సుఖాసనోపవిష్టుండై మహేశ్వరవిభూతిమాహాత్మ్యంబును ధ్యానించుచుండగా నాతనివదనకమలమునుండి "అపరాజితుండును, సర్వజ్ఞుండు నగునామహాదేవుని నేను భజించెదను. చరాచరంబగు నీసమస్తప్రపంచమును నాతనివిభూతియే" అనువాక్యములు వెలువడియెను. ఆశుభవాక్యముల నాకర్ణించినంతనే సకలర్షులకును బాపక్షయం బయ్యెను. అప్పుడు వారందఱు నవ్విభూతింగూర్చి సవిస్తరంబుగాఁ దెలిసికొనఁగోరి సారవంతంబులగు వాక్యములతో నిట్లనిరి. మహాత్మా! అక్లిష్టకర్ముండును, వాసుదేవుండు నగుకృష్ణుండు ధౌమ్యాగ్రజుం డగునుపమన్యునిచేఁ బాశుపతవ్రతదీక్షితుండై పరమజ్ఞానలాభంబు నందినట్లు పూర్వము విని యుంటిమి. ఆకృష్ణునకుఁ బాశుపతజ్ఞాన మెట్లు సిద్ధించెనో సవిస్తరంబుగా వినఁగోరెదము.

అని ప్రార్థించుటయు వాయుదేవుం డిట్లు చెప్పందొడంగెను. సనాతనుం డగువాసుదేవుండు స్వేచ్ఛా[illegible] నవతరించి దుఃఖమయం బగుమానుషత్వమునందు విరక్తుండై మునిశ్రేష్ఠుం డగునుపమన్యునికడకుం బోయి జటాసమా[illegible]ను, రుద్రాక్షమాలికావిభూషితసర్వాంగుండును, వివిధశాస్త్ర[illegible] బగువేదంబునుం బోలి శిష్యగణపరివృతుండై యున్నవాఁడును, శాంతస్వభావుండును, శివధ్యానరతుండును మహాతేజుండు నగు నమ్మునిశ్రేష్ఠుని సందర్శించి పులకీకృతసర్వాంగుఁడై యమ్మహర్షిశేఖరునకుఁ బ్రదక్షిణనమస్కారంబులఁ గావించెను. ఆమౌనిసత్తముని సందర్శనమాత్రముచేతనే శ్రీకృష్ణునిసకలదోషములును వినష్టంబులై పోయెను. అప్పుడుపమన్యుండు నిర్మలుం డగుశ్రీకృష్ణునిం గాంచి యథాక్రమంబుగా "అగ్నిః" ఇత్యాదిమంత్రోచ్చారణపూర్వకంబుగా నాతని సర్వశరీ

రంబును భస్మవిలిప్తంబు గావించి ద్వాదశమాసవ్యాప్తం బగుపాశుపత వ్రతంబు ననుష్ఠింపఁజేసి సర్వశ్రేష్ఠం బగుపాశుపతజ్ఞానంబును బ్రసాదించెను.

అది మొదలుగాఁ బ్రశంసితవ్రతు లగుమహర్షు లందఱును పాశుపతవ్రతావలంబులై కృష్ణుని బరివేష్టించి యుపాసింప నారంభించిరి. అప్పుడు పరమశక్తిమంతుం డగుకృష్ణుండు గురునిచే నియోగింపఁబడి పుత్త్రార్థమై యంబాసహితుఁ డగుశంకరు నుద్దేశించి తపంబు గావించెను. ఆతపఃప్రభావముచే నాతఁడు వర్షాంతంబున దేవీసహితుండును, ప్రమథగణపరివృతుండు నగుశంకరుని సాక్షాత్కరింపఁజేసికొని యాదేవునను గ్రహంబుచేఁ బుత్త్రలాభముం గాంచెను. భగవానుఁ డగుశివుం డంబికాసహితుఁడై వచ్చి పుత్త్రదానముం గావించుటచేఁ గృష్ణుండు జాంబవతీగర్భజాతుం డగుప్రథమపుత్త్రునకు సాంబుఁడని నామకరణముం గావించెను.

విద్యావతారకథనము.

పురాణము, ధర్మశాస్త్రము, చతుర్వేదములు, షడంగములు, [illegible]యశాస్త్రము ననునివి చతుర్దశవిద్యలు. వీనితో [illegible]కమును, గాంధర్వమును, అర్థశాస్త్రమును [illegible]. భిన్నభిన్నమార్గప్రవర్తకంబు లగునీ [illegible] కాలపాశియే యని వేద[illegible]. [illegible] బ్రహ్మాండనాయకుఁ డగుమహాదేవుఁ డీ [illegible]ముతో ముందుగా సనాతనుండగుబ్రహ్మదేవుని బుత్త్రరూపంబున సృజియించి విశ్వయోని యగునాతనికి విశ్వ విశ్వసృష్టినిమిత్తంబుగా నీయష్టాదశవిద్యలను బ్రసాదించెను. సృష్టికర్త యగుబ్రహ్మ యట్లు విద్యాలాభంబు నంది మొట్టమొదటఁ బురాణము

ను స్మరించెను. అనంతరమాతనిముఖంబులనుండి సకలవేదంబులును బహిర్గతంబు లయ్యెను. వేదానంతరము సకలశాస్త్రంబులు నుదయించెను. అనంతంబులగునీశాస్త్రంబుల నధ్యయనంబు గావించుటకుఁ బృథ్వియందలిప్రజలందఱు నసమర్థులగుటయు ద్వాపరయుగాంతంబున నీసకలశాస్త్రంబులును సంక్షేపంబు చేయుటకై యీశ్వరాదేశంబున సర్వమయుం డగువిష్ణుదేవుండు సత్యవతీగర్భంబున నరణియం దగ్నిదేవుండునుంబోలి వ్యాసరూపంబున నవతరించెను. ఆవేదవ్యాసుండు తన మతియను మంథానదండముతో వేదసముద్రమును మథించి దానినుండి ప్రకాశమానం బగుమహాభారత మనుచంద్రమండలము నుదయింపఁ జేసెను. మఱియు నాతఁడు వేదసమూహమును సంక్షేపముగఁ జేసి చతుర్భాగములుగా విభజించెను. అందుచేతనే యాతనికి వేదవ్యాసుఁ డనునామము గలిగెను. ఆతఁడు పురాణముల నన్నిటిని నాలుగులక్ష శ్లోకములుగా సంక్షేపించెను. దేవలోకమునం దిప్పటికిని బురాణములు శతకోటిశ్లోకపరిమితములై యున్నవి. వేదములు వేదాంగములు, ఉపనిషత్తులునుగూడ నధ్యయనము గావించినను బురాణజ్ఞానము లభింపకున్నచో విచక్షణులు గాఁజాలరు. ఇతిహాసపురాణములచే వేదమును బరిపుష్టినందింపవలయును. అల్పజ్ఞాను లగువారు నన్నుల్లంఘింతురని వేదము సర్వదా భయపడుచుండును. సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, వంశానుచరితము నని పురాణము పంచలక్షణములు గలది. బ్రాహ్మము, పాద్మము, వైష్ణవము, శైవము, భాగవతము, భవిష్యము, నారదీయము, మార్కండేయము, ఆగ్నేయము, బ్రహ్మవైవర్తము, లైంగము, వారాహము, స్కాందము, వామనము, కౌర్మము, మాత్స్యము; గారుడము, బ్రహ్మాండము నని పురాణములు పదునెనిమిది.

అందుఁ జతుర్థం బగుశివపురాణమునందు శివమాహాత్మ్యము వర్ణితమై యుండును. దేవలోకమునందు దీనిమూలగ్రంథము లక్షశ్లోకములచేతను, ద్వాదశసంహితలచేతను విరాజిల్లుచున్నది. ధర్మప్రతిష్ఠితం బగునీపురాణము స్వయముగా నీశ్వరునిచేఁ గథితంబైనది. వర్ణత్రయమునందును సముత్పన్ను లగుశివభక్తు లీశివోక్తధర్మానుష్ఠానంబుచే నొకజన్మమునందే శివప్రసాదంబున ముక్తిలాభంబు నందుదురు. కావున మోక్షంబు గోరువారు శివు నాశ్రయింపవలయును. దేవతలకుఁగూడ శివాశ్రయంబునఁగాని ముక్తి లభింపదు. వేదతుల్యం బగునీశివపురాణము విద్యేశ్వరసంహిత, రౌద్రసంహిత, వినాయకసంహిత, ఉమాసంహిత, మాతృకాసంహిత, ఏకాదశరుద్రసంహిత, కైలాససంహిత, శతరుద్రసంహిత, కోటిరుద్రసంహిత, సహస్రకోటిరుద్రసంహిత, వాయవీయసంహిత, ధర్మసంహిత యని ద్వాదశసంహితలుగా విభక్తమై యున్నది. అందు విద్యేశ్వరసంహిత దశసహస్రశ్లోకపరిమితము. ప్రత్యేకముగ రౌద్ర, వైనాయ, కోమా, మాతృకాసంహిత లష్టసహస్రశ్లోకసంకలితములు. ఏకాదశరుద్రసంహితత్రయోదశసహస్రశ్లోకసమన్వితము. కైలాససంహిత షట్సహస్రశ్లోకభూయిష్ఠము, శతరుద్ర, కోటిరుద్ర, సహస్రకోటిరుద్రసంహితలు ప్రత్యేకముగ దశసహస్రశ్లోకసంపన్నములు. వాయవీయసంహిత చతుస్సహస్రశ్లోకవిలసితమును, ధర్మసంహిత పంచసహస్రశ్లోకవిరాజితమునై యీవిధముగా శివపురాణము లక్షశ్లోకములచే శోభిల్లుచున్నది. చతుస్సహస్రపరిమిత మగువాయవీయసంహిత రెండుభాగములై యున్నది. ఉత్తమం బగునీశాస్త్రము వేదజ్ఞానవిహీనునకు బోధింపరాదు. శ్రద్ధావిహీనులకును, బురాణజ్ఞానవిహీనులకును దీనింగూర్చి చెప్పరాదు. సర్వవిధములఁ బరీక్షితుండును, అనసూయుండును, ధార్మికుండును, శివభక్తుండు నగుశిష్యునకీశివపురా

ణాము నుపదేశించవలయును. ఎవ్వనిమూలమున మఱికిసకలపురాణసంహితలును లభించినవో యట్టి యమితతేజుండును, భగవానుండు నగు వేదవ్యాసునకు నమస్కారము.

—♦ బ్రహ్మసందర్శనము. ♦—

సూతుండిట్లనియెను. మహర్షిశేఖరులారా! పూర్వము మహత్తరంబగు కాలగతిచే ననేకకల్పంబులు మరలమరలఁ గడచినతరువాతఁ బ్రస్తుతోపస్థితంబగు శ్వేతవరాహకల్పంబున మరల సృష్టిప్రవృత్తి యగుటయు జగత్కార్యంబులు యథారూపముగఁ బ్రవర్తిల్లుచుండెను. అప్పుడు ప్రజలందఱును బ్రబుద్ధులై యుండఁగా షట్కులీయులగుమునీంద్రులకుఁ బరస్పరమును "ఇదిబ్రహ్మతత్త్వము; ఇది కాదు" అనువిషయమునుగూర్చి మహత్తర మగువివాదము గలిగెను. కాని బ్రహ్మతత్త్వము దుర్నిరూప్యం బగుటచే నెంతకును విషయనిశ్చయము కాకపోయెను. అప్పుడమ్మునులందఱును సకలదేవతాపూజితుండై యుండు బ్రహ్మదేవుని సందర్శించుటకై బ్రహ్మలోకమునకుఁ బ్రయాణమైరి. దేవదానవసంకులంబును, సిద్ధచారణగణవిలసితంబును, యక్షగంధర్వసేవితంబును, బహువిహంగకలకూజితంబును, మణివిద్రుమవిభూషితంబును, నికుంజకందరదరీనిర్ఝరాభిశోభితంబును, పతిరమణీయంబును, శుభదర్శనీయంబును నగుసుమేరుశృంగంబున నానాపశుసమాకీర్ణంబును, దశయోజనవిస్తీర్ణంబును, దశయోజనాయతంబును నగుబ్రహ్మవనంబు గలదు. అందలిసరోవరము లతిరమణీయములై నిర్మలస్వాదుజలపూర్ణములై యుండును. అందలితరులతాదులు భృంగనిస్వనంబులచే విలసిల్లుపుష్పమంజరులచే నలంకృతములై యుండును. ఆవనమధ్యంబున దైత్యదానవుల కగమ్యంబును, సూర్యతేజోమయంబు నగునొకనగరంబు గలదు. ఆనగరంబు సముద్ర[illegible]కాంతితో నొప్పు మంచి

ంబును, జాంబూనదమయంబును నై, ప్రశస్తరాజమార్గంబులచేతను, నగరతలంబు నొప్పుచుండు మణిమయసౌధశిఖరంబులచేతను శోభి ల్లుచుండును. అందు సాధ్యగణసహితుం డగుబ్రహ్మదేవుండు నివసిం చియుండును.

మహర్షులందఱు సత్యలోకంబు బోయి దేవర్షిగణసేవితుండును, సా క్షాల్లోకపితామహుండును, స్వర్ణసన్నిభుండును, సకలాభరణవిభూషితుం డును, ప్రసన్నవదనుండును, పద్మపత్రవిశాలలోచనుండును, పరమద ర్శనీయుండును, దివ్యగంధానులిప్తుండును, దివ్యశ్వేతవస్త్రాలంకృతుండు ను, దివ్యమాల్యవిభూషితుండును, దివిజమునివందితపాదారవిందుండు ను, దివాకరసదృశప్రభాసంపన్నుండును, దివ్యలక్షణలక్షితుండును, దే వీసహితుండు నగుబ్రహ్మదేవుని సందర్శించి హర్షోత్ఫుల్లనయనులై నిట లతటంబుల నంజలులు ఘటించి సురశ్రేష్ఠుండగునాతని నిట్లని నుతింపం దొడంగిరి.

మహాత్మా! సృష్టిస్థితిలయంబులకుం గారణభూతుండవు, పురాణ పురుషుండవు, పరమాత్మవు, బ్రహ్మవు, ప్రధానదేహుండవు, ప్రధాన క్షోభకారివి, త్రయోవింశతితత్త్వభేదంబులచే వికృతుండవు, అవికారుం డవు నగు నీకు నమస్కారము. ఈబ్రహ్మాండమంతయు నీయందే యు త్పన్నమైనది. నీవీబ్రహ్మాండమధ్యమునందు సుస్థిరుండవై యున్నా వు. నీవు సంసిద్ధకార్యస్వరూపుండవు. కార్యసిద్ధికిం గారణుండవు. అట్టి నీకు నమస్కారము. సర్వలోకస్వరూపా! సర్వలోకవిధాతా! సర్వా త్మా! సర్వదేహాత్మసంయోగవియోగకారణా! నీకు నమస్కారము. నీవీసకలజగంబులను సృజించితివి. నీవే పాలించుచుంటివి. మరల నీవే సంహరింపుచుందువు. దేవా! సమాచారమయం బగు మోహినీశక్తి

నెఱుంగుటకు మేమెంతవారము? సర్వలోకపితామహా! నీకు నమస్కారము.

అని యిట్లు మునివరులు వినుతించుటయు బ్రహ్మదేవుండు సంతుష్టుండై ప్రియమధురగంభీరస్వరంబున నోమహాభాగు లగుమునీంద్రులారా! మీరందఱునుగలసి యిట్లు విచ్చేయుటకుఁ గారణ మేమి? అని ప్రశ్నించుటయు నమ్మహర్షులు వినయవినమితులై భక్తిపూర్వకంబుగ నిట్లు విన్నపంబు సేయందొడంగిరి. మహాత్మా! మేమతిఘోరం బగు నజ్ఞానాంధకారముచే నావృతులమై యున్నాము. మేముపరస్పరమును వాదోపవాదములచే నెంత శ్రమపడినను బరతత్త్వమును గ్రహింపఁజాలకుంటిమి. నీవు సకలజగద్విధాతవును, సర్వకారణుఁడవు నై యుంటివి. ఓలోకనాథా! ఈజగంబునందు నీయెఱుంగనితత్త్వంబేదియును లేదు. ఏపురుషుఁడు సకలజీవులకంటెను బ్రాచీనుండును, విశుద్ధుండును, బరిపూర్ణుండును, నిత్యుండును, బరమేశ్వరుండును, బరమపురుషుండు నై యుండెనో, యెవ్వనిచిత్రకృత్యంబుచేఁ బ్రప్రథమమందీజగంబు సృజింపఁబడియెనో, తుద కిది యంతయు నెవ్వనియందు లయంబు గాంచునో, సర్వభూతంబు లెవ్వనికి వశ్యములై యుండునో, సర్వనియంత యెవ్వఁడో, యట్టిపరమపురుషుం డగునీశ్వరుని సందర్శించుటకు మేమెట్లు సమర్థుల మగుదుమో దయయుంచి యానతీయవలయును.

—♦ బ్రహ్మప్రబోధము. ♦—

బ్రహ్మదేవుం డిట్లు ప్రార్థితుండై విస్మయస్మేరవీక్షణంబులతో దేవదానవమునిసన్నిధానంబున లేచి నిలువఁబడి చాలసేపటివఱకును ధ్యానించి రుద్రశబ్దము నుచ్చరించుచు నానందపులకితగాత్రుండును, కృతాంజలిపుటుండు నై యిట్లు చెప్పందొడంగెను. మహాభాగులారా! ఎవ్వఁడు వాఙ్మనంబుల కగోచరుఁడో, యెవ్వనిధ్యానానంద మితర

భయాతీత మైనదో, యెవ్వనినుండి బ్రహ్మవిష్ణురుద్రేంద్రపూర్వకం బగునీసమస్తమును, సర్వభూతేంద్రియసహితముగాఁ బ్రప్రథమమునం దుదయించెనో, యెవ్వఁడు కారణంబులకు విధాతయు, ధ్యాతయుఁ, బరమకారణుండు నై యుండెనో, యెవ్వఁ డేవస్తువునుండియు నెన్నఁడు నుదయింపకుండునో, యెవ్వఁడు సర్వైశ్వర్యసంపన్నుఁడై సర్వేశ్వరనామంబున విలసిల్లుచుండునో, మోక్షార్థులగువా రెల్లరు నెవ్వని ధ్యానించుచుందురో, యెవ్వఁ డాకాశమధ్యగతుండును, శంభుండు నై యుండునో, యెవ్వఁడు ప్రథమంబున నన్నుఁ బుత్త్రునిగా సృజించి నాకుఁ దత్త్వజ్ఞానమును బ్రసాదించెనో,యెవ్వనియనుగ్రహంబుచే నేనుప్రాజాపత్యపదలాభము గాంచితినో, యెవ్వం డీశ్వరుండును, నద్వితీయుండును, భూరుహముంబోలి యచలుండును, గగనస్థితుండు నై యుండునో, యేమహాపురుషునిచే నీయఖిలజగంబును బరిపూర్ణమై యుండునో, యెవ్వఁ డేకాకి యయ్యును గ్రియాశూన్యులగు బహుప్రాణులకు సత్క్రియాసంపాదకుఁడై యుండునో, యెవ్వం డొక్కఁడయ్యును బహుబీజంబులను సృష్టించుచుండునో యాతఁడే పరమేశ్వరుఁడు. అప్రతిహతశాలి యగునాతఁడు సకలజీవసహితం బగుబ్రహ్మాండమం దంతట నధిష్ఠించి యుండును. ఆతఁ డొక్కఁడే భగవంతుఁడు. ఆతనికం టె ద్వితీయు లెవ్వరును లేరు. ఆతఁడు సర్వదా జీవహృదయంబుల నెలకొని యున్నను నగోచరుఁడై యుండును. మఱియుఁ దా నప్రకాశుఁడై, సకలజగంబులను బ్రకాశింపఁజేయుచు జగదధిష్ఠితుఁడై యుండును.అనంతశక్తి యగునాతఁడు కాలాత్మయుక్తంబు లగుసకలకారణంబుల నధిష్ఠించి యుండును. జగంబంతయు నంధకారావృతమై దివారాత్రివిభేదంబు లేక సదసద్వస్తువిహీనంబై యున్నసమయంబునఁ గేవలము సర్వమంగళమయుం డగు నాపరమేశ్వరుఁ డొక్కఁడే విరాజిల్లు

చుండును. ఆతనినుండియే ప్రజ్ఞ యుదయించెను. సత్యోత్తముండును, సర్వోత్కృష్టుండును, నిర్గుణుండును, గుణమయుండును, నిష్కలుండును, మంగళమయుండు నగునీశ్వరుఁ డాతఁడే. కార్యకరణంబులు నాతనితో సమానులుగాని, యీతనికంటె నధికులుగాని యెవ్వరును లేరు. ఆతనిశక్తి స్వభావముచేతనే సర్వోత్కృష్టమైనది. ఆతనిజ్ఞానక్రియలు నిత్యములైనవి. అవ్యక్తంబగుక్షరంబును, అమృతంబగునక్షరంబునుగూడ నక్షరాత్మకంబులై యేకాత్మకంబులై యేకాత్ముండగు నా పరమేశ్వరునందే వివర్తంబులై యున్నవి. ఆపరమేశ్వరధ్యానయోజనంబులచేతను దత్త్వచింతనంబుచేతను మాయ శక్తియుక్తంబగును. ఆదేవుని యెదుట విద్యుల్లతలు మెఱయఁజాలవు. సూర్యచంద్రులు ప్రకాశింపఁజాలరు. ఆతనితేజఃకిరణములచేతనే సచరాచరంబగుజగంబంతయుఁ బ్రకాశించు నని శ్రుతులు చెప్పుచున్నవి. ఆమహాదేవుం డొక్కఁడే మహేశ్వరుం డని యెఱుంగునది. ఆతనిపరమపదంబుకంటె నుత్తమపదంబు లేవియును లేవు. ఆతఁడే సర్వంబునకుఁ బ్రథముఁడు. కాని యాతని కాద్యంతములు లేవు. ఆతఁడు సహజనిర్మలుండును, స్వతంత్రుఁడును, బరిపూర్ణుఁడు నై యుండును. ఈచరాచరవిశ్వంబంతయు నాతనియిచ్ఛాధీన మైనది. ఆతనిదేహ మప్రాకృత మైనది. ఆతఁడు లక్ష్యలక్షణశూన్యుఁడు. ఆతఁ డముక్తుఁ డయ్యును ముక్తికారకుఁడు; కాలసంబంధము లేనివాఁ డయ్యు నాతఁడు కాలప్రేరకుఁడు. ఆతఁడు సకలంబునకు నూర్ధ్వస్థితుండై యుండును. ఆసర్వజ్ఞునియందే సకలంబును నిలిచియున్నది. షడధ్వమయుం డగునాతఁడు సర్వజగన్నాథుఁడు. ఉన్నతోన్నతుం డగునాతనికంటె నున్నతు లెవ్వరును లేరు. అనంతమహిమాధారుం డగునాతనివైభవ మపరిచ్ఛిన్నమైనది. సకలేంద్రియంబులయందును శుద్ధబుద్ధిప్రవర్ధకుం డగునాతఁ డాత్మశ

స్వామృతాస్వాదనరసికుం డగుచిరయావనుఁడు. అనంతానందనిష్యంద మకరందపానమధువ్రతుం డగునాతఁ డఖండజగదండములను బిండీకరించుటయందుఁ బండితుఁడు. ఔదార్యవీర్యగాంభీర్యమాధుర్యసముద్రుఁ డగునాతనితో సమానమగువస్తు వేదియును లేదు. రాజరాజేంద్రుఁ డగు నాతనితో నుపమింపఁదగినవా రెవ్వరును లేరు. ఆచిత్రకారునిచే తనే ప్రథమంబున నీజగంబు సృజింపఁబడియెను. అంతకాలంబున నిది మరల నాతనియందే విలీనంబు గాఁగలదు. సర్వనియోజకుం డగునాతనికి సకలభూతములు వశ్యములై యుండును. ఆతని సందర్శించుటకు భక్తికంటె నన్యోపాయంబు లేదు. ఆతనియందు భక్తిని వృద్ధిఁజేయుటకే పండితులచే వ్రతంబులును, వివిధంబు లగుదానములును, దపంబులును, నియమములును గల్పింపఁబడియెను. నేనును, విష్ణుదేవుండును, రుద్రుండును, సకలసురాసురగణంబులునుగూడ నాతనిసందర్శనంబుకొఱకు మహోగ్రం బగుతపంబు నిప్పటికి నాచరించుచున్నారము. దుర్జనులు, మూర్ఖులు, పతితులు, నింద్యచరిత్రులు నగువారి కాతఁ డగోచరుం డైనను భక్తులగువారికి నిరంతరమును బహిరంతర్దర్శనీయుండును, బూజ్యుండు నై యుండును.

స్థూలంబును, సూక్ష్మంబును, దదుభయాతిరిక్తంబు నని యాతనిస్వరూపము త్రివిధంబు. అస్మదాదులగు నమరులందఱును స్థూలరూపమును దర్శింపఁగలుగుదురు. యోగిగణంబుల కాతనిసూక్ష్మమూర్తి గోచరం బగును. తృతీయమూర్తి నిత్యమును, జ్ఞానానందమయంబును, నవ్యయము నైనది. తదేకనిష్ఠులును, దదేకతత్పరులు తద్వ్రతానుష్ఠాననిరతులు నగుభక్తులుమాత్రమే దానిని దర్శింపఁగలరు. అది గుహ్యాతిగుహ్యంబైనది. శివభక్తుండగువాఁడు నిశ్చయముగా భక్తిప్రభావముచే విముక్తుం డగును. అంకురమునుండి బీజమును, బీజమునుండి

యంకురంబునుంబోలి శివప్రసాదముచే భక్తియు, భక్తిచేశివప్రసాదం బును గలుగుచుండును. ఈశ్వరానుగ్రహప్రభావముచేతనేజీవునకు స ర్వత్రసిద్ధిలాభం బగును. సర్వవిధసాధనంబులచేఁ దుదకు శివుండును వశీభూతుం డగును. ధర్మమే యీశ్వరప్రసాదసాధనము. అది వేద ప్రదర్శితమైనది. వేదాభ్యాసవశంబుననే పూర్వజన్మార్జిత పుణ్యపాపం బులకు సామ్యంబును, దానివలన శివప్రసాదసంపర్కమును, దానివల న ధర్మాతిశయంబును గలుగును. ధర్మాభివృద్ధివలన జీవునకుఁ బాప క్షయం బగును. క్షీణపాపుఁడగుజీవునకుబహుజన్మపరంపరలచేఁ గ్రమ ముగా దేవీసహితుఁడగుసర్వేశ్వరునందు జ్ఞానపూర్వకమగు భక్తి యు దయించును. జీవుండు పరమేశ్వరు నెట్లు భావించునో తదనురూపంబ గునీశ్వరప్రసాద మాతనికి లభించును. శివప్రసాదమువలనఁ గర్మఫల నివృత్తి యగును. కర్మఫలంబులయందు స్పృహాశూన్యుండగువాఁడు శివధర్మపరిగ్రహంబున కర్హుం డగును.

గురూపదేశసహితము, గురూపదేశరహితము నని శివధర్మపరి గ్రహణము ద్వివిధంబు. అందు గురురహితంబగుదానికంటె గురుస హితమైనదియే శతగుణాధికంబు. శివధర్మపరిగ్రహం బైనంతనే శివ జ్ఞానోత్పత్తి యగును. శివజ్ఞానోదయమైనంతనే మానవునకు సంసార దోషజ్ఞానంబును, గ్రమముగా విషయవైరాగ్యంబును గలుగును. ఆ వైరాగ్యమువలన నీశ్వరవిచారమును, దానివలనఁ గర్మపరిత్యాగంబు ను, ధ్యానాసక్తియు నగును. జ్ఞానధ్యానయుక్తుం డగుపురుషునకు యో గంబును, యోగముచే నుత్తమంబగుభక్తియు, భక్తివలననీశ్వరప్రసా దమును సిద్ధించును. ఆశివప్రసాదముచేముక్తి గలుగును. ముక్తుండ గుజీవుఁడు శివతుల్యుండగును. ఈయనుగ్రహప్రసారమునకుఁ గ్రమం బగునెట్టినియమమును లేదు. ఏపురుషున కెట్టియోగ్యత గలదో యా

రేఁ దృష్టియనుగ్రహమును బడయుచుండును. కొందఱుగర్భావస్థయం
దును, గొందఱు జననానంతరమునను, గొందఱు బాల్యంబునను, గొం
దఱు తారుణ్యంబునను, గొందఱు వార్ధకంబునను, ముక్తులగుచుందు
రు. కొందఱు తిర్యగ్యోనిగతులై ముక్తిఁ గాంతురు. కొందఱు నరకప
తితులై ముక్తు లగుదురు. స్వకర్మబలంబున నున్నతపదప్రాప్తులై త
త్పదక్షయానంతరంబునఁ గొందఱును, అట్లు పదక్షయం బైనపిమ్మట
మరల జన్మగ్రహణంబు గావించి కొందఱును, ఊర్ధ్వగతులై యచ్చట
నే సుస్థిరులై యుండి కొందఱును, ముక్తు లగుచుందురు. కావున మా
నవులకు ముక్తి యేకవిధమైనది గాదు. వారివారిజ్ఞానభక్తుల ననురూ
పంబగుప్రసాదబలముచే ముక్తిలాభం బగుచుండును. కావునఁ దత్ప్ర
సాదార్థమైవాఙ్మనోదోషశూన్యులై దారపుత్రాగ్నిసహితముగా నేక
మాత్రశివారాధనతత్పరులు గావలయును. మఱియు, శివనిష్ఠులును,
శివపరులును, శివధ్యానయుతులును, శివాశ్రితులునై తదేకచిత్తంబున
సకలకార్యంబుల ననుష్ఠించుచుండవలయును.

వాయుదేవుఁ డిప్పుడు దేవతలచే సహస్రవర్షంబగునొకయజ్ఞ
మును బ్రారంభింపఁజేసి యున్నాఁడు. ఆయజ్ఞావసానమునం దాతఁడు
మంత్రప్రభావముచే నైమిశారణ్యమునకు వచ్చి మీకు శ్రేయోపా
యము నుపదేశింపఁగలఁడు. అనంతరముమీరు దేవదేవీనివాసంబును,
బరమశోభనంబును, బవిత్రంబు నగు వారాణసీక్షేత్రమును సేవింపుఁ
డు. ఆస్థానమునందు శ్రీమంతుఁ డగుమహాదేవుఁడు భక్తాభీష్టదాయకుఁ
డై విహరించుచుండును. మీరచ్చట జరుగువిచిత్రసంఘటనముల న
న్నిటి నవలోకించి మరల నాయొద్దకు రావలయును. అప్పుడు నేనుమీ
కేకజన్మమునందే ముక్తి కరతలామలకం బగునట్టియుపాయమును జూ

ధించెదను. నేనిప్పుడు నాచేఁ గల్పితంబగునీమనోమయచక్రమును వి
సర్జించెదను. దీనికడకమ్మియెచ్చటి విశీర్ణంబై పడిపోవునో యాస్థల
ము మీతపస్సాధనంబున కుత్తమంబైనది.

అని చెప్పి పితామహుం డగుబ్రహ్మదేవుండు సూర్యతేజోమ
యంబగుచక్రమును గైకొని మహాదేవునకుఁ బ్రమాణంబు గావించి
దానినివిసర్జించెను. అప్పుడు మునులందఱును బ్రహృష్టాంతఃకరణు
లై జగత్ప్రభుండగువనజాసనునకు నమస్కరించి యాచక్రనేమి యెచ్చ
ట విశీర్ణం బగునో యాస్థానమును దర్శించుటకై బయలుదేఱిరి.ఆచక్ర
ము పోయిపోయి స్వాదుజలపరిపూర్ణంబును, విమలంబు నగునొకవనం
బునఁ జారుశిలాతలంబుపైఁ బడిపోయెను. ఆకారణముచే సకలమునిజన
పూజితంబగునావనంబునకు నైమిశారణ్యం బనుపేరు గలిగెను. అది
బహుసంఖ్యాయుతగంధర్వవిద్యాధరపరిపూర్ణంబును, పవిత్రమునై యుం
డెను. పూర్వకాలంబునఁ బురూరవుండనునృపాలుండష్టాదశసముద్ర
ద్వీపంబులనేలుచు దైవవశంబున నూర్వశీవిలాసమునకు వశీభూతుండై
పోవుచు నక్రమంబుగా మునీంద్రుల స్వర్ణయజ్ఞశాల నపహరించెను.
అందుచే మునులందఱును గోపించి కుశవజ్రప్రయోగంబుచే నాతని
నచ్చటనే నిహతుం గావించిరి. విశ్వసృష్టిసంకల్పులును, బ్రహ్మజ్ఞు
లును, గార్హపత్యాశ్రమకలితులు నగుప్రజాపతులు పూర్వమం దచ్చ
ట దివ్యయజ్ఞారంభముం గావించిరి. ఆనైమిశంబున శబ్దార్థన్యాయకో
విదులును, శక్తిప్రజ్ఞక్రియాయోగులును నగుమహర్షులచే ననేకసత్కా
ర్యము లనుష్ఠితంబు లయ్యె. అచ్చటనే వేదవిదులగుపండితులు వేద
వాదబహిష్కృతులగుప్రతివాదులను విజితులం గావించుచుండిరి. ఆ
నైమిశారణ్యము స్ఫటికమయపర్వతపాదజాతంబు లగుశిలలనుండి ప్ర
వహించుచుండునమ్లానస్వాదుజలధారలచేతను, మధురఫలభరితంబులగు

తరువరంబులచేతను రమణీయమై, హింస్రజంతువిహీనమై, మునిజనతపోయోగ్యంబై విరాజిల్లుచున్నది.

— అ ని లా గ మ న ము. —

సూతుం డిట్లనియెను. ఆనైమిశంబునఁ బ్రశంసితవ్రతులును, మహాభాగులు నగుమునిగణంబులు మహాదేవు నర్చించుచు యజ్ఞారంభముం గావించిరి. విశ్వసృష్టిప్రవృత్తు లగుప్రజాపతులు పూర్వకాలమునందు యజ్ఞపరిసమాప్తి గావించినట్లే మహర్షులందఱు సత్యాశ్చర్యకరంబుగా నమ్మఖంబును భూరిదక్షిణలతో సంపన్నంబు గావించినకొంతకాలమునకు బ్రహ్మనియోగంబున వాయుదేవుండు స్వయముగా నచ్చటికి విచ్చేసెను. బ్రహ్మశిష్యుండును, జితేంద్రియుండును, సర్వంబును బ్రత్యక్షముగ దర్శించువాఁడును, నలువదితొమ్మిదివాయువులను దనయాజ్ఞలలో మెలఁగించువాఁడును, ప్రాణాదివాయుప్రవృత్తులచే నిత్యమును నవయవసంచాలనంబు గావించుచు జీవులశరీరధారణంబునకాధారుండై యున్నవాఁడును, అణిమాద్యష్టైశ్వర్యసమన్వితుండును, సకలభువనధరుండును, గగనసంభూతుండును, శబ్దస్పర్శగుణకలితుండును, తేజఃప్రకృతి యని తత్త్వవేత్తలచేఁ బ్రశంసితుండును నగువాయుదేవుం డట్లాశ్రమంబున కేతెంచుటయు దీక్షానతు లగునమ్మును లందఱును బ్రహ్మదేవుని పూర్వవాక్యంబులను దలంచుకొని పరమానందముతో నెదురేఁగి ప్రణామపూర్వకంబుగా నాతనిం దోడ్తెచ్చి సువర్ణపీఠంబున నాసీనుం గావించిరి. అనిలదేవుం డట్లు మునులచే నభ్యర్చితుండై యగ్న్యాసనంబున నుపవసించి యందఱ నభినందించుచు మునిశేఖరులారా! మహాయజ్ఞారంభంబు గావించినప్పటినుండియు సర్వవిషయంబుల మీ కెల్లరకును గుశలంబే కద! యజ్ఞవిఘాతుకులగు దైత్యులవలన మీ కెట్టిబాధలును గలుగలేదుగద! ప్రాయశ్చిత్తంబును, ననిష్టం

బును గలుగకుండ సకలక్రియలును సక్రమంబుగ నిర్వర్తితంబు లయ్యె నుగద! ఈయజ్ఞానంతరమున మీరింకను నేమి చేయఁదలంచితిరి.

అని వాయుదేవుండు కుశలప్రశ్నంబు సేయుటయు బవిత్రచరిత్రులగుమునిశ్రేష్ఠులు ప్రహృష్టహృదయులై వినయపూర్వకంబుగ నిట్లు చెప్పందొడంగిరి. మహాత్మా! ఇయ్యాశ్రమంబునకుఁ గల్యాణకరంబగుభవదాగమనంబువలన మాకుఁ గుశలం బగుటయే కాక మాతపంబు లన్నియును ఫలించినవి. పూర్వవృత్తం బొక్కటి యాలకింపుము. పూర్వము మేమందఱము నజ్ఞానమోహితులమై పరబ్రహ్మజ్ఞానబోధంబుకొఱకుఁ బ్రజాపతి యగుబ్రహ్మదేవు నుపాసించితిమి. శరణాగతవత్సలుం డగునద్దేవుండు మాయందుఁ గరుణించి భగవానుం డగురుద్రుఁడే సకలశ్రేష్ఠుం డగుపరమకారణుం డనియు, అప్రతర్క్యుం డగు నాతత్త్వస్వరూపుని భక్తులుమాత్రమే దర్శింపఁగల రనియు, భక్తియు, మోక్షంబు నాతనిప్రసాదంబుననే లభించుననియు, కావున మీరాతని ప్రసాదంబుకొఱకు నైమిశారణ్యంబున దీర్ఘసత్రయాగంబు నారంభించి యద్దేవు నుపాసించుచుండవలయు ననియు, ఆయజ్ఞావసానంబున వాయుదేవుం డటకు వచ్చు ననియు, ఆతనియుపదేశంబుచే మీకు జ్ఞానలాభంబును, గల్యాణంబు నగుననియు, నానతిచ్చి మమ్మిటకుఁ బంపియున్నాఁడు. మేము నిందుండి భవదాగమనంబుకొఱకు నిరీక్షించుచుంటిమి. దీర్ఘసత్రానుష్ఠానంబు గావించి సహస్రదివ్యవర్షంబు లయ్యెను. తత్ఫలంబుగా మీ రిట కేతెంచిరి. ఇంతకంటె మాకుఁ బ్రార్థనీయం బేమున్నది? అని చెప్పుటయు వాయుదేవుండు ప్రీతుండై మునిపరివేష్టితుండై యుండి వారికి భక్తివృద్ధ్యర్థమై మహాదేవతత్త్వముం గూర్చి బోధింపఁదొడంగెను.

మహర్షిపవనసంవాదము.

నైమిశారణ్యవాసు లగుమహర్షు లందఱును బవనదేవుని యథావిధిగ నర్చించి మహాత్మా! నీకు పరమేశ్వరజ్ఞానము లభించినవిధమును, నీవవ్యక్తజన్ముం డగుబ్రహ్మదేవునకు శిష్యుండ వైనవిధంబును దెలుపవలయు నని ప్రశ్నించుటయు వాయుదేవుం డిట్లనియెను. మునులారా! పందొమ్మిదవ శ్వేతలోహితకల్పంబునందు చతురాననుండు సృష్టికాముండై తపంబు గావించెను. పరమేశ్వరుం డగుమహాదేవుం డాతనితపంబునకు సంతుష్టుండై, కుమారుండు నతిసుందరుండు నగు శ్వేతమునిమూర్తిం దాల్చి దివ్యవాక్యోచ్చారణంబు సేయుచు దర్శనం బిచ్చుటయు వనజాసనుండు జగత్పతి యగునమ్మహాదేవుం గాంచి ప్రణామంబు గావించి యాతనియనుగ్రహంబున గాయత్రీసహితం బగు తత్త్వజ్ఞానముం బడసెను. అట్లు చతుర్ముఖుండు తత్త్వజ్ఞానసిద్ధుండై చరాచరంబు లగునిఖిలభూతములను సృజించెను. ఆపరమేశ్వరప్రసాదముచేఁ బద్మాసనుండు పొందఁగలిగినదివ్యతత్త్వజ్ఞానమును, దపఃప్రభావముచే నేనును బరమేష్ఠియనుగ్రహంబునఁ బడయఁగలిగితిని. అని చెప్పుటయు మహర్షిశేఖరు లో మహాత్మా! సత్యంబులకంటె సత్యతరంబును, శుభప్రదంబును, దన్నిష్ఠులగు మానవులకు సుఖప్రదంబును నగునయ్యీశ్వరజ్ఞానము నీకెట్లు లభించినదో యానతీయవలయు నని ప్రశ్నించిరి.

వాయుదేవుం డిట్లనియెను. మునిశేఖరులారా! పూర్వము నాకు లభించినజ్ఞానము జీవమాయాపరమేశ్వరసంబంధమైనది. సుఖార్థులగువా రీజ్ఞానమునందే సంపూర్ణశ్రద్ధ గలవారై యుండవలయును. అజ్ఞానదుఃఖము లీజ్ఞానముచేతనే నివర్తితంబు లగును. వస్తుపరిచ్ఛేదమే జ్ఞానము. అజడము, జడము, నియంత యని వస్తువులు త్రివిధంబులు.

ఇవి పశువు (జీవుఁడు) పాశము (మాయ) పతి (ఈశ్వరుఁడు) యనునా మంబులచే వ్యవహరింపఁబడుచుండు. తత్త్వజ్ఞానులగువారు వీనికే అక్షరము, క్షరము, క్షరాక్షరపరము ననునామముల నుపయోగించుచుందురు. అక్షరం బనిన జీవుఁడును, క్షరం బనిన మాయయు, క్షరాక్షరపరం బనిన నీశ్వరుండు నని యెఱుంగునది. ప్రకృతి క్షరంబును, పురుషుఁ డక్షరుండు ననియు నెఱుంగవలయును. ఈరెంటికిని బ్రేరకుండును, వీనికతీతుండు నగునాతఁడే పరమేశ్వరుఁడు. అని చెప్పటయు మునులు దేవా! ప్రకృతి యన నేమి? పురుషుఁ డెవ్వఁడు? ఈప్రకృతిపురుషులకుఁ గలసంబంధ మెట్టిది? వీరికి బ్రేరకుండగునీశ్వరునిస్వరూప మెట్లుండును? అని ప్రశ్నించిరి.

వాయుదేవుం డిట్లనియెను. మాయయే ప్రకృతియని చెప్పంబడును. మాయావృతుం డగుబ్రహ్మయే పురుషుఁడు. మలకర్మంబులచే నీరెంటికిని సంబంధము గలిగెను. ఈయుభయంబునకును బ్రేరకుఁడగుపరుఁడే పరమేశ్వరుఁడు.

మునులిట్లు ప్రశ్నించిరి. మాయాస్వరూప మెట్టిది? మాయావృతుం డగుపురుషుం డెట్టివాఁడు? మలంబన నేమి? శివత్వం బెట్లు గలిగెను?

వాయుదేవుండిట్లనియెను. పరమేశ్వరశక్తియే మాయ. మాయావృతుం డగుపురుషుఁడు చైతన్యస్వరూపుఁడు. జ్ఞానచ్ఛాదకంబైనది మలంబని చెప్పంబడును. సహజవిశుద్ధంబును, సహజసిద్ధంబు నైనదియే శివత్వము.

మును లిట్లు ప్రశ్నించిరి. విశ్వవ్యాపకుం డగుపురుషుని మాయ యేకారణముచే నెట్లావరించినది? ఆపురుషుం డెందుకొఱకు మా

యావృతుం డయ్యెను? పురుషుం డెట్లు మాయానివృత్తుండు గాఁగ లుగును?

వాయుదేవుం డిట్లనియెను. వ్యాపకునకును గళాదులకుంబోలి యావరణంబు గలుగును. భోగార్థంబగుకర్మమే యావరణహేతువు. పూర్వోక్తం బగుమలక్షయంబైనచో నావరణనివృత్తియగును.

మును లిట్లు ప్రశ్నించిరి. మహాత్మా! కలాదు లెవ్వి? కర్మమన నేమి? దాని కాద్యంతము లెవ్వి? ఫలాశ్రయము లేవి? భోగ మెవ్వని కొఱకు? భోగ్యమన నేమి? భోగసాధన మేది? మలక్షయ మెట్లగును? క్షీణమలుం డగుపురుషుం డెట్లుండును?

వాయుదేవుం డిట్లనియెను. కళ, విద్య, రాగము, కాలము, నియతి యనునీయైదును గళాదులని చెప్పుదురు. పురుషుఁడే భోక్త. కర్మ పుణ్యాపాపభేదంబులచే ద్వివిధంబు. పుణకర్మంబులకు సుఖంబును, బాపకర్మంబులకు దుఃఖంబును ఫలంబులు. అవిద్యాభోగపర్యంతమును గర్మము నిలిచి యుండును. అది యజ్ఞానాత్మ నాశ్రయించి యుండును. అవిద్యాభోగపూర్తి యైనచోఁ గర్మాంతం బగును. కర్మవినాశంబుకొఱకే భోగము. అవ్యక్తం బగుప్రకృతియే భోగ్యము. బాహ్యాంతరింద్రియమూలంబున శరీరము భోగసాధనం బగుచున్నది. నిరంతరశివతత్త్వధ్యానమూలంబున లభించినయీశ్వరానుగ్రహంబుచే తనే మలక్షయం బగును. ఆత్మమలక్షయం బైనంతనే పురుషుండు శివసమానుండు గాఁగలఁడు.

మును లిట్లు ప్రశ్నించిరి. కలాదిపంచతత్త్వంబులకంటెను గర్మ మేకారణముచే వేఱైనది? భోక్త యనియుఁ బురుషుఁడనియు నాత్మ యేకారణముచేఁ బ్రసిద్ధమైనది? అవ్యక్తస్వరూప మెట్టిది? దానికి భో

గ్యత్వ మెట్లు సంభవించెను? పురుషునకు భుక్తియం దాశ్రయ మేది? శరీర మన నేమి?

వాయుదేవుం డిట్లనియెను. విద్యాకళలు జ్ఞానవ్యంజకములు. రాగము ప్రవర్తకమైనది. అవచ్ఛేదకమైనది కాలము. నియమించునది నియతి. త్రిగుణాత్మకంబును, గారణంబునగు నవ్యక్తమే ప్రధానమనియుఁ బ్రకృతియనియుఁ దత్త్వజ్ఞులు చెప్పుదురు. ఆప్రకృతినుండి సత్వరజస్తమోగుణంబు లుత్పన్నంబు లయ్యెను. తిలలయందుఁ దైలముంబోలి త్రిగుణంబులు బ్రకృతియందు సూక్ష్మరూపముతో నుండును. సమస్తసుఖంబులును, సుఖ హేతువులును సత్వసంబంధమైనవి. కేవలము తద్వ్యతిరిక్తములు రాజసములు. స్తంభ మోహంబులు తామసంబులు. సత్వగుణంబుచే నూర్ధ్వగతియుఁ, దమోగుణంబుచే నధోగతియు, రజోగుణంబుచే మధ్యగతియు నగును. పంచతన్మాత్రలును, పంచభూతంబులును, పంచకర్మేంద్రియంబులును ప్రధానబుద్ధ్యహంకారమనంబులు ననునీచతుర్వింశతితత్త్వంబులసమష్టియే సవికారం బగునవ్యక్త మని చెప్పుదురు. అది కారణదశయందున్నప్పు డవ్యక్తంబనియు, ఘటపటాదికార్యదశయందున్నప్పుడు వ్యక్తంబనియు వ్యవహరింపఁబడుచుండును. ఘటాదికార్యంబులు కారణంబులగుమృదాదులకంటె భిన్నంబులు గానియట్లు శరీరాదికార్యంబులు కారణం బగునవ్యక్తంబుకంటె భిన్నంబులు గావు. కావున నవ్యక్తం బొక్కటియే కార్యకారణరూపంబుల విరాజిల్లుచుండును. అవ్యక్తాధారరూపం బగుశరీరమే పురుషునకు భోగ్యమైనది. తద్భిన్నం బగునది పురుషునకుభోగ్యంబు గానేరదు.

మును లిట్లు ప్రశ్నించిరి. బుద్ధీంద్రియశరీరంబులకంటె నతిరిక్తంబుగా నాత్మయనునొకానొకవస్తు వెచ్చట నేవిధముగా నున్నది?

వాయుదేవుం డిట్లనియెను. బుద్ధీంద్రియశరీరాతిరిక్తంబును, ఆ

వినశ్వరంబును నగునాత్మయనునొకవస్తువున్నది. కాని దానికి హేతు నిర్దేశంబు సేయుట సులభంబు గాదు. పండితు లగువారు బుద్ధీంద్రియశరీరముల కాత్మత్వము నంగీకరింపరు. బుద్ధియే యాత్మ యని యంగీకరింతు మేని స్మృతి కవకాశము లేకుండఁబోవును. ఇంద్రియంబులలో నేదేనొకటి యాత్మగా భావింతుమేని నానావిషయకజ్ఞానము లేకుండఁబోవును. ఒకయింద్రియమునకు నొక్కటేవిషయజ్ఞానము గలుగవలసియుండును. ఇఁక శరీరమే యాత్మయందుమేని మనజ్ఞానమంతియు శరీరమునంతే వ్యాపించి యుండవలయును. అట్లు లేదు. కావున ననుభూతవిషయస్మృతియు, నన్యజ్ఞేయపదార్థజ్ఞాతయు, బుద్ధ్యాదులకతీతుండు నగువాఁడు నావశ్యకముగా నుండితీరవలయును. ఆతఁడే యంతర్యామి యని వేదవేదాంతములు కీర్తించుచున్నవి. ఆతనియందే సకలవస్తువులు నున్నవి. సకలవస్తువులందు నాతఁడు వ్యాపించి యుండును. ఆతఁడే యుక్తస్వరూపుఁడు. ఆతఁడే నిత్యుఁడు. కాని యెవ్వరు నాతని వ్యక్తస్వరూపునిగా నిర్ణయింపలేరు. చక్షువులకుఁగాని, యితరేంద్రియంబులకుఁ గాని యాతండు గోచరింపఁడు. ఆమహాత్ముఁడు కేవలయోగాభ్యాసవిశేషంబగుమనస్సుచేతనే గ్రహింపఁబడును. స్త్రీపుంనపుంసకభేదంబు లాతనికి లేవు. విద్యాద్యావములును, దిగ్వాదిక్రియలునులోనగు నాతనికి లేవు. లోకోత్తరుం డయ్యు నాతఁడు నశ్వరంబులగు దేహసమూహములందు నివసించి యుండును. అవ్యయుం డగునాతఁడు స్థాయిస్వరూపుఁడు. ధీరులగుమానవులు శ్రవణమననాద్యభ్యాసబలంబున నిత్యుఁడు నాతని దర్శించుచుందురు. వేయుమాటలేల ? పురుషుఁడు (ఆత్మ) దేహముకంటె భిన్నుండనియే యెఱుంగవలయును. అది దేహముకంటెఁ భిన్నుం బనితలంచువా రజ్ఞానులు. ఈశరీరము పురుషుని దని చెప్పుటవలనే పురుషుఁడు దేహముకంటె భిన్నుఁడుగాఁ దోఁ

చుచున్నారు. మలినంబును, విషయవశీభూతంబును, అనిత్యంబును, దుఃఖమయంబునగునీశరీరము నేమియుఁగానిదానిఁగాఁ దత్త్వజ్ఞులుభావింతురు. విపత్సమూహములకుఁ బుట్టినిల్లయిన యీశరీరము నాశ్రయించినపురుషుఁ డాత్మకర్మవశంబున నొకప్పుడు సుఖియు, నొకప్పుడు దుఃఖియు, నొకప్పుడు మూఢుఁడు నగుచుండును. క్షేత్రము జలప్లావితమై యంకురములఁ బుట్టించునట్లే కర్మమజ్ఞానసంకలితమై దేహముల నుద్భవింపఁజేయును. శరీరము నాశనశీలంబును, నసుఖావాసంబును, రోగభూయిష్ఠంబు నై యుండును. పురుషున కతీతంబులు, ననాగతంబులు నగుదేహములు వేలకొలఁది యుండును. శరీరములన్నియును మరల మరలఁ బుట్టుచు గిట్టుచుండును. కాని యాత్మమాత్ర మెప్పటికి నొక్కటేరీతి నుండును. ఏకాలమునందును, ఎచ్చటను, ఏవిధముగను దానికి శరీరముతోఁ జిరకాలసంబంధ మగపడుట లేదు. గగనతలంబున మేఘంబులచేఁ జంద్రబింబముంబోలి యాత్మయు శరీరంబులచేనప్పుడప్పు డాచ్ఛాదితంబును, విముక్తంబు నగుచుండును. ద్యూతక్రీడయందుకుమదాత్రభేదంబుచేఁ బంటేములు వివిధములుగాఁ దోఁచునట్లే సంసారమునందు దేహభేదంబుచే నాత్మ వివిధవృత్తుల గోచరించుచుండును. ఆత్మ యెవ్వరిదియును గాదు. ఆత్మ కెవ్వరును లేరు. మార్గస్థునకు మార్గమునందుఁ బహువిధపరిజనసమ్మేళనంబువలెనే యాత్మకు దారపుత్రాదిసంబంధం బగుచుండును. నదీజలంబులఁగొట్టుకొనిపోవుకాష్ఠంబులకుంబోలె ప్రాణులకును సంయోగవియోగములు సంభవించుచుండును. శరీరము జడం బని యాత్మయెఱుంగును గాని శరీర మాత్మనెఱుంగుటకు సమర్థంబు గానేరదు. ఈశ్వరుండు దేహాత్మతత్త్వంబుల నెఱింగియుండును గాని దేహాత్మ లాతని గ్రహింపఁజాలవు. బ్రహ్మాదిస్థావరపర్యంతమును గలసకలపదార్థములును బశువు లని చెప్పంబడును.

పాశబద్ధుండును, సుఖదుఃఖభోగియు నగువాఁడే పశువు. ఇట్టిపశుసమూహమే యీశ్వరునకు లీలాసాధనంబని పండితులు వక్కాణింతురు. అజ్ఞుం డగుపశువు తనసుఖదుఃఖవిషయంబులఁ బరాధీనుండై యీశ్వరప్రేరణంబున స్వర్గనరకప్రాప్తుం డగుచుండును.

మునులిట్లు ప్రశ్నించిరి. మహాత్మా! నీచేవర్ణితంబులగునీపశుపాశంబులకు విలక్షణం బగువస్తువేది? పశుపాపవిమోచనంబునకు సమర్థుం డెవ్వఁడు?

—♦ శైవతత్త్వకథనము. ♦—

వాయుదేవుం డిట్లనియెను. మునికులతిలకులారా! అనంతరమణీయగుణాశ్రయుండును, విశ్వనిర్మాతయు, పశుపాశవిమోచకుండును నగు నధీశ్వరుం డొకఁడున్నాఁడు. ఆతఁడు లేకున్నచో జగత్సృష్టియే లేదు. ఏమనిన—పశుపాశంబులలోఁ బశువగుజీవుఁ డజ్ఞుండును, పాశం బగుప్రకృతి యచేతనంబు (జడము) నైయుండెను. ప్రధానప్రకృతియుఁ బరమాణువులుమొదలుగాఁగల స్థూలసూక్ష్మాదిసకలపదార్థములు నచేతనములే యై యున్నవి. బుద్ధిమత్కారణం బగుచైతన్యసంబంధము లేకుండ నవి జగత్కార్యనిర్వహణంబునకు సమర్థములు గాఁజాలవు. జగంబు సావయవంబును, గార్యరూపంబు నగుటంజేసి దీనికిఁ గర్తయొకఁ డావశ్యకముగ నుండితీఱవలయు నని తోఁచుచున్నది. కర్త లేకుండఁ గార్యోత్పత్తి కాఁజాలదుగదా! కావున జగంబంతయు నీశ్వరకార్యమే గాని జీవునికార్యమును, బ్రకృతికార్యమును గానేరదు. జీవునియందు మనకుఁ గానంబడుచుండు సమస్తకర్తృత్వమును గూడ నీశ్వరప్రేరితమైనదియే. అంధుండు నిజగమనంబునకు నసమర్థుం డగునట్లే జీవుండును స్వకార్యనిర్వహణమున కసమర్థుఁడై యున్నాఁడు. జీవుండును, దత్ప్రేరకుం డగునీశ్వరుండును బరస్పరభిన్ను లని యెఱింగి

యీశ్వరోపాసనంబు గావించువా రీశ్వరప్రసాదమువలన నమృతత్వ
ముం గాంచఁగలరు. నశ్వరత్వముచే బశుపాశంబులకును, దనయీశ్వరున
కును గలపరిభేదమును గ్రహించి బ్రహ్మజ్ఞుం డగువాఁడు జన్మము
నుండి విముక్తుం డగును. జీవప్రకృతులు రెండును బరస్పరసంయుక్త
ములై యుండును. విశ్వవిమోచకుం డగుపరమేశ్వరుఁడు వ్యక్తావ్యక్త
వస్తువ్యాప్తం బగునీవిశ్వమును భరించి యుండును. జ్ఞాతవ్యం బగువ
స్తువు భోక్త, భోగ్యము, ప్రేరకుఁడు నని ముత్తెఱంగుల నొప్పారుచుం
డును. ఇంతకంటె నధికముగాఁ దెలిసికొనఁదగిన దేదియును లేదు.
తిలలయందుఁ దైలంబును, దధియందు ఘృతంబును, నదులయందు
జలంబును, గాష్ఠంబులయం దగ్నియు నెట్లు వ్యాపించి యుండునో
యట్లే తనయందుఁ దనకంటె విలక్షణంబును, సత్యంబు నగుపరమాత్మ
యున్నదని యెఱింగినవాఁడు నిర్వాణపోయుక్తుండై పరమాత్మసాక్షా
త్కారముం గాంచఁగలఁడు. ఇంద్రజాలసదృశం బగుమాయతోఁ
గూడియున్న పరమేశ్వరుఁడు తనయీశ్వరశక్తిచే సకలలోకములను
సృజించి వానికెల్లనీశ్వరుఁడై యుండును. సృష్టికిఁ బూర్వంబున రు
ద్రుం డొక్కఁడుమాత్రమే యుండెను. ఆతనికంటె ద్వితీయుం డెవ్వఁ
డును లేఁడు. ఆతఁ డెట్లు విశ్వమును సృష్టించి పాలనంబును, సంకో
చంబును గావించుచుండును. ఆతఁడు విశ్వతోముఖుండును, విశ్వవ్యా
ప్తబాహుపాదనయనుండును విశ్వేశ్వరుండునై యుండును. ఏకాత్ముం
డగుసమ్మహేశ్వరుఁడే యాకాశమును, భూమిని సృజించెను. నిఖిలదేవ
గణంబులకు నాతఁడే యుత్పాదకుఁడు. దేవతలకంటె ముందుగా నా
తఁడు హిరణ్యగర్భుని సృజించెను. మహర్షి యగురుద్రుండు విశ్వాధి
కుం డని వేదములు చెప్పుచున్నవి. ఆదిత్యవర్ణుండును, మహాత్ముండు
ను, అమృతుండును, నిర్వికారుండును, తమోగుణాతీతుండు నగుప్రభు

వును నే నెఱుంగుదును. ఆపరమాత్మునికంటెం బరు లెవ్వరును లేరు. ఆతనికంటె నణుస్వరూపులుగాని మహాత్స్వరూపులుగాని యెవ్వరును లేరు. ఈజగం బంతయు నాతనితో నిండి యున్నది. ఆతఁడు నిత్యము నేకాకియై వృక్షముంబోలె నిశ్చలభావంబునఁ గేవలము నాకాశస్థితుండై యుండును. ఈచరాచరప్రపంచ మంతయు నాతనిసంకల్పముచేతనే జనించినది. ఆతనివదనమస్తకగ్రీవంబులు సర్వవ్యాప్తములై యుండును. భగవంతుం డగుశివుండు సర్వవ్యాపియు, సర్వగతుండును, సర్వభూతగుహాశ్రయుండు నై యుండును. ఆతఁడు జగమునందలిసమస్తవస్తువుల నావరించి యుండును. ఆదేవుండు సకలేంద్రియగుణాభాసుండును, సర్వేంద్రియవివర్జితుండును, సర్వేశ్వరుండును, సర్వశరణ్యుండును, సర్వమహాత్స్వరూపుండును నై యుండును. ఆతఁడు కన్నులులేకయే చూడఁగలఁడు. చెవులులేకయే వినఁగలఁడు. సర్వజ్ఞుం డగునాతని నెవ్వరు నెఱుంగఁజాలరు. ఆతఁడు పరమపురుషుం డని పండితులు నిర్దేశించి యున్నారు. అణువులకంటె నణుస్వరూపుఁడును, మహాత్ములకంటె మహాత్స్వరూపుఁడును, అవ్యయుఁడు నగునద్దేవుఁడు జీవులబుద్ధిరూపగుహాశ్రయుండై యుండును. యజ్ఞరహితుం డగునాతని నుద్దేశించియే సకలయజ్ఞములు ననుష్ఠితంబు లగుచుండును. అతిమహిమాన్వితుం డగునాతని నీశ్వరప్రసాదంబున నపగతశోకుం డగువాఁడు సందర్శింపఁ గలఁడు. అజరుండును, పురాణుండును, సర్వాత్మకుండు నగునాప్రభుని నే నెఱుంగుదును. బ్రహ్మవాదు లాతనికి జన్మము లేదని చెప్పుదురు. అమ్మహేశ్వరుం డేకాకి యయ్యును శక్తిసంయోగముచే మాటిమాటికిని ముందుగా లోకత్రయవిధానంబు గావించి యంతంబున సంహారము గావించుచుండును. విశ్వవిధాయిని యగునీశ్వరశక్తి యజనామంబునఁ బ్రసిద్ధమై యుండును. దానినే పండితులు ప్రకృతి యని నిర్దే

శించి యున్నారు. ఆప్రకృతి సత్త్వరజస్తమోగుణశక్తిశాలినియై శుక్లలోహితకృష్ణవర్ణంబులచే విలసిల్లుచుండును. ప్రజాప్రసవిని యగునాప్రకృతి నజుం డనుసరించి సేవించుచు భోగాంతంబున దానిని ద్యజించుచుండును.

జీవాత్మయుఁ బరమాత్మయు ననురెండుపక్షులు బంధుభావముతోఁ గలసి మానవశరీరం బగువృక్షము నాశ్రయించి యుండును. అందొకటి మధురంబులగుకర్మఫలంబుల భుజియించుచుండును. మఱియొకటి యేమియు భుజింపక యూరక చూచుచుండును. ఆరెంటిలో నొకటియగుజీవవిహంగము సంసారవృక్షనిమగ్నమై, మోహావేశంబునఁ బరితపించుచుండును గాని ప్రసాదయుతుండును, బరమకారణుండును నగుపరమేశ్వరునిమహిమలను దర్శించునప్పుడుమాత్రము సుఖించుచుండును. మాయి యగుపరమేశ్వరుఁడు మాయామూలంబున విశ్వమధ్యమునందుఁ బ్రవేశించి ఛందంబులను, యజ్ఞంబులను, క్రతువులను, భూతభవ్యంబగువిశ్వంబును సృష్టించుచుండును. ప్రకృతి మాయ యనియు, పరమేశ్వరుఁడు మాయి యనియు నెఱుంగునది. ప్రకృత్యవయవంబులచే నీజగంబులన్నియు వ్యాప్తములై యున్నవి. ఈశ్వరుఁడు కలలమధ్యప్రదేశముకంటెను సూక్ష్మాతిసూక్ష్ముఁడై యుండును. పరమేశ్వరుఁడు మంగళమయుం డనియు, విశ్వస్రష్ట యనియు, విశ్వప్రేరకుఁడనియు నెఱింగినవానికి శాంతిలాభంబు గలుగును. విశ్వేశ్వరుండును, రక్షకుండును, కాలస్వరూపుండు నగుప్రభుం డాతఁడొక్కఁడే. ఆవిశ్వేశ్వరస్వరూపజ్ఞానము గలవాఁడు మృత్యుపాశ వినిర్ముక్తుం డగును. సర్వభూతనిగూఢస్థితుండును, సర్వేశ్వరుండు నగుశివునిదివ్యస్వరూపజ్ఞానము లభించినంతనే సర్వపాపవిముక్తి యగును. శివుఁడే ప్రధానదైవంబనియు, విశ్వవిధాత యనియు, మహేశ్వరుఁ డనియు నాతఁడు

తనహృదయస్థితుం డనియు గ్రహించినవాం డమృతత్వముం గాంచం గలండు. దివారాత్రులును, సమస్తసదసద్వస్తుసమూహంబును లేనిసమయంబునం గేవలము శివుం డొక్కండే విరాజిల్లుచుండెను. ఆతనినుండియే పురాతనం బగుప్రజ్ఞ యుత్పన్నం బయ్యెను. ఊర్ధ్వంబునంగాని, మధ్యంబునంగాని, పార్శ్వంబునంగాని యెవ్వరు నాతని గ్రహింపంజాలరు. ఆతనితో సమాను లెవ్వరును లేరు. ఆతనిదివ్యనామము మహాద్యశోవిలసితమైనది. జన్మభీరులగువా రయ్యీశ్వరునజుంగా నెఱింగి స్వసంరక్షణార్థమై యారుద్రునిదక్షిణముఖంబు నాశ్రయింతురు. బ్రహ్మయు, పరుండు ననువారిరువురుమాత్రమే యనంతులు, నక్షరులునని కీర్తింపంబడుచున్నారు. విద్యావిద్యలు వారియందే యతినిగూఢముగ సన్నిహితంబులై యుండును. అవిద్యాక్షయం బైనచో విద్య యమృతరూపముగాం బ్రశంసితం బగును. ఆయిరువురిని దనయధీనమం దుంచుకొని పరమేశ్వరుండు వారికి భిన్నుండై యుండును. ఆతండు ప్రత్యేకముగ బహువిధజగంబు లనేకవస్తురూపంబున విస్తరింపంజేయుటకును, సకలవస్తువులను సృష్టించుటకును, సకలజగంబులను దనయధికారము వ్యాపింపంజేయుటకును సమర్థుండై యుండును. ఆతండు నిజతేజముచేం గ్రిందను, మీందను, పార్శ్వంబులను, సకలదిశలను బ్రకాశింపంజేయుచుండును. అద్వితీయుండును, వరేణ్యుండును, సర్వకారణుండును, సర్వవస్తుస్వరూపుండు నగునాతండు సర్వశబ్దార్థములను, గుణాదులను భోగ్యభోక్తృత్వరూపంబునం బరిణమింపంజేయుచు విద్యవ్యాపియై యుండును. జగంబులకుం బూర్వస్థితుండును, బ్రహ్మస్వరూపుండును, బ్రహ్మయోనియు, గుహ్యోపనిషద్విలసితుండు నగునాతని దేవతలును, మహర్షులు నెఱుంగుదురు. అద్దేవుండు భావగ్రాహ్యుండును, నివాసశూన్యుండును, సృష్టిప్రళయకర్తయు, కాలకాలుండు నని యను

భవంబుచే గ్రహింపఁగలమానవుల కీక మానవదేహంబు గలుగదు. మూఢులగువా రద్దేవుని స్వభావంబనియు, కాలంబనియుఁ జెప్పెదరు. జగంబుల నన్నిటిని భ్రమింపఁజేయుమహిమ యాతని కున్నది. ఆతఁడు కాలంబునకును గాలస్వరూపుఁడై జగంబు నావరించి యుండును. కర్మమూలంబగునీజగం బాతనిచేఁ బ్రేరితంబై భూతగణంబులతో వివర్తితం బగుచుండును.

ఆతఁడు సత్వగుణసహితుండై కాలాదితత్త్వయోగంబునఁ దలఁచుగఁ గర్మారంభంబు సేయుచుండును. మఱియుఁ దలఁచుగా నివర్తితుం డగుచుండును. ఆకాశాద్యష్టమూర్తులచేతను, సత్వాదిగుణత్రయంబుచేతను, విద్యావిద్యాద్వయంబుచేతను నేకం బగుకాలంబుచేతను, ఇచ్ఛాదులగునాత్మగుణంబులచేతను నీజగంబంతయు వ్యాప్తంబై యున్నది. ఆతఁడు సత్వాదిగుణంబులచేఁ గర్మారంభంబు చేసి ప్రాణులకుఁ బ్రకృతియోగముం గావించుచుండును. గుణాభావంబునఁ గర్మంబు చేయఁబడుచున్నను దానికి వినాశం బగును. పూర్వకర్మక్షయం బైనచో నాతఁ డొట్టిదే మఱియొకకర్మంబునఁ బ్రవృత్తుం డగును. అతఁడే యాదియు, స్వయముగా భోక్తృభోగసంయోగకారణుండు నై యుండును. త్రికాలంబులకుఁ బరుండును, నిర్గుణుండును నగుపరమేశ్వరుని విశ్వయోగియగుభవునిగను, స్తుత్యునిగను, ప్రజాపతియగు దేవదేవునిగను, జగత్పూజ్యునిగను జిత్తంబున భావించి యుపాసింపవలయును. కాలాదులకుఁ బరుం డగునాతనినుండియే సకలజగంబును బరివర్తితం బగుచున్నది. ధర్మావహుండును, పాపహారియు, నైశ్వర్యాధనాథుండు నగునాతఁడే విశ్వాధారుఁడు. ఈశ్వరులలోఁ బరమేశ్వరుండును, దైవంబులలోఁ బరమదైవంబును, పతులలోఁ బరమ పతియు, సర్వశ్రేష్ఠుండు నగుసద్దేవుని భువనేశ్వరేశ్వరునిగా నెఱుంగునది. ఆతని

కెట్టికార్యకారణంబులును లేవు.

ఆతనితో సమానులు గాని, యధికులుగాని యీజగంబునం దెవ్వరును లేరు. బహువిధంబులగు నాతనిదివ్యశక్తి వేదంబులచేఁ బ్రకీర్తితం బైనది. తజ్జ్ఞానక్రియాశక్తులచే నాతఁడు జగన్నిర్మాణంబు గావించెను. ఆతనికంటె నధికులు లేరు. ఆతని కెట్టిచిహ్నంబును లేదు. ఆకాశాదులకుఁ గారణుండును, బ్రభువులకుఁ బ్రభుండు నగునాతని కుత్పాదకు లెవ్వరును లేరు. ఆతఁ డెవ్వరివలనను జనించినవాఁడు గాఁడు. మలమాయాదు లేవియు నాతనికి జన్మకారణంబులు గావు. ఏకాకియగునాతఁడు సర్వతోభావంబుగ సర్వభూతంబులయందును నిగూఢముగ వ్యాపించి యుండును. సకలభూతాంతరాత్ముండును, సకలధర్మాధ్యక్షుండు నగునాతఁడు సర్వభూతాధారుండును, సర్వసాక్షియు నై యుండును. జగద్వ్యాపియు, నిర్గుణుండు నగునాతఁడు వశియు, వివశాత్ములగుయోగిగణంబులకు ముఖ్యుండు నై యుండును. ఆతఁ డేకాకియయ్యును సమయోచితంబుగా ననేకబీజంబుల సృష్టించుచుండును.

మోక్షార్థులగువారు నిజహృదయస్థితుం డగునాతనిదర్శించి నిత్యసుఖంబులఁ గాంచుచుందురు. ఇతరుల కట్టిభాగ్యంబు లేదు. నిత్యంబులకు నిత్యుండును, చేతనంబులకుఁ జేతనుండు నగునయ్యీశ్వరుండు కేవలనిష్కాముం డయ్యును సర్వకామంబులఁ బ్రసాదించుచుండును. సాంఖ్యయోగాధిగమ్యుండును, గారణస్వరూపుండు నగునాతఁడే జగన్నాథుఁడు. ఆతని నెఱింగినజీవులు సర్వబంధవిముక్తు లగుదురు. విశ్వస్రష్టయు, విశ్వవిదుండును, కర్మజ్ఞుండును, కాలవిచ్ఛేదకారియు, గుణవంతుండును, ప్రకృతిపురుషనియంతయు, గుణాధీశ్వరుండును, బంధమోచకుండు నగునాతఁడు ప్రథమంబున బ్రహ్మనుసృష్టించి స్వయముగా నాతనికి వేదంబుల నుపదేశించెను. ఆత్మ బుద్ధిప్రసాదబలంబున

నేనమ్మహాదేవు నెఱింగి సంసారమునుండి ముక్తింగోరి నిష్కళుండును, నిష్క్రియుండును, శాంతుండును, నిరవద్యుండును, నిరంజనుండు నగు వాతనియాశ్రయముం గాంచితిని. జలంబుల సేతువును, దగ్ధకాష్ఠము ననలంబును నాచ్ఛాదించువిధంబున మానవులు చర్మముంబోలి యాకాశమును బరివేష్టింపఁ గలిగినప్పుడు తపఃప్రభావముచే వారికి శివస్వరూపదర్శనంబు లేకపోయినను దుఃఖవిమోచనము గాఁగలదు. వేదాంతరహస్యంబును, పవిత్రంబును, పాపనాశకంబును, చతుర్థాశ్రమోచితంబును నగుజ్ఞానము పూర్వకాలంబున నుపదిష్టంబైనది. నేను నా భాగ్యగౌరవంబుచే బ్రహ్మముఖమునుండి యీవిజ్ఞానలాభముంబడయఁ గలిగితిని. సర్వశ్రేష్ఠంబగునీజ్ఞానమును బ్రశాంతులకుమాత్రమే యుపదేశింపవలయును. అప్రశాంతులకును, అసద్వృత్తులకును, పుత్రేతరులకును దీనినుపదేశింపరాదు. ఈశ్వరునియందుఁ బరమభక్తులును, గురుని దేవునిగనే భావించువారు నగుశిష్యులకుఁ బండితు లీసకలార్థంబులను బోధింపవలయును. ఈయర్థంబు సంక్షేపించి చెప్పెద నాకర్ణింపుఁడు. ప్రకృతిపురుషులకంటె నీశ్వరుఁడు భిన్నుఁడై యున్నాఁడు. అతఁడు సృష్టికాలంబున సమస్తవస్తువులను సృష్టించును. మఱియు సంహారకాలంబున సర్వంబును సంహరించును.

—♦ కాలప్రభావము. ♦—

కాలమునందే సకలవస్తువులు నుదయించి యందే విలీనంబులగుచుండును. కాలనిరపేక్షం బగువస్తువేదియును లేదు. ఈసమస్తప్రపంచమును గాలాంతర్గతమైనదియే. సృష్టిసంహారముద్రలతో నది చక్రమువలెఁ బరిభ్రమించుచుండును. హరిహరబ్రహ్మాదులును, సురాసురగణంబులునుగూడఁ గాలనియమము నతిక్రమింపఁజాలరు. భూతభవిష్యద్వర్తమానరూపంబులచే నిక్కాలము ప్రాణులను విభజించి

క్రమముగా జీర్ణింపఁజేయుచుండును. అతిసమర్థంబును, నతిభయంకరంబు నగుకాలము స్వేచ్ఛగా జరగిపోవుచుండును. పవనదేవా! మహాత్మా! భగవత్స్వరూపుం డగు నీకాలుం డెవ్వఁడో, యాతఁ డెవ్వనికి వశీభూతుఁడై యుండునో, యాతనికి వశుండు గానివాఁ డెవ్వఁడైన నుండెనో యీవిషయంబులను సవిస్తరంబుగాఁ దెలుపవలయు నని మునులందఱు నేకవాక్యముగాఁ బ్రశ్నించుటయు వాయుదేవుం డిట్లనియెను.

కళాకాష్ఠానిమేషాదిరూపసంకలితంబును, బరమేశ్వరతేజంబు నగు కాలము కాలాత్మ యనునామంబున విఖ్యాతంబై యున్నది. సకల స్థావరజంగమంబుల కలంఘ్యం బగు నీశ్వరనియోగరూపబలమే విశ్వనియామకమైనది. అగ్నియందుండి స్ఫులింగములవలెనే యమ్మహేశ్వరుని దివ్యశక్తినుండి యొక్కసూక్ష్మాంశముమాత్రము వెలువడి మహాత్ముం డగుకాలాత్మునియందు సంలగ్నమై యున్నది. అందుచేతనే యీవిశ్వమంతయుఁ గాలవశం బయ్యెను. కాలుం డెన్నఁటికిని విశ్వమునకు వశుండు గానేరఁడు. అప్రతిహతం బగుశివతేజము కాలునియందుఁ బ్రతిష్ఠితం బగుటంజేసి కాలపరిమాణ మతిమహత్తరమును దురత్యయంబు నయ్యెను. ప్రజ్ఞావిశేషముచే నెవ్వరును గాలము నతిక్రమింపఁజాలరు. కాలకర్మంబులనుండి యెవ్వఁడును దప్పించుకొనఁజాలఁడు. చతురుదధివేలావలయితం బగుభూచక్రమునంతను నేకచ్ఛత్రముగఁ బరిపాలించుపరాక్రమశాలి యగుసార్వభౌముఁడుగూడఁ గాలము నతిక్రమింపఁజాలఁడు. సకలేంద్రియంబులను, జగంబునుగూడ వశపఱచుకొన్నవాఁడైనను గాలమును జయింపఁజాలఁడు. అట్టివారి నందఱను గాలమే జయింపఁగలుగును. ఆయుర్వేదనిపుణులును, రసాయనానుష్ఠానపరులు నగువైద్యులైనను మృత్యువు నతిక్రమింపఁజాలరు. కాలా

తిక్రమణం బసాధ్యమైనది. మానవులు తమతమసంపత్సంకల్పబల శీలాదులచేఁ గావింపందలంచినకార్యములను గాలము బలవంతముగ నింకొకరీతిం జేసివైచును. ఎవ్వరును దలఁచుకొనకుండఁగనే కాలము జీవులకుఁ బ్రియులతోడను, అప్రియులతోడను సంయోగవియోగము లను గల్పించుచుండును. అందుచేఁ గొందఱికి సుఖంబును, గొందఱికి దుఃఖంబును గలుగుచుండును. అవిజ్ఞేయస్వభావుం డగుకాలునిశక్తి యతివిచిత్రమైనది. చూచుచుండఁగనే తరుణుఁడు వృద్ధుఁడుగను, బల వంతుఁడు బలహీనుఁడుగను, శ్రీమంతుఁడు శ్రీహీనుఁడుగను నగుచుం డును. ఇట్లే కాల మత్యాశ్చర్యముగా వస్తుపరివర్తనముం గావించు చుండును. కాలవైపరీత్యంబునఁ గులీనత, సౌశీల్యము, శక్తి, నైపు ణ్యము మొదలగునవి యేవియును బనిచేయఁజాలవు. అవనీనాథులు మొద లనాథులవఱకును గలయెల్లవారియందును గాలప్రభావ మొక్క రీతినే పనిచేయును. అకాలమునం దెంతబాగుగ నుపయోగించినను రసాయనములచే నౌషధఫలంబు గలుగదు. కాని యుచితసమయమున నుఁ బ్రయోగించినచో నట్టిరసాయనములు సఫలములై సుఖప్రదము లు గాఁగలవు. ఎవ్వరికి నకాలమున జననమరణంబులు గలుగవు. అకాలమున నెట్టివస్తువును వర్ధిల్ల నేరదు. సుఖదుఃఖము లకాలమున సం భవింపవు. అకాలమునం దెట్టివస్తువు నుత్పన్నంబు గానేరదు. శీతల వాయుసంచాలనంబును, మేఘవృష్టియు, సస్యోత్పత్తియుఁ గాలవశం బుననే యగుచుండును. కాలప్రభావముచేతనే జీవులు జీవింతురు. కాలాత్మతత్త్వము నెఱింగినవిజ్ఞులుమాత్రము నతిక్రమించి కాలాతీతుం డగుపరమేశ్వరుని దర్శింపఁగలరు. అకాలుండును, అబంధముక్తుండును, అపురుషుండును, అప్రకృతుండును, అవిశ్వుండును, విచిత్రస్వరూపుం డును, సర్వశ్రేష్ఠుండును, బరమేశ్వరుండు నగుశివునకు నమస్కారము.

— బ్రహ్మాద్యాయుఃపరిమాణకథనము. —

వాయుదేవుం డిట్లనియెను. కాలమున కాదిమానము నిమేష ము. శాంత్యతీతకళయే దాని కవధి. కనుఱెప్పపాటుకాలము నిమేషం బనియును, బదునేనునిమిషములు కాష్ఠ యనియు, ముప్పదికాష్ఠలు కళ యనియు, ముప్పదికళలు ముహూర్త మనియు, ముప్పదిముహూర్తము లొకదినంబనియు, ముప్పదిదినంబు లొకమాసం బనియు నెఱుంగునది. మాసమునకు శుక్లంబనియుఁ, గృష్ణం బనియు రెండుపక్షము లు గలవు. మానవులయొకమాసము పితృదేవతల కొకదినం బగును. ఆఱుమాసము లొక్కయయనంబును, రెండయనంబు లొకవత్సరంబు నగును. అట్టివత్సరము దేవతల కొకదినం బగును. అందు దక్షిణాయనము రాత్రియు, నుత్తరాయణము పగలు నని చెప్పుదురు. ఈమానముచేతనే దేవతలకు ముప్పదిదినంబులు మాసమును, ద్వాదశమాసములు వత్సరంబు నగును.మానవులమూఁడువందలయఱువదివర్షములు దేవతల కొకవర్షంబగును. దేవమానముచేతనే యుగసంఖ్యాగణనంబు చేయవలయును. భారతవర్షంబునఁ జతుర్యుగంబులు వ్యవహృతంబు లగుచున్నవి. కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలి యుగము నని నాలుగుయుగములు. దేవమానముచేఁ గృతయుగపరిమాణము చతుస్సహస్రవర్షములు. దానిసంధియు సంధ్యంశమును గూడఁ జతుశ్శతవర్షపరిమాణంబు గలిగియుండును. అవశిష్టంబు లగు మూఁడుయుగంబులును గ్రమంబుగా నొకదానికంటెనొకటి వేయివర్షంబులు తక్కువగా నుండును. వానిసంధులును, సంధ్యంశలునుగూడఁ బరిమాణంబులం దట్లే యుండును. సహస్రచతుర్యుగంబు లొకకల్పం బగును. డెబ్బదియొక్కచతుర్యుగంబు లొకమన్వంతరంబు. ఒకకల్పంబునందుఁ జతుర్దశమన్వంతరంబులు గడచును. ఈవిధముగా శతశతం

బులును, సహస్రసహస్రంబులు నగుకల్పాంతరములు గడచిపోయినవి. అవి యన్నియు నజ్ఞేయములు, నసంఖ్యేయములు నగుటంజేసి వానిం గూర్చి తెలుపుట సాధ్యంబు గాదు. ఒకకల్ప మవ్యక్తుం డగుబ్రహ్మ కొకపగలగును. సహస్రకల్పంబులు బ్రహ్మకొకవత్సరము. ఈరీతిగా నెనిమిదివేలవర్షంబులు బ్రహ్మకొకయుగంబును, అట్టిసహస్రయుగంబు లొకసవనంబును, అట్టిసవనంబులు త్రిసహస్రంబులైన నొకత్రివృతంబు నగును. అదియే బ్రహ్మకు జీవితకాలము. బ్రహ్మ కొకదినంబగులోపలఁ బదునాలుగురింద్రులును, మాసం బగులోపల నాలుగువందలయిరువదిమందిపురందరులును, సంవత్సరంబగులోపల నైదువేలనలువదిమందిశతమఖులును నిపతితు లగుదురు. బ్రహ్మజీవితకాలములోపల నైదులక్షలనలువదివేలకంటె నధికసంఖ్యలగునింద్రులు విలయంబు నందుదురు. విష్ణుదేవునికిఁ బ్రతిదినంబునందు నొకనూతనబ్రహ్మ యుదయించుచుండును. అట్లే రుద్రునియొక్కొక్కదినంబున కొక్కొక్కవిష్ణుం డుదయించుచుండును. మఱియు నీశ్వరునిదినదినంబునకు నొకనూతనరుద్రోదయ మగుచుండును. ఇట్లే సదాశివునకుఁ బ్రతిదినంబు నొకయీశ్వరవిలయంబగుచుండును. అట్టిసదాశివుఁడుగూడ సాక్షాచ్ఛివునియేకదినమాత్రస్థాయియే. సాక్షాచ్ఛివునిజీవితకాలంబున నైదులక్షలనలువదివేలమందిసదాశివులు విలయంబు నందుదురు. సాక్షాచ్ఛివప్రేరణముచేతనే కాలాత్ముఁడు ప్రవర్తించుచుండును. బ్రహ్మయుపే సృష్టికొకకాలాంతర మగును. అట్టికాలాంతరము పరమేశ్వరున కొకదివంబును, నంతియకాలము రాత్రియు నగును. ఆతనిదివాభాగంబు సృష్టియు, రాత్రిభాగంబు ప్రళయంబు నగుచున్నది. కేవలలోకసంగ్రహార్థమై యీవిధముగాఁ గాలకల్పనంబు సేయుటయే గాని నిజముగా నాతనికి దినరాత్రిప్రభృతికాలంబు లేవియును లేవు. సకలజీవులు

ను, ప్రజాపతులును, సకలమూర్తులును, సకలదేవదానవులును, సకలేంద్రియంబులును, ఇంద్రియభోగ్యవస్తువులును, పంచభూతములును, తన్మాత్రలును, భూతాదులును, బుద్ధియు, సకలదేవతలునుగూడ నా పరమేశ్వరునిదివాభాగంబునఁ బ్రవర్తిల్లుచు నాతనిరాత్రిభాగంబున విలయంబు గాంచుచుందురు. రాత్రి గడచినతోడనే మరల దిశాభాగంబున విశ్వసృష్టి యగుచుండును. ఎవ్వఁడు విశ్వాత్ముఁడో, యెవ్వని దివ్యశక్తి కర్మకాలస్వభావాదుల కలంఘ్యమైనదో, సకలజగంబు నెవ్వనియాజ్ఞాధీనమై యుండునో యట్టిమహాత్ముం డగుశంకరునకు నమస్కారము.

—♦ శక్త్యాద్యుత్పత్తికథనము. ♦—

మును లిట్లు ప్రశ్నించిరి. మహాత్మా! పరమేశ్వరుం డీవిశ్వము నంతను దనయాజ్ఞచే నెట్లు సృష్టించి ప్రతిష్ఠించి పరమం బగులీలాఖేలనముం గావించుచున్నాఁడు? అందు ప్రథమంబున సంభవించిన దేది? క్రమముగా నీయఖిలజగంబు నెట్లు విస్తీర్ణంబయ్యెను? మరల నేది తన విశాలకుక్షియం దీసమస్తమును గ్రసించుచున్నది?

వాయుదేవుం డిట్లనియెను. మహర్షిశేఖరులారా! శాంత్యతీతపదాలంకృతి యగుశక్తియే పరమేశ్వరునుండి మొట్టమొదట నుదయించెను. దానినుండి మాయయు, మాయనుండి యవ్యక్తంబు నుదయించెను. మఱియు శక్తినుండి శాంత్యతీతపదంబును, దానినుండి క్రమముగ శాంతిపదంబును, దానినుండి విద్యాపదంబును, దానినుండి ప్రతిష్ఠాపదంబును, దానినుండి నివృత్తిపదంబును గలిగెను. ఈశ్వరసృష్టిం గాంచి యిట్లు సంక్షేపముగాఁ జెప్పితిని. ఏక్రమముగా సృష్టియయ్యెనో దానికిఁ బ్రతిలోమక్రమంబుగా సంహారం బగుచుండును. ఈపంచసర్గోద్దిష్టం బగుసృష్టికంటె నితరసృష్టి యేదియును లేదు. వానిపం

చకళలచేతనే జగమంతయు వ్యాప్తంబై యున్నది. కారణం బగునవ్యక్త మాత్మచే నధిష్ఠితమైయుండి మహదాదివిశేషాంతం బగుసమస్తమును సృష్టించుచుండుననుట సర్వసమ్మతసిద్ధాంతమే. కాని యవ్యక్తం బచేతనం బగుటచేతను, బురుషుం డజ్ఞుం డగుటచేతను వారిరువురకును సృష్టివిషయంబునఁ గర్తృత్వంబు లేదు. ప్రధానపరమాణ్వాదులు సమస్తము నచేతనంబు లగుటం జేసి బుద్ధిమత్కారణం బగునొకవస్తుసాహాయ్యములేకుండ నవి స్వయముగా నేమియుం జేయఁజాలవు. ఈజగం బంతయు సావయవం బగుకార్యరూపంబునఁ దోఁచుచుండుటం జేసి దీనికిఁ గర్తయొకఁ డుండితీరవలయు నని యంగీకరింపవలసి యున్నది. కావున సమర్థుండును, స్వతంత్రుండును, సర్వశక్తిమంతుండును, సర్వవిదుండును, ఆదిమధ్యాంతరహితుండును, మహదైశ్వర్యసంపన్నుండును, మహాదేవుండు నగుమహేశ్వరుం డొకఁడు సకలజగత్కర్తయై యుండె నని గ్రహింపవలయును.

ఆసత్యవ్రతునిశాసనముచేతనే ప్రధానమునకుఁ (ప్రకృతి) బరిణామంబును, బురుషునకుఁ బ్రవృత్తియుఁ గలుగుచుండు నని పెద్దలు చెప్పుదురు. మూఢు లగువా రీవిషయమును విశ్వసింపఁజాలరు. సృష్ట్యారంభమునుండి ప్రళయపర్యంతమును గలకాలము బ్రహ్మకు శతవర్షాయుష్కాలంబని చెప్పంబడియెను. ఆకాలమునకుఁ బరంబనియు, దానియందర్ధభాగంబునకుఁ బరార్థంబనియు నామంబులు. పదార్థద్వయంబు గడచినచో మహాప్రళయం బగును. మహాప్రళయసమయంబునందవ్యక్తము వికారోపసంహారంబు గావించుకొని యాత్మయందు విలీనమై యుండును. అప్పుడు తమస్సత్వంబులు సమత్వంబుచే నొప్పుచుండును. ప్రకృతిపురుషులు సమానధర్మముతో నుందురు. తమస్సత్వగుణంబుల కప్పుడు భిన్నభావమును, న్యూనాధికభావమును

లేకుండుటచే నవి పరస్పరము నోతప్రోతభావంబున విలసిల్లుచుండును. ఈయుభయగుణంబులును సమత్వముం గాంచుటచే నెట్టివస్తువిభాగమునులేక సర్వము నంధకారమయమై యుండును. ఇట్లు జగంబంతయు నష్టావస్థయందుండఁగాఁ బూర్వోక్తంబగుమహేశ్వరునిరాత్రి గడచి పోవుచుండును. అట్లు గడచి మరల దినంబైనంతనే ప్రకృతి పురుషుని యందుఁ బ్రవేశించి మాయాయోగంబునఁ బ్రచలితంబగుచుండును. అనంతరము పరమేశ్వరాజ్ఞచే నవ్యక్తమునుండి మరల నుత్పత్తివిలయంబులకై సకలభూతంబులును సృష్టింపంబడును. ఎవ్వనియిచ్ఛానుసారముగా నుత్తరోత్తరవిచిత్రం బగువిశ్వముత్పన్నంబగుచుండునో, యెవ్వని శక్తియందలియేకాంశముచేతనే సమస్తమును నిశ్శేషం బగుచుండునో, అధ్వవిదులగువా రెవ్వని సమస్తఘననియామకునిగాఁ బ్రశంసించుచుందురో యట్టిసకలలోకవిలక్షణుం డగుపరమాత్మునకు నమస్కారము.

లోకోత్పత్తివర్ణనము.

వాయుదేవుఁ డిట్లనియెను. పూర్వము పురుషాధిష్ఠితం బగు నవ్యక్తమునుండి క్రమముగా బుద్ధిమొదలుగవిశేషాంతంబువఱకునుగల వికారము లన్నియు నుదయించెను. అనంతర మావికృతులనుండి రుద్రుండును, విష్ణుండును, బ్రహ్మయునను దేవతలు జగత్కారణరూపులై యుదయించిరి. వారిశక్తి యెల్లయెడల నకుంఠితమై సర్వవ్యాప్తమయ్యెను. వారివిజ్ఞానమును, అణిమాద్యైశ్వర్యములును నప్రతిమానములైనవి. పరమేశ్వరుఁ డీబ్రహ్మవిష్ణురుద్రుల సృష్టిస్థితిలయకార్యములయందు హేతుత్వముం గాంచి ప్రభుత్వముతోఁ బ్రసన్నుఁడై యుండును. కల్పాంతరమునందు మహేశ్వరుఁడు వారికే మరల సృష్టిస్థితిలయకార్యములను బ్రత్యేకముగ విభాగించి యొసంగును. వీరు పరస్పరోత్పన్నులై, పరస్పరాధారులై, పరస్పరానుగమనంబు గావించుచుఁ

బరస్పరసాహాయ్యముచే బుద్ధిప్రాప్తు లగుచుందురు. ఒకచో బ్రహ్మయు మఱియొకచో విష్ణుండును, నింకొకచో రుద్రుండును బ్రశంసితు లగుచుందురు. ఇంతమాత్రముచే వారొకరికంటె నొకరధికులుగాని, యతిరిక్తులుగాని కారు. వీరిలో నొక్కని నధికునిగను, నితరుల నల్పులుగను భావించువారు పిశాచములు రాక్షసులునై జన్మింతురు.

గుణత్రయాతీతుం డగుమహేశ్వరుఁడు బ్రహ్మకాలవిష్ణురుద్రులనుచతుర్వ్యూహంబుగా విభక్తుండై, సర్వాత్మకుండును, సర్వాధారుండును, శక్తిసంభవకారణుండు నై యుండును. ఆతఁ డీశ్వరస్వరూపుఁడై యుండి రుద్రాద్యాత్మమూర్తిత్రయంబునకును, బ్రకృతిపురుషులకును గ్రీడార్థమై జగత్సృష్టి గావించుచుండును. సర్వశ్రేష్ఠుండును, నిష్కలుండును నగుపరమేశ్వరుఁడు సకలవస్తువుల కాధారుండును, సకలవస్తువులయం దాత్మరూపముచే నధిష్ఠితుండు నై యుండును. కావుననే మహేశ్వరుఁడును, బ్రకృతియుఁ, బురుషుండును, సదాశివుండును, భవుండును, విష్ణుండును సకలంబును సదాశివాత్మకమని చెప్పంబడును.

ప్రధానమునుండి మొట్టమొదట బుద్ధి యుదయించెను. అది మహత్తు, మఱియనునామంబులచేఁ బ్రసిద్ధమై యుండును. ఆమహత్సంక్షోభంబుచేఁ ద్రివిధంబులుగ నహంకారం బుత్పన్నం బయ్యెను. అహంకారమునుండి పంచభూతములును, బంచతన్మాత్రలును, బంచేంద్రియంబులును బుట్టెను. సత్త్వాహంకారమునుండి సాత్త్వికవస్తువు లుదయించెను. ఈవైకారిక, సాత్త్వికసర్గంబు లొక్క సమయమునందే ప్రవృత్తంబు లగుచుండును. సాత్త్వికాహంకారమునుండి జ్ఞానేంద్రియపంచకంబును, గర్మేంద్రియపంచకంబును బుట్టెను. మనం బేకాదశేంద్రియము. అది యాత్మగుణానుసారంబుగాఁ గర్మజ్ఞానేంద్రియాత్మకమై యుండును. తామసాహంకారమునుండి భూతములును, దన్మాత్రలు

నుదయించెను. ఇది భూతంబుల కాది యగుటచే దీనికి భూతాది యనునామంబు గలిగెను. ఈభూతాదినుండి శబ్దతన్మాత్రయు, దానినుండి యాకాశంబును, గగనమునుండి స్పర్శయు, దానినుండి వాయువును, వాయువునుండి రూపంబును, దానినుండి తేజంబును, తేజమునుండి రసంబును, దానినుండి యుదకంబును, జలమునుండి గంధంబును, దానినుండి పృథ్వియు నుద్భూతంబు లయ్యెను. అనంతరము పంచభూతంబులనుండియుఁ జరాచరసృష్టి యయ్యెను.

పురుషాధిష్ఠానమువలనను, అవ్యక్తానుగ్రహమువలనను మహదాదివిశేషాంతంబును గలసృష్టిపదార్థము లన్నియు నొకయండము నుద్భవింపఁజేసెను. బ్రహ్మకుఁ గార్యకారణసంసిద్ధి లభించినప్పు డాయండమునందు బ్రహ్మసంజ్ఞుం డగుక్షేత్రజ్ఞుండు ప్రవృద్ధుం డయ్యెను. ప్రథమశరీరి యగునాతనినే పురుషుఁడందురు. ఆబ్రహ్మయే సకలభూతంబులకు నాదికర్త. అభిమానియగునాతనినుండి యప్రతిమానంబును, జ్ఞానవైరాగ్యలక్షణయుక్తంబును, ధర్మైశ్వర్యకరంబును, బ్రాహ్మీనామకంబు నగుబుద్ధి యుత్పన్నం బయ్యెను. బ్రహ్మదేవుండు తనమనంబున సంకల్పించినయెల్లవస్తువులునుగూడ సవ్యక్తమునుండి యుదయించెను. ఆతఁడు స్వభావవశీకృతుండును, త్రిగుణపరాపేక్షుండునగుటచేఁ ద్రిలోకమధ్యంబునఁ దన్నుఁదాను త్రిభాగములుగా విభజించుకొని యొకరూపముతో సృష్టియు, నొకరూపముతో సంహారమును, నొకరూపముతోఁ బాలనమును గావించుచుండును.

స్వయంభూతుం డగునాతఁడు బ్రహ్మత్వమునందుఁ జతుర్ముఖుండును, గాలత్వమునం దంతకుండును, బరిపాలనవిషయంబున సహస్రశీర్షుండునై మూఁడవస్థలచే విరాజిల్లుచుండును. ఆప్రభునకు సృష్టికార్యంబునందు సత్వరజోగుణంబులును, సంహారకార్యమునందుఁ ద

మోగుణంబును, సంరక్షణకార్యమునందుఁ గేవలసత్త్వగుణంబును నీవిధ ముగా ముత్తెఱంగుల గుణవృద్ధి యగుచుండును. ఆతనిబ్రహ్మత్వము నందు లోకసృష్టియు, కాలత్వమునందు లోకసంహారము నగుచుండు ను. పురుషత్వమునం దాతఁడుదాసీనుఁడై యుండును. ఇట్లాతనికర్మం బు త్రివిధంబై యున్నది. ఇట్లాతఁడు త్రివిధంబుల విభక్తుం డైనప్పుడు త్రిగుణుం డనియుఁ జతుర్విధంబుల విభక్తుం డైనప్పుడు చతుర్వ్యూ హుం డనియుఁ బ్రశంసితుం డగుచుండును. సకలంబున కాది యగు టచే నాదిదేవుం డనియు, జన్మము లేకుండుటచే నజుం డనియు నాతఁ డు కీర్తింపఁబడుచుండును. సమస్తప్రజలను బరిపాలించుటచే నాతని కిఁ బ్రజాపతి యనునామము గలిగెను.

అమ్మహాత్ముం డగుబ్రహ్మకు హిరణ్మయం బగుమేరువు గర్భా శయంబును, సముద్రంబు లన్నియు గర్భోదకంబులును, సకలపర్వతం బులును జరాయువు నై యుండును. ఆబ్రహ్మాండమధ్యంబునందు సక లలోకంబులును, సమస్తజగంబును, గ్రహనక్షత్రసహితులగుసూర్య చంద్రులును, వాయువును నివసించి యుందురు. అయ్యండోపరిభాగ ము దశగుణాధికజలంబుచేతను, ఆజలోపరిభాగము దశగుణాధికతేజము చేతను, ఆతేజోపరిభాగము దశగుణాధికవాయువుచేతను, అయ్యనిలోపరి భాగము దశగుణాధికాకాశముచేతను, అయ్యాకాశము పూర్వోక్తభూ తాదులచేతను, ఆభూతాదులు మహత్తత్త్వముచేతను, ఆమహత్తత్త్వ మవ్యక్తము (ప్రకృతి) చేతను నావృతంబులై యుండును. ఈవిధము గా బ్రహ్మాండము సప్తప్రాకృతావరణములచే నావృతమై యుండును. అయ్యండమును బరస్పరావృతంబు లగునష్టప్రకృతులు నావరించి యుండును.

వికారము (కార్యము) లన్నియు, వికారుల (కారణములు) యం

దాధారాధేయభావముతో నుండును. కూర్మము తనసకలాంగకముల ను వ్యాకోచములుగను, సంకోచములుగను జేసికొనుచుండునట్లే, యవ్యక్తము తనసకలకార్యములను విస్తరింపఁజేయుచుఁ దనయందే విలీనములుగాఁ జేసికొనుచుండును. అవ్యక్తప్రభవంబులగుసకలవస్తువులు ననులోమక్రమంబున నుదయించి ప్రళయకాలంబునందుఁ బ్రతిలోమక్రమంబున విలీనంబులగుచుండును. త్రిగుణంబులును గాలవశంబున సమంబులును, విషమంబులునై యుండును. వానిసమభావమునందే లయంబును, వానివిషమభావమునందే సృష్టియు నగుచుండును.

బ్రహ్మాద్యధిష్ఠానం బగుబ్రహ్మాండము మహత్తత్త్వమైనది. అది బ్రహ్మకు క్షేత్రంబగుటచే నాతనికి క్షేత్రజ్ఞుండనునామము గలిగెను. ఇట్టివి సహస్రకోటిబ్రహ్మాండములు గలవు. ప్రకృతి సర్వగతంబగుటంజేసి యవియన్నియుఁ దిర్యగూర్ధ్వాధోభాగస్థితంబులై యుండును. ప్రత్యండమునందును బ్రత్యేకముగ బ్రహ్మవిష్ణురుద్రులు నివసించియుందురు. మహేశ్వరుఁడు ప్రకృతికిఁ బరుండై యుండును. బ్రహ్మాండము ప్రకృతిసంభూతమైనది. ఆయండమునుండి పరమైశ్వర్యశాలియగు బ్రహ్మ యుదయించి సకలలోకంబులను సృజించెను. ఈప్రకృతసృష్టి కంతకును నజ్ఞానరూపం బగునవిద్యయే కారణము. పరిణామమునం దిది యంతయు నొక్కసారియే విలయంబు నొందును. ఇది పరమేశ్వరుని కొక లీలామాత్రము.

అజ్ఞేయంబును, వ్యాపకంబు నగుప్రధానమే యీజగంబునకుఁ గారణము. అన్యంబు లగుసకలకారణంబులును దానినుండియే సంభవించెను. అది యాదిమధ్యాంతరహితంబును, అనంతవీర్యసంపన్నంబును, సత్వరజోగుణాన్వితంబును, పురుషసంయుతంబు నై యుండును. ఈప్రధాన ముత్పాదనక్షమంబును, అతిరిక్తరజస్సంయుక్తంబు నగుటంజేసి

యిది మొట్టమొదట లోకవిస్తారవృద్ధి హేతుభూతంబు లగునష్టవికార ములను సృజియించెను. అంతకాలంబున మరల నిదియే వీని నన్నిటి ని గ్రసించుచుండును. అప్రాకృతుండును, బరమైశ్వర్యశాలియు నగు మహేశ్వరునియిచ్ఛామాత్రముచేతనే ప్రళయకాలమునందు సకలకా రణంబులును బ్రకృతియందు విలీనంబు లగుటయు, సృష్టికాలంబున మరల నవి యన్నియుఁబ్రవృత్తంబులగుటయు సంభవించుచుండును.

పృథ్వీమండలోద్ధారణము.

వాయుదేవుం డిట్లు చెప్పందొడంగెను. బ్రహ్మదేవునిజీవితకాల మునందలి పూర్వోత్తరభాగంబులు పరార్థపరిమితంబులై యుండును. ఆయుభయపరార్థంబులయందును సృష్టియు, సంహారము నగుచుండు ను. సకలంబున కాదియగు నాబ్రహ్మదేవుని యొక్కొక్కదినంబునకుఁ బదునలుగురు మనువులు పరివర్తితు లగుచుందురు. అనాదులును, అనంతములును, అవిజ్ఞేయములు నగుటంజేసి, సమస్తమన్వంతరములం గూర్చియు, సకలకల్పములంగూర్చియుఁ బ్రత్యేకముగ వర్ణించి చెప్పు ట యశక్యము. అట్లు ప్రత్యేకించి యభివర్ణించుటవలనఁగూడ విశేష ప్రయోజనం బేమియును లేదు. కావున నేనిప్పు డట్లు వర్ణింపఁదలఁచు కొనలేదు. సకలకల్పమధ్యంబునను నిప్పుడు జరగుచున్నకల్పమునందుఁ గూడ ననేకములగు సృష్టిప్రళయములు జరగుచునే యున్నవి. వర్త మానం బగునిది వారాహకల్పంబు. ఈకల్పమునందును జతుర్దశమ న్వంతరములు గలవు. స్వాయంభువాదు లగునేడ్గురును, సావర్ణ్యాదు లగునేడ్గురును గలసి చతుర్దశమనువులు. అందు వైవస్వతుం డనుసప్త మమనువు, వర్తమానకాలంబున కధీశ్వరుండు. సకలమన్వంతరముల యందును, సృష్టిసంహారము లొక్కరీతిగనే యుండు నని బుద్ధిమంతు లగువా రూహింపుకొనవలయును.

పూర్వకల్పాంతంబునఁ బ్రళయప్రభంజనాహతిం జేసి సకలవనంబు లున్మూలితంబులగుచుండఁ, బ్రళయానలజ్వాలలచే సకలజగంబును శుష్కతృణసమూహంబుం బోలి దగ్ధంబై పోవుచుండఁ, బ్రళయధారాధరంబు లెడతెగకుండ వర్షించుచుండ, సకలార్ణవంబులు నుద్వేలంబులై యతిదారుణంబుగఁ బొంగిపొరలుచుండ మహత్తరం బగుజలంబుచే సకలదిశలును నిమగ్నములై పోయెను. అప్పు డాప్రళయసముద్రము చటులోత్తుంగతరంగభుజమండలవిక్షేపంబు గావించుచు, భయంకరతాండవము సేయుచుండ నారాయణుండును, బ్రహ్మయు నభిన్నులై యాసలిలోపరిభాగంబున సుఖనిద్రం గాంచుచుండిరి. బ్రహ్మదేవుం డప్పుడు నారాయణు నుద్దేశించి " జలము నరప్రభవం బగుటచే దానికి నారం బనుపేరు గలిగెను. ఆనరునకుఁ బ్రళయకాలమునం దానారమే విశ్రమస్థాన మయ్యెను గావున నాతనికి నారాయణుం డనునామము గలిగెను." అను నర్థమిచ్చుశ్లోకమును బఠించెను.

అట్లు శివయోగమయం బగునిద్రయందు నిమగ్నుండై త్రిదశేశ్వరుం డగునారాయణుం డున్నసమయంబున సిద్ధులును, జనలోకనివాసులగు దేవగణంబులును నాతని మేల్కొల్పుటకై ప్రభాతస్తోత్రపాఠములఁ గావించుచుండిరి. అనంతరము భగవానుం డగునారాయణుండు ప్రబుద్ధుండై జలశయనంబునుండి లేచి యోగనిద్రాలసంబులగుకటాక్షంబులచే సకలదిశలను బరికించెను. అప్పు డాతనికిఁ దనకంటె నన్యం బేమియును గోచరింపలేదు. అందుచే నాతఁ డతివిస్మయంబునఁ గూర్చుండి చింతానిమగ్నుం డయ్యెను. మహామహీధరనదీనగరకాననాదినానావిధవస్తుపరిశోభితయు, మనోహారిణియు, భగవతియు నగుపృథ్వి యెటనున్న దని బ్రహ్మదేవుండు తనమనంబునఁ జింతించుచు భూస్థితిని గ్రహింపఁజాలక తనతండ్రి యగుత్రిలోచనుని స్మరించుకొనియె

ను. మహాదేవస్మరణమాత్రంబున నాతనికి భూదేవి సలిలనిమగ్నయై యున్నట్లు బోధపడియెను. అప్పుడు ధరణీపతి యగుప్రజాపతి పృథ్వి నుద్ధరించునుద్దేశముతో జలవిహారసమర్థంబగు దివ్యవరాహరూపమును స్మరించుకొనియెను.

ఆవరాహము శైలసన్నిభవిగ్రహంబుతోడను, మహామేఘనిస్వనంబుతోడను, నీలమేఘమువంటి కాంతితోడను, భయంకరాకారముతోడను, దారుణంబగుఘుర్ఘురధ్వానముతోడను, పీనవర్తులస్కంధంబులతోడను, పీనోన్నతకటిమండలముతోడను, హ్రస్వంబులును, వృత్తంబులు నగునూరుజంఘాగ్రములతోడను, సుతీక్ష్ణంబులగుఖురంబులతోడను, పద్మరాగమణులంబోని వర్తులంబులగు భీషణేక్షణంబులతోడను, వర్తులంబును, దీర్ఘంబునగుదేహముతోడను, స్తబ్ధంబులును, దీర్ఘంబులు నగుకర్ణంబులతోడను, ప్రళయార్ణవమును ఘూర్ణిల్లఁజేయుచున్నశ్వాసప్రశ్వాసంబులతోడను, గండభాగంబులఁ బ్రకాశించుచున్నజటాపటలంబుచే నాచ్ఛన్నంబులైన స్కంధప్రదేశములతోడను విరాజిల్లుచు విచిత్రమణిభూషణాలంకృతమై విద్యుద్విరాజితంబగుఘనాఘనముంబోలి శోభిల్లుచుండెను.

బ్రహ్మదేవుం డిట్లతిబలిష్ఠం బగువరాహమూర్తిం దాల్చి భూతలోద్ధరణార్థమై రసాతలంబునఁ బ్రవేశించెను. మహాశైలసన్నిభంబగు మహాకాయముం దాల్చి యున్నయావరాహమూర్తి శివలింగపాదపీఠముంబోలి విలసిల్లుచుండెను. అనంతర మాపృథ్వీధరం బగువరాహము ప్రళయజలధినిమగ్నం బగుధరామండలమును దసదంష్ట్రాగ్రంబులచే రసాతలమునుండి యుద్ధరించెను. అట్లు గావించిన వరాహమూర్తిం గాంచినంతనే జనలోకనివాసులగుసిద్ధమునిగణంబులు పరమానందముతో నృత్యంబులు సేయుచు నాతనియుత్తమాంగమునందుఁ బుష్పవృ

ష్టిం గురియించిరి. అప్పు డామహావరాహమూర్తి శరీరంబంతయుఁ బుష్పమాలికలచే నలంకృతమై, ఖద్యోతమాలికాశోభితంబగుసమున్న తనీలమహీధరముంబోలి శోభాసంపన్నుం బయ్యెను.

అనంతర మవ్వరాహమూర్తి యతివిశాలంబగునీభూమండలము నెప్పటియట్ల స్థాపించి మరల నిజస్వరూపముం దాల్చి దానిని సమతలంబున నెలకొల్పి పర్వతంబులను యథాస్థానంబులఁ బ్రతిష్ఠించి పూర్వమువలెనే మరల భూమ్యాదిచతుర్లోకంబులను సృష్టించెను. విశ్వకర్మయగువిధాత యీవిధముగాఁ బర్వతసహితంబుగా భూమండలమును బ్రళయార్ణవమునుండి యుద్ధరించి మరలఁ జరాచరాత్మకంబగుజగంబంతయును సృష్టించెను.

—♦ సృష్టినిరూపణము. ♦—

బ్రహ్మదేవుండు బుద్ధిపూర్వకంబుగ సర్గచింతానిమగ్నుండై యున్నసమయంబునఁ దమోమయం బగుమోహం బుత్పన్న మయ్యెను. అప్పు డమ్మహాత్మునకుఁ దమోమోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము, అవిద్యయు సంభవించెను. ధ్యానపరాయణుండును, అభిమానియు నగుబ్రహ్మదేవునిచేఁ గావింపంబడుచున్నపంచవిధంబులగుసృష్టియు నప్పుడు బీజసమూహముచేఁ గుంభంబునుంబోలి యంతటను దమోగుణంబుచే నావృతంబయ్యెను. అది బహిరంతస్తేజోవిహీనంబును, స్తబ్ధంబును, నిస్సంజ్ఞంబు నై యుండెను. ఆవస్తువుల కన్నిటికిని బుద్ధియు, ముఖ్యేంద్రియంబులునుగూడ సమాచ్ఛన్నంబు లై పోవుటచే నవి నగంబు లయ్యెను. ఇట్లు ప్రథమసృష్టియంతయు నసాధకం బగుటం గాంచి బ్రహ్మదేవుండప్రసన్నహృదయుండై ద్వితీయసృష్టిని సంకల్పించెను. ఆతనిసంకల్పమువలన నప్పుడు తిర్యక్స్రోతంబగుసర్గం బయ్యెను. అది యంతఃప్రకాశకంబును, బహిరావృ

త్తంబు నగుటం జేసి యందలివస్తువు లన్నియును కుటిలగమనయుతంబులును, స్వభావముచే నసన్మార్గంబులును బహుస్వరూపములు నయ్యెను. ఆసృష్టియుఁ దనయభిప్రాయసాధనంబున కసమర్థం బగుటచే బ్రహ్మదేవుండు మఱియొకసృష్టిని సంకల్పించెను. అందువలన సత్వగుణప్రధానం బగు దేవసృష్టి యయ్యెను. అందలిజీవులు బహిరంతరముల యందెట్టియావరణంబును లేక విశేషముగ సుఖప్రీతియుక్తులై యుండిరి. వారుప్రకాశమయులును, బ్రకాశమయస్వభావులు నగుటచే దేవనామంబునఁ బ్రసిద్ధులైరి. ఇంతమాత్రంబున విధాత సంతుష్టుండు గాక మరల ధ్యానపరాయణుం డయ్యెను. అందువలన నాతనియభిమతార్థసాధకంబును, దుఃఖబహుళంబు నగుప్రజాసర్గం బయ్యెను. అందలిజీవులు బహిఃప్రకాశశీలురును, అంతస్తమోమయులును, రజోగుణప్రధానులు నై యుండిరి.

పంచమం బగు ననుగ్రహసర్గము చతుర్విధంబులఁ బరగుచుండును. విపర్యము, శక్తి, తుష్టి, సిద్ధి యనునాల్గింటిచేతను నాల్గువిధంబులుగా నాసృష్టియయ్యెను. అందుఁజేరనివారందఱును స్త్రీధనాదుల యందాసక్తులై యుందురు. వారు కేవలమును భక్షణాదులయం దాసక్తులును, భూతప్రేతపిశాచాదినామంబులచేఁ బ్రసిద్ధులు నై యుందురు. పరమేష్ఠి యగుబ్రహ్మ మొదట మహత్సృష్టిని, దదనంతరము తన్మాత్రసృష్టినిగావించెను. అదియే భూతసర్గము. తృతీయంబగువైకారికసృష్టికి, ఐంద్రియకం బగునామము గలదు. ఈప్రాకృతసర్గ ము బుద్ధిపూర్వకమైనది. స్థావరంబులు ముఖ్యంబులగుటం జేసి చతుర్థసర్గము ముఖ్యంబయ్యెను. తిర్యక్స్రోతనామకంబగుపంచమసృష్టియందుఁ, బహుపశ్వాదు లుత్పన్నంబులయ్యెను. తరువాత నూర్ధ్వస్రోతనామకం బగుషష్ఠసర్గము దేవసర్గం బని చెప్పుదురు. అంతట నర్వాక్స్రోతా

దిసృష్టి. సప్తమం బగునది మానుషసర్గంబు. అష్టమం బనుగ్రహసర్గం
బును, నవమంబు కౌమారసర్గంబు నని చెప్పుదురు.

ప్రథమోక్తంబు లగుప్రాకృతసర్గంబులుమూఁడును, అబుద్ధిపూర్వకములు. ముఖ్యాదివైకృతసర్గంబు లైదును బుద్ధిపూర్వకములు. పూర్వము బ్రహ్మదేవుండు తనమానసపుత్త్రులనుగా సనందుఁడు, సనకుఁడు, విద్వాంసుఁ డగుసనాతనుఁడు, ఋభుఁడు, సనత్కుమారుఁడు ననువారిని బ్రథమంబున సృజించెను. వారందఱును, వీతరాగులును, విమత్సరులు నగు యోగులై నిరంతరపరమేశ్వరధ్యానాసక్తు లగుట వలన వారికిఁ బ్రజాసృష్టియం దభిలాష లేకపోయెను. వారందఱును సృష్టిక్రియాపరాఙ్ముఖు లై పోవుటయు మఱల సృష్టి చేయవలయు నని సంకల్పించి బ్రహ్మదేవుండు మహోగ్రం బగుతపంబు గావించెను.

ఇట్లు తపంబు చేయుచున్నయాతనిచే నేమియుం గాకపోయెను. చిరకాలము తపించుటచే నాతనికి దుఃఖము గలుగుటచేఁ గ్రోధ ముదయించెను. అందుచే నాతనినేత్రములనుండి యశ్రుబిందువులు వెలువడుటయు వానినుండి భూతప్రేతాదులు పుట్టెను. వానినన్నిటిం గాంచి యజుండు తన్నుఁదానే నిందించుకొనియెను. అప్పు డాతనికిఁ గ్రోధామర్షంబులచే మూర్ఛ గలుగుటయు, క్రోధావిష్టుం డగునాతఁడు ప్రాణములను విడిచెను. అప్పుడు ప్రాణేశ్వరుండును, నీలలోహితుండును, భగవానుండు నగురుద్రుండు పరమానుగ్రహంబు గావించుటకై ప్రభుండగు బ్రహ్మదేవునిముఖమునుండి ప్రాదుర్భవించి సకలేశ్వరుం డగు నాతఁడు తన్నుఁదా నేకాదశవిధంబులుగా విభజించుకొనియెను. వారేకాదశరుద్రులైరి. వారయ్యీశ్వరునిచే "వత్సలారా! లోకానుగ్రహార్థమై మీరు నాచే సృష్టింపఁబడితిరి. కావున సమస్తలోకసంస్థాపనంబునకును, హితంబునకును బ్రజావృద్ధిహేతుస్వరూపులగుమీ రనలసు

లై ప్రియత్నింపుఁడు." అని బోధింపఁబడి వారందఱును రోదనము చేయుచు నలుదెసలఁ బరుగులెత్త నారంభించెను. అందుచే వారికి రుద్రనామంబు గలిగెను. ఆరుద్రులే ప్రాణస్వరూపులు. కావుననే వారు మహాత్మకులు.

అనంతరము బ్రహ్మపుత్త్రుం డగుమహేశ్వరుఁడు దయావిష్టుం డై మృతుం డగుబ్రహ్మను మరల జీవింపఁజేసి ప్రహృష్టహృదయుం డై బ్రహ్మదేవు నుద్దేశించి సాధువాక్యంబులతో నిట్లనియెను. ఓజగద్గురూ ! విరించీ ! నీవు భయపడవలదు. నేను నీకుఁ బ్రాణంబులఁ గల్పించితిని. ఓసువ్రతా ! నీవిఁక సుఖముగా లెమ్ము ! అనుటయు బ్రహ్మదేవుండు స్వప్నానుభూతుండునుబోలి యామనోహరవచనంబుల నాకర్ణించి ప్రఫుల్లనయనకమలంబులతో నల్లనల్లన మహాదేవు నీక్షించి యాదేవునివలనఁ దనకు మరలఁ బ్రాణంబులు లభించిన వని యెఱింగి కృతాంజలియై మేఘగంభీరస్వరంబున నోమహాభాగా ! నీవు నాహృదయానందకరుండ వైతివి. ఓవిశ్వమూర్తీ ! ఏకాదశరూపంబులతో నున్ననీ వెవ్వరు ? అని ప్రశ్నించుటయు సుముఖుం డగునమ్మహేశ్వరుండు పద్మగర్భుని దనహస్తద్వయంబుచే స్పృశించుచు మహాత్మా ! నేను నీకుఁ బుత్త్రుండ నగుపరమాత్ముఁడ నని యెఱుంగుము. ఈయేకాదశరుద్రులును నీసంరక్షణంబుకొఱకు వచ్చియున్నారు. కావున నీవిఁక నాయనుగ్రహంబుచే ఘోరమోహపరిత్యక్తుండవై, ప్రబుద్ధుండవై మరల నెప్పటివలెఁ బ్రజాసృష్టి గావింపుము.

అని భగవానుం డానతిచ్చుటయు విశ్వాత్ముం డగువిధాత యతిప్రీతుండై నామాష్టకంబున నద్దేవు నిట్లు వినుతింపఁదొడంగెను. ఓరుద్రదేవా ! భాస్కరామితతేజోమయుండ వగునీకు నమస్కారము. ఓదేవా ! రసజలమయాత్ముండవు, భవుండవు నగునీకు నమస్కారము.

ఓశర్వా! సర్వదా సౌరభమయక్షితిస్వరూపుఁడ వగునీకు నమస్కారము. ఓయీశ్వరా! స్పర్శమయవాయుస్వరూపుఁడ వగునీకు నమస్కారము. ఓపశుపతీ! అతితేజోమయపావకస్వరూపుఁడ వగునీకు నమస్కారము. ఓభీమా! శబ్దమయస్వరూపుఁడ వగునీకు నమస్కారము. ఓయుగ్రమూర్తీ! యజమానస్వరూపుఁడ వగునీకు నమస్కారము. ఓమహాదేవా! అమృతమయసోమస్వరూపుఁడ వగునీకునమస్కారము. అని యీవిధముగా స్తోత్రంబు సేయుచుఁ బద్మజుండు వినతుండై యాతని నిట్లు ప్రార్థింపందొడంగెను. భగవానుండ వగు సోమహేశ్వరా! నీవు నాకుఁ బుత్త్రుండవు. మఱియు భూతభవిష్యద్వస్తువుల కధీశ్వరుండవు. ఓయనంగదమనా! సృష్టివర్ధనంబునకై నీవు మదీయాంగమునుండి యుదయించితివి. కావున నోప్రభూ! ఈమహత్సృష్టికార్యంబునఁ బ్రవృత్తుండనై యున్ననాకు సాహాయ్యంబు గావింపుము. ప్రజాదిసృష్టిం గావింపుము.

శంకరుండును, త్రిపురమర్దనుండు నగురుద్రుం డీరీతిగా విధాతచే యాచితుండై యట్లే చేయుదు నని యనుగ్రహించెను. అప్పుడు భగవంతుం డగుపద్మాసనుండు ప్రహృష్టాంతఃకరణుండై యద్దేవునకు వందనంబు లొనరించి యాతనిచే సృష్టికరణంబున కనుజ్ఞాతుండై మరలఁ దనమనంబునుండి మరీచి, భృగువు, అంగిరసుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, దక్షుఁడు, అత్రి, వసిష్ఠుఁడు ననువారిని సృజించెను. వీరికంటె ముందుగా నాతఁడు ధర్మని, సంకల్పుని సృజించెను. రుద్రునితోఁగూడ నీపన్నిద్దఱును బ్రథమంబున బ్రహ్మనుండియుదయించిరి. వీరే ప్రాచీనగృహస్థులుగాఁ బ్రశంసితు లగుచున్నారు. వీరివలననే దివ్యంబులును, దేవగణార్చితంబులు నగు ద్వాదశవంశము లయ్యెను. ఈవంశము లన్నియుఁ బ్రజావంతములును, గ్రియావంతములును, మ

హాష్షసమలంకృతములు నై యుండెను.

అనంతరము బ్రహ్మదేవుండు రుద్రసహితుండై యాజలంబునం దు దేవాసురపితృమానవులను సృష్టింపందలంచి సమాధినిష్ఠుండై తన ముఖమునుండి దేవగణంబులను, కటిప్రదేశమునుండి పితృగణంబులను, జఘనమునుండి యసురగణంబులను, లింగమునుండి మానవగణంబులను బుట్టించెను. ఆతనిమలనిర్గమస్థానమునుండి క్షుధావిష్టు లగురాక్షసులుదయించిరి. వారందఱును రజస్తమోగుణప్రధానులును, బలిష్ఠులును నిశాచరులు నైరి. మఱియు నాతనిపార్శ్వదేశంబులనుండి నాగ,యక్ష, భూత, గంధర్వ, వయోగణంబులును, వక్షస్థలమునుండి పక్షులును, ముఖమునుండి ఛాగంబులును, పాదంబులనుండి గజ, తురగ, శరభ, గవయాదిసకలమృగంబులును, రోమంబులనుండి యోషధులును, సకల ఫలమూలంబులును నుదయించెను.

ఆతఁడు తనప్రథమముఖమునుండి గాయత్రియు, ఋగ్వేదంబును, త్రివృత్స్తోమంబును, రథంతరంబును, అగ్నిష్టోమంబును బుట్టించెను. దక్షిణముఖమునుండి యజుర్వేదమును, త్రిష్టుప్ఛందమును, పంచదశస్తోమమును, బృహత్స్తోమమును, ఉక్థంబును సృజించెను. పశ్చిమముఖమునుండి సామవేదమును, జగతీచ్ఛందమును, సప్తదశస్తోమమును, వైరూపాతిరాత్రింబులను గలిగించెను. ఉత్తరముఖమునుండి యథర్వవేదమును, ఆప్తోర్యామాణంబును, అనుష్టుప్ఛందంబును, వైరాజనామకం బగుసామమును బుట్టించెను. ఆతనిశరీరమునుండి నానావిధ భూత, యక్ష, పిశాచ, గంధర్వగణంబులును, అప్సరోగణంబులు నుదయించిరి. మఱియు నర, కిన్నర, రాక్షస, పశు, పక్షి, మృగ, సర్పాదులును, స్థావరజంగమాత్మకంబు సవ్యయంబు నగునీజగంబంతయు నుదయించెను.

వీరికందఱకును బూర్వసృష్టియం దెట్టి కర్మము గలదో ప్రతిసృష్టియందునట్టికర్మమే ప్రాప్తించుచుండును. జీవులందఱు నీశ్వరప్రేరితులై హింసాహింస, మృదుక్రూర,ధర్మాధర్మ, సత్యాసత్యములందాసక్తులై యుందురు. దేనియందాసక్తి గలవారి కదియే ప్రియముగానుండును. విధాత స్వయముగా మహాభూతములయందును, ఇంద్రియంబులయందును, భోగ్యవస్తువులందును, ముక్తులయందును నానావిధత్వమును, జీవులకు వానియందు వివిధప్రవృత్తులను గల్పించెను. అనంతరమాతఁడు వేదశబ్దములనుండి ప్రథమంబునఁ బ్రాకృతభూతాదులకు నామరూపంబుల విస్తరింపఁజేసెను. అజుండు తననిశావసానంబునందు సృష్టింపంబడినసకలపదార్థములకును వేదంబులయందు నిర్దిష్టంబులైన నామస్థానంబులను బ్రసాదించెను. కారణోద్భూతం బగునీబ్రహ్మసృష్టి యంతయు మహదాదివిశేషాంతంబునుగల వస్తువులయొక్కయు, సాక్షాత్ప్రకృతియొక్కయు వికారస్వరూపమే.

అది చంద్రసూర్యప్రభలచేఁ బ్రకాశితంబును, గ్రహనక్షత్రాదులచే రమణీయంబును, నదీనదసాగరశైలనగిరజనపదాదులచే నలంకృతంబును నై యుండును. ఈబ్రహ్మస్వరూపసనాతనవృక్షముమహేశ్వరానుగ్రహంబనుజలంబుచేఁ దడుపఁబడి యవ్యక్తమునుండి యుత్పన్నంబైనది. ఈమహావృక్షము బుద్ధి యనుస్కంధంబు చేతను, మహత్తను శాఖాసమూహము చేతను, కోటరంబు లనునింద్రియగణంబులచేతను, పరిమాణం బనుమహాభూతసముదాయముచేతను, విశేషంబులనుపల్లవంబులచేతను, ధర్మాధర్మము లనుకుసుమంబులచేతను, సుఖదుఃఖము లనుఫలంబులచేతను, విరాజిల్లుచు సర్వభూతాశ్రయమై యుండును. స్వర్గమాతనిమస్తకంబుగను, ఆకాశము నాభిగను, సూర్యచంద్రులు నయనములుగను, దిక్కులు కర్ణములుగను, పృథ్వి పాదపీఠము

గను నిర్దేశింపఁబడియెను. అచింత్యుండును, సర్వభూతనిర్మాతయు సి
గునాతనిముఖమునుండి బ్రాహ్మణులును, వక్షమునుండి క్షత్రియులు
లును, ఊరువులనుండి వైశ్యులును, పాదములనుండి శూద్రులును సం
భవించిరి.

శేషశాయివర్ణనము.

అని బోధించుటయు మహర్షులందఱును వాయుదేవు నుద్దేశించి
మహాత్మా! పరమాత్ముం డగుభవుండు చతుర్ముఖునిముఖమునుండి పు
ట్టె నని చెప్పితివి. ఈవిషయంబున మాకధికతరం బగుసంశయము గ
లిగియున్నది. విరూపాక్షుం డగుమహాదేవుఁడు సర్వదేవతాశ్రేష్ఠుండు
ను, దీప్తత్రిశూలధరుండును, కపర్దియు, నీలలోహితుండును, భగవా
నుండును, రుద్రుండును, కాలస్వరూపుఁడు నైయుండును. యుగాం
తమునం దాతఁడు క్రుద్ధుండై బ్రహ్మవిష్ణులతోఁగూడ సకలలోకసంహా
రంబు గావించును. బ్రహ్మవిష్ణువు లాతనికిఁ బ్రణతులై లోకసంహార
కారి యగునాదేవున కధీనులై యుందురు. ఆమహాదేవుఁడే మొదట
బ్రహ్మవిష్ణులను సృజించెను. నిరంతరము నాతఁడే వారికి యోగక్షే
మకరుఁడై యుండును. అట్టిపురాతనుండును, ఆదిదేవుండు నగురుద్రుం
డు, అవ్యక్తప్రభవు డగుబ్రహ్మదేవునకుఁ బుత్రుం డెట్లయ్యెను? ప్ర
జాపతి యగుబ్రహ్మయు; విష్ణుండును రుద్రప్రేరితులై పరస్పరాంగము
లనుండి పరస్పరము నుదయించినట్లు మేము విని యుంటిమి. సర్వభూ
తకారణస్వరూపు లగువారు మరలఁ బ్రధానాప్రధానభావములతో నొ
కరినుండి యొకరెట్లుదయించిరి? మీ రెఱుంగనిదియు, నాకర్ణింపనిది
యు నగువిషయ మేదియు నుండదు. భగవానుండగుబ్రహ్మదేవునకు
శిష్యుండవగునీవు సర్వంబు నాతనివలన వినియే యుందువు. మహా
త్మా! విరించి నీకుపదేశించినవిధంబున మాకీసర్వవృత్తాంతమును సవిస్త

రముగా నెఱిఁగింపుము.

అని ప్రార్థించుటయు వాయుదేవుండిట్లనియెను. విప్రశ్రేష్ఠులారా! నిపుణులగుమీరు యుక్తాయుక్తముగనే ప్రశ్నించితిరి. బ్రహ్మదేవునిచే నేను వినినవిధంబుగనే త్రిమూర్త్యుత్పత్తింగూర్చి మీకుఁ జెప్పెదను. కారణస్వరూపు లగుబ్రహ్మవిష్ణురుద్రులు మువ్వురును మహేశ్వరునుండి యుద్భవించిరి. వారే యీచరాచరవిశ్వంబునకు సృష్టిస్థితిలయకారణులు; పరమేశ్వరప్రేరితులు; పరమైశ్వర్యసంయుక్తులు. వా రాపరమేశ్వరునిశక్తిచే నధిష్ఠితులై కార్యకరణసమర్థులై యుందురు. పరమేశ్వరుఁడే ప్రథమంబున నామువ్వురను స్వకర్మనియోజితులం గావించెను. బ్రహ్మ సృష్టికార్యమును, విష్ణువు పాలనకార్యమును, రుద్రుఁడు సంహారకార్యమును జేయుచుందురు. మాత్సర్యంబుచే వారు పరస్పరాధిక్యమును వాంఛించి జనకుండగుపరమేశ్వరుంగూర్చి తపంబు సేయుచుందురు. పరమేశ్వరానుగ్రహంబున వారు సర్వాత్మకత్వముం గాంచఁగలిగిరి. కావుననే యొకకల్పమునందు రుద్రుండు బ్రహ్మవిష్ణువులను, మఱియొకకల్పమునందు జగన్మయుం డగుబ్రహ్మదేవుండు రుద్రవిష్ణులను, మరల నింకొకకల్పంబున విష్ణుదేవుండు బ్రహ్మరుద్రులను సృష్టించుచుండును. ఈవిధముగాఁ బ్రతికల్పమునందును నొకరినొకరు జయించునభిలాషతో నొకరినుండి యొకరుగా బ్రహ్మవిష్ణురుద్రులు మువ్వురు నుదయించుచుందురు. వారియుత్పత్తింగూర్చి యాయాకల్పములం దో యీమహర్షులు తథావిధంబుగఁ గీర్తించుచుందురు.

పూర్వము మేఘవాహనకల్పమునందు నారాయణుండు దివ్యవర్షసహస్రంబులు మేఘరూపముం దాల్చి పరమేశ్వరుని వహించి యుండెను. అప్పుడు విశ్వగురుం డగుమహాదేవుం డాతనిమనోభావమును గ్రహించి యాతనికి సర్వవిధంబుల నవ్యయంబగుశక్తిని బ్రసాదించెను.

అట్లు సర్వేశ్వరానుగ్రహంబున శక్తిమంతుండై భగవానుం డగువిష్ణుం డు బ్రహ్మసహితుండై విశ్వసృష్టిం గావించుచుండెను. విష్ణునిచే నూతనముగ సృష్టింపఁబడినబ్రహ్మ యప్పుడు విష్ణుదేవునిశక్తిం గాంచి యసూయాగ్రస్తుఁడై హాస్యంబు సేయుచు నోవిష్ణూ! హామ్మో! నీసృష్టికారణమును నేనెఱుంగుదును. మనయిరువురికంటె నధికశక్తిమంతుం డగురుద్రుం డొకఁడున్నాఁడు. ఆవిషయంబున సంశయము లేదు. సర్వోన్నతపదారూఢుం డగునాపరమేశ్వరునియనుగ్రహముచేతనే నీ విప్పుడు సృష్టికర్తవైతివి. నేనుగూడఁ దపంబుచే నాపరమేశ్వరు నారాధించి నీతోఁగూడ నీజగంబంతయును సృష్టించెదను.

అని పద్మసంభవుండు నారాయణుని దిరస్కరించి తపంబు గావించి శంకరుని సాక్షాత్కరింపఁజేసికొని యిట్లు ప్రార్థించెను. ఓదేవదేవా! విశ్వేశ్వరా! విష్ణుండు నీవామాంగమునుండియు, నేను నీదక్షిణాంగమునుండియు నుదయించితిమి. అయినను విష్ణుండు నాతోఁగూడ నీ సకలజగంబును సృష్టించి యున్నాఁడు. నేను నీయనుగ్రహబలంబువ నే యాతనిని దిరస్కరించివచ్చితిని. ఆతనికి నాకంటెను నీయం దధిక భక్తి యున్నదేమో చూడవలయును. మేమిరువురమును నీనుండి సమానముగనే యుదయించితిమే. కాని నీవు ముందుగ నాతనియెడలఁ బ్రసన్నుండవై దివ్యశక్తిని బ్రసాదించితివి. అట్లే యిప్పుడు నాయెడలఁగూడ ననుగ్రహించి నాకట్టిశక్తిని దయచేయవలయును. అని యిట్లు బ్రహ్మ ప్రార్థించుటయు దయానిధి యగుమహాదేవుండు మందహాసంబు సేయుచు నాతనికి సర్వంబును బ్రసాదించెను.

ఇట్లు విరించి సర్వాత్మశక్తిలాభముంగాంచి యాక్షణంబుననే విష్ణునొద్దకు నతివేగముగఁ బోయెను. పంకజాక్షుం డగువిష్ణుండు క్షీరసముద్రతీరంబున నిచ్ఛానురూపంబుగ సృష్టించుకొన్నమణిహేమమయ

విమానాంతరమునందు శేషపర్యంకమున హాయిగ శయనించి యుండెను. చతుర్భుజుం డగునాతఁడు వివిధాలంకారభూషితుండును, శంఖచక్రధరుండును, సౌమ్యాకారుండును, శ్రీవత్సాంకితవక్షుండును, మందహాససుందరవదనమండలుండును నై యుండెను. ఆతనిపాదపద్మములు భూదేవికరపల్లవంబుల స్పర్శంబుచే రంజితములై యుండెను. అట్లాతఁడమృతసన్నిభం బగుక్షీరసాగరమున శయనించి యోగనిద్రాసక్తుండై యుండెను. ఆతఁడు తమోగుణంబునఁ గాలరుద్రుండును, రజోగుణంబున బ్రహ్మయు, సత్వగుణంబున సర్వాత్ముండగువిష్ణుండును, నిర్గుణభావంబున మహేశ్వరుండు నై యుండెను.

బ్రహ్మ యాపురుషునిం గాంచి ప్రగల్భభావముతో విష్ణుదేవా! తొల్లి నీవు నన్నుగ్రసించినట్లే నేనిప్పుడు నిన్ను గ్రసించెద నని పలుకుటయు మహాబాహుం డగువిష్ణుం డావాక్యశ్రవణంబునఁ బ్రబుద్ధుండై బ్రహ్మదేవు నవలోకించి మందహాసంబు గావించెను. ఇంతలోనే మహాత్ముండగుబ్రహ్మ యాతని గ్రసించి యావెంటనే యశ్రమంబునఁ దనభ్రూమధ్యమునుండి యవ్విష్ణుదేవుని మరల సృష్టించెను. ఆసమయంబున భగవానుండు నిందుభూషణుండు నగుమహాదేవుం డమూర్తుండయ్యును మూర్తిధరుండై వారిశక్తిని బరీక్షించుటకును, వారి ననుగ్రహించుటకును నవతీర్ణుండై వారిరువురును నిలిచియున్నస్థానంబునకు విచ్చేసెను. అప్పుడు బ్రహ్మవిష్ణు లామహాదేవుం గాంచి ప్రీతులును, భీతులునై కౌతుకవశంబున నాతనింగూర్చి స్తోత్రముచేయుచు సన్మానపూర్వకముగా దూరమునుండియే యద్దేవునకుఁ బ్రణామములం గావించిరి. పినాకధరుం డగుమహాదేవుండును వారిరువురి ననుగ్రహించి వారిదర్శనపథంబుననే మరల నంతర్ధానుండయ్యెను.

రుద్రోత్పత్తి.

వాయుదేవుం డిట్లనియెను. మునులారా! ప్రతికల్పంబునను రుద్రావిర్భావంబునకుఁ గారణ మెఱింగించెద వినుండు. కల్పకల్పంబునను బ్రహ్మాండమునుండి బ్రహ్మ యుదయించి ప్రజాసృష్టి సేయుచు నెంత చేసినను దానియభివృద్ధిం గానక యత్యంతదుఃఖముచే మూర్ఛితుఁ డగుచుండును. అప్పుడు రుద్రగణాధీశ్వరుండును, గాలస్వరూపుండును నగురుద్రుండు బ్రహ్మముఖశాంతికొఱకును, ప్రజాభివృద్ధికొఱకును నీశ్వరునిచే నాజ్ఞాపింపఁబడి యాబ్రహ్మకుఁ దనయుఁడుగా నుదయించి యాతనికిని, లోకములకును ననుగ్రహముం జూపుచుండును. భగవానుండును, ఈశ్వరుండును, నీలలోహితుండును, తేజోమయుండును, అనామయుండును, ఆద్యంతరహితుండును, విధాతయు, భూతసంహర్తయు నగువిభుం డాతఁడే. పరమైశ్వర్యశాలియు, పరమేశ్వరుండు నగునాతఁడు మహాదేవప్రేరితుఁడై యాతనిశక్తిచే నధిష్ఠితుండును, నాతనిచిహ్నలచేఁ జిహ్నితుండునై యుండును. ఆతఁడు శివరూపంబును, శివనామంబును దాల్చి కార్యకరణక్షముండై యుండును. ఆతఁడు శివతుల్యుండును, దదాజ్ఞాపాలకుండు నై యుండును. సహస్రార్కప్రభుండును, చంద్రకళాధరుండు, భుజంగహారభూషితుండును, కేయూరవలయవిరాజితుండును, కపాలధరుండును, పింగళకేశకలాపుండును, గంగాతుంగతరంగాభిషిక్తుండును, కైలాసవాసుండును, కర్ణకుండలాలంకృతుండును, వృషభవాహనుండును, మేఘగంభీరనినదుండును, మహానలతేజుండును, మహాబలపరాక్రమశాలియు, భయంకరాకారుండు నగు రుద్రుండు బ్రహ్మపుత్త్రుఁడై పుట్టి యాతనికి జ్ఞానదానముం గావించి సృష్టికార్యంబున నాతనికిఁ దోడ్పడుచుండును. ఇట్లు ప్రతికల్పంబునను రుద్రుఁ డుదయించి బ్రహ్మకు సహాయుఁ డగుచుండుటచే నాతనియు

నుగ్రహముచేఁ బ్రహ్మరూపమునఁ బ్రహ్మసృష్టి వర్ధిల్లుచుండును.

ఒకప్పుడు నీలలోహితుండగు నావిభుండు ప్రజాసృష్టివిషయంబున బ్రహ్మచేఁ బ్రార్థితుండై తనముఖంబునుండి తనతోసమానులగు ప్రజలను సృష్టించెను. వారు జటాధరులును, నిరాతంకులును, నీలగ్రీవులును, త్రిలోచనులును, జరామరణవర్జితులును, శూలధరులు నై జనించి యొక్కసారిగాఁ జతుర్దశభువనములను వ్యాపించిరి. అప్పుడు బ్రహ్మ రుద్రస్వరూపు లగువారిం గాంచి తనకుమారుఁ డగురుద్రుని నుద్దేశించి యోదేవదేవా! నీకు నమస్కారము. ఇఁక నీవిట్టిప్రజలను సృజింపవలదు. నీకు శుభమగుఁగాక! మఱియొకరీతిని మరణశీలురగు ప్రజలను సృజింపుము. అని ప్రార్థించుటయు రుద్రుండు మందహాసంబు సేయుచు నేనట్టిసృష్టిం గావింపను. నీవు మరణశీలురగు ప్రజలను సృజింపుము. నాముఖంబునుండి యుదయించి మహాబలులగు నీయాజ్ఞకు లందఱును నిరంతరము నాతోడనే యుందురు. అనిచెప్పి నిఖిలభూతేశ్వరుం డగురుద్రుండు సృష్టికార్యమునందు నివృత్తుండై రుద్రగణంబులతోఁ గూడి యుండెను. అదిమొదలుగ నాతఁ డెట్టికార్యమును గావింపక ప్రళయకాలపర్యంతము నూర్ధ్వరేతస్కుఁడై యుండెను.

—• అర్ధనారీశ్వరసాక్షాత్కారము. •—

బ్రహ్మదేవుండు తనమానసికసృష్టి క్రమముగా వర్ధిల్లకుండు సమయంబున మిథునసంబంధ మగుసృష్టి గావింపవలయు నని యాలోచించెను. ప్రథమమునం దీశ్వరుఁడు స్త్రీజనమును సృజింపకుండుటచే నట్టిసృష్టిసేయుట కాతఁ డసమర్థుండై తనయభీష్టలాభంబుకొఱకుఁ బరమేశ్వరుని దర్శించి యేదేనొకయుపాయంబు నరయవలయు నని నిశ్చయించుకొని తపంబు సేయ నారంభించెను. అప్పుడు లోకకారణంబును, సూక్ష్మతరంబును, విశుద్ధంబును, భక్తిగమ్యంబును, నిష్కలంబు

ను, నిరుపప్లవంబును, నిరంతరంబును, నిత్యంబును, నిత్యైశ్వరసమీప స్థంబును, పరమంబు నగునొకశక్తి బ్రహ్మమానసమునుండి యావిర్భవించెను. ఆదివ్యశక్తితో నాతఁడు తనహృదయమునందుఁ ద్రిలోచనుం డగుమహాదేవుని ధ్యానించుచుఁ దపంబు సేయందొడంగెను.

యోగయుక్తుం డగు నవ్విరించితీవ్రతపంబునకు జనకుం డగు మహేశ్వరుం డచిరకాలంబుననే సంతుష్టుండై తనయేకాంశముచే నర్ధనారీశ్వరరూపముం దాల్చి విధాతకు సాక్షాత్కరించెను. అద్వితీయుండును, అనిర్దేశ్యుండును, అకృతాత్ములకదృశ్యుండును, సర్వలోకకారణుండును, శక్తిమంతుండును, అప్రతర్క్యుండును, అజ్ఞేయుండును, అమేయుండును, అజరుండును, నిత్యుండును, అచలుండును, నిర్గుణుండును, శాంతుండును, అనంతమహిమాస్పదుండును, సర్వదుండును, సర్వగతుండును, సదసద్వ్యక్తిరహితుండును, అప్రతిముండును, శరణ్యుండును, తమోరహితుండును, అవ్యయుండును, శాశ్వతుండు నగునమ్మహాదేవుం గాంచి బ్రహ్మదేవుండు దండప్రణామంబు గావించి కృతాంజలిపుటుండై లేచి శ్రద్ధావినయసంపన్నంబులును, సుసంస్కృతంబులును, మనోహరంబులును, సత్యంబులును, అర్థవంతంబులును, శ్రుతిసమ్మతంబులు నగుసూక్తంబులచే నమ్మహాదేవుని, దేవిని వినుతింప నారంభించెను.

జయేశ్వరా! మహేశ్వరా! సర్వగుణశ్రేష్ఠా! సురేశ్వరా! నీకు జయమగుఁగాక! ఓకల్యాణప్రకృతీ! ప్రకృతినామా! ప్రకృతిదూరాంగీ! ప్రకృతిసుందరీ! నీకు జయమగుఁగాక! మహాదేవా! అమోఘమహామాయాశాలీ! అవ్యర్థమనోరథా! లీలామయా! అమోఘమహాబలా! నీకు జయమగుఁగాక! ఓజగన్మాతా! విశ్వమయీ! విశ్వజగద్ధాత్రీ! విశ్వజగత్స్రష్టీ! నీకు జయమగుఁగాక! ఓనిత్యైశ్వర్యశాలీ! నిత్యవస్త్వాశ్రయా!

నిత్యాకారా! నిత్యవస్త్వనుగతా! నీకు జయమగుఁగాక! ఆత్మత్రియ నిర్మాత్రీ! ఆత్మత్రయపాలనీ! ఆత్మత్రయసంహర్త్రీ! ఆత్మత్రయనాయికా! మహాశక్తీ! నీకు జయమగుఁగాక! అవలోకనమాత్రంబున నధీనంబులగుజగత్కారణంబులను విస్తరింపఁజేయువాఁడా! అయత్నంబుగ నుద్భూతంబైననేత్రాగ్నిలంబుచేఁ గామదేవుని దహించినవాఁడా! నీకు జయమగుఁగాక! దేవాదులకుఁగూడ నవిజ్ఞేయంబగుసూక్ష్మరూపంబుచేఁ బ్రకాశించుచుండుదేవీ! స్థూలాత్మశక్త్యంశయందు సమస్తచరాచరప్రపంచమును వ్యాపింపఁజేయుదేవీ! నీకు జయమగుఁగాక! నిఖలవిశ్వతత్త్వంబుల ననేకరూపంబులచే విన్యస్తంబులుగాఁ జేయుదేవా! అసురగణమస్తకన్యస్తపదారవిందులగుననుచరగణంబులు గలదేవా! నీకు జయమగుఁగాక! ఆశ్రితజనులను సంరక్షించుసామర్థ్యముగల తల్లీ! సంసారవిషవృక్షాంకురము నున్మూలింపఁగలతల్లీ! నీకు జయమగుఁగాక! ఆశ్రితులకు మహావీర్యశౌర్యైశ్వర్యములఁ బ్రసాదించుతండ్రీ! విశ్వబహిర్భూతం బగుననంతవైభవము గలతండ్రీ! సృజింపంబడినపంచభూతంబులను నడపించుటయందుఁ బరబ్రహ్మస్వరూపుఁడవగుతండ్రీ! నీకు జయమగుఁగాక! ఓపంచార్థవిజ్ఞానామృతప్రవాహస్వరూపిణీ! దారుణసంసారమహారోగభిషక్స్వరూపిణీ! అనాదిమలాజ్ఞానతమఃపటలచంద్రికా! నీకు జయమగుఁగాక! ఓత్రిపురకాలాగ్నిస్వరూపా! త్రిపురభైరవా! త్రిగుణాతీతా! నీకు జయమగుఁగాక! త్రిగుణవినాశినీ! నీకు జయమగుఁగాక! ఓసర్వజ్ఞా! దేవా! సర్వప్రబోధికా! దేవీ! సర్వాంగసుందరా! దేవా! సర్వాభీష్టప్రదాయినీ! దేవీ! మీకు జయమగుఁగాక! ఓదేవా! నీపరమధామంబెక్కడ? నేనెక్కడ? నాస్తోత్రపాఠము లెక్కడ? ప్రభూ! అయినను భక్తివశంబునఁ బ్రలపించుచున్ననన్ను క్షమింపుము.

అని యిట్లు వినుతించుచు విధాత మారుద్రాదిరుద్రులకుఁ

ఋద్ధిపుష్టిప్రకామంబులం గావించుచుండెను. బ్రహ్మోక్తంబగు నీయర్ధనారీశ్వరస్తోత్రము సర్వశ్రేష్ఠంబును, పవిత్రంబును, పార్వతీపరమేశ్వరులకతిప్రియంబు నైనది. ఎవ్వరేఫలంబును గోరి యీస్తోత్రమును పఠించినను శివానుగ్రహంబుచే వారి కాఫలంబు సిద్ధించును. సకలభువనభూతభావనులును, జననమరణవిరహితులును, నరనారీరూపధరులు నగుశంకరీశంకరులకు నమస్కారము.

—♦ మిథునసంబంధసర్గారంభము. ♦—

బ్రహ్మదేవుం డిట్లు వినుతించుటయు మహాదేవుండు ప్రీతుండై జలదనిస్వనగంభీరంబులును, మధురంబులును, విశదంబులును, సరళవర్ణమయంబులును, ప్రీతిపదార్థయుక్తంబులును, రాజలక్షణాన్వితంబులును; సకలవిషయారంభరక్షావిలయదక్షంబులును, మనోహరతరంబులును, ఉదారంబులును, మధురమందహాసకలితంబులు నగువచనంబులంబో నిట్లనియెను. ఓవత్సా! మహాభాగా! నీవు నాపుత్త్రుండవు. నేను నీసకలవాక్యంబులయందలి గౌరవమును గ్రహించితిని. నీవిప్పుడు ప్రజాభివృద్ధిం గోరి తపంబు గావించితివి. నీతపంబునకు నేను పరితుష్టుండ నైతిని. నీయభిలషితవరప్రదానంబు గావించెదను. అని యనుగ్రహించి పరమోదారుండును, దేవశ్రేష్ఠుండు నగుమహాదేవుండు తనశరీరభాగమునుండి యొకదేవీమూర్తిని సృజించెను. ఆదేవినే బ్రహ్మవిదులగువారు పరమాత్ముం డగుమహాదేవుని దివ్యశక్తి యని ప్రశంసించుచుందురు. ఆమెకు జన్మమృత్యుజరాదులు లేవు. భవునియంగమునుండి యుదయించుటచే భవానీనామంబున విలసిల్లినామెయపారమహిమను వర్ణింపఁజాలక మనంబును, నింద్రియసహితంబుగా వాక్యంబులును నివృత్తంబు లగుచుండును. మహాదేవశరీరోత్పన్నయై ప్రతిభాసించుచుండునద్దేవి తనమహిమచే సకలజగంబును వ్యాపించి యుండి

దివ్యశరీరిణి యగునామె విచిత్రాకృతితో గోచరించుచుండును. అమ్మ హాదేవి తనమాయచే సకలజగంబులను మోహింపఁజేయుచుండును. వస్తుత్వముచే జన్మశూన్య యగునామె మహేశ్వరుని దివ్యదేహము నుండి యుద్భవించెను. ఆమెపరమభావము దేవతలకుఁగూడ నగోచర మైనది. సకలదేవతలకు నామె యధీశ్వరి. ఆమె తనస్వామి యగు మహాదేవుని దేహమునుండి విభక్తయై యుండును. అట్టి సర్వలోకేశ్వరి యు, సర్వజ్ఞయు, సర్వగతయు, సూక్ష్మరూపిణియు, సదసద్వ్యక్తివిహీన యు, దివ్యదేహప్రభావిభాసితసకలజగన్మండలయు నగు పరమేశ్వరిం గాంచి బ్రహ్మదేవుండు సాష్టాంగప్రణామంబు గావించి యిట్లు స్తుతింప నారంభించెను.

ఓసర్వజగన్మయీ! దేవీ! నేను పరమేశ్వరునిచే సృజింపఁబడి, సృష్టికార్యమునందు నియోగింపఁబడి సర్వజగంబులను సృజించుచుం టిని. నేను ముందుగా నామానసమునుండి పుట్టించిన దేవతాదులు మరలమరల నెన్నిసారులు సృష్టింపఁబడుచుండినను నభివృద్ధిం గాంచుట లేదు. అందుచే నేనిప్పుడు మిథునసంబంధ మగుసృష్టిచేఁ బ్రజాభివృద్ధిం గావింప నభిలషించుచుంటిని. ఇంతకుఁబూర్వము నీవలన నక్షయం బగునారీకులము సంభవించి యుండలేదు. అందుచే నారీకులమును సృష్టించుశక్తి నాకు లేకపోయెను. అందఱకును నీమూలముననే శక్తి లభించుచున్నది. కావున నోసర్వవ్యాపినీ! సర్వశక్తిప్రదాయినీ! సురే శ్వరీ! వరదాత్రీ! నాప్రార్థనమును మన్నించి నాకొక్కవరంబు దయ సేయుము. చరాచరంబులయభివృద్ధికొఱకు నీవొకయంశముచే నాతన యుఁడగు దక్షునకుఁ దనయవై జన్మింపుము.

అని యిట్లు వేదవక్త యగు విరించి ప్రార్థించుటయు, నద్దేవదే వి తన భ్రూమధ్యమునుండి తనతో సమానప్రభావము గల యొక

దివ్యశక్తిని బుట్టించెను. దేవదేవుం డగుమహేశ్వరుం డామెం గాంచి మందహాసము సేయుచు నీవు తపంబుచే బ్రహ్మదేవు నారాధించుచు నాతనికి మనోరథసంపాదనంబు గావింపుమని యాజ్ఞాపించెను. ఆదేవియు మహాదేవునియాజ్ఞను శిరంబునం దాల్చి బ్రహ్మవచనానుసారంబుగా దక్షపుత్రికయై జన్మించెను. అనంతరము బ్రహ్మస్వరూపిణి యగు నయ్యాదిశక్తి విధాత కనంతశక్తిప్రదానంబు గావించి మరల మహేశ్వరునిదివ్యదేహంబునం బ్రవేశించెను. అప్పు డమ్మహాదేవుండు నంతర్హితుం డయ్యెను. అదిమొదలుగ నీప్రపంచమునందు స్త్రీసంభోగము ప్రతిష్ఠితం బయ్యెను. ఓమునులారా! అప్పటినుండియే మిథునసంబంధ మగుప్రజాసృష్టియు నారంభమయ్యెను. దేవియగునాదిశక్తినుండి సర్వశక్తులు నెట్లుత్పన్నంబు లయ్యెనో భూతసృష్టిప్రసంగమునందు మీకుం జెప్పియుంటిని. ఈచరిత్ర మతిపవిత్రంబును, మధురంబును, ధనప్రవృద్ధికరంబు నైనది. ప్రతిదినంబును దీనిని బఠించువారికి సకలాభీష్టసిద్ధియు సత్పుత్రలాభంబును గలుగును.

స్వాయంభువవంశప్రశంస.

ఈశ్వరుండును, మహాదేవుండు నగుమహేశ్వరునియనుగ్రహంబున నీవిధముగా నిత్యంబును, శ్రేష్ఠంబు నగుశక్తిలాభముం గాంచి బ్రహ్మదేవుండు మిథునసంబంధసర్గముం గావించు నభిలాషతోం దనదేహమును రెండుభాగములుగం జేసి యొకభాగమునుండి విరాట్పురుషుం డగుస్వాయంభువమనువును సృష్టించెను. దేవియగుశతరూప యతిదుస్సహం బగుమహాతపంబు గావించి ప్రదీప్తయశుండగు నమ్మనువును భర్తగాం బడసెను. పిమ్మట నామె స్వాయంభువమనువువలనం బ్రియవ్రతుండు, నుత్తానపాదుండు ననునిరువురుతనయులం గాంచెను. అయ్యిరువురుపుత్రులునుగూడం గ్రమముగ సంతానవంతులైరి. అమ్మను

దంపతులకీతనయులేకాక యిరువురుతనయులుగూడఁ గలిగిరి. వారును సంతానవంతులైరి. ఆకూతి, ప్రసూతి యనునామంబులచే వారు ప్రసిద్ధులై యుండిరి.

స్వాయంభువమనువు ప్రసూతిని దక్షునకును, ఆకూతిని రుచి యనుప్రజాపతికిని నొసంగి పరిణయములంగావించెను. బ్రహ్మమానసపుత్రుండగురుచివలన నాకూతిగర్భమునుండి యొకమిథునం బుదయించెను. అందుఁ బురుషునిపేరుయజ్ఞుఁడు; స్త్రీపేరు దక్షిణ. వారిరువురును సంతానవంతులై జగద్వర్ధనముం గావించిరి. మహాప్రభావసంపన్నుండగుదక్షుండును మనుకన్యయగుప్రసూతిగర్భమునుండి యిరువదినలుగురులోకమాతలను బుట్టించెను. వారిలో శ్రద్ధ, లక్ష్మి, ధృతి, పుష్టి, తుష్టి, మేధ, క్రియ, బుద్ధి, లజ్జ, వసువు, శాంతి, సిద్ధి, కీర్తి యను పదుముగ్గురుకన్యలను బ్రభావశాలి యగుధర్ముండు ధర్మపత్నులుగాఁ గైకొనియెను. తక్కిన ఖ్యాతి, సతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, ఊర్జ, స్వాహా, స్వధ, యనుకన్యలను యథాక్రమంబుగ భృగువు, మహాదేవుఁడు, మరీచి, అంగిరుఁడు, పులహుఁడు, క్రతువు, పులస్త్యుఁడు, అత్రి, వసిష్ఠుఁడు, అగ్ని, పితృగణంబులును దమతమభార్యలుగాఁ బరిగ్రహించిరి. ధర్మునకు శ్రద్ధాదిత్రయోదశపత్నులయందును గాముఁడుమొదలు యశునివఱకును గలపదుముగ్గురుపుత్రులు గలిగిరి. వీరందఱును సుఖప్రదాయకులై యుండిరి. మఱియు ధర్మునకు హింసాగర్భంబున జనించినయాధర్ముండనుపుత్రుఁడుమాత్రము దుఃఖదాయకుఁడయ్యెను. ఆయధర్మునకు జనించినవిష్కృత్యాదులగుపుత్రులుగూడ సధర్మలక్షణయుతులై యుండిరి. నియమశూన్యులగువారికి భార్యలుగాని, పుత్రులుగాని లేకుండిరి. అదియే తామససర్గము. అధర్ముఁడు దాని కధీశ్వరుఁడు.

దక్షపుత్రికయు, రుద్రాణియు నగుసతీదేవి పతినిందాశ్రవణంబు సహింపక బంధుసహితుండగుదక్షుని, నాతనిభార్యను నిందించుచు దేహత్యాగంబు చేసి హిమాలయగృహంబున మేనాగర్భమునుండి మరలఁ బుత్రికయై జనించెను. రుద్రుం డాసతిం గాంచి యసంఖ్యాకులగు రుద్రగణంబులను బుట్టించినవృత్తాంతమును మీకిదివఱకే చెప్పియుంటిని. భృగునకు ఖ్యాతిగర్భమునుండి నారాయణప్రియ యగులక్ష్మీదేవి తనయయై పుట్టెను. మఱియు మన్వంతరసంచారశీలురగుధాతయు, విధాతయు నను నిరువురు దేవమూర్తులుగూడ నుదయించిరి. ఆయిరువురు దేవతలకును శతసహస్రపుత్రపౌత్రాదు లుత్పన్నులైరి. స్వాయంభువమన్వంతరాతీతు లగువారందఱును భార్గవు లని ప్రసిద్ధులైరి. మరీచి సంభూతి యనుపత్నివలనఁ బౌర్ణమాసుండనుపుత్రుని, నలువురుపుత్రికలను బడసెను. ఆపుత్రికాపుత్రికులవంశము లతివిస్తారము లయ్యెను. వారివంశమునందే బహుపుత్రవంతుం డగుకశ్యపమహర్షి యుదయించెను. అంగిరుండు స్మృతియనుపత్నివలన ఆగ్నీధ్రుండును, శరభుండునను నిరువురుకొమరులను నలువురుతనయలను గనియెను. వీరివంశము సహస్రసహస్రపుత్రపౌత్రాదులచే నతీతమైపోయెను. పులస్త్యునకుఁ బ్రీతియందు దంతనామంబున నగ్ని యుదయించెను. ఆతఁడు పూర్వజన్మమునం దగస్త్యనామముచేఁ బ్రసిద్ధుం డయ్యెను. స్వాయంభువమన్వంతరమునం దాతనిపుత్రపౌత్రాదిసంతతి యంతయును బౌలస్త్యనామంబున విఖ్యాతం బగుచుండెను. పులహుండు క్షమాదేవివలనఁ గర్దముఁడు, ఆసురీయుఁడు, సహిష్ణుఁడు నను త్రేతాగ్నితుల్యులగుమువ్వురుపుత్రులను బడసెను. వీరివంశము లన్నియును సుప్రతిష్ఠితము లయ్యెను. క్రతునకు సన్నతివలనఁ గ్రతుతుల్యు లగుననేకపుత్రులు గలిగిరి. వారికి భార్యలుగాని, పుత్రులుగాని యెవ్వరును లేరు. వారందఱు

నూర్ధ్వరేతస్కులై యుండిరి. ఆయఱువదివేలమందియు వాలఖిల్యనా
మంబునఁ బ్రఖ్యాతులైరి. వారు సూర్యసారథి యగునసూరునితోఁ
గూడ సూర్యుని బరివేష్టించి యగ్రగమనంబు గావించుచుందురు.

అత్రి కనసూయగర్భమునుండి మైదుగురుపుత్రులును, శ్రుతి
యనునొకపుత్రికయుఁ బుట్టిరి. ఆశ్రుతియే శంఖపదునకు జనని య
య్యెను. సత్యనేత్రుఁడు, హవ్యుఁడు, ఆపోమూర్తి, శనైశ్చరుఁడు,
సోముఁడు ననునీయైదుగురు నత్రిపుత్రులు. స్వాయంభువమన్వంతరం
బున మహాత్ము లగునయ్యాత్రేయులు శతసహస్రపుత్రపౌత్రాదులచే
వంశాభివృద్ధిం గావించిరి. ఊర్జ యను దేవియందు వసిష్ఠుండు రజుఁడు,
గాత్రుఁడు, ఊర్ధ్వబాహుఁడు, సవనుఁడు, అనయుఁడు, సుతపుఁడు, శు
క్రుఁడు, ననునేడ్గురుతనయులం గాంచెను. వీరు సప్తర్షినామంబున
విఖ్యాతులైరి. స్వాయంభువమన్వంతరంబున వీరినామంబులచే శతా
ర్బుదసంఖ్యాతీతంబు లగువంశము లుత్పన్నంబు లయ్యెను. సానుబం
ధం బగునీఋషిసర్గ మతిసంక్షేపముగఁగాని, యతివిస్తరముగఁగాని
వర్ణించుట కశక్యమైనది.

వహ్నిదేవుండు భార్యయగుస్వాహాదేవివలన నమితతేజులగుము
వ్వురు తనయులంగాంచెను. పావకుఁడు, పవమానుఁడు, శుచి, యని
వారినామములు. అం [illegible] మానుం డనియు, వైద్యుతాగ్ని
పావకుండనియు, సూర్యకిరణజన్యం బగునగ్ని శుచి యనియుఁ జెప్పం
బడును. ఆముువ్వురకును గ్రమముగా హవ్యవాహుఁడు, కవ్యవాహుఁ
డు, సహరక్షుఁడు ననుముువ్వురుసుతు లుదయించిరి. వారు క్రమము
గా దేవపితృదైత్యసంబంధనామములచేఁ బ్రసిద్ధులైరి. వారిపుత్రపౌత్ర
సంఖ్య నలువదితొమ్మిది. వారందఱును గామ్య, నైమిత్తిక, నిత్య
కర్మంబులయందుఁ బ్రయోజనీయులైరి. అందఱును, దపస్వులు, వ్రత

ధారులు, రుద్రస్వరూపులు, రుద్రపరాయణులునై యుండిరి. అందుచేతనే యగ్నిముఖమునం దర్పించిన యఖిలపదార్థంబులును రుద్రదత్తంబు లగుచుండును.

ఇంకఁ బితృదేవతలంగూర్చి సంక్షేపముగఁ బ్రశంసించెదను. జగత్పితృస్వరూపుఁ డగుబ్రహ్మదేవుఁడు సృష్టించుటకుఁ బ్రవృత్తుం డైనసమయంబున నాతనినుండి షడృతువులు నుదయించెను. స్థానాభిమాను లగుపితృదేవతలకు ఋతువు లాశ్రయంబు లగుటంజేసి వానికిఁ బితృనామంబు విఖ్యాతం బయ్యెను. దీనికి వేదప్రమాణంబుగలదు. ఋతువులయందు స్థావరజంగమంబు లుత్పన్నంబు లగుటంజేసి వేదంబులయం దార్తవగణంబులకుఁ బితృగణంబు లనునామము నిర్దేశింపఁబడియెను. ఈవిధముగా ఋతుకాలాభిమాను లగుపితృదేవతలకు ఋతుత్వమును, ఆర్తవత్వమును, పితృత్వమును గలిగెను. అట్టియభిమానులును, మహాత్ములు నగుపితృదేవతలందఱును మన్వంతరములయందు మహైశ్వర్యసంపన్నులై గగనతలంబున నివసించి యుందురు. అగ్నిష్వాత్తులు, బర్హిషదులు నని పితృదేవత లిరుదెఱంగులవారై యుందురు. మఱియు వా రయజ్వలును, యజ్వలు నని విఖ్యాతులై యుందురు. వారందఱును గృహస్థులు. ఆపితృగణంబులవలన స్వధాదేవి లోకవిశ్రుతచరిత్ర లగునిరువు రాత్మజలం గనియెను. క్రమంబుగ వారినామంబులు మేనయు, ధరణియు నని ప్రసిద్ధము లయ్యెను. వారిరువురు నీసమస్తజగంబును ధరించియుందురు. మేనాదేవి యగ్నిష్వాత్తులకును, ధరణీదేవి బర్హిషదులకును, జనించిరి. హిమాలయపత్ని యగుమేనాదేవి మైనాకపర్వతమును, క్రౌంచపర్వతమును, శివాలింగనపావని యగుగౌరిని, గంగను బ్రసవించెను. మేరుశైలపత్ని యగుధరణి దివ్యౌషధిసమన్వితంబును, విచిత్రసుందరకందరయుతంబు నగుమందరపర్వతము

ను గనియెను. శ్రీమంతంబగు నామందరపర్వతము నిజతపఃప్రభావ ముచే శ్రీకంఠనాథుం డగుమహాదేవున కావాసం బయ్యెను. ఆధరణీ దేవి మరల వేళ, నియతి, ఆయతి యనుముప్పురు పుత్త్రికలం గనియె ను. పూర్వము స్వాయంభువమన్వంతరంబున నీనియతియు, ఆయతియు భృగుపుత్త్రులకుఁ బత్నులైరి.

వేళాదేవి సాగరునివలనఁ బ్రాచీనబర్హికి సవర్ణయుఁ బత్నియు నగు సాముద్రి యనుపుత్త్రికను బ్రసవించెను. ఆప్రాచీనబర్హికి సా ముద్రివలనఁ బదుగురుతనయులు గలిగిరి. ధనుర్వేదపారగు లగువా రందఱును బ్రాచేతసనామంబున విఖ్యాతులైరి. పూర్వము చాక్షుష మన్వంతరంబున మహాదేవశాపముచే దక్షుండు వీరికిఁ బుత్త్రుం డయ్యె ను. నేనిప్పుడు బ్రహ్మపుత్త్రు లగుధర్మాదుల సకలవంశములనుగూ ర్చియు నాతిసంక్షేపంబుగను, నాతివిస్తరంబుగను బ్రశంసించితిని. ఆవంశములన్నియుఁ గ్రియావంతములును, బ్రజావంతములును, మహా సమృద్ధిమంతంబులు నై విరాజిల్లుచుండెను. ప్రజాపతిమొదలుగ నుద యించిన యీప్రజల నందఱను శతకోటివర్షంబులకైనను లెక్కింపఁ జాలము.

ఈభూమండలమున రాజవంశములు చంద్రవంశమనియు, సూ ర్యవంశ మనియు ద్వివిధంబుల విలసిల్లుచుండును. ఇక్ష్వాకుఁడు, అం బరీషుఁడు, యయాతి, నహుషుఁడు మొదలగుపుణ్యశ్లోకులును, బవి త్రచరిత్రులు నగుమహారాజు లీప్రసిద్ధవంశములందే జనియించిరి. ఈవంశములందు జనించిన మహాపరాక్రమవంతులును, దపోనిధులు నగు ననేకరాజర్షిగణంబుల చరిత్రములను బూర్వమే కీర్తించియుంటిని. ఆపురాతనచరిత్రముల నిప్పుడు మరలఁ జెప్పుటవలనఁ బ్రయోజనంబు లేదు. మఱియు నీశ్వరప్రసంగసమయంబున నితరవిషయంబులంగూర్చి

యుగ్గడించుట పండితసమ్మతంబు గానేరదు. ఈశ్వరకథాప్రసంగమునఁ దత్ప్రభావద్యోతనంబునకు సృష్ట్యాదివిషయంబు లెంతవఱ కావశ్యకములో యంతవఱకుమాత్రమే వర్ణించుట యుచితము. అతివిస్తరంబు వలనఁ బ్రయోజనంబు లేదు.

సతీదేహత్యాగము.

అనుటయు మహర్షులిట్లనిరి. వాయుదేవా! దక్షకన్యయగుసతీదేవి యేకారణంబుచే దాక్షాయణీరూపంబును ద్యజించి మేనాగర్భంబున హిమాలయపుత్రికయై జన్మించెను? మహాత్ముం డగుదక్షుం డేకారణముచే మహేశ్వరనిందనముం గావించెను. మహాదేవుం డెందుచే నిందితుం డయ్యెను? మహాదేవశాపముచే జాక్షుషమన్వంతరమునందు దక్షుం డేవిధముగా జన్మించెను? ఈసమస్తవిషయంబులను సవిస్తరంబుగా మాకెఱింగింపవలయును.

అని మునిగణంబులు ప్రార్థించుటయు వాయుదేవుం డిట్లు చెప్పందొడంగెను. మునులారా! లఘుచేతస్కుం డగుదక్షునిపాపహేతుకం బగుప్రమాదమువలనం గలిగిన దేవదూషితం బగుచరిత్రముం గూర్చి చెప్పెద నాకర్ణింపుఁడు. పూర్వకాలమునం దొకప్పుడు సకలసురాసురసిద్ధగంధర్వాదులును, మహర్షిగణంబులును మహాదేవసందర్శనార్థమై హిమాలయశిఖరంబునకుం జనిరి. దివ్యాసనాసీనుండగుమహాదేవుండు దేవీసహితుండై యందఱకును దర్శనంబిచ్చెను. ఆసమయంబునఁ దనజామాతను, పుత్రికను గాంచవలయుననుకుతూహలముతో నమరగణంబులంగూడి దక్షుండునుగూడ నచ్చటికి వచ్చియుండెను. సతీదేవి పరమాత్మస్వరూపిణి యగుటంజేసి తనజనకుం డగుదక్షుండు వచ్చియున్నను నాతనికి దేవతలకంటె నధికసన్మానంబులం గావింపలేదు. దక్షుం డమ్మహాదేవిదివ్యతత్త్వము నెఱుంగఁజాలక కేవలము తనపుత్రిక

మే యనునజ్ఞానముచే విముగ్ధుండై తన్నగౌరవించిన దనుభావముచే నాతఁ డామెయెడల వైరభావముం బూనియుండెను.

అంతటదక్షుండు యజ్ఞదీక్షితుండై నియతివశంబున విద్వేషంబు వహించి యమ్మఖంబున కల్లుం డగుశివు నాహ్వానంబు సేయఁ డయ్యెను. కాని యితరులగు నల్లుండ్రు నందఱను బిలిచి వారికందఱకును విశేషసన్మానములం గావించెను. ఆసంగతి నారదునివలన నెఱింగి సతీదేవి రుద్రునితోఁ జెప్పి పితృగృహమునకుం బ్రయాణమై సర్వలక్షణసంపన్నంబును, మనోహరంబును, గామగమనంబును, దప్తకాంచన ప్రభావిలసితంబును, వివిధరత్నాలంకృతంబును, ముక్తామయచంద్రాతపవిరాజితంబును, వివిధమాల్యవిభూషితంబును, గనకమయంబును, శతసహస్రరత్నస్తంభశోభితంబును, వజ్రసోపానకలితంబును, ప్రవాళమణితోరణాలంకృతంబును నగువిమానరాజము నధిరోహించెను. మఱియు నాదివ్యవిమానంబు పుష్పమాలికలచేతను, విచిత్రరత్నాసనంబులచేతను, వజ్రనిర్మితగవాక్షాదిమణికుట్టిమంబులచేతను, మహావృషభలాంఛితంబులును, మణిస్తంభవిలసితంబులు నగుశుభ్రపతాకలచేతను విరాజిల్లుచుండెను. రత్నకంచుకధరులును, వేత్రపాణులును, దుర్జయులు నగు గణాధిపతు లవ్విమానద్వారంబుల నధిష్ఠించి యుండిరి. మృదంగవేణువీణాతాళగానవిశారద లగురమణీమణు లందు విలసిల్లుచుండిరి.

సఖీజనపరివృతయై దివ్యాసనంబున నాసీనయై యున్నయాదేవదేవి కిరువంకల నిరువురు సుందరీరత్నములు నిలిచి చామరంబుల విసరుచుండిరి. ఆచామరమధ్యమునందలి యాసతీవదనమప్పుడు పరస్పరయుద్ధాసక్తములగు రెండుహంసములనడుమనున్న పద్మమువలె శోభిల్లుచుండెను. ప్రియసఖి యగుసుమాలిని యాదేవికిరీటోపరిభాగంబున ముక్తామణిఖచితంబును, సుధాంశుసన్నిభంబు నగుఛత్రమును బట్టి యుండె

ఆయుజ్జ్వలచ్ఛత్రి మాదేవివదనమండలోపరిభాగంబునం జంద్రోపరి
గంబునున్న వర్తులామృతభాండముంబోలి ప్రకాశించుచుండెను.
ప్రావతి యనునొకసఖి మందహాసవదనారవిందయై యాసతీదేవి నక్ష
కచే నానందింపఁజేయుచుండెను. చెలియగు పయశ యద్దేవిరత్న
ఫలకలను దరసమున్నతవక్షంబునం జేర్చుకొని యామెను సేవించు
ండెను. కాంచనవర్ణ యనునొకసహచరి యారుదాణిమెదుట నిలువు
ద్దముంబూని నిలిచి యుండెను. మఱియుఁ గొందఱుసఖీమణులు తా
వృంతంబులను, గొందఱు తాంబూలపేటికలను, గొందఱు క్రీడా
ంగములను హస్తములం దాల్చియుండిరి. కొందఱుచెలులు మనో
రసురభికుసుమంబులను, కొందఱ అమూల్యాభరణంబులను, గొందఱు
పుష్పమాల్యంబులను, గొందఱు పరిమళవిలేపనద్రవ్యములను బూని
యుండిరి. సులోచనలగు నితరసఖులు యథాయోగ్యముగ నుచితక
ర్మంబుల నిర్వహించుచు నమ్మహాదేవిని సేవించుచుండిరి.

అప్పుడాపరమేశ్వరి తారకాగణమధ్యస్థిత యగుశరత్కాలచం
ద్రరేఖయుంబోలి సఖీజనమధ్యవర్తినియై విరాజిల్లుచుండెను. అప్పుడు
శంఖధ్వని యగుటయు మహానాదసంపన్న మగుప్రయాణభేరి మ్రో
గింపఁబడియెను. తాళశబ్దంబులతో మధురవాద్యంబులును, అనాహ
తంబులగు శతసహస్రకాహళవాద్యంబులును వెలువడియెను. మహే
శ్వరసమతేజస్సంపన్నులును, అస్త్రధారులు నగునష్టోత్తరశతసంఖ్యగణా
ధ్యక్షులు ముందు నడచుచుండిరి. గజారూఢుం డగుకార్తికేయునిం
బోలి వృషభారూఢుండును, శ్రీమంతుండును, దేవవందితుండును, శివా
నందదాయకుండు నగుగణపతి వారినడుమనుండి పయనము సాగించు
చుండెను. గగనతలంబున మధురశబ్దంబులతో దేవదుందుభులు మ్రో
గుచుండ మునిగణంబు లానందముతో నృత్యము సేయుచుండిరి.

మేఘములు పుష్పవర్షముం గురియించుచుండెను. అట్లు మహో
హాముతో నమ్మహేశ్వరి ప్రయాణంబు చేసి మార్గమధ్యంబున
లకు శుభసందర్శనంబును బ్రసాదించుచు నచిరకాల
హంబును జేరుకొనియెను.

ఆమెం గాంచి దక్షుం డతికుపితుండై యాగ్రహ
బుగా నామెను సన్మానింపక యద్దేవికనిష్ఠసోదరీమణుల
వింప నారంభించెను. అప్పుడు చంద్రముఖి యగునంబి
తుండగుజనకుం గాంచి యుగ్రభావంబున యుక్తి
నంబులతో నిట్లనియెను. తండ్రీ! పితామహుండగుబ్ర
బిశాచంబులవఱకును గలసకలజీవులు నెవ్వనియాజ్ఞలను దల
చుందురో యట్టిమహాదేవుని నీవిప్పు డర్చించుట లేదు. ప
జ్యేష్ఠపుత్రిక నగునేనిచ్చటికి వచ్చియుండఁగా నన్నుఁబలుకరింప
మాని కనిష్ఠలగువీరినందఱిని సన్మానించితివి. ఇది లోకగర్హిత
గాదా? అని సతీదేవి తూలనాడుటయు దక్షుండు తనకోపము
కొనఁజాలక నీకనిష్ఠసోదరీమణులు నీకంటె శ్రేష్ఠలును, వరిష్ఠ
జేసి నేను వీరిని సన్మానించితిని. మఱియు వీరిభర్తలు స
నాయాదరమునకుఁ బాత్రులై యుందురు. వారు నీభర్త
త్రునికంటె నధికగుణవంతులు. తమోగుణయుతుండగునీపతి
నాకుఁ బరమశత్రుఁడు. ఆతని నాశ్రయించిననీవును నాతిరస్కా
కుఁ బాత్రురాలవు. అని నిందించెను.

ఆమాటల నాకర్ణించి సతీదేవి క్రోధావేశవివశయై
దఱియెదుటను దండ్రినుద్దేశించి యిట్లనియెను. ఓయీ! ఇ
నేవిధంబుగను నిందించియెఱుఁగని సర్వలోకేశ్వరుండగు
నాభర్తను నీవిప్పు డకారణముగ నిందించితివి. విద్యా

రుద్రోహియు, నీశ్వరదూషకుండును మహాపాపాత్ములుగావున నట్టివారు సద్యోదండార్హు లని శ్రుతులు చెప్పుచున్నవి. ఇందుకొఱ కమ్మహేశ్వరునిచే నీమహాపాపంబునకుఁ దగినశిక్ష గాఁగలదు. నీవాత్రిలోచనుని బూజింపక నిరాకరించినకారణముచే నీదుష్టకులం బంతయు వినష్టంబు గాఁగలదని నిశ్చయించుకొనుము. అని యిట్లు సతీదేవి క్రోధావేశంబునఁ బలికి యాదక్షుని, నాతనివలనంగలిగినయాత్మశరీరమును బరిత్యజించి హిమాలయముంగూర్చి బయలుదేఱెను. శ్రీమంతుండగు హిమాచలుండును దేవిప్రాప్తికొఱకుఁ జిరకాలమునుండి ఘోరం బగుతపంబు గావించుచుండెను. ఇప్పటి కాతనితపఃఫలంబు సిద్ధించినది. ఆతనితపఃప్రభావముచేఁ బరమేశ్వరి యనుగ్రహించి తనయోగమాయచే నాతనిముగ్ధునిం గావించి తండ్రిగాఁ జేసికొనియెను.

ఇట్లు సతీదేవి దక్షుని నిందించి శరీరమును బరిత్యజించి పోయిన తోడనే భయవ్యాకులంబులై యజ్ఞవిహితంబు లగుమంత్రము లన్నియుఁ దిరోహితంబు లయ్యెను. అందుచే యజ్ఞముగూడ వినష్టంబై పోయెను. త్రిపురమర్దనుం డగుమహాదేవుండును దక్షాలయమునుండి దేవి వెడలిపోయినవార్త నాలకించి దక్షునియెడలను, మహర్షులయెడలను గుపితుండై వారికీవిధంబుగ శాపంబొసంగెను. ఓదక్షా! నీవు నామూలమున నిరపరాధయగుసతీదేవి నవమానించి తక్కినతనయలనందఱను వారిభర్తలతోఁగూడ సన్మానించితివి గావున వైవస్వతమన్వంతరంబున బ్రహ్మయజ్ఞమునందు నీజామాతలందఱు నయోనిజులై జన్మింతురుగాక! నీవును చాక్షుషమన్వంతరంబునఁ బ్రాచీనబర్హికిఁ బౌత్రుండవుగను, ప్రచేతసులకుఁ బుత్రుండవుగను నృపాలుండవై జనియింతువుగాక! ఓదుర్మతీ! అప్పుడును నీధర్మార్థయుతంబులగుసకలకర్మంబులకును నామూలమున విఘ్నంబులు సంభవించుఁగాక! దక్షుం డీవిధముగా నీశ్వ

రునిచే శపింపఁబడి స్వాయంభువం బగుదేహమును విడిచి దుఃఖితుండై భూతలపతితుం డయ్యెను. అనంతర మాతఁడు చాక్షుషమన్వంతరం బునఁ బ్రాచేతసనామంబుతోఁ బ్రచేతసులకుఁ బుత్రుండై పుట్టెను. భృగుప్రభృతు లగుమునిగణంబులు వైవస్వతమన్వంతరంబున బ్రహ్మ యజ్ఞమునందు వారుణశరీరధారులై పుట్టిరి. వైవస్వతమనుసమయం బునఁ దురాత్ముం డగుదక్షుండు గావించు సకలకర్మంబులకును మహా దేవునిమూలమున విఘ్నములు గలుగుచుండెను.

—♦ వీరభద్రాగమనము. ♦—

హిమాచలేంద్రుఁడు తనతపఃప్రభావముచే విశ్వమాత యగు నాదిదేవికిఁ బితృత్వముం గాంచి మహానందహృదయుండయ్యెను. హి మగిరిశిఖరవాసుం డగుమహాదేవుండును హైమవతిం బెండ్లియాడి యా మెతోఁ గలసి వినోదక్రీడలం దేలుచుండెను. ఇట్లు చిరకాలంబు గడ చుటయు వైవస్వతమన్వంతరం బయ్యెను. అప్పుడు ప్రాచేతసుం డగు దక్షుం డశ్వమేధయాగంబు గావించుటకు సంకల్పించి సిద్ధగణసేవితం బగు గంగోత్పత్తిస్థానంబున, హిమాలయశుభోపరిభాగంబున యజ్ఞాను ష్ఠానముం గావించి యుండెను. ఆదిత్యవసురుద్రగణంబులును, సాధ్య గణంబులును, మరుత్సోమపితృగణంబులును, ఆజ్యపధూమపగణంబు లును, అశ్వినీకుమారులును, దదితరమహర్షిగణంబులును విష్ణుసహితం బుగా యజ్ఞభాగా [illegible] మునకు విచ్చేసి యుండిరి. అట్లు వా [illegible] యేతెంచియుండుటంగాంచి దధీచి [illegible] దక్షునుద్దేశించి యిట్లనియెను.

[illegible] జించువారికిని, బూజ్యులను బూ జింపని [illegible] కు [illegible] ట కెట్టిసంశయమును లేదు. దుర్మార్గులకు సన్మానమును, సన్మార్గులకుఁ బరాభవంబును గలుగుచో

ట నాక్షణమునందే దైవకృతంబగుదారుణదండనము గలుగకమానదు. సమస్తజగత్ప్రభుండును, బరమపూజ్యుండును, బశుపతియు నగుమహాదేవుని నీ వేకారణముచేఁ బూజింపకుంటివి?

అని బ్రహ్మర్షియగుదధీచి యుగ్గడించుటయు దక్షుండు మునీంద్రా! త్రిశూలధరులును, గపర్దులు నగునేకాదశరుద్రులను నేనెఱుంగుదును. వారికంటె భిన్నుండగుమహేశ్వరుఁ డెవ్వఁడో నేనెఱుంగ నని చెప్పెను. అప్పుడు దధీచి దృఢస్వరముతో నీయజ్ఞమునం దీసకలరుద్రులను, వచ్చినయీసకలదేవతలను బూజించుటవలన నేమిలాభము? నీ విప్పుడు యజ్ఞరక్షకుం డగురుద్రుని బూజించుట లేదు. అవ్యయుండును, సర్వలోకప్రభుండును, బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు స్రష్టయు, బ్రహ్మాదిపిశాచపర్యంతముం గలయెల్లవారిని దనభృత్యులుగా గ్రహించినవాఁడును, బ్రకృతిపురుషులకుఁ బరుండును, యోగశాస్త్రవిశారదులును, దత్త్వజ్ఞులు నగుమహర్షులచే నిరంతరచింతితుండును, అక్షరుండును, అసత్స్వరూపుఁడును, సదసత్స్వరూపుఁడును, పరబ్రహ్మస్వరూపుఁడును, ఆదిమధ్యాంతరహితుండును, అప్రతర్క్యుండును, సనాతనుండును, స్రష్టయు, సంహర్తయు, భర్తయు నగుమహాదేవుండుగాక యజ్ఞంబులకు శుభఫలదాయకుం డింకెవ్వఁడని నీవు తలంచితివి?

అనుటయు దక్షుండు నవ్వుచు నప్రతిమప్రభావుండగునీవిష్ణుదేవుఁడే యీయజ్ఞంబున కధీశ్వరుఁడు. నేనిప్పుడు విధిపూర్వకంబులగు మంత్రంబులచేఁ బవిత్రంబును, ఆహవనీయంబున నగుహవిస్సును సువర్ణపాత్రమునందుంచి యున్నట్టి హవిర్భాగము నీయజ్ఞేశ్వరునకే సమర్పించెద నని చెప్పెను. ఆమాట విని దధీచి మునీంద్రుం డోపాపాచార ఘా! సర్వదేవేశ్వరుం డగుమహాదేవు నర్చింపనికారణంబుచే నీయజ్ఞము సంపూర్ణంబు గానేరదని క్రోధోద్రేకముచేఁ బలుకుచుఁ దక్షుణంబ య

న్మఖశాలవెలువడి తనయాశ్రమంబునకుం బోయెను. అట్లు దధీచి కో పముతో వెడలిపోవుటయు భావ్యనర్థం బవశ్యఘటనీయంబని నిశ్చ యించియు దేవతలందఱును దక్షుని ద్వేషింపఁజాలక నిలిచియుండిరి.

ఈవృత్తాంతమంతయు నాకర్ణించి మహాదేవి దక్షయజ్ఞవిధ్వంస నార్థమై మహాదేవుని బ్రోత్సహించెను. అప్పుడు మహేశ్వరుండు దేవి చేఁ బ్రేరితుండై దక్షమఖవిధ్వంసనోద్దేశముతోఁ బ్రబలపరాక్రముం డగు వీరభద్రుం డను గణాధ్యక్షుని సృష్టించెను. ఆవీరభద్రుండు మహా తేజస్వియు నుగ్రుండును, సహస్రభుజుండును, సహస్రాక్షుండును, ముద్గర శరకార్ముకసహస్రధారియునై ప్రజ్వలించుచుండెను. మఱియు నాతఁడు గదాఖడ్గత్రిశూలహస్తుండును, బాలచంద్రావతంసుండును, వజ్రోద్భాసి తకరుండును, విద్యుత్కేశకలాపుండును, కరాళదంష్ట్రుండును, విద్యుజ్జి హ్వుండును, ప్రలంబోష్ఠుండును, మేఘసాగరనిస్వనుండును, వ్యాఘ్ర చర్మాంబరుండును, కుండలపరిభాసితగండమండలుండును, శ్రేష్ఠామరక పాలమాలికాలంకృతశేఖరుండును, రణన్నూపురకేయూరాదిభూషణ భూషితుండును, రత్నాలంకారపరిదీప్తుండును, తారహారావృతవక్షోభా గుండును, మహాశరభశార్దూలసింహసదృశవిక్రముండును, మదగజమం థరగమనుండును, శంఖచామరకుందేందుపరిభావిలసితుండునునై తుషా రాచ్ఛన్నం బగుజంగమపర్వతముం బోలి యుండెను. ఆతనినలుదెసల నగ్నిశిఖాసదృశం బగుతేజఃపుంజము వినిర్గతం బగుచుండెను. ముక్తా మణిహారంబులచే నాతనిదేహ మలంకృతమై యుండెను. అందుచే నాతఁడు పరిశయకాలానలముం బోలి దేదీప్యమానుండై యుండెను.

అప్పు డాగణాధ్యక్షుండు భూతలంబున మోకరించి కృతాంజలి యై పరిణామపూర్వకంబుగ నమ్మహేశ్వరునిపార్శ్వంబున నిలిచియుండె ను. ఆవీరభద్రుండు తనకుఁ గర్మసాక్షిస్వరూపిణియు, సహచారిణియు

గను మహేశ్వరిభద్రకాళిని దనక్రోధమునుండి సృష్టించెను. అంతశ్శంకరుండు కాలాగ్నిసన్నిభుండగువీరభద్రుని భద్రకాళీసహితంబుగఁ గాంచి మీకు భద్రం బగుఁగాక యని యాశీర్వదించెను. అప్పుడు దేవీసహితుం డగువీరభద్రుండు మహాదేవుం గాంచి దేవదేవా! నేనేమి చేయవలయునో యాజ్ఞాపింపుమని ప్రార్థించుటయుఁ ద్రిపురహరుం డయగునీశ్వరుండు పార్వతీప్రియంబు నెఱవేర్పందలంచి యోగణేశ్వరా! నీవు భద్రకాళీసహితుండవై పోయి దక్షాధ్వరవినాశంబు గావింపుము. నేనును పార్వతీసహితుండనై యాశ్రమసమీపమునం దుండి మీదుస్సహవిక్రమముం గాంచుచుండెదను. సువర్ణశృంగంబున గంగాద్వారసమీపంబున మేరుమందరసదృశమహీరుహంబులచే విలసిల్లు కనఖలక్షేత్రంబున నిప్పుడు దక్షయజ్ఞంబు జరగుచున్నది. నీవతిశీఘ్రముగఁ బోయి యమ్మఖధ్వంసంబు గావింపుము. ఆలస్యము చేయవలదని యాజ్ఞాపించెను.

అనంతరము హిమాచలతనయ, ధేనువు వత్సముంజూచుపోలిక భద్రకాళీసహితుం డగువీరభద్రుం దిలకించి షడాననుం డగుకుమారునింబోలి మూర్ధాఘ్రాణంబు గావించి మందహాసంబు సేయుచు మధురస్వరముతో నిట్లనియెను. వత్సా! మహాబలపరాక్రముండ వగు భద్రా! నీవు నాకుఁ బ్రియంబు గావించుటకై యుదయించితివి. కావున నాదుఃఖమును దూరముచేయుము. దక్షుండు వైరభావముతో యజ్ఞేశ్వరు నాహ్వానింపక యజ్ఞకర్మరతుండై యున్నాఁడు. నీవు గణేశ్వరసహితుండవై పోయి యమ్మఖభంగంబు గావింపుము. నీవు నా యాజ్ఞం దలఁదాల్చి భద్రాసహితంబుగఁ బోయి యాయజ్ఞలక్ష్మి నలక్ష్మిం గావించి యజమానుని నిహతుం గావింపు మనిబోధించెను.

వీరభద్రుండును పార్వతీపరమేశ్వరులయాజ్ఞలను బుష్పమాలిక

లంబోలి మస్తకంబునం దాల్చి వారికి నమస్కారంబు గావించి ప్రయాణం బయ్యెను. అనంతరము దేవీదుఃఖనాశకుండును, శ్మశానవాసియు, వీరభద్రరూపుండు నగుమహాదేవుండు క్రుద్ధుండై శరీరరోమకూపంబుల నుండి రోమజులను ననేకగణేశ్వరులను, దక్షిణబాహువునుండి శతకోటి గణేశ్వరులను వామబాహువునుండి రుద్రసదృశపరాక్రమవంతులును, భీకరదర్శనులును, దారుణకర్ములును, సపత్నీకులు నగుసర్వతోభద్రుల ను సృజించెను. ఇట్లే యాతఁడు తనపాదములనుండియు, ఊరువులనుండియు, పృష్ఠమునుండియు, పార్శ్వములనుండియు, ముఖమునుండియు, గళప్రదేశమునుండియు, గుహ్యమునుండియు, శిరోమధ్యమునుండియు, కంఠమునుండియు, వదనమునుండియు ననేకగణేశ్వరులను సృష్టించెను.

అప్పుడు వీరభద్రతుల్యులగుభద్రగణేశ్వరులమూలంబున సకల జగంబులు నాచ్ఛన్నంబు లయ్యెను. వారందఱును సహస్రహస్తులును, సహస్రాయుధధారులును, రుద్రానుచరులును, రుద్రపరాక్రములును, శక్తిశూలగదాఖడ్గశిలాధరులును, కాలాగ్నిసదృశులును, త్రిలోచనులును, జటాధరులును నై యుండిరి. వీరభద్రజాతు లగునాగణేశ్వరు లందఱును సింహారూఢులై మేఘంబులంబోలి గర్జించుచుండిరి. భగవానుం డగువీరభద్రుం డాభద్రగణంబులచేఁ బరివేష్టితుండై కాలానలశతపరివృతుండగు కాలభైరవునింబోలి విరాజిల్లుచుండెను. వారినడుమ వృషభధ్వజుండగువీరభద్రుండు వృషభారూఢుండై మేఘారూఢుం డగు మహాదేవుంబోలి ప్రయాణము సేయుచుండెను. భసితప్రభుండను గణేశ్వరుఁ డొకచేతితో నాతనికిఁ జామరమును విసరుచు మఱియొక చేతితో ముత్యాలగొడుగు పట్టియుండెను. అప్పు డావీరభద్రునిపార్శ్వంబుననున్న భసితప్రభుండు విశ్వగురుండగుమహాదేవునిపార్శ్వము నందుండు హిమాచలేంద్రునిం బోలి యుండెను. శుభ్రసౌమ్యచామర

హస్తుండగు భసితపరిభూషణునితోఁ గూడియున్న వీరభద్రుఁడు కేవలము మహాదేవునివలె విరాజిల్లుచుండెను.

మహాతేజుండగు భానుకంపుం డనుగణేశ్వరుఁడు వీరభద్రునిముందు నిలిచి మణిహేమమయంబగు శంఖమును బూరించుచుండెను. ఆకాశమున దేవదుందుభులు మ్రోఁగుచుండెను. జలధరంబులు మాటిమాటికిని బుష్పవృష్టిం గురియించుచుండెను. మార్గమునందు మరందకలితవికచకుసుమసౌరభంబులతో ననుకూలపవనంబులు వీతెంచుచుండెను. మదోన్మత్తులగు గణేశ్వరులు మహావేశాసన్నులై తమతమపరాక్రమోద్ధతిం జూపుచు నానందనృత్యములం గావించుచు, సింహనాదములుసేయుచు, హసించుచుఁ బరస్పరోత్సాహదాయకులై గానముసేయుచుండిరి. ఆవీరగణమధ్యస్థితులగు భద్రకాళీవీరభద్రులు రుద్రగణమధ్యవర్తులగు పార్వతీపరమేశ్వరులం బోలి శోభిల్లుచుండిరి.

అట్లు ప్రయాణంబు సాగించి వీరభద్రుండు తుహినాద్రింబున హిరణ్మయంబగు దక్షయజ్ఞశాలం బ్రవేశించెను. ప్రళయకాలంబున విశ్వదహనంబు గావించుటకై ప్రవేశించిన మహాకాలుండునుం బోలి వీరభద్రుండు దక్షునిప్రధానయజ్ఞానుష్ఠానభూమియందుఁ బ్రవేశించెను.

—♦ దక్షాధ్వరధ్వంసము. ♦—

అమితతేజులగువిష్ణుప్రభృతిసకలదేవతలయు విచిత్రధ్వజమండపంబులచేఁ బరిశోభితంబగుమహాయజ్ఞమును వీరభద్రుఁడు సందర్శించెను. ఆయజ్ఞమునందు శుభకరంబులగుకుశలు ఋజుభావముతో నాస్తీర్ణములై యుండెను. అగ్ని బాగుగఁ బ్రజ్వలించుచుండెను. యజ్ఞభూమి యంతయు సముజ్జ్వలంబు లగుకాంచనపాత్రలచే నలంకృతమై యుండెను. యజ్ఞకర్మనిపుణులును, యజ్ఞోచితకర్ములు నగుఋషులచే విధిపూర్వకంబుగ బహువిధక్రియలు నిర్వర్తింపఁబడుచుండెను. అనం

ఘోష్యప్సరోగణసంగీతంబులచేతను, వేదపాఠంబులచేతను యజ్ఞశాలయంతయు మాఱుమ్రోగుచుండెను. అదియంతయుం గాంచి ప్రతాపశాలియు వీరశ్రేష్ఠుండు నగువీరభద్రుండు సింహనాదంబు సేయుటయు గణేశ్వరులందఱు నాయజ్ఞశాలయందు గగనవిదారితంబులును, సాగరగంభీరంబులు నగుకిలకిలారావంబులఁ గావింపం దొడంగిరి. ఆదారుణారావంబుల నాకర్ణించి సకలదేవతలును భయభ్రాంతులై తత్క్షణముతో వసనభూషణాదులు విస్రస్తంబులగుచుండ నలుదెసలకును బరుగులెత్త నారంభించిరి.

మేరుశైలము విభిన్నం బయ్యెనో, భూమండల మాకస్మికముగ విదీర్ణంబయ్యెనో యని దేవతలందఱును దల్లడిల్లుచుండిరి. వనంబున మృగేంద్రగర్జనము నాలించి భయంబుచే గజగణంబులు ప్రాణంబుల విడుచున ట్లాభయంకరధ్వనులనాలించి కొందఱుదేవతలు గతాసులై పోయిరి. ఆదారుణారావంబునకు సకలపర్వతములును విదీర్ణములయ్యెను. భూమండలము ప్రకంపితమయ్యెను. వాయువులు విజృంభింపఁ దొడఁగెను. సకలసముద్రంబులును సంక్షుభితంబు లయ్యెను. అగ్నులు జ్వాలాశూన్యంబు లయ్యెను. సూర్యచంద్రగ్రహనక్షత్రములు ప్రభావిహీనములై పోయెను.

అప్పుడు మహావీరుం డగువీరభద్రుండు భద్రకాళిభద్రగణసహితుండై యజ్ఞశాలం బ్రవేశించుటం గాంచి దక్షుండు మనంబున భయభ్రాంతుం డయ్యెను గాని ధైర్యము బ్రకటించుచుఁ గ్రుద్ధస్వరముతో “ఎవరు మీరు? ఇచ్చటి కేలవచ్చితిరి?” అని యదలించెను. ఆదక్షునివాక్యంబు లాలించి మహాతేజుం డగువీరభద్రుండు మందహాసము సేయుచు దక్షునివంకను, దేవగణంబులవంకను, ఋత్విగ్గణంబులవంకను దృష్టిపాతంబు సేయుచు గాఢము గర్వభాషణముతో మేఘ

గంభీరస్వరంబున నిట్లనియెను. మేమందఱము నమితతేజుం డగుమహాదేవుని యనుచరులము. యజ్ఞభాగంబుల నపేక్షించి యిచ్చటికి వచ్చితిమి. మాయజ్ఞభాగములను మాకిర్పింపవలయును. ఈయజ్ఞమునందు మానిమిత్తమై యుచితభాగంబులు రక్షితంబులై యున్నవా? లేకున్నచో నట్లులేకుండుటకుఁ గారణముం దెలుపుఁడు. అట్లు చేయుట మీకిష్టంబు లేదేని మాతో యుద్ధము చేయుఁడు.

అర్థవంతంబులును, సముచితంబులు నగువీరభద్రుని వచనంబుల నాకర్ణించి దక్షప్రముఖు లగుదేవగణంబులు మంత్రిగణంబుల నుద్దేశించి మీరీవిషయంబున ధర్మనిర్దేశంబు గావింపవలయు నని కోరిరి. అప్పుడు మంత్రిగణంబులో దేవతలారా! మీచిత్తంబు లజ్ఞానాచ్ఛాదితములై పోయినవి. కావుననే మీరీయజ్ఞమునందుఁ బ్రథమభాగార్హుం డగుమహేశ్వరు నర్చించుట మానితిరి. అని బోధించినను, మూఢచిత్తు లగుదేవతలు వీరభద్రప్రహారాభిలాషులై వారికి యజ్ఞభాగంబుల నర్పింపకుండిరి. సత్యంబును, హితకరంబు నగుతమప్రబోధనంబు విఫలం బగుటచే మంత్రిగణంబులు కోపించి యాయజ్ఞశాలం బరిత్యజించి సనాతనం బగుబ్రహ్మలోకమునకుం బోయిరి. అప్పుడు గణాధ్యక్షుం డగువీరభద్రుండు విష్ణుపురస్సరు లగుదేవతల నందఱను సంబోధించి మీరందఱు నాత్మబలగర్వితులై మంత్రిగణంబులప్రబోధమును బ్రమాణముగా నంగీకరింపకుంటిరి. ఓదేవతలారా! మీరందఱు నీయజ్ఞమునందు మమ్మీవిధముగా నవమానించితిరి. కావున నిఁక మీప్రాణములతోఁగూడ మీగర్వములు దూరము లగుఁగాక! అని క్రోధావేశముతోఁ బలుకుచుఁ బూర్వము మహాదేవుండు త్రిపురదహనముం గావించినవిధంబున బహువిధాన్నాదిసమస్తపదార్థంబులతోఁ గూడ నయ్యజ్ఞవాటమును దననేత్రానలంబుచే భస్మీభూతముం గావించెను.

అప్పుడు పర్వతాకారమహాకాయులగు గణేశ్వరులు విజృంభించి యూ[illegible]ములు నత్పాటితంబులుగను, రజ్జువులచే హోత్రకంఠంబు [illegible]యజ్ఞపాత్రంబుల విచూర్ణంబులుగను [illegible]తరంబులను గంగాజలనిమగ్నములుగాఁ జేయు [illegible]. మఱియు సర్వగణంబులు బహువిధసుగంధభక్ష్యంబుల భుజించుచు, సుస్వాదుపానీయ, లేహ్య, చోష్యంబుల నారగించుచు న్నెల్లవస్తువులను జిందఱవందఱగఁ జేసివైవఁదొడంగిరి. బలవంతులగు సర్వగణంబులు వజ్రచక్రత్రిశూలశక్తిప్రాసముసలఖడ్గాదిసాధనంబులఁ గరంబులం దాల్చి క్రోధోద్ధతులై లోకపాలప్రముఖులగు దేవగణంబులఁ జీల్చి చెండాడుచు "కొట్టుఁడు! చంపుఁడు!" అని బొబ్బలు పెట్టుచుండిరి. మహారణోచితంబులును, గోధోత్పన్నంబులు నగునా దారుణాలాపంబులచే నలుదెసలును బ్రతిధ్వనించుచుండెను. కొందఱు విస్ఫారితనేత్రులై దంతంబులచే నోష్ఠతాలుదంశనంబు గావించుచు నాశ్రమస్థులగు [illegible] దఱిమికొట్టుచుండిరి. మఱియు వారిస్రువంబుల నపహరించి జలా[illegible]యందుఁ బాఱవైచుచుండిరి. వారిట్లు డుచుఁ [illegible]లవస్తువుల నతలకుతలంబులుగఁ జేయుచు ము[illegible] జేసివైచుచుండిరి. సింహపరాక్రములగు [illegible]హితంబుగ దేవతలనందఱను మథించి రక్తాసవపానవినోదంబులఁ దేలియాడుచుండిరి. అమితప్రభావసంపన్నులగువారట్లతిభయంకరకృత్యములం గావించుచు, నృత్యము సేయుచు శత్రువులను బ్రహరించుచుఁ బాఱఁద్రోలుచు, నున్మత్తవిహారముం గావించుచుండిరి. అందుఁ గొందఱు మదోన్మత్తులై నృత్యములు సేయుచుండిరి. కొందఱట్టహాసములం గావించుచుండిరి. కొందఱు పరుగులువారుచుండిరి. కొందఱు జలధరపటలంబులనుత్పాటితంబుల

గఁ జేయఁ జూచుచుండిరి. కొందఱాకసంబున కెగసి సూర్యదేవుని గ్రహింపఁజూచుచుండిరి. గారుడవిహంగములు భుజంగములం దాల్చు నవిధంబునఁ గృపాణపాణులై కొందఱు గగనతలంబున వాయువేగంబున సంచరించుచుండిరి. కొందఱు దేవతాగణంబులను గగనవీథులఁ బాఱఁదోలుచుండిరి. కొందఱు ద్వారజాలకవేదికాసహితంబుగ గృహంబులను బెకలించివైచుచుండిరి. ప్రళయకాలజలధరంబులంబోలి యాప్రమథగణంబు లాసకలగృహంబులను జలనిక్షిప్తంబులుగఁ జేయుచుండిరి. అట్లు ప్రమథగణంబుల దారుణకృత్యంబులచే ద్వారకవాటసద్యంబు లుద్వర్తితంబులై, శాలావలభీగవాక్షాదులు విధ్వస్తంబులగుటయు నయ్యజ్ఞవాటం బనాప్తవాక్యంబునుంబోలి యప్రశస్యంబై పోయెను. ఇట్లు గృహంబులన్నియు వినాశంబునందుటయు నారీమణులు భయభ్రాంతలై "హానాథా! హాతండ్రీ! హాతాతా! హాభ్రాతా! హాజననీ! హామాతులా!" అని యీవిధముగా సంబోధించుచు నార్తనాదములఁ గావింపనారంభించిరి.

—♦ విష్ణుప్రమథగణంబులయుద్ధము. ♦—

అప్పుడు విష్ణుండును, మహేంద్రప్రభృతి సకలదేవతలును భయార్తులై పలాయనంబు గావింపందొడంగిరి. దండాహతులనేకులు కొందఱు నక్షతశరీరులై యెట్లో పాఱిపోవలెంచుచుండంగా విష్ణుమూర్తి యుక్కోపోద్రిక్తుండై సర్వశక్తివినాశకం బగుత్రిశూలంబుఁ దాల్చి యీర్థ్యంబునకు దృష్టినిగుడించి, వదనంబునుండి యగ్నిజ్వాలలు వెలువరించుచుఁ బంచాననము మదగజబృందంబులంబోలి యాదేవతలను సెఱుము నారంభించెను. అప్పుడాతనిగమనంబు మదగజగమనంబునుంబోలి యతిమనోహరమై యుండెను. అట్లు వీరభద్రుండును మదమాతంగము మహాసరోవరంబునుంబోలి యతితరం బగుశౌర్యమును సంక్షుభిత

ముగాఁ జేసినైచి, ఛేదితులును, పీడితులును, క్రందితులును, విదారితులును, మథితులు నగునాదేవతలసమూహము సమమఁ దృణసమూహంబునందును వెలుంగు మహానలుండునుంబోలి విజృంభించుచుండెను. ఆతఁడు త్రిశూలధారియై వాయువేగంబుతో రణరంగమున విహరించుచున్నప్పుడు దేవతల కాతనియేకమూర్తి వేయిమూర్తులుగా గోచరించుచుండెను.

మహారణమదోద్ధత యగుభద్రకాళియు మహాక్రోధావిష్టయై కంఠస్థలంబున ముక్తామణిసముజ్జ్వలం బగుత్రిశూలంబుచే దేవతాగణంబులను నిర్భిన్నులం గావింపఁదొడంగెను. రుద్రక్రోధసంజనితుం డగు వీరభద్రుం డప్పుడు భద్రకాళీసహితుండై, చంచలధూమధూమ్రం బగునాత్మప్రభతో వెలుంగుప్రళయకాలానలుండునుంబోలి శోభిల్లుచుండెను. దేవగర్వాపహారకారిణి యగుభద్రకాళియు, విశ్వవినాశంబు గావించు కల్పాంతానలజ్వాలంబోలి భీకరస్వరూపిణియై యుండెను. అప్పుడు రుద్రగణాగ్రణి యగువీరభద్రుండు హయసహితుం డగుసూర్యుని, రుద్రగణంబులను వాముపదాహతులం గావించి పరాభవించి ఖడ్గంబుచే నగ్నిని, పాశంబుచే యముని, వృషశూలంబుచే రుద్రులను ముద్గరంబుచే వరుణుని, పరిఘామూలంబున నిర్ఋతిని, టంకంబుచే వాయువును విభిన్నులం గావించెను. అనంతరము దీప్తిమంతుం డగువీరరుండు తనసఖాగ్రంబులచే వేదమాత యగుసరస్వతీదేవి శుభదాయకం బగునాసాగ్రమును ఛేదించివైచెను. మఱియు నాతఁడు కుఠారంబుచే విభావసునిబాహుదండంబును, హవ్యాస్వాదనోపయుక్తంబగు నంగుళద్వయపరిమితజిహ్వాగ్రంబును ఛేదించివైచెను. అట్లే తననఖాగ్రంబులచే స్వాహాదేవిదక్షిణనాసాపుటంబును, వామస్తనచూచుకంబును జిదిమివైచెను. మఱియు నాతఁడు భగునివిశాలనయనపద్మంబులను పెరి

లించి తనధనుష్కోటిచే ముక్తామణిసన్నిభంబు లగుపూషునిదంతముల నుత్పాటితంబులుగాఁ జేసివైచెను. ఆకారణముచేతనే పూషుం డస్పష్టవక్త యయ్యెను.

అనంతర మాతఁడు చంద్రునిం బట్టి క్రిందఁబడవైచి తనపదాంగుళులచేఁ గ్రిమింబోలి నలిపివైచెను. పిమ్మట నమ్మహావీరుండు దక్షమస్తకచ్ఛేదంబు గావించి దక్షపత్నులరోదనధ్వనులను జెవిని బెట్టకయే యాశిరంబును దెచ్చి దేవి యగుభద్రకాళి కుపహారంబు గావించెను. తాళఫలసదృశంబగునమ్మస్తకమును జేతఁబూని భద్రకాళియు మహానందముతో రణరంగమునందుఁ గందుకక్రీడం గావింపనారంభించెను. అప్పుడు గణేశ్వరులందఱునుజేరి దక్షపత్నులనాక్రమించి దుశ్శీలలగు భార్యలను భర్తలుపరిహరించువిధంబున నిర్దయులై ప్రహరింపనారంభించిరి. మఱియు వా రుద్ధతులై సింహపరాక్రమంబుఁ జూపుచు, అరిష్టనేమి, సోముఁడు, ధర్ముఁడు, ప్రజాపతి, బహుపుత్రుండగునంగిరుఁడు, భృంగాశ్వుఁడు, కశ్యపుఁడు మొదలగువారిగళంబుల బిగించిపట్టి తిరస్కారవచనంబులచేఁ బరాభవించుచు వారిమస్తకంబులపై ముష్టిప్రహారంబులఁ గావింప నారంభించిరి. కలియుగంబున బలవంతులగు జారులచేఁ గులవధూగణంబులుంబోలి యాగణాధ్యక్షులచేఁ దాళవై తాళాదిగణంబులు పుత్రవధూసహితంబుగఁ బరాభూతులైరి.

ఇట్లు గణాధ్యక్షులచే వినష్టం బగుయజ్ఞవాటంబు ప్రధ్వస్తంబులగుకలశంబులతోడను, భగ్నంబు లగుయూపంబులతోడను, వినష్టంబులగునుత్సవంబులతోడను, దగ్ధంబు లగువిశాలగృహంబులతోడను, విభిన్నంబు లగుతోరణద్వారములతోడను, ఉత్పాటితంబు లగుదేవసైన్యంబులతోడను, ఉత్పీడితంబు లగుఋషిగణంబులతోడను, ప్రశాంతంబులగుబ్రహ్మఘోషంబులతోడను, ప్రక్షీణంబులగుపరిచారక

ప్రేక్షకగణంబులతోడను, రోరుద్యమానంబులగు స్త్రీసమూహంబులతోడను, విదూషితంబు లగుసకలోపకరణంబులతోడను, శూన్యారణ్యముంబోలి భాసిల్లుచుండెను. త్రిశూలాఘాతంబులచే విభిన్నంబు లగునూరుబాహుమస్తకంబులు గలిగి దేవతాగణంబులు భూపతితు లగుచుండిరి. ఈరీతిగా వేలకొలందిదేవతలు ధరణీతలంబునం బడిపోవుటయు సర్వగణేశ్వరుం డగువీరభద్రుం డొక్కక్షణంబులో మరల యజ్ఞశాలం బ్రవేశించెను.

ప్రళయానలాకారుం డగునాతనిం గాంచి యజ్ఞపురుషుండు మృగరూపముం దాల్చి పలాయితుం డగుచుండుటయు ధనుర్ధరుండగు వీరభద్రుండు భీషణంబుగ గుణధ్వానంబు సేయుచు శరసంధానంబు గావించి యాతని వెంబడించి తఱుమ నారంభించెను. ఆకర్ణాకృష్టం బగునాతనికార్ముకంబునుండి వెలువడుగుణధ్వని భూమ్యాకాశములం బ్రతిధ్వనించుచుండెను. వీరభద్రుం డాయజ్ఞపురుషు నట్లు తఱిమితఱిమి పోయి యతినిశితంబగు నొకయర్ధచంద్రబాణముచే “చచ్చితిని; చచ్చితిని.” అని ప్రలపించుచున్న యాతనియుత్తమాంగము నొక్కపెట్టున విచ్ఛేదంబు గావించెను. సూర్యాత్మజుం డగుయజ్ఞపురుషుం డిట్లు హతుం డగుటం గాంచి విష్ణుదేవుండు మహాక్రోధపరవశుండై యుద్ధంబునకుద్యుక్తుం డయ్యెను.

అప్పు డాతండు పక్షీంద్రుండును, బన్నగాశనుండును, మహావేగుండు నగుగరుడునిమూపుపై నధివసించి హతశేషులగు దేవతలను, దేవేంద్రుని గూర్చుకొని యుద్ధసన్నద్ధుండై యుండెను. సృగాలపరివృతం బగువ్యాఘ్రముం గాంచినసింహముంబోలి భూతపతి యగువీరభద్రుండు దేవగణసహితుం డగువిష్ణుదేవుం గాంచి యలక్ష్యముగా హసింప నారంభించెను. అప్పు డతిరమణీయంబును, వృషభధ్వజవిలసితం

బును, సహస్రసూర్యప్రభాసమానంబు నగునొకదివ్యరథం బాకాశము
నుండి యావిర్భూతం బయ్యెను. అది యుత్తమాశ్వద్వయసంయోజి
తంబును, చతుశ్చక్రవిలసితంబును, దివ్యాస్త్రసంచితంబును. పూర్వ
ము త్రిపురమథనసమయంబున మహాదేవునకు సారథ్యంబు గావించి
యాతండే యిప్పు డారథంబునకు సారథియై యుండె.
యగుబ్రహ్మదేవుండు మహాదేవునాజ్ఞచే నారథంబును విష్ణుండు చూచు
చుండ వీరభద్రుసన్నిధికిం దీసికొనిపోయి మహాత్మా! సుందరవిశాల
లోచనా! వీరభద్రా! భగవానుండును, అవ్యయుండును, బాలేందు
భూషణుండు నగుదేవదేవుండు నిన్నీరథంబు నధిరోహింపు మని యాజ్ఞా
పించి యున్నాఁడు. ఆదేవుం డంబికాసహితుండై గైధ్యాశ్రమసమీ
పమునందు నివసించి దుస్సహంబగు నీపరాక్రమం బంతయు నవలో
కించుచున్నాఁ డని విన్నపంబు చేసెను.

రణకుంజరుం డగుభద్రుం డావచనంబుల నాకర్ణించి బ్రహ్మ
మొదలఁ బ్రసన్నుండై రథారోహణంబు గావించెను. బ్రహ్మసారథికం
బగునారథంబునందున్న వీరభద్రుండు త్రిపురసంహారోద్యుక్తుం డగు
మహాదేవునిం బోలి శోభిల్లుచుండెను. అప్పుడు భానుకంపుండు కుం
దేందుసన్నిభప్రభామయం బగునుత్తమశంఖమును మ్రోఁగించుటయు
సంక్షుభితసాగరఘోషముం బోలి యున్నయాదారుణశంఖారావము
నాకర్ణించి సకలదేవగణములును భయభ్రాంతులై పోయిరి. రణసందర్శన
కుతూహలంబుచే నాగయక్షగంధర్వసిద్ధసాధ్యాదిగణంబు లొక్కనిమిష
ములో గగనతలం బంతయును నిండిపోయిరి. అప్పుడు శార్ఙ్గం బనునిం
ద్రధనువుం దాల్చిన నారాయణుం డనునీలమేఘము శరపరంపరలను
వర్షధారలచే గణేశ్వరు లనువృషభములను బీడింప నారంభించెను.
అట్లు పరాక్రమించుచున్న విష్ణుదేవునిం గాంచి వీరభద్రుండు సహస్ర

శరమోచనదక్షమంబగు విజయకార్ముకముం దాల్చి మేరుధనుర్ధరుండగు మహాదేవునిం బోలి బ్రహ్మాండము కంపించునట్లు గుణధ్వానంబు గావింప నారంభించెను. అనంతర మత్యుగ్రప్రతాపుం డగునాగణాధ్యక్షుండు ప్రదీప్తం బగుసర్పముఖశరంబును వింట సంధించుటయు నాతని హస్తమునం దాబాణము విశాలోరగవదనమునందలి క్షుద్రసర్పాకృతిం దాల్చియుండెను. భద్రుం డతిక్రోధముతో నతితీక్ష్ణంబగు నాదివ్యశరంబును బ్రయోగించి విష్ణుదేవునిలలాటప్రదేశమును విద్ధంబు గావించెను. అందుచే విష్ణుండు సింహాధిక్షిప్తం బగు వృషేంద్రంబునుం బోలి క్రుద్ధుండై భీషణముఖంబును, వజ్రకల్పంబు నగు మహాబాణముచే వీరభద్రునిభుజంబును ఛేదించెను.

వీరభద్రుండును మరల నయుతసూర్యప్రభామయంబగు నొకబాణముచే విష్ణుదేవునిభుజంబును నొప్పించెను. ఇట్లయ్యిరువురు నొండొరులపై దివ్యాస్త్రంబులఁబ్రయోగించుకొనుచుఁ దుములసంగ్రామము సేయందొడంగిరి. పరస్పరజయార్థులై యిట్లు పోరాడుచున్నయామహాయోధులం గాంచి గగనతలంబునందున్న ఖేచరగణంబులు హాహాకారములం గావింప నారంభించిరి. అప్పుడు వీరభద్రుం డాదిత్యసంకాశంబును, అగ్నిముఖంబు నగుదివ్యాస్త్రముం బ్రయోగించి యతిదృఢంబుగ నవ్విష్ణుదేవుని విశాలవక్షమును భేదించుటయు నారాయణుం డాతీవ్రశరాఘాతంబుచే వ్యథితుండై మూర్ఛిల్లి యంతలోనే చైతన్యముం గాంచి లేచి క్రుద్ధుండై స్వనామాంకితంబులును, నెల్లయెడల నవ్యర్థంబులు నగుదివ్యశరంబులఁ బ్రయోగింప నారంభించెను. వీరభద్రుండును భద్రనామాంకితంబులగునేపరంపరలచే మార్గమధ్యమునం దే యావిష్ణుదేవునిశరంబుల నన్నిటిని శకలచ్ఛిన్నములుగాఁ జేయుచుండెను. మఱియు నాతఁ డవలీలగా నొకబాణంబుచే విష్ణుకార్ముకం

బును, శరద్వయముచే గరుడుని పక్షద్వయంబును ఖండించివైచెను. అప్పుడు విష్ణుండు యోగబలంబునఁ దనశరీరమునుండి భీషణాకారులును శంఖచక్రగదాధరులు నగువేలకొలఁది దేవతలను సృజించుటయు మహాబాహుండగుశంకరుండు తననేత్రానలంబుచేఁ ద్రిపురవాసులంబోలి వీరభద్రుం డాదేవతలనందఱను భస్మీభూతులం గావించెను. అదియంతయుం గాంచి విష్ణుదేవుండు క్రోధారక్తలోచనుండై దక్షిణకరంబున సుదర్శనచక్రముం దాల్చి వీరభద్రునిపైఁ బ్రయోగింపఁజూచుటయు భద్రుండు మందహాసంబు సేయుచు నవలీలగా నాతనిస్తంభితునిం గావించెను. ఇట్లు స్తంభితుండగునారాయణుం డెంతప్రయత్నించినను చక్రప్రయోగంబు సేయఁజాలకయవశుండై యాక్రోశించుచుఁ జక్రసహితంబుగా నెత్తినబాహు వెత్తినట్లే యుండ శిలావిగ్రహముంబోలి నిశ్చలభావంబున దేహశూన్యుండగుజీవునివలెను, శృంగశూన్యంబగు వృషభమువలెను, దంతశూన్యంబగుసింహమువలెను, నిరాధారుఁడై నిలువఁబడిపోయెను.

ఈవిధముగా దుర్దశాపన్నుండై పోయినవిష్ణుదేవునిం గాంచి దేవతలందఱును క్రుద్ధులై పంచాననంబుపయిం దాఁకుబలీవర్దంబులంబోలి యొక్కుమ్మడి వీరభద్రుం దలపడి యుద్ధము సేయ నారంభించిరి. వీరభద్రుండును మృగసమూహంబులపై విజృంభించు మృగేంద్రుండునుంబోలి యట్టహాసంబు సేయుచు దేవతాగణంబులనందఱ నాక్షణంబ స్తంభితులం గావించెను. అప్పుడింద్రాదులు వజ్రాద్యాయుధంబులతో నెత్తినబాహువు లెత్తినట్లుండఁ జిత్రప్రతిమలవలె నిలిచిపోయిరి. కల్పాంతభైరవునింబోలి వెలుంగుచు విజృంభించుచున్నవీరభద్రునియెదుట నిలువఁజాలక సకలదేవతలును భయభ్రాంతులై పలాయితు లగుచుండుటయు భద్రుండు శిలావృష్టిచే శైలంబులభేదించు మేఘుం

డునుంబోలె దేవతాసమూహమును శరవర్షంబుచే ముంచివైచుచుండె ను. అగ్నిజ్వాలలఁ గ్రక్కుచుండు మహానాగంబునుంబోలె దివ్యాస్త్రం బులచే వెలుంగుచుండు నవ్వీరుని మహాబాహువు శోభిల్లుచుండెను. ఆ దికాలంబున నానావిధభూతంబుల సృష్టించు ప్రజాపతింబోలి వీరభ ద్రుండు వివిధంబు లగుదివ్యాస్త్రశస్త్రంబుల సృజించుచు సూర్యుండు సహస్రకరంబులచే బ్రహ్మాండము నాక్రమించునట్లే యొకక్షణంబు లో దివ్యాస్త్రములచే సకలదిశల నాచ్ఛాదితంబులుగాఁ జేసివైచెను.

హేమమయంబులగు నవ్వీరభద్రునిదివ్యశరంబు లన్నియు నాక సంబున కెగసి విద్యుత్స్వరంపరలంబోలి వెలుంగుచు దుందుభంబులు మం డూకంబుల వధించి రుధిరపానంబు చేయువిధంబున దేవతాసంహారంబు గావించి వారిరుధిరాసవపానంబు గావించుచుండెను. విచ్ఛిన్నబాహులు ను, విభిన్నమస్తకులును, విదారితపార్శ్వులునై దేవతలందఱును భూతల పతితులగుచుండిరి. కొందఱు మృతులగుచుండిరి. కొందఱు భూమండల మునకుఁ బాఱిపోవుచుండిరి. కొందఱు స్వర్గాభిముఖులై పలాయితు లగు చుండిరి. కొందఱెందు దాఁగుటకును దోఁపకుండుటచేఁ బరస్పరము నొకరివెనుక నొకరొదిఁగి నిలుచుచుండిరి. కొందఱు భూగర్భములందును గొందఱు పర్వతగుహాలయందును దాఁగుచుండిరి. కొందఱు గగనత లంబునను, గొందఱు జలాంతరంబునను నంతర్హితు లగుచుండిరి. వీరుండగు భద్రుండు ప్రళయకాలంబునఁ బ్రజాసంహారంబు సేయు భైరవుండునుం బోలె విజృంభించుచు సకలదేవతాగణంబులను భిన్న భిన్నంబులుగాఁ జేయుచు దీనులగువారిరుధిరంబులచే నతిభీషణంబుల గురక్తవాహినులను బ్రవహింపఁజేయుచుండెను.

అప్పుడు రక్తాగ్రం బగునయ్యజ్ఞభూమి శుంభదైత్యసంహారసమ యంబున రుధిరసిక్తవసనయు, శ్యామాంగియు నగుకౌశికింబోలి శోభి

ల్లుచుండెను. అతిదారుణం బగునమ్మహారణావసానసమయంబున భయవిహ్వలమగుభూమండల మంతయుఁ బ్రకంపిత మగుచుండెను. బృహత్తరంగసహితంబులును, గంభీరావర్తసంయుక్తంబులునై సకలసముద్రంబులును సంక్షుభితంబు లగుచుండెను. నానావిధోత్పాతసూచకంబులై యుల్కాపాతంబు లగుచుండెను. సకలవృక్షంబులును శాఖావిహీనములై పోవునట్లు సకలదిశలు నప్రసన్నములై పోవునట్లు భయంకరప్రభంజనములు వీచుచుండెను. దైవప్రాతికూల్యముచే నయ్యశ్వమేధాధ్వరంబున కీవిధముగా దుర్దశ సంభవించెను.

ఏయజ్ఞమునందు స్వయముగా బ్రహ్మపుత్త్రుం డగుదక్షప్రజాపతి యజమానుండును, ధర్మప్రభృతులు సదస్యులును, విష్ణుదేవుండు రక్షకుండునై యింద్రాదిదేవతలు తమతమహావిర్భాగంబులను స్వయముగా గ్రహించుటకు వచ్చియుండిరో యట్టిమహాయజ్ఞమునందు యజమానునకును బురోహితాదులకునుగూడ సద్యస్సమయంబున శిరశ్ఛేదంబులై పోయెను. కర్మఫలం బనుభవింపక తీఱదుగదా! కేవలవేదవిరుద్ధంబును, నీశ్వరబహిష్కృతంబును, అసత్పరిగ్రహీతంబునగుకర్మం బెన్నటికిని జేయఁగూడదు. మహత్తరంబు లగుపుణ్యకర్మంబులను, శతాధికంబు లగుయజ్ఞంబులను గావించినను శివభక్తి లేకయున్నచో నట్టిసకలకర్మంబులును నిష్ఫలంబులై పోవును. మహాపాపాత్ముండైనను భక్తిపూర్వకంబుగా మహాదేవు నర్చించినచో నాతనిసకలపాపంబులును వినష్టంబులై పోవును. ఈవిషయంబుల విశేషవాగాడంబరముం జూపుటవలనఁ బ్రయోజనంబు లేదు. శివనిందాపరాయణు లగువారి దానతపోయజ్ఞహోమాదిసకలకార్యంబులును నిష్ఫలంబులు.

అట్లు వీరభద్రునిదారుణాస్త్రంబులచే విభిన్నశరీరులగు నారాయణ రుద్ర, దిక్పాలాదిదేవతాగణంబులు మహావ్యథాభిభూతులై

పలాయితు లగుచుండిరి. కొందఱు వీరగణమధ్యంబున నాలులాయిత కేశపాశులై భయభ్రాంతిచే దిక్కుదోఁపక చిక్కియుండిరి. కొందఱు గహ్వరస్థానములం దాఁగియుండిరి. కొందఱు మొగంబు లగపడకుండ బోరగిలఁబడి యుండిరి. కొందఱదృశ్యులై పోయిరి. కొందఱెందును బోఁజాలక శిరశ్శరాసనవసనాదులఁ బరిత్యజించి భూతలపతితులై యుం డిరి. అపురదేహుండును, మహాపరాక్రమశాలియు నగువీరభద్రుండు మాత్రము దక్షయజ్ఞధ్వంసంబు గావించి వృషభంబులసమమువెలుంగు సింహంబును బోలి వీరగణపరివేష్టితుండై శోభిల్లుచుండెను.

పార్వతీపరమేశ్వరానుగ్రహము.

ఇట్లు భిన్నభిన్నాంగులగువిష్ణుప్రభృతులును, అల్పావశిష్టు లగు దేవగణంబులును, కష్టదశావిపర్యయంబున భయభ్రాంతులై పోయిరి. వీరగణంబులు వీరభద్రప్రేరితులై రణరంగంబున వారివారిదోషంబుల కుఁ దగినదండంబులం గావించిరి. ఆసమయంబున సారథ్యంబు గావిం చిన బ్రహ్మదేవుండు వీరభద్రునియనుగ్రహంబు వడసి ప్రణామపూర్వ కంబుగ నాతనింగూర్చి యిట్లు ప్రార్థించెను. మహాత్మా! నీకిఁకఁ గ్రో ధంబుతోఁ బ్రయోజనము లేదు. దేవతలందఱును నశించిపోయిరి. ప్రసన్నుండవై యిఁక సీగణేశ్వరులను రణరంగమునుండి మరలింపుము. అని ప్రార్థించుటయు వీరభద్రుం డాతనియెడల గౌరవముచేఁ బ్రశాం తుం డయ్యెను. స్తోత్రపారనిపుణులగుదేవగణంబు లాసమయము నె ఱింగి నిటలతటఘటితాంజలిపుటులై బహువిధస్తోత్రపాఠంబులచే స వ్వీరభద్రుని వినుతింపనారంభించిరి.

ఓశాంతమూర్తీ! మఖధ్వంసకా! త్రిశూలపాణీ! రుద్రభద్రా! రుద్రాణీశ్వరా! కాలాగ్నిరుద్రమూర్తీ! శివా! నీకు నమస్కారము. నీవు దేవగణంబుల సర్వాంగకములను, దక్షునిమస్తకమును ఛేదించితివి. ఓ

వీరభద్రా! మేము స్వయముగా నిర్దోషులమైనను, సాహసియుఁ బాపాత్ముండు నగు దక్షునితోడిసంసర్గమువలనఁ గలుషితులమైతిమి. అందుచేతనే మహారణంబున నీచే దండితులమైతిమి. ప్రభూ! మే[illegible]మును నీభయముచే దగ్ధులమైపోవుచుంటిమి. నీవే మాగతివి. కావున శరణాగతుల మగు మమ్ము రక్షింపుము.

అని యిట్లు దేవతలు స్తుతించుటయుఁ బ్రభుం డగువీరభద్రుండు ప్రసన్నుండై వారినందఱను నిగళముక్తులం గావించి మహేశ్వర సన్నిధానమునకుఁ దీసికొనిపోయెను. అప్పుడు గగన[illegible] గతుండును, సర్వలోకేశ్వరుండును, ప్రభుండు నగుమహేశ్వరుండు గణపరివృతుండై గగనతలంబున నిలిచి యుండెను. పరమైశ్వర్యసంపన్నుం డగుసమ్మహాదేవుం గాంచినంతనే సకలదేవతలును బ్రీతులును భీతులునై యాతనికిఁ బ్రణామములం గావించిరి. ప్రణతార్తిహరుం డగు నమ్మహాదేవుండు భయభ్రాంతులగుదేవతలం గాంచి మందహాసంబు సేయుచుఁ బార్వతివంకఁ గనుంగొని యిట్లనియెను. ఓదేవతలారా! మీకిఁక భయములేదు. నేనిప్పుడు మీపాపముల నన్నిటిని బరిమార్జితములుగాఁ జేసితిని. నేను నిజముగాఁ గోపించినచో నిప్పటికే మీజీవితంబులును, స్థితులును వినష్టంబు నందియే యుండును. అని యనుగ్రహించుటయు దేవతలందఱు నాక్షణంబుననే భయవిరహితులై యానందావేశంబున నృత్యంబులు సేయ నారంభించిరి. ఆశుభసమయముం గాంచి బ్రహ్మదేవుండు కృతాంజలిపుటుండై త్రిశూలధరుం డగుమహాదేవునకుఁ బ్రణమిల్లి యిట్లు విన్నపంబు గావించెను. ఓప్రణతార్తిభంజనా! నీకు విజయం బగుఁగాక! ఇట్టిమహాపరాధములను క్షమించు మహాత్ములు నీకంటె నెవ్వరున్నారు? పరమేశ్వరా! యుద్ధనిహతులగుసకలదేవతలను బునరుజ్జీవితులం గావింపుము. నీవు ప్రసన్నుండవైనచో

నెవ్వరికి సుఖంబులు లభింపకుండును? దూషితంబులగుసకల యజ్ఞాంగ
కములను మరల భూషితంబులుగాఁ జేయుము.

అని బ్రహ్మదేవుండు ప్రార్థించుటయు దేవదేవుండు మందహా
సంబు సేయుచు దేవివంకఁ గటాక్షపాతంబు గావించి ప్రసన్నుండగు
పద్మసంభవునియందలివాత్సల్యముచే దేవతల సందఱను బునర్జీవితు
లం గావించెను. తోడనే యింద్రాదిదేవత లందఱును బరమేశ్వరాను
గ్రహంబుచే యథారూపంబులం దాల్చి యాదేవదేవునకుఁ బ్రణా
మంబులఁ గావించిరి. విభిన్నంబులగు దేవతలసకలాంగకంబులును
యథారూపంబున విరాజిల్లుచుండెను. అప్పుడు భగవంతుం డగుపితా
మహుండు వృద్ధచ్ఛాగశిరంబుచే దక్షశిరంబును మరల నిర్మించెను. తో
డనే దక్షుండు చైతన్యముం గాంచి లేచి కృతాంజలిపుటుండై భయో
ద్రేకంబుచే బహువిధంబులఁ బ్రలాపించుచుఁ బరమేశ్వరుని స్తుతింప
నారంభించెను. కృతాపరాధుం డగుదక్షుం డిట్లు భయవ్యాకులుండై
ప్రలపించుచుండుటం గాంచి దయానిధి యగుమహాదేవుండు దక్షునిం
గాంచి మందహాసంబు సేయుచు భయపడవలదని యూఱడించెను.

అనంతరము మహాదేవుండు బ్రహ్మదేవునకుఁ బ్రియంబు సేయం
దలంచి యాతనితనయుం డగుదక్షునకు శాశ్వతం బగుగాణపత్యపదం
బును బ్రసాదించెను. అప్పుడు విరించి కృతాంజలిపుటుండై యభివాద
నంబు సేయుచుఁ బార్వతీపరమేశ్వరులను శుభవచనంబులచే వినుతింప
నారంభించెను. అనంతరము విష్ణుదేవుండును, దేవతాగణంబులును,
మహర్షిగణంబులును యథాక్రమంబుగ మహాదేవుని, మహాదేవిని
వినుతింపఁదొడంగిరి. అప్పుడు గిరిరాజదుహిత యగునంబికాదేవి తన
పార్శ్వమునందుఁ గృతాంజలిపుటుండై నిలిచియున్న నిజాజ్ఞానిర్వాహ
కుండగువీరభద్రుం గాంచి ప్రసన్నుం డగునాతనికేలు కేలం గీలించి

యాకర్షించి భద్రకాళీసహితంబుగ నాతని దనతొడలపైఁ గూర్చుండఁజేసికొని కార్తికేయునివలెనే గాఢాలింగనముం గావించుకొని యాతనిమూర్ధాఘ్రాణంబు చేసెను. అనంతర మాదేవి పరమానందముతోఁ ద్రిశూలధారి యగువీరభద్రున కనేకసహస్రవరంబులఁ బ్రసాదించెను.

అప్పుడు విష్ణుదేవుఁడు, ఇంద్రుఁడు, పితామహుఁడు మొదలగు ప్రధానదేవగణంబులు సర్వలోకేశ్వరుం డగుమహాదేవునకు శరణాగతులై స్తోత్రంబులు సేయందొడంగిరి. పరమకారుణికుం డగు పరమేశ్వరుండును, మందహాసవదనముతో శరణాగతులగు సకలదేవతలకును భయాపనయనంబు గావించి యోదేవతలారా! విధినియోగవశంబున మీ రందఱును యజ్ఞనిమంత్రితులై నాయెడల నపరాధంబు గావించితిరి. ఇప్పుడు మీ రందఱును మదేకశరణ్యులై ప్రణతులై యుంటిరి గావున మీయపరాధంబు లన్నియును విస్మృతంబులై పోయెను. కావున నిఁక మీ రందఱును భయవిరహితులై యిప్పటిపరాభవంబును విస్మరించియుండుఁడు. ఓహరివిరించిసురేంద్రప్రముఖదేవగణాలారా! మీ రిప్పుడు యథాసుఖంబుగ మీమీపురంబులకుఁ బొండు. అని దక్షముఖధ్వంసకారియు, యజ్ఞవిరహితుండు నగుమహాదేవుం డిట్లానతిచ్చి యనుచరగణంబులతోఁ బార్వతీసహితంబుగఁ జూచుచుండఁగనే గగనతలంబునుండి యంతర్హితుం డయ్యెను.

పిమ్మట మహేంద్రప్రభృతిదేవగణంబులు వ్యథావిరహితులై వీరభద్రునియద్భుతపరాక్రమచరిత్రమును గీర్తించుచు నాక్షణమునందే యాకాశంబున వివిధమార్గముల నవలంబించి సుఖగమనంబు గావించిరి.

— మందరగిరివర్ణనము. —

శ్రీమంతంబును, విచిత్రకందరయుతంబు నగుమందరపర్వతము తనతపఃప్రభావముచే మహేశ్వరునకుఁ బ్రియనివాసమందిర మయ్యెను. ఆశైలరాజ మంబికాశంకరులను శిరంబునఁ దాల్చియుండవలయు నను కోరికతో మహాతపంబు గావించెను. చిరకాలమునకాతనికిఁ బార్వతీపరమేశ్వరులపాదకమలస్పర్శసుఖానుభవంబు లభించెను. సహస్రవదనములుగలవారు శతకోటివత్సరములు వర్ణించినను సంపూర్ణముగ నాపర్వతసౌందర్యమును వర్ణింపఁజాలరు. లోకు లాపర్వతము నితరభూధరంబులవంటిసౌందర్యముగలదే యని భావింతురేమో యనుసంశయముచే నేను సమర్థుండనయ్యు నిప్పుడు దానిని వర్ణింపఁబూనుకొనలేదు. కాని సర్వసమృద్ధం బగునాధరాధరము తనసౌందర్యప్రభావముచేతనే పార్వతీపరమేశ్వరులకు నిత్యనివాసయోగ్యం బయ్యె నని చెప్పఁగలను. అందుచేతనే పరమేశ్వరుం డంబికాదేవిప్రియంబుకొఱ కాసుందరశైలము నంతఃపురముగాఁ జేసికొనియెను. విశాలశిలాఫలకంబులచేతను, సాంద్రమహీరుహషండంబులచేతను విరాజితంబులగునాగిరిమేఖలాప్రదేశములు గౌరీశంకరులనిత్యసాన్నిధ్యసౌభాగ్యముం గాంచుచు సమస్తజగద్భాగ్యమును దృణీకరించుచుండును. నిరంతరము నుమామహేశ్వరుల స్నానాదిక్రియలచేఁ బవిత్రీకృతంబులును, లఘుతరంబులును, సురభిశీతలంబులు, నిర్మలంబులు నగునిర్ఝరజలధారలచే నాసుందరశైలరాజము శైలసామ్రాజ్యపదంబున కభిషేకింపఁబడుచున్నట్లు విద్యోతమానం బగుచుండును. ఆపర్వతశిఖరంబున రాత్రులయందు విహరించుచుండు చంద్రుం డాపర్వతోత్తమాంగంబున సామ్రాజ్యచిహ్నంబుగాఁ బట్టఁబడిన శ్వేతచ్ఛత్రముం బోలియుండును.

ఆపర్వతేంద్రమునకుఁ బ్రాంతంబులయందు విహరించు చమరీమృగంబులవాలంబులు చామరంబులుగను, ప్రభాతకాలంబున నుదితుండగుసూర్యభగవానుండు నిలువుటద్దముగను దోఁచుచుండును. సమీపస్థలంబులలతావేష్టితపాదపంబులు తపోధనులంబోలి బాహురూపలతలచేఁ బుష్పమోచనంబు సేయుచు విహంగకలాలాపంబులచే నమ్మహీధరవరేణ్యు నాశీర్వదించుచున్నట్లుండును. అధోముఖంబులు, నూర్ధ్వముఖంబులు, తిర్యఙ్ముఖంబులు నగుశృంగంబులచే విరాజిల్లు నయ్యద్రిరాజమొకప్పుడు పాతాళంబునకుఁ బతితంబగుచున్నట్లును, ఒకప్పు డాకాశమున కెగయుచున్నట్లును, సకలదిశలను వ్యాపించి యాకసమునఁ బరిభ్రమించుచున్నట్లును, జగంబంతయును దర్శించుచున్నట్లును, నృత్యము సేయుచున్నట్లును గానవచ్చుచుండును.

మఱియు నాభూధరేంద్రము నిత్యాభినవరమణీయంబై, యంతగ్గభీరంబులును, విశాలంబులు నగుగుహాముఖంబులచే నావులించి సకలజగంబులను గ్రసింపఁజూచుచున్నట్లును, సకలసముద్రజలంబులఁ బానముచేయఁ దలఁచుచున్నట్లును, అంతస్థం బగునంధకారమును వెడలఁగ్రక్కనెంచుచున్నట్లును, మేఘసహితంబుగ నాకాశమును భక్షింప నుద్యమించుచున్నట్లును దోఁచుచుండును. ఆపర్వతాభ్యంతరప్రదేశములందలినివాసభూములు దర్పణంబులంబోలి మెఱయుచుండును. సమీపాశ్రమస్థితంబులగుమహీరుహంబులు సాంద్రచ్ఛాయలచే నాతపనివారణంబు గావించుచుండ నాపవిత్రప్రదేశములు సుస్నిగ్ధంబులును, సరిత్సరోవరతటాకంబులనుండివీతెంచు మందపవనంబులచే శీతలంబులునై యుండును. ఆపర్వతరామణీయకమంతయు గిరిజాశంకరుల స్వేచ్ఛావిహారంబులచేఁ జరితార్థం బగుచుండును.

గౌరీదేహధారణము.

వైయాఘ్రాశ్రమస్థితుండగు పరమేశ్వరుం డప్పు డంబికాసహితంబుగ సంతర్హితుండై మరల మందరశైలంబునకుం బోయి యాశైలోద్యానమునందు దేవీసహితుండై విహరించుచుండెను. ఇట్లు బహుకాలంబు గడచుటయుఁ గ్రమంబుగఁ బ్రజావృద్ధియగుచుండ దైత్యకులంబున శుంభనిశుంభు లనునిరువురు సోదరు లుదయించి మహాతపంబుచేఁ బరమేష్ఠిం బ్రసన్నుని గావించుకొని జగంబునం దెట్టిపురుషుండును దమ్ము వధింపఁజాలకుండునట్టివరంబును సంపాదించుకొని యుండిరి. అంబికాంశసముద్భూతయుఁ, బరాక్రమవతియు, నయోనిజయు, పురుషసంయోగవివర్జితయు నగుకన్యయందు వారు మోహాసక్తులైనప్పు డామెరణరంగమున వారిని వధించునట్లుగా నెడవెట్టి విరించి వారికి వరప్రదానంబు గావించెను.

అంతనాదైత్యు లిరువురును మదోద్ధతులై రణరంగమునం దింద్రాదిదేవతలను బరాజితులం గావించి యొక్కసారిగా నిఖిలజగంబును స్వాధ్యాయవషట్కారశూన్యంబుగాఁ జేసివైచిరి. అప్పుడు బ్రహ్మదేవుండు వారిసంహారముకొఱకు స్వయముగా మహేశ్వరునిపాలికిం బోయి మహాత్మా! ఏకాంతముగా జగదంబను నిందించియైనను, మఱియొకవిధముగా నామెకుఁ గోపమును గల్పించియైనను నామెవర్ణకోశమునుండి, కామభావవిరహితయు, శుంభనిశుంభసంహారిణియు నగు నొకకన్య యుదయించునట్లు చేసి యాకన్యను దేవతలకుఁ బ్రసాదింపవలయు నని సనిప్రార్థించెను.

భగవానుండును, నీలలోహితుండు నగుమహాదేవుం డిట్లు విరించిచే నభ్యర్థితుండై మందహాసంబుతో నట్లే చేయుదు నని యనుగ్రహించి యొకప్పు డేకాంతసమయంబున నంబికాదేవిని గాంచి నవ్వుచు

"నీవు కాళివి" అని పరిహసించెను. అట్లు మహాదేవుండు తనశరీరచ్ఛాయంగూర్చి నిందించుటం గాంచి పార్వతీదేవి క్రోధావిష్టయై గర్వముతో భర్తంగాంచి కఠోరవచనంబుల నిట్లనియెను.

స్వామీ! నేను నల్లనిదాన నగుటవలన మీమానసంబున కప్రియంబుగాఁ దోఁచుచున్నచో మీరింతకాలమువఱకును నన్నేల కట్టుకొని యుంటిరి? ఈనారూపము మీకసహ్యముగాఁ దోఁచుచున్నను, మీరిన్నాళ్లును నాతో నెట్లు విహరించుచుంటిరి? ప్రభూ! మీరీశ్వరులు. మీకసాధ్యం బగునదియేదియును లేదు. ఆత్మారాము లగుమీకు సామాన్యసంభోగము సుఖసాధనంబు గాఁజాలదు. కావుననే మీరు పూర్వము గందర్పుని భస్మీభూతునింగావింపఁగలిగితిరి. పతిమనోహారిణిగానిసతి యెంతసుందరీమణియైనను, నెంతటిసద్గుణమణియైనను నేమి లాభము? కేవలము భర్తలయుపభోగంబుకొఱకే స్త్రీలు సృష్టింపఁబడిరి. అట్లు గాకున్నచో స్త్రీజాతివలనఁ బ్రయోజనం బేమున్నది? కావున నేకాంతసమయమున నిందితంబగు నాయీశరీరవర్ణమును బరిత్యజించి మఱియొకవర్ణమును బరిగ్రహింపవలయును. అట్లు చేయఁజాలకున్నచో నేనీశరీరమునే పరిత్యజించెదను. అనిపల్కుచు నంబికాదేవి చటాలునఁ బర్యంకమునుండి లేచి నిలువఁబడి తపశ్చరణంబునకు స్థిరసంకల్పయై భర్తం గాంచి గద్గదస్వరంబున ననుమతిం గోరుకొనియెను.

ఈవిధంబుగాఁ బ్రణయభంగం బగుటయు, భూతపతి యగు మహాదేవుండు భీతుండై దేవీచరణకమలంబులకుఁ బ్రణామంబు గావించి యిట్లనియెను. ప్రియా! ఇది పరిహాసవచనం బనియెఱుంగనిదానివలె నాపై నింతగాఁ గోపపడియెదవేల? నాకునీయెడలనే య[illegible] గలిగిన-చో నిఁక నాసక్తి యెక్కడఁ గలుగును? నాకు నీయందరతియే కలిగి

యున్నచో నీవు జగంబులకుఁ దల్లివి, నేను దండ్రిని నగుటయెట్లు సంభవించును? మఱియిరువురకును గలరతికామములు కేవలకామకృతంబులనుకొంటివా? కందర్పునిజననముకంటెఁ జిరకాలముక్రిందటనే యీ జగదుత్పత్తి యైనది. సామాన్యజనంబుల కభిరతినిమిత్తమే నేను గందర్పుని సృజించితిని. కామదహనం బేల గావించితి నని నీవు నన్నుఁ దిరస్కరించితివి. అక్కాముండు నన్ను సామాన్యునిగ భావించి పరాభవించుటకుఁ బ్రయత్నించెను. అందుచేఁ గోపించి నేనాతనిభస్మీభూతునిగాఁ జేసినైచితిని. మనవిహారం బంతయును లోకరక్షణంబుకొఱకేగదా! అందుచేతనే నిన్ను నేనిట్లు పరిహసించితిని. దీనికిఁ బ్రయోజనం బచిరకాలంబునఁ దనంతనే నీకు బోధపడఁగలదు. దేవీ! నీవిఁక నీవృథాక్రోధమును బరిత్యజింపుము. నేను నీయేకాంతభక్తుండ ననియెఱుంగవా?

అని యిట్లు సదాశివునిచేఁ ననునయింపఁబడియును బర్వతరాజతనయ తనహృదయంబున “గాళి” యనునప్రియవచనము వేధించుటయు మహాదేవునుద్దేశించి యిట్లనియెను. పరమేశ్వరా! ఇంతకుఁబూర్వముకూడ నేననేకపర్యాయములు నీచాటూక్తులను వినియుంటిని. వానియందలిమోహినీశక్తిప్రభావముచే నెన్నియోసారులు నాకోపము వంచింపఁబడిపోయెను. స్వామి కప్రియయయ్యును బ్రాణపరిత్యాగంబు సేయఁజాలనికులాంగనను బండితులు కుత్సితనుగాఁ బరిగణింతురు. నేను నల్లనిదానను. అందుచేనే నీకు సంపూర్ణముగ నప్రియురాల నైతినని యనుకొనుచున్నాను. కాకున్నచో నన్నుఁ గాళి యనిపరిహసించుటయేల తటస్థించును? రమణీమణులకృష్ణవర్ణము పండితప్రశంసనీయము గానేరదు. కేవలతపోబలంబుచే నేనీయనాదృతం బగుకాలవర్ణమును బరిత్యజించెదను. అట్లు గాదేని నిశ్చయముగా మరణించెదను.

ఈకృష్ణవర్ణశరీరముతో నేనింక జీవింపంజాలను.

అని దృఢనిశ్చయముతో దేవి వచించుటయు మహాదేవుండు ప్రియా! నీకిట్టిదృఢసంకల్పమే యున్నయెడల వేఱుగం దపంబు గావించు టెందులకు? నేను దలంచినను, నీవుదలంచినను నిమిషములో వర్ణాంతరముం గాంచవచ్చునుగదా! యనియెను. ఆమాటవిని దేవి నీమూలమునంగాని, నామూలమునంగాని నేను వర్ణాంతరముం దాల్చుట కిచ్చగించుటలేదు. నేను స్వయముగాం దపంబు గావించి బ్రహ్మదేవునియనుగ్రహంబు సంపాదించుకొని యామూలమున గౌరి నయ్యెదను. అని దేవినిశ్చయించుటయు మహాదేవుండు దేవీ! పూర్వము బ్రహ్మదేవుండు నాయనుగ్రహంబుచేతనే బ్రహ్మత్వముం గాంచియుండెను. అట్టివానిని దపోమూలంబున మరల నారాధించుటవలన విశేష లాభ మేమున్నది? అని బోధించెను.

మహాదేవి యిట్లనియెను. బ్రహ్మాదిసకలదేవతాగణంబులును, మీయనుగ్రహంబుచేతనే తమతమపదంబులం గాంచియున్నను, నేను మీయాజ్ఞానుసారముగనే మహాతపంబు గావించి బ్రహ్మదేవు నారాధించి పూర్వము సతీరూపంబునం దక్షతనయనై యుదయించితిని. మఱియు జగన్నాథుండవగునిన్నుం బతిగాం బడసితిని. అట్లే యిప్పుడును దపశ్చరణంబుచేం బద్మసంభవుని సంతుష్టుం గావించి గౌరిం గావలయు నని యిచ్చగించుచున్నదానను. ఇందు దోష మేమున్నది? అని మహాదేవిదృఢస్వరంబునంబలుకుటయు మహాదేవుం డొక్కమందహాసంబు గావించి యూరకుండెను. కాని దేవకార్యార్థమై యామెను నిరోధింపండయ్యెను.

అనంతరము మహాపతివ్రత యగునంబికాదేవి పతియగుజగత్పతికిం బ్రదక్షిణంబు గావించి దుస్సహవియోగదుఃఖమును హృదయము

నందే యుంచుకొని హిమాలయపర్వతమునకుం బోయి పూర్వప్రణయవశంబున నిదివఱకు సఖీజనసహితయై తపంబుగావించినప్రదేశంబునందే మరలఁ దపశ్చరణంబునకు సంకల్పించుకొనియెను. అంత నామె తల్లిదండ్రులనువర్జించి ప్రణామంబులం గావించి సకలవృత్తాంతంబును వారికి నివేదించి వారియనుమతింగూడఁగాంచి తపోవనంబునకుంబోయి యచ్చట సకలాలంకారములను బరిత్యజించి స్నానము చేసి పవిత్రయై తపోవేషముందాల్చి దుష్కరతపంబు గావింప సంకల్పించి మనోమధ్యంబున స్వామిచరణకమలంబుల నిలుపుకొని సర్వదా ధ్యానించుచుండెను. బాహ్యంబున సర్వదం బగుమృణ్మయలింగంబునందును మహాదేవభావముం జూపుచుఁ ద్రిసంధ్యలయందును బుష్పఫలాదుల నర్పించియారాధించుచుండెను. నాస్వామియే బ్రహ్మస్వరూపుండై సాక్షాత్కరించి నాతపఃఫలంబును బ్రసాదించుఁగాక యని నిరంతరమును భావించుచు నాదేవి యాతినియమంబులఁ దపోనుష్ఠానముం గావించుచుండెను.

ఇట్లు తపంబు సేయుచుండఁ బహుకాలంబు చనుటయు నొకనాఁ డొకవ్యాఘ్రము దుష్టభావముతోడ నామెను సమీపించెను. కాని యాపార్వతీదేవిసమీపమును జేరఁగలిగిన యామృగరాజమునకు సకలశరీరము లిఖితచిత్రముంబోలి స్తంభించిపోయెను. మహాదేవి యగు పార్వతి యామృగరాజంబుగాంచియుఁ దనప్రభావమునందలివిశ్వాసముచే నించుకంతయును జలింపదయ్యెను. స్తంభితం బగువ్యాఘ్రమప్పుడు తనశరీరంబంతయు నట్లు స్తంభించిపోవుటకుఁ జింతించుచు నాకింతకంటె నామిషంబేదియును లేదని దుఃఖించుచు నాదేవిని విడువంజాలక యాసమీపమునందే యుపాసకునింబోలి నిరంతరము నామెను దర్శించుచు శిలావిగ్రహమువలె నిలువంబడి పోయెను. పార్వతీదేవియు

దానిం గాంచి " ఇది నిత్యము నన్నే యుపాసించుచున్నది. మఱియు దుష్టసత్త్వంబులనుండి నన్ను రక్షించుటకై యిది నాచెంతకు వచ్చియున్నది" అని భావించుకొనుచు నామస్తశార్దూలము నెపుడుఁ గృపావతియై యుండెను. అందుచే దానికిఁ గాయిక, వాచిక, మానసికంబు లగు దోషములన్నియును క్రమముగా నశించి దేవీతత్త్వము విజ్ఞాతంబు గాఁజొచ్చెను. దానిమాంసాసక్తియు, అంగస్తంభనమును, దౌరాత్మ్యమును నివృత్తి యగుటయు మనంబునకు సంతుష్టి గలుగుచుండెను. ఆప్పుడు దానికిఁ బాపభావోదయం బగుటయుఁ దనజీవితంబు చరితార్థంబయ్యె నని తలంచుకొని యాదుష్టవ్యాఘ్రమప్పు డుత్తమోపాసకునిం బోలి పరమేశ్వరిని సేవింప నారంభించెను. అది తనదుష్టభావమును దూరీభూతముగాఁ జేసి శాంతముతోఁ దపోవనంబున విహరించుచుండెను.

క్రమముగా మహాదేవితపంబును నతితీవ్రం బగుచుండెను. అప్పుడు దైత్యపీడితు లగుసకలదేవతలును విరించిపాలికిం బోయి శరణంబు గోరుటయు స్వయముగ దైత్యసంహారంబునకు వేచియున్న పితామహుండు దేవతలవలన సకలవృత్తాంతము నాకర్ణించి సత్వరంబుగ నమరసహితుండై దేవితపోవనంబునకుఁ బోయి యచ్చట శ్రేష్ఠతపోనిరతయై విశ్వప్రతిష్ఠారూపంబున వెలయుచున్నమహాదేవిం దర్శించెను. సకలజగంబులకును దల్లియుఁ, దండ్రియగు రుద్రదేవునకు సతీమణియుఁ, బర్వతరాజదుహితయు, ఆర్యస్వభావయు నగునాదేవదేవికి బ్రహ్మదేవుండు ప్రణామంబు గావించెను. దేవియు, సకలదేవతాసహితుండై యున్న విచ్చేసిన లోకపితామహుం గాంచి సముచితవిధానంబున స్వాగతం బడిగి యర్ఘ్యపాద్యాదులచే నర్చించెను.

అప్పుడు బ్రహ్మాసనుం డద్దేవి నుచితవచనంబులచే నభినందించు

ము నేమియు నెఱుంగనివానివలె, దేవీ! నీవిట్టిఫలంబును సాధించుట కై యిట్టిఘోరతపంబును గావించుచుంటివి? సకలజగన్నాథుం డగు పరమేశ్వరుఁడే నీస్వామి యగుటం జేసి సర్వతపఃఫలంబులును నీకరగతం బులై యున్నవి. మఱియు నీసకలజగంబును నీవిలాసమాత్రమేకదా! మహాదేవవిరహంబును సహించి నీవింతకాలము నెట్లు తపంబు చేయఁ గలిగితివో యదియే యాశ్చర్యముగా నున్నదని వచించెను. ఆమాట లాకర్ణించి దేవదేవి యిట్లనియెను. దేవా! సృష్ట్యాదియందు నీవలన సకలజగంబులు నుత్పన్నంబులగు సమయంబున సర్వంబునకు నాదిభూ తుండ వగునీవే నాకుఁ బ్రథమపుత్త్రుండవై యుంటివి. మఱియుఁ బ్ర జాభివృద్ధికొఱకు నీలలాటదేశమునుండి మహాదేవుం డుదయించుటం జేసి యప్పటినుండి నీవు నాకు మామవును, గురుండవు నైతివిగదా! ఇంతేకాక నాతండ్రియగు హిమాచలేంద్రుండు నీతనయుం డగుటచే లోకపితామహుండ వగునీవు నాకు సాక్షాత్పితామహుండవు. ఇట్టి వివిధసంబంధములచే నాకు బంధుండవును, లోకయాత్రానిర్వాహకుం డవునగునీయెదుట నాకును, నాభర్తకును నేకాంతమందిరంబున జరిగిన సమాచారము నెట్లు ప్రకటింపఁగలను? ఇన్నిమాటలతోఁ బ్రయోజ నంబు లేదు. ఇదిగో! నాశరీర మిప్పుడు కృష్ణవర్ణంబై యున్నది. ఈ దేహనీలచ్ఛాయను త్యజించి గౌరవర్ణముం దాల్పవలయు నని నే నభిల షించుచున్నాను.

అని దేవి తెలుపుటయుఁ బితామహుండు ఓదేవీ! ఈసామాన్య ప్రయోజనంబుకొఱ కింతటిఘోరతపంబు గావింపవలయునా? నీవు ని జముగఁ దలంచినచో నిది యెంతపాటిపని! కావుననే యిదియింతయు ను కేవలము నీవిలాసమాత్ర మని భావించుచున్నాను. ఓజగన్మాతా! ఇది నీవిలాసమైనను, లోకహితంబుకొఱకు నీవిట్లు గావించితి వనుటకు

సంశయము లేదు. కావున నిట్టిలీలచేతనే నాయభిమతము నొకదాని
సిద్ధింపఁజేయుము. శుంభనిశుంభు లనునిరువురుదైత్యులు నావలన వర
లాభంబు నంది యతిగర్వితులై విజృంభించి సకలదేవతలను బీడించు
చున్నారు. వారికి నీమూలముననే వినాశంబు గలుగవలసియుండెను.
ఇఁక నాలసించుటవలనఁ బ్రయోజనము లేదు. నీవేదో మిషపెట్టుకొని
యుంటే నిలిచి యుండుము. నచే సృష్టింపఁబడినదివ్యశక్తియే వారిరువురి
కిని మృత్యుస్వరూపిణి గాఁగలదు.

అని బ్రహ్మదేవుండు ప్రార్థించుటయు సంప్రీతయ యగు
పార్వతి యాకాశమునందే తనచర్మకోశమును బంధించి, గౌరవర్ణ య
య్యెను. ఉత్సృష్టంబగునాదేవిచర్మకోశమునుండి కౌశికనామంబున నీల
మేఘసభ శరీరిణి యగునొకకన్య యుదయించెను. మహామాయయు,
వైష్ణవియు, యోగనిద్రాస్వరూపిణియు నగునాదివ్యశక్తి శంఖచక్రత్రి
శూలాద్యాయుధంబులచే విభూషితంబు లగునెనిమిదిబాహువులచే
విరాజిల్లుచుండెను. ఆదేవిమూర్తి సౌమ్యంబును, ఘోరంబు నై యుం
డెను. మఱియు నామె త్రినేత్రయశోభితయు, బాలచంద్రవిభూషిత
పురుషసంసర్గవర్జితయు, అస్పృశ్యయు, సతీమనోహరాకారిణియు నై
యుండెను.

అప్పుడు పార్వతీదేవి శుంభనిశుంభసంహారిణియైన యాసనాతన
దివ్యశక్తిని బ్రహ్మదేవునకు సమర్పించెను. పితామహుండును ప్రహృ
ష్టహృదయుండై యాదివ్యశక్తికి వాహనంబుగా మహాబలపరాక్రాం
తం బగునొకసింహమును సృజించి యొసగి మద్య, మత్స్య, మాంస,
పిష్టకాద్యుపచారంబులచే నద్దేవిని బూజించి వింధ్యాచలం బామెకు
నివాసస్థానముగాఁ గల్పించెను. విశ్వసృష్టయగు బ్రహ్మచే నద్దేవి యి
ట్లు సత్కృతయై యథాక్రమంబుగఁ దనజనని యగుగౌరికిని బ్రహ్మకు

ను బ్రణామంబు లాచరించి సెలవు లందికొని వింధ్యాచలంబునకుం బోయి శుంభనిశుంభసంహారంబు సేయుటకై సంకల్పించి తనశరీరము నుండి మహావీర్యసమన్విత లగు ననేకదివ్యశక్తులను సృజించి వారిచేం బరివేష్టితయై విహరించుచుండెను. అనంతరము కందర్పబాణాభిన్నహృదయులగు శుంభనిశుంభు లనుదుష్టదైత్యు లిరువురును నమ్మహాదేవి శరాఘాతంబులచేం బంచత్వంబు నొందిరి.

—◆వ్యాఘ్రమునకుగాణాపత్యప్రాప్తి.◆—

గౌరీదేవి దివ్యశక్తి యగుకౌశికిని బుట్టించి బ్రహ్మకు సమర్పించి నప్పుడు పితామహుం గాంచి దేవా! నన్నాశ్రయించి యున్నయీవ్యాఘ్రముం విలోకించితివా? ఇది దుష్టసత్వంబులనుండి తపస్సమయంబున నన్నుం గాపాడినది. మఱియు నీశాస్త్రాలము తనమనంబంతయు నా యందే నిలిపి యితరచింతనంబులం బరిత్యజించి నన్నే భజించినది. కేవలము దీనిని బ్రతిపాలించుటకంటె నాకుం బ్రియంబగు నితరాభిమతం బేదియును లేదు. కావున నిది గోప్తయును మాయంతఃపురంబున నివసించుచున్నను, శంకరుండు బ్రతుకు ... గాణాపత్యపదంబుం బ్రసాదింపవలయును. ఇది నాముందు నడచుచుండ నిరంతరమును సఖీజనసహితంబుగ విహరించుచుండవలయు నని నేనభిలషించుచున్నాను. ఓప్రజాపతీ! నీవీవిషయంబున ననుజ్ఞాప్రదానంబు గావింపవలయును.

అని యిట్లు ముగ్ధయుంబోలి గౌరీదేవి యర్థించుటం గాంచి విరించి విస్మితుండై నవ్వుచుం గఠోరం బగువ్యాఘ్రపూర్వవృత్తాంతము నిట్లు వర్ణింపదొడంగెను. దేవీ! ఈక్రూరజంతువెక్కడ? మంగళమయం బగునీయనుగ్రహం బెక్కడ? నీవు సాధూద్వేషపరముఖంబున నమృతసేచనంబు గావింపం జూచుచుంటివి. ఇది కేవలవ్యాఘ్రంబు

గాదు. వీ డొకక్రూరనిశాచరుఁడు ఈదుష్టుఁ డనేకతపోధనులగు బ్రాహ్మణులను భక్షించి యున్నాఁడు. కామరూపి యగు నీరక్కసుఁడు తనయిచ్చవచ్చినరూపంబులం దాల్చి స్వేచ్ఛావిహారముం గావించుచుండును. ఇట్టి సకలపాపకర్మంబులకును దగినఫలము నీతఁ డవశ్యముగ ననుభవింపవలయును. ఈదురాత్మునియెడలఁ దయ దలఁచుటవలన నేమిలాభము? దేవీ! స్వభావముచేతనే కలుషాత్ముం డగు నీతనితో నీకేమిప్రయోజనము? అని చెప్పుటయు దేవి మహాత్మా! నీవచనంబులన్నియు నిక్కంబులే యగును. కాని యీతఁడు నన్నాశ్రయించి యుండెను. ఆశ్రితు లెట్టివారైనను నేను వారిని బరిత్యజింపఁజాలను. అని నిశ్చయముగా వచియించెను.

అంత బ్రహ్మదేవుండు శాంతవచనంబులతో నిట్లనియెను. దేవీ! ఈతఁడు నీభక్తుండనుసంగతి నెఱుంగక యీతనిపూర్వవృత్తము నెఱింగించితిని. నీయెడల భక్తి గలిగియున్నచోఁ బాపము లీతని నేమి చేయఁగలవు? నీభక్తుల కెన్నటికిని వినాశంబు లేదు. నీయాజ్ఞ లేకున్నచోఁ బుణ్యకర్మంబులకైనను ఫలం బెట్లు గలుగును? పరమేశ్వరీ! నీయాజ్ఞయుఁ, బ్రజ్ఞయుఁ బురాతనములైనవి. సకలజీవబంధమోక్షంబులును నీయధీనములందే యుండును. పరమశక్తిస్వరూపిణి వగు నీదయ లేకున్నచో నెట్టికర్మంబును సిద్ధింపదు. నీవు స్వయముగా భవవిరహితవయ్యును సకలసృష్టిపదార్థములకు వివిధశక్తిస్వరూపిణివై యుందువు. శక్తిశూన్యుం డగువాఁ డేమిచేయఁగలఁడు? విష్ణుదేవుండును, నేనును, సకలదేవదానవరాక్షసులును, సకలజీవులును దమతమయైశ్వర్యములం గాంచుటకు నీయాజ్ఞయే యేకమాత్రాధారమై యున్నది. ఇంతవఱ కెందఱో బ్రహ్మవిష్ణుమహేశ్వరు లతీతులై పోయిరి. ఇంకను నెందఱో రానున్నవారు. అట్టిబ్రహ్మాదు లందఱును నీయాజ్ఞానువర్తులే గదా

అస్మదాదులకును, శ్రేష్ఠులగు దేవగణంబులకును బురుషార్థచతుష్టయ సంపత్తి లభించుటకు నీయారాధనంబుకంటె నితరోపాయం బేమున్నది? నీమూలమునఁ దత్క్షణమందే బ్రహ్మాదిస్థావరత్వములకు విపర్యయంబు గలుగుచుండును. సుకృతదుష్కృతములకు నీయిచ్ఛానుసారముగనే ఫలసిద్ధి యగుచుండును. జగత్పతియు, పరమాత్మయు నగుమహాదేవున కాదిశక్తివగు నీవు సనాతనివై, యనాదిమధ్యాంతరహితవై లోకయాత్రానిర్వాహణంబుకొఱ కొకానొకమూర్తిం దాల్చి ప్రవేశించి యనేకవిధంబు లనుగ్రహించుచుందువు. నీయథార్థస్వరూపము నెఱుంగంగలవా రెవ్వరున్నారు? కావున నీవ్యాఘ్రము దురాచారుం డగుదుష్టరాక్షసుండైనను నీయనుగ్రహంబుచేఁ బరమసిద్ధిం గాంచెను. దీనికిఁ బ్రతిబంధకు లెవ్వ రుందురు?

అని యీవిధముగా సముచితవచనంబులచే సద్దేవి యాత్మమాహాత్మ్యంబును స్మృతికిఁ దెచ్చుటయు నప్పుడు గౌరీదేవి బ్రహ్మప్రార్థనంబుచేఁ దపంబునుండి నివృత్తి యయ్యెను. బ్రహ్మదేవుండును దేవి యొద్ద సెలవుగైకొని యంతర్హితుం డయ్యెను. అనంతరము పార్వతీదేవి తనతల్లి యగుమేనకను సందర్శించి, తనవియోగఖేదంబున నవసియున్న యాజననీజనకులకుఁ బ్రణామంబు లాచరించి యనేకవిధంబు లగుప్రియవచనంబులతో వారల వారల నూఱడించెను. పిమ్మటఁ బార్వతీవిరహదుఃఖంబుచేఁ బుష్పహాసంబున బాష్పమోచనంబు సేయుచు, శాఖారూఢంబు లగువిహంగకూజితంబులచే దీనభావంబున విలపించుచు వ్యాకులభావంబున మాఱుపడియున్న యాశ్రమమహీరుహంబులను సఖీమణుల కొప్పగించి యమ్మహాదేవి భర్తృదర్శనకుతూహలంబున నతిత్వరితముగఁ బయలుదేఱెను. అప్పు డామె యావ్యాఘ్రమును దనకన్నబిడ్డవలెనే ముందిడుకొని తనదేహకాంతులచే దశ

దిశల వెలుఁగఁజేయుచు మహేశ్వరనిత్యనివాసం బగుమందరపర్వతము నకుఁ బ్రయాణమై పోయెను.

—♦ ఉమామహేశ్వరసల్లాపము. ♦—

సహస్రాబ్దములహస్రాబ్దంబులు నాకస్మికముగఁ గడఁగించివైచు పరమోత్కృష్టంబగుప్రణయరసంబును వర్ణించుట యసాధ్యము. దేవ్యాగమనంబునకై కుతూహలపడుచున్న మహాదేవుఁ డప్పుడు ద్వారపాలికాసహితయై ససంభ్రమంబున నేతెంచియున్న గౌరీదేవిం గాంచి యించుక సంశయించినదానివలెఁ గానవచ్చెను. అప్పటియాపరమేశ్వరుని భావమును బార్వతీదేవియు గ్రహించెను. అంతరంగము పూర్వానుభూతం బగుప్రేమభావవశమునను, వదనంబులవలనను నాయమ యగ్రవర్తి యగుటచే గృహముఖమునకుఁ బోవుచుండ పాదములఁ దేచి యామె కుఁ బ్రణామంబు గావించెను. ఆ దేవియు మహాదేవునిచరణంబులకు సాష్టాంగప్రణామంబు గావించెను. అప్పు డామె లేచియు లేవకుండఁగనే మహాదేవుండు తనబాహువులచే నామెను గ్రహించి పరమానందముతో గాఢాలింగనముం గావించుకొని యంకభాగంబునఁ జేర్చుకొనుటకుఁ బ్రవృత్తుం డగుటయు నామె చటాలునఁ బ్రక్కను జేరి కూర్చుండెను.

అప్పుడు మహాదేవుండు మందహాసవదనారవిందుఁ డగుచు దేవిని బలవంతముగఁ దనయంకతలంబునం జేర్చుకొని చిఱునవ్వునవ్వుచు విస్ఫారితనయనంబులతో నామెవదనమండలసౌందర్యామృతమును బానము చేయుచు నామెను బలుకరింపం దలంచి ముందుగ నెట్లు మాటాడుట యుచితమో యేవిధముగనే యిట్లనియెను. ఓసర్వాంగసుందరీ! ఆనీయవస్థ మాఱిపోయినదా? అప్పుడు నీకోపము నుపసంహారింపఁ జేయుటకై నాకేయుపాయమును దోఁచినది కాదు. నీవు స్వేచ్ఛా

వశంబున నితరవర్ణమును గ్రహింపక కాళీరూపమునే ధరించి యుంటివి. దేవీ! నీస్వభావమునందు నాహృదయము విముగ్ధంబగుటచే నదియొక చింతాకారణ మయ్యెను. నీయుపరమభావము నేవిధముగా విస్మరించితివి? తలంచుకొన్నచో సర్వవర్ణములను ధరింపఁగలనీ వీవిధముగా మనను గలఁగించుకొనుటకుఁ గారణంబెంతమాత్రమును లేదు. సామాన్యదంపతులకువలెనే మనయిరువురకునుగూడ బరస్పరవిద్వేషంబు తటస్థించినచో నింక నీచరాచరప్రపంచంబంతయు నిలుచుట యెట్లు?

దేవీ! నే నగ్నిమస్తకస్థితుండను. నీవు సోమమస్తకస్థితవు. మనమిరువురమే యగ్నిసోమాత్మకంబగు నీవిశ్వమంతయును బరిపాలించుచున్నారము. లోకహితమునకొఱకు మనము స్వసంకల్పానుసారంబుగా శరీరధారణంబు గావించి విహరించుచున్నారము. మనయిద్దరిలో విచ్ఛేదంబు సంఘటిల్లిన నీసమస్తప్రాకృతమగు జగంబంతయు నిరాధారంబై పోవును. ఈవిషయంబున శాస్త్రయుక్తిచే సిద్ధాంతంబైన కారణంబొకటి గలదు. స్థావరజంగమాత్మకంబగు నీజగంబంతయు (వాగర్థ) నామరూపాత్మకంబై యున్నది. నీవు సోమోపమామృతమయంబగువాక్స్వరూపము గలదానవు. నేనును సుధామయంబగునర్థస్వరూపము గలవాడను. ఇట్లు మనమిరువురము సమ్మతులమైయున్నపుడు మనకు విచ్ఛేదమెట్లు సంభవించును? నీవు మహాబోధకారణంబగువిద్యాస్వరూపిణివి. నేను తదీయంబగుజ్ఞానమువలన జ్ఞేయస్వరూపుఁడను. విద్యావేద్యంబులకు విశ్లేషంబు లేనప్పుడు విద్యావేద్యస్వరూపులమగుమనకు విచ్ఛేదంబెట్లు తటస్థించును. నే నాత్మవ్యాపారముచే నీజగత్సృష్టిసంహారములు గావించుటలేదు. ఆజ్ఞావశంబుననే యవి జరుగుచుండును. మహోత్తరంబగునట్టియాజ్ఞవు నీవే. నాకుఁగల స్వాతంత్ర్యరూపంబగునైశ్వర్యంబున కంతకును నాజ్ఞయే యేకమాత్రసాధనంబై యున్నది. ఆజ్ఞారూపిణ్యవైన

నైనచో నాక్రీడైశ్వర్యమంతయు నిలుచు నెట్లు? మనమిద్దఱమును వియుక్తులమై యెన్నటికి నుండఁజాలము. అయినను మనకు వియోగము సంఘటిల్లినది. ఇంతకంటె నాశ్చర్యకరమగువిషయ మేమున్నది?

దేవీ! ఈప్రపంచమునందు మనప్రవృత్తులకు లోకానుగ్రహంబుకంటె నితరప్రయోజనం బేదియును లేదు. కావుననే మనక్రీడాకౌతుకంబులుగూడ నిరర్థకములు గానేరవు. దేవకార్యమునుద్దేశించి నేను నిన్నుఁ బరిహాసించితిని. అదియును సహేతుకంగనిది గాదు. కాని కోపపడితివేల? త్రిలోకరక్షార్థమే నీవును నన్నుఁ గోపించితివి. లోకానర్థకం బగుకార్యం బెన్నటికిని నీవు చేయఁజాలవు. అని మహాదేవుండిట్లు ప్రియవాక్యంబులచే నుపలాలించుటయు శృంగారభావసారంబునకు కృతిప్రజన్మభూమి యగుపరమేశ్వరి "స్వామి వచియించినదంతయు సత్యమే" అని తనమనంబున భావించుకొని మందహాసంబు సేయుచు సిగ్గుచేఁ గౌశికీవృత్తాంతముకంటె మఱియేమియు మాటాడఁజాలకపోయెను.

దేవి యిట్లనియెను. స్వామీ! నేను కౌశికి యనునొకకన్యను సృజించితిని. నీవామెను జూడలేదుగదా! ఈప్రపంచమునం దట్టికన్య యెందును జనించియుండలేదు. ఇఁక నెన్నటికిని జనింపఁబోదు. ఆమె పరాక్రమము, బలము, వింధ్యాచలనివాసము, విజయము, శుంభనిశుంభసంహారము, సేవకప్రత్యక్షఫలదానము, సకలదేవతానిత్యపరిత్రాణము మొదలగువిషయములంగూర్చి బ్రహ్మదేవుండు సవిస్తరముగా నీకు నివేదింపఁగలఁడు. అని చెప్పుచు సఖీజనంబుచే నావ్యాఘ్రము నచ్చటికిఁ దెప్పించి మహాదేవున కుపాయనరూపంబున నివేదించి స్వామీ! ఈవ్యాఘ్రమును దిలకింపుము. నాయుపాసకులలో నింతటివా రెవ్వరును లేరు. తపోవనంబున దుష్టసత్వంబులనుండి యిది నన్నుఁ గాపాడినది. అందుచే నిది నావిశ్వాసమునకుఁ బాత్రమైనది. అది మఱియ

నుగ్రహముం గోరి స్వదేశమును విడిచి వచ్చినది. నావలన నీకుం బ్రియంబుగావించుట నీకవశ్యకర్తవ్యం బగునేని దీనిని మనద్వారరక్షకవర్గమునం జేర్పవలయు నని నందీశ్వరునకు నియోగింపుము.

అని ప్రణయమధురంబులును, శ్రవణామృతంబులు నగుమృదువచనంబులతో దేవి యిట్లు కోరుటయు మహాదేవుండు ప్రియా! నీమధురవచనంబులకు నేను ప్రీతుండనైతినని చెప్పినంతనే యావ్యాఘ్రము సువర్ణవేత్రంబును, రత్నకంచుకంబును, కాలకాకోదరసన్నిభంబగు ఖడ్గంబును దాల్చి ద్వారరక్షకగణనాయకరూపముతోఁ బొడసూపెను. సోమరూపిణియగుదేవియు, మహాదేవుండును, నందీశ్వరుండును గూడ దానికార్యంబున కానందించుచుండుటం జేసి యావ్యాఘ్రమునకు సోమనంది యనునామంబు గలిగెను. అర్ధేందుభూషణుం డగుమహాదేవుం డిట్లు దేవిప్రియంబు గాంచి యామెను బహువిధరత్నఖచితదివ్యాలంకారములచే నలంకరించి మనోహారిణియగు పర్వతరాజకన్యను దనయంకతలంబునం జేర్చుకొని నానావిధప్రియసంభాషణంబులచేతను, సల్లాపంబులచేతను నుపలాలించెను.

—♦అగ్నిషోమాదివివరణము.♦—

మును లిట్లనిరి. వాయుదేవా! మహాదేవుండు దేవితో నీవిశ్వంబంతయు నగ్నిషోమాత్మకం బనియు, వాగర్థాత్మకంబనియు నిర్దేశించి యుండెనుగదా! మఱియు నాతఁ డంబికం గాంచి నీవునకైశ్వర్యంబునను నేకమాత్రప్రారంబ వనికూడఁ జెప్పియుండెను. ఆవాక్యంబులతాత్పర్యంబు యథారూపంబుగ వినవలయు నని మేమందఱమును గుతూహలపడుచున్నారము. దయతో నంతయు నెఱింగింపుమని ప్రార్థించిరి.

వాయుదేవుం డిట్లనియెను. రౌప్యంబును, ఘోరంబును, దేజోమయంబు నగునీశ్వరునిదేహ మగ్నిస్వరూపం బనియును, అమృతమ

యంబును, శక్తిమంతంబును, శాంతిదాయకంబు నగు దేవిశరీరము సోమస్వరూపంబనియును బ్రసిద్ధంబులు. అమృతమునందే విశ్వమంతయును బ్రతిష్ఠితమైయున్నది. తేజము సాక్షాద్విద్యాకళాస్వరూపము. నిఖిలసూక్ష్మభూతంబులును రసతేజోమయంబులై యుండును. సూర్యానలాదిరూపంబులచేఁ దేజంబునకును, సోమజలాదిరూపంబులచే రసంబునకును వివిధవృత్తులు గలవు. తేజము వైద్యుతాదిమయంబైనది. రసము మధురాదిమయంబైనది. ఈ తేజోరసవివిధభేదంబులచేతనే జరాచరంబగు నీవిశ్వమంతయు ధరింపఁబడియున్నది. అగ్నినుండియే యమృత ముదయించును. మరల నాయమృతమువలననే యగ్ని వర్ధిల్లుచుండును. కావుననే యగ్ని, సోముఁడు ననునీయిరువురు దేవతల నుద్దేశించియు హోమముచేయఁబడిన యాజ్యము లోకహితకరంబని ప్రశంసితం బయ్యెను.

హవిస్సుకొఱకు సస్యంబును, సస్యాభివృద్ధికొఱకు వర్షంబును, మరల వర్షాభివృద్ధికొఱకు హవిస్సును గారణంబు లగుటంజేసి యీజగంబంతయు నగ్నిషోమమ్మృతంబని ప్రసిద్ధం బయ్యెను. సౌమ్యం బగు నమృతముతోడిసంబంధము గలుగనంతవఱకు నగ్ని యూర్ధ్వముఖంబుగాఁ బ్రజ్వలించుచుండును. అయ్యమృత మగ్నిసమ్మిళితం బైనప్పుడది యధోభాగమునకు స్రవించుచుండును. అందుచేతనే కాలాగ్ని యధోభాగమునుండియే యూర్ధ్వమునకుఁ బ్రజ్వలించుచుండును. అగ్ని యూర్ధ్వగతం బగునంతవఱకే దహించుచుండును. అది యధోగతం బైనంతనే జలప్లావితం బగును. ఈయూర్ధ్వజ్వలనం బగుకాలాగ్ని యాధారశక్తిచే ధృతంబై యుండును. నిమ్నగతుం డగునాధారశక్తిస్వరూపసోముఁడు శివశక్త్యాశ్రయుండై యుండును. శివునకు శక్తియు, శక్తికి శివుఁడు నాధారులై యుందురు. కావుననే యీజగంబున శివ

శక్తివిభిన్నం బగుపదార్థంబేదియును లేకుండును.

ఈజగం బనేకపర్యాయము లగ్నిచే దగ్ధమై భస్మ మగుటంజేసి భస్మ మగ్నివీర్యంబుగా నిర్దిష్టం బయ్యెను. ఈభస్మతత్త్వము నెఱింగి "అగ్ని" ఇత్యాదిమంత్రంబులను బఠించుచు భస్మస్నానము సేయు వాఁడు సకలబంధవిముక్తుం డగును. అగ్నివీర్యంబగునట్టిభస్మము యోగవిముక్తిచేఁ బ్రకృతి కధికారమును గల్పించుచు మరల నది శాక్తామృతముచేఁ బ్లావితమై యోగయుక్తిచేఁ బ్రకృతి నధికారమునుండి మరలించుచుండును.

ఇందుచేతనే మృత్యువిజయంబును గోరుసాధువు లమృతముచే నభిషిక్తులగుచుందురు. శివశక్తిస్వరూపం బగునమృతస్పర్శనము లభించినతరువాత నిఁక మృత్యు వెట్లు సంభవించును? ఈమహాస్నానవిషయంబులతత్త్వము నెఱింగినమహాత్ముఁడు కేవలము నగ్నిషోమపుటంబును బరిత్యజించి భవవిముక్తుండు గాఁగలుగును. ఎవ్వఁడు శివరూపానలంబుచే శరీరమును దగ్ధముగాఁ జేసి యోగమార్గానుసారంబుగా శక్తిరూపామృతంబుచేఁ బ్లావితంబుగాఁ జేయునో యాతఁడు మోక్షపదంబు నందుటకు సమర్థుం డగును. ఈయర్థమును మనసునందుంచుకొని యే మహాదేవుం డీజగమంతయు నగ్నిషోమాత్మకంబని యానతిచ్చియుండెను.

—♦షడధ్వవివరణము.♦—

వాయుదేవుం డిట్లనియెను. ఈజగం బంతయును వాగర్థమయంబనువిషయముంగూర్చి చెప్పెదను. అందువలన సవిస్తరంబుగఁ గాకపోయినను సంక్షేపముగనైన షడధ్వంబులవిధంబు బోధపడఁగలదు. ఈప్రపంచమునందు శబ్దము లేనియర్థము గా[illegible] శబ్దము గాని యొక్కటియును లేదు. [illegible] శబ్దసమూహార

బంతయు సర్వవిధంబుల నర్థబోధకంబై యుండును. ఈప్రకృతిపరిణా
మం బంతయును శబ్దార్థభావితంబై యుండును. ఈప్రకృతి పరమాత్మ
లగుశివశక్తుల నైశ్వర్యం బని చెప్పుదురు. అందు శబ్దస్వరూపం బగు
విభూతి స్థూలం బనియు, సూక్ష్మం బనియు, తద్భిన్నం బనియు మూఁ
డువిధంబులు గలిగి యుండును. శ్రవణగోచరం బగుశబ్దము స్థూల
విభూతియు, చింతామయం బగుశబ్దము సూక్ష్మవిభూతియనియు, చిం
తాశూన్యం బగుశబ్దము పరావిభూతి యనియుఁ జెప్పంబడును.

ఈపరావిభూతియే శివతత్త్వము నాశ్రయించిన క్రియాశక్తి. జ్ఞానశక్తిసంయోగంబుచేతను, నీశ్వరేచ్ఛానుసారంబు చేతను బూర్వోక్తసకలశక్తులుం జేరినసమష్టియే శక్తితత్త్వము. అదియే సమస్తకార్యంబులకును మూలప్రకృతిత్వముం గాంచి యుండును. అది సాధ్వియు, కుండలినియు, మాయయు, విశుద్ధకర్మమార్గస్వరూపిణియు నై విరాజిల్లుచుండును. అది విభక్తరూపంబులచే షడధ్వాత్మతల వర్ధిల్లుచుండును. అందు శబ్దము త్రివిధాధ్వరూపంబును, అర్థము త్రివిధాధ్వరూపంబును గలిగి యుండును. ఈషడధ్వంబులును జీవులకు వారివారి చిత్తశుద్ధుల ననుసరించి భోగమోక్షంబులఁ గల్పించుటకు సమర్థములై యుండును. మంత్రాధ్వము, పదాధ్వము, వర్ణాధ్వము ననునీమూఁడును శబ్దసంబంధములైనవి. భువనాధ్వము, తత్త్వాధ్వము, కాలాధ్వము ననునీమూఁడు నర్థాంతర్గతములైనవి. ఈషడధ్వములును బరస్పరవ్యాప్యవ్యాపకంబులై యుండును.

మంత్రము లన్నియును వాక్యస్వరూపములు. అవి పదసమూహంబుచే వ్యాప్తములై యుండును. పదసమూహ మంతయు వర్ణవ్యాప్తమై యుండును. వర్ణసమూహమే పదం బనిపండితులు నిర్దేశించి యుండిరి. సకలవర్ణంబులును జతుర్దశభువనంబులచే వ్యాప్తములై

యుండును. భువనమధ్యమునందే వర్ణవిజ్ఞానం బగుచున్నది. భువనంబు లన్నియును బ్రహ్మాండమునకు బహిరంతరములం గలమహదాదితత్త్వసమూహముచే వ్యాప్తములై యుండును. తత్త్వస్వరూపంబులగు కారణంబులవలననే యనేకవిధంబు లగుకార్యారంభములగుచుండును. బ్రహ్మాండాంతర్గతంబు లగుకొన్నిభువనములుమాత్రమే పురాణములయందు వర్ణితంబు లై యుండెను. తద్భిన్నంబులగుశివాగమంబులయందు మఱియు ననేకభువనంబులు ప్రశంసితంబులై యుండెను. సాంఖ్యయోగశాస్త్రంబులు మహదాదితత్త్వంబులలోఁ గొన్నింటిని మాత్రమే పేర్కొని యుండెను. కాని శివశాస్త్రమునం దింకను ననేకతత్త్వములు సవిస్తరముగా వర్ణింపఁబడియెను. సకలతత్త్వంబులును స్వోపయోగకరంబులగుకళలచే వ్యాప్తములై యుండును. ప్రథమమందే మూలప్రకృతి పంచవిధంబులగుపరిణామములం గాంచియుండెను. ఆపంచపరిణామములే నివృత్త్యాదిపంచకళలు. అవియును బరస్పరవ్యాప్తంబులై యుండును. షడధ్వంబుల కభిన్న యగుపరాశక్తియే వానికి వ్యాపికయై యుండును.

ప్రకృతి శివతత్త్వస్వరూపమునందలి యీషడధ్వములందును నిలిచి యుండుటవలన శక్తినుండి పృథ్వీపర్యంతమునుగల సమస్తమును శివతత్త్వమునుండి సముద్భూతం బయ్యెను. కుంభాది నానావిధమృణ్మయపదార్థములను మృత్తిక వ్యాపించియున్నట్లు, సమస్తజగంబునకును శివతత్త్వము వ్యాపకం బగుచున్నది. ఈషడధ్వంబులమూలముననే పరమశివధామమును బడయవలయును. సర్వవ్యాపిక యగుశక్తి పంచతత్త్వశోధనమువలన శివధామప్రాపక యగును. నివృత్తిచే రుద్రపర్యంతం బగుబ్రహ్మాండం బంతయును, ప్రతిష్ఠచే నవ్యక్తపర్యంతం బగుబ్రహ్మాండోపరిభాగంబును, విద్యచే విద్యేశ్వరపర్యంతం బగునవ్య

క్రోధ్వభాగం బంతయును, శాంతిచే దాని కూర్ధ్వభాగం బంతయును విశుద్ధంబు లగును. శాంత్యతీతకళచే సద్యాంతసర్గాంతం బగుశుద్ధాధ్వం బంతయును శోధితం బగును. ఈశాంత్యతీతకళా [illegible] యోగంబుచేఁ బరమమోక్షమునా [illegible]

నివృత్త్యాదు లగుసపంచకళలచేతను జగం బంతయు వ్యాప్తంబై యున్నది. కావునసే సాధకు లీపంచకళలయందును సమస్తప్రపంచమును సందర్శింపవలయును. ఈషడధ్వవ్యాప్తి నెఱుంగక శుద్ధి గావింపఁ బ్రయత్నించుటవలన నెంతమాత్రమును లాభము లేదు. అట్టివ్యర్థాశ్రమం బంతయు నరకభోగంబునకుఁ గారణం బగును. శక్తిజ్ఞానంబు లేనిచో సకలతత్త్వంబులును, వానివ్యాప్తియు, వానిశుద్ధియుఁ గూడ నవిదితంబులై యుండును. ఆశక్తి శివునిపరమాజ్ఞాస్వరూపిణియు, చిత్స్వరూపిణియు, పరమేశ్వరియు నై విరాజిల్లుచుండును. అఖిలకారణభూత యగునయ్యాదిశక్తిమూలముననే పరమేశ్వరుఁ డఖిలజగదధిష్ఠితుఁడై యుండెను.

వాస్తవికముగాఁ బరిశీలించినచో నీశక్తి యాత్మసంబంధమగు మాయయును గాదు; వికారమును గాదు. దీనికి బంధమోక్షంబులు లేవు. ఇది తనకుఁ దానే బంధమోక్షవిధాయినియై, సర్వేశ్వరియై, పరాకాష్ఠయై, పరమేశ్వరునితో నిత్యసంబంధము గలిగి యుండును. విశేషించి శివగుణసంపర్కముగలది గావున నిదియును శివసమానధర్మములు గలిగియుండును. ఈమెవలన శివుఁడు గృహస్థుఁడును, శివునివలన నీమె గృహిణియు నైరి. కార్యరూపంబును, బరప్రకృతిజంబును నగు నీజగం బంతయును వారిసంతానమే.

శివుఁడు కర్త. శక్తి కారణము. శివశక్తులయందు గలభేద మింతమాత్రమే. శివుఁడే స్త్రీపురుషరూపంబులతో నుండు నని కొందఱు

చెప్పుదురు. ఆయిరువురకును గలభేద మింతమాత్రమే. సూర్యుండును, నాతనిప్రభయును బరస్పరము వస్తుత్వముచే భిన్నత్వముం గాంచియున్నను సూర్యసమవాయిని యగుప్రభ సూర్యుఁడు లేకుండ వేఱుగ నిలువఁజాలనివిధంబుగనే చిత్స్వరూపిణి యగుపరాశక్తియు శివునికంటె భిన్నయయ్యును శివవ్యతీతయై యుండఁజాలదని కొందఱు చెప్పుదురు.

కావున శివుం డీసమస్తజగదుత్పత్తికిని గారణుఁడై యున్నాఁడు. పరమేశ్వరి యగునాదిశక్తి యామహేశ్వరునియాజ్ఞాస్వరూపిణియై యుండును. ఆశక్తిమూలముననే త్రిగుణాత్మికయు, నవ్యయయు, శైవియు నగుమూలప్రకృతి జగత్కార్యనిర్వహణంబుకొఱకుఁ బ్రవర్తిల్లుచుండును. తత్తత్కార్యభేదంబులచే, నీదివ్యశక్తి మహామాయ యనియు, మాయయనియు, త్రిగుణాత్మకప్రకృతి యనియు మూఁడువిధంబులుగాఁ బరిణమించి పూర్వోక్తంబు లగుషడధ్వంబులను గల్పించుచుండును. వాగర్థమయంబు లగునట్టిషడధ్వములో యీసమస్తప్రపంచస్వరూపమునను బరిణమించుచున్నవి. శాస్త్రంబులన్నియు నీషడధ్వములంగూర్చి సవిస్తరంబుగా ననేకవిధంబులఁ బ్రశంసించుచుండును.

శ్రీదేవాయనమః.

పురాణగ్రంథమాలిక,

పిఠాపురము.

మనపూర్వులమహామహిమలు, సత్యచారిత్రములు, భగవన్మహిమలు, ధర్మములు, నీతులు, నీతిబోధకములగు కథలు, దేవతల చరిత్రములు, రాక్షసులచర్యలు, భగవంతునియనుగ్రహము—ఇత్యాదివిషయములతో నిండియున్న యిహపరసాధకంబులగుమనపురాణోపపురాణములు, ఇతిహాసములు మొదలగుశాస్త్రగ్రంథములను సులభశైలిని వచనరూపమున నాంధ్రీకరించి యాంధ్రమహాజనులహస్తముల కందించుటకై స్థాపింపఁబడినది. రెండేసినెలల కొక్కొక్కసంపుటము చొప్పున 200—250 పుటలవంతున డెమ్మీసైజునఁ బ్రకటింపఁబడుచుండును. ఆంధ్రమహాజనులందఱును మాయుద్యమమునకుఁ దోడ్పడి గీర్వాణభాషయందున్నయామహాపురాణాదులను మనతెలుఁగువారికిఁ దెలియునట్లుగా నొసర్చుచున్నమాకుఁ బ్రోత్సాహముఁ గలిగింతురు గావుత మని వేఁడికొనుచున్నాము.

నిబంధనలు.

(1) ఇందు చందాదారులగువారు రు 0-4-0 ప్రవేశరుసుము చెల్లింపవలయును.

(2) చందాదారులకు పోస్టేజి మనియార్డరుకర్చులు మేమే భరించి ఒక్కొక్కసంపుటము ఒకరూపాయిమాత్రమే పంపుచుందుము. (చందాదారులుకానివారికి పోస్టేజిగాక రు 1-8-0 లు.)

(3) నైజాము ఇలాకా గ్రామములు [illegible]

వున నట్టివారు ప్రవేశరుసుముసహా రు 5-4-0 ముందుగాఁ జెల్లించి నచో వారికి ఆఱుసంపుటములు ప్రకటింపఁబడి నపుడెల్ల రిజస్టర్డు బుక్కుపోస్టుగాఁ బంపుచుందుము.

సహాయులు.

సంవత్సరమునకు ముందుగ రు 10 ల నొసగువారిని సహాయులుగాఁ జేర్చుకొని వారినామములను సహాయులపట్టిలోఁ బ్రకటించుచు వత్సరమున వెలువడు ఆఱుసంపుటములను రిజస్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

పోషకులు.

ఒక్కసారిగ నూటపదియాఱురూప్యములుగ్రంథమాలికకువిరాళముగనొసగిన భాషాభిమానులను పోషకులుగాఁ జేర్చుకొని వారి నామములను గ్రంథములలోఁ బ్రకటించుచు నీగ్రంథమాలికనుండి వెలువడు గ్రంథములన్నిటి నెప్పటి కప్పుడు అన్‌రిజస్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

రాజపోషకులు.

ఒక్కసారిగ రెండునూటపదార్లనుగాని అంతకుఁబైఁగ వారియుదారహృదయమునకుఁ దోఁచుసంతటిద్రవ్యముఁగానిదయచేయుశ్రీమంతులను జమీందారులను రాజపోషకులుగాఁజేర్చుకొనియిందుఁబ్రకటింపఁబడుగ్రంథములన్నిటిని రిజస్టర్డుబుక్కుపోస్టుగా నందించుచుందుము.

పురాణగ్రంథమాలిక,
పిఠాపురము.
తూర్పుగోదావరిజిల్లా.

స డ కు టి వీ ర రా జు పం తు లు
సంపాదకుఁడు.

ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయము చందాదారులను, వారుకోరినయెడల, అడ్మిషన్ ఫీజు 0-4-0 అక్కఱలేకుండ, చందాదారులుగాఁ జేర్చుకొని మాగ్రంథములు వెడలినపుడెల్ల ఒక్కొక్కరూపాయకు వి. పి. గాఁ బంపుదుము.

ముందురాఁబోవుపుష్పము.

బ్రహ్మపురాణము.

(మొదటిసంపుటము.)

పుణ్యకథావిలసితం బగునీపురాణమునందు నీతిధర్మబోధకములగు చరిత్రము లెన్నియోకలవు. ఈసంపుటము అశ్వినీకుమారోత్పత్తి, కువలయాశ్వచరిత్రము—త్రిశంకుచరిత్రము—చంద్రచరిత్రము, పురూరవశ్చరిత్రము,రజిచరిత్రము—ధన్వంతరిచరిత్రము—యయాతిచరిత్రము—శ్రీకృష్ణోత్పత్తి, జ్యామఘుచరిత్రము—స్యమంతకమణిచరిత్రము—భారతవర్షవర్ణనము మొదలగు మనోహరచరిత్రములచే విరాజిల్లుచున్నది. ౧౯౨౮ సంవత్సరము జూలై నెల ౨౫ తేదికి వెలువడును.

చందాదారులకు పోస్టేజిమనీఆర్డరుఖర్చులుసహా రు 1-0-0

ఇతరులకు ఖర్చులుగాక 1-8-0

పురాణగ్రంథమాలికా కార్యస్థానము, పిఠాపురము.

శ్రీ ఆదిశైవ పత్రిక.

శైవసంఘాభివృద్ధికై శివాగమములును, శైవపురాణాదులందు వర్ణింపఁబడిన శైవధర్మములును, ఉపనిషత్సారభూతములయిన శైవరహస్యములును, శివభక్తులచరితములును, సనాతనధర్మములు మొదలగుసద్విషయములు తేటతెల్లముగ ప్రచురించెడి మాసపత్రిక. డెమ్మీసైజుస గ్లేజుకాగితములపై చక్కఁగా ముద్రింపఁబడుచున్నది. ప్రతి వారును చందాదారులుగా జేరి శివధర్మోద్ధరణ మొనర్ప ప్రార్థించుచున్నారము. సంవత్సరముచందా రు ౩-0-0 లు మాత్రమే.

ఎడిటర్, శ్రీ ఆదిశైవపత్రిక,

గురుకులాశ్రమము,

చిలుమూరు, అనంతవరంపోష్టు, గుంటూరుజిల్లా.

[illegible]

[illegible]

సంపాదకులు,

పురాణగ్రంథమాలిక.

[illegible]

[illegible]